సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 238

మంగళవారం 19-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



### విజయం లేకుండానే...

2024ను ముగించిన భారత ఫుట్‌బాల్ జట్టు. మలేసియాతో మ్యాచ్ 'డ్రా' - 14లో



### అందం అర్థం మారుతోంది!

మిస్ యూనివర్స్–2024 పోటీల్లో మెరిసిన గృహ, లైంగిక హింస బాధితులు - 13లో



### గ్లోబల్ సౌత్‌ను పట్టించుకోవాలి

దక్షిణార్థ గోళ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై జీ20 కూటమి దృష్టి సారించాలని ప్రధాని మోదీ సూచించారు.

వివరాలు 6లో ▸



### ఏక్ హైతో మోదీ, అదానీ సేఫ్ హై

ప్రధాని మోదీ, పారిశ్రామికవేత్త అదానీ పరస్పరం సహకరించుకుంటూ సురక్షితంగా ఉంటున్నారని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



### బీజేపీలో చేరిన కైలాశ్ గహ్లోత్

ఢిల్లీలో ఆతిశి కేబినెట్ నుంచి తప్పుకున్న ఆప్ ఎమ్మెల్యే కైలాశ్ గహ్లోత్ సోమవారం కేంద్ర మంత్రుల సమక్షంలో బీజేపీలో చేరారు.

వివరాలు 6లో ▸



### ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి

తీవ్ర వాయుకాలుష్యం, పొగమంచుతో ఢిల్లీ సోమవారం ఉక్కిరిబిక్కిరైంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 494కు పడిపోయింది.

వివరాలు 6లో ▸

# మా గొంతులు పిసికారు..
# కళ్లకు బట్టలు కట్టి కొట్టారు

## ఎస్సీ, ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్ల ముందు లగచర్ల బాధిత మహిళల కన్నీరు



ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిశోర్ మక్వానాకు ఫిర్యాదు చేస్తున్న 'లగచర్ల' బాధితులు

- కలెక్టర్‌పై దాడి సాకుతో అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు
- మాతో అనుచితంగా ప్రవర్తించారు.. మా భర్తల్ని కొడుతూ తీసుకెళ్లి జైళ్లలో వేశారు... ఫార్మా కంపెనీలకు భూములివ్వట్లేదని దౌర్జన్యం చేస్తున్నారు
- మా జీవనాధారమైన భూములివ్వలేమంటే జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారు
- అక్రమ కేసులు బనాయిస్తున్నారు
- సీఎం బంధువులకు కంపెనీలు కట్టబెట్టేందుకే కుట్రలు
- ఊళ్లో ఉండాలంటేనే భయమేస్తోంది.. మాకు న్యాయం చేయాలంటూ వేడుకోలు
- చావనైనా చస్తాం కానీ భూములివ్వబోమని స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: 'ఫార్మా కంపెనీలకు భూములివ్వకుంటే కేసులు పెడతామంటున్నారు. జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారు. మా జీవనాధారమైన భూముల్ని ఇవ్వలేమని తెగేసి చెబుతున్నవారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్నారు. బలవంతంగా భూములు లాక్కునేందుకు కుట్ర చేస్తున్నారు. కలెక్టర్‌పై దాడి జరిగిందనే సాకుతో పోలీసులు అర్ధరాత్రి మా ఇళ్లపై దాడులు చేశారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల్ని భయభ్రాంతులకు గురిచేశారు. మా గొంతులు పిసికి, కళ్లకు బట్టలు కట్టి కొట్టారు. మాతో అనుచితంగా ప్రవర్తించారు. పిల్లలు ఏడుస్తున్నా విన్పించుకోకుండా మా భర్తల్ని కొడుతూ తీసుకెళ్లారు. కొందర్ని జైళ్లలో వేశారు. మరికొందరు ఎక్కడ ఉన్నారో కూడా చెప్పట్లేదు. గత మూడ్రోజులుగా మిగతా 2వ పేజీలో ▶

### మా శవాలపైనే శంకుస్థాపన చేయాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడితో ఫార్మా భూబాధితులు... ఎవరో చేసిన తప్పులకు తమను బలి చేస్తున్నారని ఆవేదన

2లో

### రాహుల్.. కొడంగల్ పోరాటంపై గొంతెత్తు..

- లగచర్లలో మీ సర్కార్ దౌర్జన్యం 'రాజ్యాంగ రక్షకుడి'వైన నీకు కనిపించట్లేదా?: కేటీఆర్
- రేవంత్ ప్రభుత్వ అరాచకాలను పార్లమెంట్‌లో లేవనెత్తుతాం
- ప్రధాని, కేంద్రం ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించాలి

### బీజేపీ నేతల అరెస్టు

- లగచర్ల వెళ్తుండగా మొయినాబాద్ వద్ద అదుపులోకి

### పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- లగచర్ల కేసులో ఏ–26పై కలెక్టర్ చర్యలు... డీఎస్పీపై బదిలీ వేటు

- వివరాలు 2లో

## న్యూస్‌రీల్

### ముతక జననాలు.. ముతక మరణాలు!



ఇదేంటి.. ఏవో కొత్త పదాల్లా ఉన్నాయా? వాటి అర్థమేమిటనే సందేహం వస్తోందా? ఇవేకాదు.. గ్రూప్–3 పరీక్షల తెలుగు అనువాదంలో ఇలాంటి సరికొత్త పదాలు మరెన్నో ఉన్నాయి. దీనిపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- వివరాలు 16లో ▶

### బీఆర్‌ఎస్ నేత కొణతం దిలీప్ అరెస్ట్.. విడుదల



ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్న ఆరోపణలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బీఆర్‌ఎస్ నేత కొణతం దిలీప్‌ను సోమవారం అరెస్టు చేశారు.ఆ తర్వాత నోటీసులు ఇచ్చి ఆయన్ను విడుదల చేశారు.

- వివరాలు 12లో ▶

### పోరుగడ్డ నుంచి విజయోత్సవాలు



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 19 నుంచి ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం వరంగల్‌లో ప్రారంభమయ్యే ఈ వేడుకలు ఏడాదిపాటు సాగనున్నాయి.

- వివరాలు 12లో ▶

# సంక్రాంతికి సన్నబియ్యం లేనట్టే!

### చూచాయగా వెల్లడించిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్



- బియ్యం ఇచ్చేందుకు ఇబ్బంది లేదు.. కానీ కొత్త బియ్యం వంట సరిగా కాదు
- సన్న బియ్యం కనీసం మూడు నెలలు ఆగితే బాగుంటుంది
- ఉగాది నుంచి సన్నబియ్యం ఇస్తే 9 నెలలకు ఖరీఫ్ పంట సరిపోతుంది

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటన సాకారం అయ్యే సూచనలు కనిపించడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసి కొత్త బియ్యాన్ని రేషన్‌కార్డుదారులకు ఇవ్వడానికి తమకేం ఇబ్బంది లేదని, సన్న బియ్యం మూడు నెలలు నిల్వ చేసిన తర్వాతే అన్నం బాగుంటుందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. వంట సరిగా కాకపోతే బియ్యం బాగాలేవంటారని, అందుకే మూడు నెలల తర్వాత బియ్యం ఇస్తే మంచిదని సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెప్పారు. దీంతో సంక్రాంతికి సన్న బియ్యం ఇవ్వలేమని కమిషనర్ సూత్రప్రాయంగా వెల్లడించినట్లయ్యింది.

**ఖరీఫ్ ధాన్యం ఉగాది నుంచి 9 నెలలు సరిపోతుంది**

రేషన్ దుకాణాల ద్వారా ఇస్తున్న దొడ్డు బియ్యాన్ని ప్రజలు తినడం లేదని, అందుకే సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కమిషనర్ చౌహాన్ అన్నారు. అయితే సంక్రాంతి, ఉగాది ఎప్పటి నుంచి అనేదానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలోని 2.81 కోట్ల మందికి రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసేందుకు ప్రతినెలా 2 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరమవుతాయన్నారు. ఇందుకోసం సంవత్సరానికి 36 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కావాలని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మిగతా 12వ పేజీలో ▶

# కమిషన్ వచ్చాకే వర్సిటీల్లో నియామకాలు!

### కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్థానంలో తెరపైకి కాలేజ్ సర్వీస్ కమిషన్

- కమిషన్ ఏర్పాటయ్యే వరకు నియామకాలు చేపట్టకూడదని భావిస్తున్న ప్రభుత్వం!
- ఇప్పటివరకు ఖరారు కాని విధివిధానాలు
- ఇప్పటికే వర్సిటీల్లో బోధన, బోధనేతర సిబ్బంది కలిపి 3 వేలకు పైగా ఖాళీలు
- విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్థానంలో కాలేజ్ సర్వీస్ కమిషన్ ఏర్పాటయ్యే వరకు వర్సిటీల్లో నియామకాలు చేపట్టకూడదని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కమిషన్ ఏర్పాటు ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ప్రభుత్వం త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీని విధివిధానాలపై ఇంకా పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. కమిషన్ ఏర్పాటై, విధివిధానాలు ఖరారైన తర్వాతే బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల విషయంలో ముందుకెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో రిక్రూట్‌మెంట్‌ను వాయిదా వేయడానికే ఇలా చేస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. కమిషన్ విషయంలో కొన్ని చట్టపరమైన సందేహాలు సైతం పలువురు వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

**నియామకాలెప్పుడో..?**

కాలేజ్ సర్వీస్ కమిషన్ కొత్తదేం కాదు. ఉమ్మడి రాష్ట్రంలో 1985లోనే మిగతా 3వ పేజీలో ▶

## 2 నెలల తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు?

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తర్వాతే కొలువుల భర్తీకి సర్కారు నిర్ణయం

జాబ్ క్యాలెండర్‌ను నమ్ముకున్న అభ్యర్థుల్లో ఆందోళన

3లో

# పరీక్షల వేళ.. ఫీజుల పేచీ!

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రైవేటు డిగ్రీ కాలేజీల పట్టు

- మరోసారి యాజమాన్యాల ఆందోళన బాట
- ఇంతకుముందే దసరా తర్వాత నాలుగు రోజులు కాలేజీల మూత
- వారంలో ఫీజులు చెల్లిస్తామన్న సర్కార్ హామీతో తెరిచిన తీరు
- నెలైనా ఇవ్వకపోవడంతో డిగ్రీ సెమిస్టర్ పరీక్షల బహిష్కరణకు నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలు మళ్లీ ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. పలు యూనివర్సిటీల పరిధిలో జరగాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను బహిష్కరించాలని నిర్ణయించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకూ ఆందోళన కొనసాగించాలని భావిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఇంతకుముందే గత నెల 14 నుంచి నాలుగు రోజుల పాటు ప్రైవేటు కాలేజీలను యాజమాన్యాలు మూసివేశాయి. 17వ తేదీన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. వారంలో బకాయిలు చెల్లిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో... ఆందోళన విరమిస్తున్నట్టు యాజమాన్యాలు ప్రకటించాయి. కానీ ఆ హామీ ఇప్పటికీ నెరవేరలేదని, దీనితో పరీక్షలు బహిష్కరించాలనే నిర్ణయం తీసుకున్నట్టు ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మంగళవారం నుంచి, కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 21 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, కాలేజీల తీరుపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 7 లక్షల మంది మిగతా 3వ పేజీలో ▶









మణిపూర్ హత్యలకు నిరసనగా సోమవారం గువాహటిలో మణిపురి సాహిత్య పరిషత్ సభ్యుల కొవ్వొత్తుల ర్యాలీ

# అప్రమత్తంగా ఉండాలి!

### అధికారులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశం

- మణిపూర్‌లో శాంతిభద్రతలను త్వరగా పునరుద్ధరించాలి
- ఆ దిశగా వెంటనే చర్యలు చేపట్టండి
- వరుసగా రెండో రోజూ ఉన్నత స్థాయి సమీక్ష... అదనంగా 50 కంపెనీల బలగాలు పంపాలని కేంద్రం నిర్ణయం
- మణిపూర్‌లో మరో రెండురోజులు ఇంటర్నెట్ బంద్

6లో




మహారాష్ట్రలోని కడెగావ్ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్

# మోదీజీ.. సవాల్ చేస్తున్నా కమిటీని పంపండి!

### పుణేలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- మా గ్యారంటీలు కచ్చితం.. మీలా విఫల హామీలు కాదు
- కేంద్ర మంత్రి, అధికారి ఆధ్వర్యంలో కమిటీని పంపండి
- మా హామీల అమలు వివరాలన్నీ అందజేస్తా.. ఏదైనా తప్పు ఉంటే క్షమాపణలు చెప్తా..

సాక్షి, ముంబై: పదకొండేళ్ల పాలన తర్వాత కూడా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి చెప్పుకోవడానికి ఒక్క విజయగాథ లేదని సీఎం రేవంత్ విమర్శించారు. వారికి చెప్పుకోవడానికి ఏమీ లేకనే తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మహారాష్ట్ర అసెంబ్లీ మిగతా 12వ పేజీలో ▶



రామప్ప దేవాలయం (ఫైల్)

# ట్రైసిటీకి మహర్దశ

### వరంగల్ మహానగర అభివృద్ధికి రూ.4,962.47 కోట్లు

- ప్రజాపాలన–ప్రజావిజయోత్సవాల్లో భాగంగా కేటాయింపు
- భూగర్భ డ్రైనేజీ, వరద కాలువల పనులకే మెజారిటీ నిధులు... వేములవాడ శ్రీ రాజరాజేశ్వరుడి క్షేత్రం అభివృద్ధికి రూ.127.65 కోట్లు

12లో





జ్యోతిప్రజ్వలనతో వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో చింతల, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

# నేను కాదు.. మీరే గులాములు!

### కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్

- సమస్యలపై జవాబు చెప్పలేకే నాపై వ్యక్తిగత విమర్శలు
- కేసీఆర్‌లానే రేవంత్ తీరు.. దృష్టి అంతా అప్పులపైనే..
- ప్రభుత్వ ఏడాది పాలన, వైఫల్యాలపై బీజేపీ వర్క్‌షాప్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ''నేను భారతీయులకు మాత్రమే గులామును. కానీ మీరు ఏకంగా నకిలీ గాంధీ కుటుంబానికి, ఇటలీ నుంచి వచ్చిన రాజకీయ నాయకురాలికి గులాములుగా మారారు. సమస్యలపై మాట్లాడే సత్తా లేకనే.. వ్యక్తిగత విమర్శలకు దిగడం మిగతా 12వ పేజీలో ▶

**కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ చార్జిషీట్లు** -12లో


Bank of Baroda

bob Utsav డిపాజిట్ స్కీమ్

7.95% ప్రతీ ఏడాదికి వరకు

400 రోజులకు

0.60% సూపర్ సీనియర్ సిటిజన్ల కోసం మరియు
0.05% నాన్-కాలబుల్ డిపాజిట్ల కోసం కూడా ఉన్నాయి

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE


Vencobb CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

| 12 Eggs Retail Rate | Ex Farm Live Bird | 95 kg | Dressed with Skin | 170 kg |
|---|---|---|---|---|
| ₹ 76 | Retail Live Bird | 117 kg | Skin Less | 193 kg |

Issued in the interest of consumers


## ఇదండీ సంగతి



ఇంటింటికీ తిరిగి ఇలా చెప్పులు చూపిస్తుంటే ఓట్లేస్తారనే నమ్మకం నాకయితే లేదా్సర్!

## క్లుప్తంగా...

### ఏడాదిలో వెయ్యిమంది రైతుల ఆత్మహత్యలు: కె. లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలోనే సుమారు 1000 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో 50 శాతం మంది రైతులు చేసిన అప్పులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని, కొంతమంది ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. ఏడాది పూర్తికావొస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు. రైతులకు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.31 వేల కోట్ల మేర రైతుల రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం రూ.17 వేల కోట్లతో కాంగ్రెస్ సర్కారు సరిపెట్టిందన్నారు. సోమవారం పలువురు బీజేపీలో చేరిన సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ 'కాంగ్రెస్ ప్రభుత్వం యువత, రైతులు, మహిళలు.. ఇలా అన్నివర్గాల ప్రజలను మోసం చేసింది. కాంగ్రెస్ గ్యారంటీ అంటే ప్రజలను వంచించి మోసం చేయడమే గ్యారంటీ. అవినీతి, కుంభకోణాలకు గ్యారంటీ ఆ పార్టీ' అని మండిపడ్డారు.

### 'తట్టెడు మట్టి తీయకుండానే ధాన్యం పండిందా?'



సాక్షి, హైదరాబాద్: ప్రాజెక్టుల కోసం తట్టెడు మట్టి తీయకుండానే రాష్ట్రంలో పండిన ధాన్యాన్ని తన ఘనతగా చెప్పుకునే హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో పెరిగిన ధాన్యం ఉత్పత్తికి కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేదని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై ఆయన మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రాజెక్టులపై రేవంత్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే ప్రాణహిత నీటిని వాడుకునే అవకాశం వచ్చిందని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వర్షాకాలంలోనూ వరదలను తట్టుకుని నిలబడిందని, బీఆర్‌ఎస్ అధికారంలో కొనసాగి ఉంటే ఇప్పటికే మరమ్మతులు పూర్తి చేసేదని వినోద్ కుమార్ అన్నారు.

### 'ట్యాపింగ్'లో హరీశ్, కేటీఆరే ప్రధాన నిందితులు



బంజారాహిల్స్ (హైదరాబాద్): ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాను రంగంలో ఉంటే ఓడిపోతానన్న భయంతో మాజీ మంత్రి హరీశ్‌రావు తనపై అక్రమ కేసులు బనాయించి నిర్బంధించారని, తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని సిద్దిపేట కాంగ్రెస్ సీనియర్ నేత గాదగోని చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సోమవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన.. విచారణ అధికారి సూచనల మేరకు ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు భావిస్తున్న ఐఫోన్‌ను, తన బంధుమిత్రులకు చెందిన 30 మంది కాల్ లిస్టును పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్‌పై తాను జూన్ 19న డీజీపీకి ఫిర్యాదు చేశానని వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితులు హరీశ్, కేటీఆర్ మాత్రమేనని, వారిద్దరినీ అరెస్టు చేస్తే ట్యాపింగ్ బండారం బయట పడుతుందన్నారు.

### సదర్ ముగిసినా.. దున్నలిక్కడే..: నాయిని



హనుమకొండ చౌరస్తా: సదర్ పండుగ ముగిసినప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలోనే దున్నపోతులు తిరుగుతున్నాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాడు సీఎంను కలవలేక మంత్రులు బాత్రూంలలో కన్నీళ్లు పెట్టుకుంటే.. నేడు సీఎం రేవంత్‌ను కలవడం సాధారణ ప్రజలకు సైతం ధర్మదర్శనంగా మారిందని ప్రశంసించారు. సీఎం పర్యటన నేపథ్యంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, దాడులకు పాల్పడడం లాంటివి చేస్తే ఇక ఊరుకునేది లేదన్నారు, ఒక్కొక్కరిని దర్వాజాకు గుమ్మడి కాయల మాదిరిగా వేలాడదీస్తామని హెచ్చరించారు. గత సీఎం కేసీఆర్ దగ్గర మూటలు మోసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చదువొస్తే జీవోలు చదివేవారని ఎద్దేవా చేశారు.

### అమీన్‌పూర్‌లో మళ్లీ హైడ్రా పంజా

పటాన్‌చెరు (హైదరాబాద్): అమీన్‌పూర్ పట్టణంలో మరోసారి హైడ్రా పంజా విసిరింది. వందనాపురి కాలనీలో రోడ్డును ఆక్రమిస్తూ చేపట్టిన ఓ ఇంటి నిర్మాణాన్ని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా బృందం సోమవారం తెల్లవారుజామున కూల్చివేసింది. స్థానిక కాలనీవాసుల ఫిర్యాదుతో స్పందించిన హైడ్రా అధికారులు.. స్థానిక రెవెన్యూ మున్సిపల్ అధికారులెవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటిని కూల్చివేశారు. హైడ్రా అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో కూల్చివేత కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగగా.. సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయ్యింది.

# మా శవాల పైనే శంకుస్థాపన చేయాలి



## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడితో ఫార్మా భూ బాధితులు

## ఎవరో చేసిన తప్పులకు తమను బలి చేస్తున్నారని ఆవేదన

రోటిబండ తండాలో రైతులతో మాట్లాడుతున్న జాటోతు హుస్సేన్

కొడంగల్

తమ భూములు లాక్కుంటే.. తమ శవాల పైనే ఫార్మా కంపెనీలకు శంకుస్థాపన చేయాల్సి ఉంటుందంటూ రోటిబండతండా, లగచర్ల గ్రామస్తులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి ఎంత ముఖ్యమో, తమకు తమ భూములూ అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. హుస్సేన్ నాయక్ సోమవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండల పరిధిలోని ఫార్మా బాధిత గ్రామాల్లో పర్యటించి గిరిజనులతో మాట్లాడారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు ఇతర అధికారులపై దాడికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా ఫార్మా భూములకు సంబంధం లేని వ్యక్తులు ఒక్కసారిగా అధికారులపై దాడికి పాల్పడ్డారని ఈ సందర్భంగా బాధితులు ఎస్టీ కమిషన్ సభ్యుడికి వివరించారు. ఎవరో చేసిన తప్పిదాలకు తాము బలయ్యామని చెప్పారు. దాడి చేసిన రోజు అర్ధరాత్రి పోలీసులు మద్యం మత్తులో వచ్చి, మానసికంగా, శారీరకంగా వేధించారని ఆరోపించారు.

**పోలీసులు అత్యుత్సాహం మానుకోవాలి: హుస్సేన్ నాయక్**

పోలీసులు అత్యుత్సాహం మానుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డికి హుస్సేన్ నాయక్ సూచించారు. ఫార్మా బాధిత గ్రామాల నుంచి పోలీసులను వెనక్కి తీసుకోవాలని చెప్పారు. లగచర్లలో కాకుండా రెండు కిలోమీటర్ల దూరంలో గ్రామసభ ఎలా నిర్వహిస్తారని అధికారులను ప్రశ్నించారు. రైతులతో మాట్లాడడానికి కలెక్టర్ లగచర్లకు వెళ్తుంటే పోలీసులు ఎందుకు భద్రత కల్పించలేదని నిలదీశారు. భూములు తీసుకోవాలంటే రైతులతో శాంతియుతంగా మాట్లాడాలని సూచించారు. ఆయన వెంట ఐజీ సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు. ఇలావుండగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రతినిధులు గోవింద్, సురేందర్ సోమవారం ఫార్మా బాధిత గ్రామాల్లో పర్యటించారు. బాధితులకు అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు.

**ఫార్మా పేరిట భూ దందా**

సంగారెడ్డి టౌన్: లగచర్లలో ఫార్మా పేరిట భూదందాకు తెరలేపారని హుస్సేన్ నాయక్ ఆరోపించారు. లగచర్ల ఘటనలో అరెస్టు అయ్యి సంగారెడ్డి సెంట్రల్ జైల్లో ఉన్న 16 మందితో సోమవారం సాయంత్రం జాతీయ ఎస్టీ కమిషన్ బృందం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ విలేకరులతో మాట్లాడారు. ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తాం..1,350 ఎకరాలు కావాలంటూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన విమర్శించారు. రైతులు భూమిని వదులు కోవడానికి సిద్ధంగా లేరని, వారి భూమికి బదులుగా భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# మా గొంతులు పిసికారు..

▶ మొదటి పేజీ తరువాయి




ఢిల్లీలో జాతీయ మానవహక్కుల కమిషన్ భవనం వద్ద లగచర్ల బాధితులతో బీఆర్‌ఎస్ నేతలు

అన్నం తినలేదు. నిద్ర కూడా పోవడం లేదు. ఊళ్లో ఉండాలంటేనే భయమేస్తోంది. ఢిల్లీలో న్యాయం జరుగుతుందని వచ్చాం..' అంటూ లగచర్ల బాధిత మహిళలు జాతీయ ఎస్సీ, ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్ల ముందు కన్నీళ్లతో మొరపెట్టుకున్నారు. బీఆర్‌ఎస్ నేతలు సత్యవతి రాథోడ్, మాలోత్ కవిత, కోవా లక్ష్మిలతో కలిసి ఆదివారం ఢిల్లీకి వచ్చిన మహిళలు.. సోమవారం ఆయా కమిషన్ల చైర్మన్లను కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు పేరుతో కేవలం గిరిజనుల భూముల లాక్కుంటున్నారని వారు ఫిర్యాదు చేశారు. మూడు పంటలు పండే భూములివ్వలేమని తొమ్మిది నెలలుగా అనేక అర్జీలు ఇస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. సీఎం బంధువులకు కంపెనీలు కట్టబెట్టేందుకే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు.

### మంచి చేస్తడని రేవంత్‌కు ఓటేసినం: కిష్టిబాయి

'మాకు మంచి చేస్తడని రేవంత్‌రెడ్డికి ఓటేసినం. కానీ మమ్మల్ని రోడ్డుమీద కూర్చునేలా చేసిండు. మేము చావడానికైనా సిద్ధం కానీ గుంటెడు భూమి కూడా ఇవ్వం. మా దగ్గరికొస్తే బాగుండదు. 9 నెలల నుంచి దీనిపై కొట్లాడుతున్నాం. ఎన్నోమార్లు కలెక్టర్‌కు లేఖలిచ్చి కాళ్ల మీద పడ్డాం. ఎంతోమందిని వేడుకున్నాం. అప్పుడు ముఖ్యమంత్రైనా, ఆయన అన్న తిరుపతిరెడ్డి అయినా రాలేదు. కానీ ఇప్పుడు సీఎం 500 మంది పోలీసోళ్లను పంపి మా గొంతుక పిసుకుతాడా?, మా ఆడోళ్ల మీద దాడిచేపిస్తవా? ఇదేనా మీ తీరు? మా కొడంగల్ ముఖ్యమంత్రివి అనుకుంటే పూర్తిగా కొడంగల్ పేరునే కరాబ్ చేశావ్. అరెస్టు అయిన మా పిల్లలను బయటకు తేవాలే. మా భూముల జోలికి రావొద్దు..' అని గిరిజన మహిళ కిష్టిబాయి డిమాండ్ చేసింది.

### గిరిజనుల భూములే ఎందుకు గుంజుకుంటున్నారు?: జ్యోతి

'ఆ భూములు మా ముత్తాతల నుంచి మాకు వచ్చాయి. అవన్నీ పట్టా భూములే. వాటిని గుంజుకుందామని ఎందుకు ప్రయత్నిస్తున్నారు? మంచిగా పండే పంట పొలాలను లాక్కోవాలని ప్రభుత్వం చూస్తోంది. అక్కడ ఫార్మా కంపెనీ వద్దని చెబుతున్నా వినడం లేదు. చావనైనా చస్తాం కానీ భూములివ్వం. తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ చెబుతున్నా రైతులపై ఎందుకు కేసులు పెడుతున్నారు? గిరిజనుల భూములే ఎందుకు ఇవ్వమని అంటున్నారు. బెదిరించి సంతకాలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఊళ్లోకి వస్తే ఇద్దరు పోలీసులు కూడా రాలేదు కానీ ముఖ్యమంత్రి అన్న తిరుపతిరెడ్డి వస్తే రెండు బస్సుల పోలీసులు ఎందుకొచ్చారు? తిరుపతిరెడ్డి వచ్చి భూములు ఇవ్వకుంటే బాగుండదని ఆడవాళ్లని బెదిరిస్తున్నాడు. కలెక్టర్‌పై దాడి జరిగిందని చెబుతూ తాగొచ్చి ఆడపిల్లలు అని కూడా చూడకుండా తప్పుగా ప్రవర్తించారు. మహిళలను కొట్టిన, తప్పుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. జైల్లో ఉన్న నా భర్తను విపరీతంగా కొట్టారు. ఆయన్ను కొట్టిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని తొమ్మిది నెలల గర్భిణి జ్యోతి విజ్ఞప్తి చేసింది.

### మూడ్రోజుల నుంచీ ఏడుస్తూనే ఉన్నాం: దేవీబాయి

'తొమ్మిది నెలల నుంచి మమ్మల్ని సతాయిస్తున్నారు. అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. భూములు పోతున్నాయని మేము బాధపడుతుంటే రాత్రిళ్లు వచ్చి మా ఇంటోళ్లని, పిల్లలను పట్టుకెళ్లారు. వారెక్కడున్నారో కూడా తెలియదు. మూడ్రోజుల నుంచి తిండీతిప్పలు లేకుండా ఏడుస్తూనే ఉన్నాం. ఢిల్లీలో న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం..' అని దేవీబాయి ఆశాభావం వ్యక్తం చేసింది.

### దాడి జరగలేదని కలెక్టర్ చెప్పినా అరెస్టులు చేశారు: సుశీల

'భూములు పోతున్నాయని తిండికూడా పోతలేదు. నిద్రపోవడం లేదు. చిన్నచిన్న భూములున్న మమ్మల్ని అనేక ఇబ్బందులు పెడుతున్నారు. కలెక్టర్ స్వయంగా దాడి జరగలేదని చెప్పినా రాత్రి 12 గంటలప్పుడు కరెంట్ ఆపేసి ఇళ్లల్లోకి చొరబడి దౌర్జన్యం చేశారు. జైల్లో ఉన్న మా వాళ్లను కలవకుండా చేస్తున్నారు. మా ప్రాణాలు పోయినా సరే భూములు మాత్రం ఇవ్వం..' అని సుశీల తెగేసి చెప్పింది.

# రాహుల్.. కొడంగల్ పోరాటంపై గొంతెత్తు..

## లగచర్లలో మీ ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యం 'రాజ్యాంగ రక్షకుడి'వైన నీకు కనిపించట్లేదా?: కేటీఆర్

- రేవంత్ ప్రభుత్వ అరాచకాలను పార్లమెంట్‌లో లేవనెత్తుతాం
- ప్రధాని మోదీ ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించాలి
- రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశమే లేదు..
- రేవంత్ సీఎంగా ఉంటేనే ఆ తర్వాత బీఆర్‌ఎస్ 15 ఏళ్లు అధికారంలో ఉంటుంది



ఢిల్లీలో లగచర్ల బాధితులతో కలసి మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగ రక్షకుడిని.. గిరిజనులు, ఆదివాసీలు, నిమ్నవర్గాల పరిరక్షకుడిని అని చెప్పుకునే లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి కొడంగల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దురాగతాలు కనిపించట్లేదా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మణిపూర్ అల్లర్లు, జార్ఖండ్‌లో గిరిజనుల దాడులపై గొంతు చించుకునే రాహుల్‌కు లగచర్లలో గిరిజనులు చేస్తున్న పోరాటం కనిపించట్లేదా అని అడిగారు. 'కేంద్ర ప్రభుత్వానికి దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, నిమ్నవర్గాలపై ప్రేమ లేదు. వారి హక్కులను కాంగ్రెస్ మాత్రమే కాపాడుతుందని డైలాగ్‌లు కొడతారు. రాజ్యాంగాన్ని చూపెడుతూ, మేము మాత్రమే నిమ్నవర్గాల హక్కులను కాపాడుతామని గొంతు చించుకుంటారు. మీకు నిజంగా గిరిజనులపై ప్రేముంటే కొండగల్ వచ్చి పోరాటం చేస్తున్న వారికి మద్దతుగా వచ్చి గొంతెత్తు. గిరిజనుల భూములు లాక్కుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన అన్న తిరుపతిరెడ్డి అరాచకరాలకు అడ్డుకట్టవేయ్'అని రాహుల్‌కు కేటీఆర్ సూచించారు. లగచర్ల భూముల సేకరణ, గిరిజనుల అరెస్టులను జాతీయ స్థాయిలో వివరించేందుకు ఢిల్లీకి వచ్చిన కేటీఆర్ లగచర్ల బాధితులతో కలసి సోమవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వ అరాచకాలను పార్లమెంట్‌లో లేవనెత్తుతామన్నారు.

**అల్లుడి కోసం భూములు కోల్పోవాలా..**

గిరిజనులు భూములు ఇవ్వకుంటే ఏవిధంగా బెదిరింపులకు దిగుతున్నారో బాధితులు చెబుతున్నారని, అల్లుడి కోసం పెట్టే ఫార్మా కంపెనీ కోసం తాము భూములు కోల్పోవాలా అని ప్రశ్నిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. చావడానికైనా సిద్ధంగా ఉన్నాం... కానీ భూములు ఇవ్వబోమని చెబుతున్నారన్నారు. సీఎం సోదరుడు ఏవిధంగా బెదిరింపులకు పాల్పడుతున్నాడో కూడా వారు వివరంగా చెబుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో చిన్న పిల్లలు పిలిచినా వస్తా అని చెప్పిన రాహుల్‌కు.. గిరిజన మహిళల ఆక్రందనలు వినిపించటం లేదా అని నిలదీశారు. ఇన్నాళ్లు జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల్లో బిజీగా ఉన్నారని, ఇప్పుడైనా మీ ముఖ్యమంత్రి అరాచకాలను ఆపేలా హెచ్చరించండి అని చెప్పారు. భూదందాలపై విచారణ జరిపించాలన్నారు. బీజేపీ, ప్రధాని మోదీ సైతం లగచర్ల అంశాన్ని తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ అకృత్యాలపై బీజేపీ పోరాడాల్సి ఉన్నా బీజేపీ ఎందుకు మౌనం వహిస్తోందో అర్థం కావడం లేదన్నారు. కేంద్రానికి కూడా మనసుంటే ఈ విషయంలో వెంటనే విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**ఫ్యామిలీ ప్యాకేజ్‌గా మార్చారు..**

రేవంత్ రాష్ట్రాన్ని పూర్తిగా వాళ్ల ఫ్యామిలీ ప్యాకేజ్‌గా మార్చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం సోదరుడు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని, ఫార్మా విలేజ్‌ను ఆపేది లేదని చెప్పేందుకు అతనెవరని ప్రశ్నించారు. తమ హయాంలో ఫార్మాసిటీ అంటే జనం మనస్సుల్లో విషయం చిమ్మిన రేవంత్ ఇప్పుడు రాష్ట్రంలో దాదాపు 20 చోట్ల ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ ప్రభుత్వాన్ని అస్థిరపర్చాల్సిన అవసరం తమకు లేదని కేటీఆర్ పునరుద్ఘాటించారు. 'ఢిల్లీకి కావాల్సిన మూటలు అందించగల సత్తా ఉన్నది రాష్ట్రంలో ఒక్క రేవంత్‌కు మాత్రమే. అందుకే ఆయనే ఐదేళ్లు సీఎంగా ఉంటాడని భావిస్తున్నాం.. ఉండాలని కోరుకుంటున్నాం. రేవంత్ ముఖ్యమంత్రిగా ఉంటేనే ఆ తర్వాత బీఆర్‌ఎస్ 15 ఏళ్లు అధికారంలో ఉంటుంది'అని పేర్కొన్నారు. కేసీఆర్ మూఢ నమ్మకాలు నమ్ముతారని ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం వాస్తు పేరుతో సచివాలయం గేట్ ఎందుకు మార్చుతున్నారని ప్రశ్నించారు.

# బీజేపీ నేతల అరెస్టు



మొయినాబాద్‌లో పోలీసులు అడ్డుకోవడంతో వాహనంలోనే కూర్చుని మీడియాతో మాట్లాడుతున్న ఎంపీలు అరుణ, ఈటల

- లగచర్ల వెళ్తుండగా మొయినాబాద్ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నార్సింగి పీఎస్‌కు ఈటల, డీకే అరుణ, ఏలేటి తరలింపు
- సంగారెడ్డి సెంట్రల్ జైల్లో లగచర్ల బాధితులతో ములాఖత్

మొయినాబాద్/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఆ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సాయంత్రం 4.40 గంటల సమయంలో మొయినాబాద్ పీఎస్ ఎదుట రోడ్డుపై బారికేడ్లు అడ్డుపెట్టి వారు వెళ్తున్న కారును పోలీసులు నిలిపేశారు. దీంతో వారు అరగంట అందులోనే కూర్చున్నారు. సమాచారం అందుకున్న స్థానిక బీజేపీ శ్రేణులు రోడ్డుపైకి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఈటల, అరుణ, ఏలేటిలను బలవంతంగా కారులో నుంచి దింపి అరెస్టు చేశారు. పోలీసు వాహనాల్లో ఎక్కించి నార్సింగి పీఎస్‌కు తరలించారు. అరగంట తర్వాత ఇళ్లకు పంపించారు.

**మమ్మల్ని అడ్డుకోవడం ఏమిటి?: ఈటల**

లగచర్లలో రైతుల కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అడ్డుకోవడం ఏమిటని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అంతకు ముందు పోలీసులను ప్రశ్నించారు. 'మేం రౌడీలం కాదు.. గూండాలం, సంఘ విద్రోహశక్తులం కాదు.. బాధ్యత కలిగిన పార్లమెంటు సభ్యులం.. మమ్మల్ని ఎలా అడ్డుకుంటారు..?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు ప్రతిపక్ష పార్టీగా అండగా ఉండాల్సిన బాధ్యత తమకుందని అన్నారు. తమకు రక్షణ ఇచ్చి తీసుకుపోవాల్సిన పోలీసులు, బాస్‌ల ఆదేశాలతో ఇలాంటి పనులు చేస్తారా? అంటూ ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు.

**భూములు ఎవరి ప్రయోజనాల కోసం..**

సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కొడంగల్‌లో మళ్లీ గెలవాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి లగచర్ల రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరి ప్రయోజనాల కోసం రైతుల భూములు లాక్కుంటున్నారని ప్రశ్నించారు. లగచర్లలో జరిగిన అరాచకానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని ధ్వజమెత్తారు.

**ఓట్లేసి గెలిపించిన వారికంటే ముఖ్యమా?**

సంగారెడ్డి సెంట్రల్ జైల్లో ఉన్న లగచర్ల బాధితులతో డీకే అరుణ, ఈటల సోమవారం ములాఖత్ అయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పోలీసుల వైఫల్యం కారణంగానే లగచర్ల ఘటన జరిగిందని డీకే అరుణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫార్మా కంపెనీలపై అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. కొడంగల్‌లో ఓట్లేసి గెలిపించిన ప్రజలకంటే ఆయనకు ఫార్మా కంపెనీలే ముఖ్యమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో నిరుపేదల ఉసురు పోసుకున్న కేసీఆర్ గద్దె దిగి ఇంటికెళ్లిపోయారని, 11 నెలల కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీ నాయకులు కూడా కేసీఆర్ మాదిరే వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు వలస వచ్చారని, నచ్చిన ఫార్మా కంపెనీలకు అక్కడి భూములు అప్పగించేందుకు ఆయన కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం లగచర్ల వద్ద 144 సెక్షన్ పెట్టి ప్రజా ప్రతినిధులను అక్కడికి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటోందని ఈటల మండిపడ్డారు. కనీసం స్థానిక ఎంపీనైన తనను కూడా నియోజకవర్గం పరిధిలో తిరగనిచ్చే పరిస్థితిలేదన్నారు. దీనిపై పార్లమెంటులో ప్రివిలేజ్ మోషన్ ప్రవేశ పెడతామని తెలిపారు. లగచర్ల బాధితులకు ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- లగచర్ల కేసులో ఏ–26పై కలెక్టర్ చర్యలు
- డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డిపై బదిలీ వేటు
- నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ 25వ తేదీకి వాయిదా



కరుణాసాగర్‌రెడ్డి

వికారాబాద్: వికారాబాద్ జిల్లా కొడంగల్ పరిధిలోని 'లగచర్ల కేసు'కు సంబంధించి సోమవారం పలు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. దాడిలో పాలుపంచుకున్నాడనే కారణంతో పోలీసులు ఓ పంచాయతీ కార్యదర్శిని అరెస్టు చేయగా, అతన్ని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11న లగచర్ల ఘటన చోటుచేసుకోగా, ఇందులో 42 మంది పాల్గొన్నట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. మరుసటి రోజున 21 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో సంగాయిపల్లి పంచాయతీ కార్యదర్శి కావలి రాఘవేందర్ ఏ- 26గా ఉన్నాడు. అతని స్వగ్రామం లగచర్ల కాగా సంగాయిపల్లిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. రిమాండ్ రిపోర్టులో అతని వృత్తి పంచాయతీ కార్యదర్శి అని కూడా పోలీసులు మెన్షన్ చేశారు. ఈ విషయాన్ని పోలీసులు తమకు తెలియజేయలేదని, శనివారం కలెక్టర్‌కు తెలియడంతో అతన్ని సస్పెండ్ చేశారని డీపీఓ జయసుధ తెలిపారు. ఇదిలావుండగా రిమాండ్ రిపోర్టులో తాను ఇచ్చినట్టుగా పేర్కొన్న వాంగ్మూలం వాస్తవం కాదని, మూడురోజుల క్రితం నరేందర్‌రెడ్డి అందజేసిన అఫిడవిట్‌ను న్యాయవాదులు సోమవారం కొడంగల్ కోర్టులో దాఖలు చేశారు. మరోవైపు నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై సోమవారం వికారాబాద్ జిల్లా కోర్టులో వాదనలు జరగగా, న్యాయమూర్తి తదుపరి విచారణను ఈనెల 25వ తేదీకి వాయిదా వేశారు.

**కస్టడీ పిటిషన్‌పై రేపు విచారణ**

నరేందర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు వేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు. ఇంకోవైపు లగచర్లలో ఘటనలో నిందితుల అరెస్టులు కొనసాగుతుండగానే.. పోలీసు ఉన్నతాధికారులు పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డిపై వేటు వేశారు. ఆయనను డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఉత్తర్వుల్లో సాధారణ బదిలీగా పేర్కొనడం గమనార్హం. కాగా కొత్త డీఎస్పీగా శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు.

# 'లగచర్ల'ను బీఆర్‌ఎస్ రాజకీయం చేస్తోంది



సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనను బీఆర్‌ఎస్ రాజకీయం చేస్తోందని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ధ్వజమెత్తారు. గిరిజనుల పేరుతో లబ్ధిపొందాలని బీఆర్‌ఎస్ చూస్తోందని, లగచర్లలోని 1,350 ఎకరాల భూమిలో 200 ఎకరాలు మాత్రమే గిరిజనులవని అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు బాలు నాయక్, మందుల సామేల్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. లగచర్ల ఘట నలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేసి జైలులో ఉన్న ఏడుగురికి అక్కడ భూములే లేవన్నారు. కేవలం రాజకీయం కోసమే బీఆర్‌ఎస్ ఈ దాడికి కుట్రపన్నినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ప్రభుత్వం ఎవరికీ ఇబ్బంది లేకుండా భూసేకరణ జరుపుతోందని, భూ ములు కోల్పోయిన వారికి నాలుగు రెట్లు అధికంగా పరిహారం చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని అన్నారు. అమాయకులైన గిరిజనులను బలి పశువులను చేయొద్దని కేటీఆర్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. తప్పును కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ వెళ్లి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిశారని విమర్శించారు.

# మా భూములు తీసుకోండి

- ఇండస్ట్రియల్ పార్కుకు ఒప్పుకుంటున్నాం
- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరిని కలిసిన రైతులు



కలెక్టర్ మనుచౌదరికి పట్టాపాస్ పుస్తకాల జిరాక్స్ ప్రతులను అందజేస్తున్న రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లి క్రాసింగ్ వద్ద ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి తాము ఒప్పుకుంటున్నామని, మా భూములు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్ మనుచౌదరిని కలిశారు. ఈ సందర్భంగా 55 ఎకరాలకు సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకాల జిరాక్స్ ప్రతులను కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇండస్ట్రీ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, భూములకు నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. చౌటపల్లి క్రాసింగ్ వద్ద సర్వే నంబరు 312లో దాదాపు 83ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కానీ ఈ భూమిని గతంలో పేదలకు అసైన్డ్ చేసి పంపిణీ చేశారు. ఈ భూములన్నీ హుస్నాబాద్ నుంచి అక్కన్నపేటకు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉంటాయి. మరికొద్ది రోజుల్లో ఈ రహదారి నాలుగు లేన్లుగా మారనున్నది. ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణంలో భాగంగా సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులను అడ్డుకున్న రైతులే ఇప్పుడు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. దీంతో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి అడుగులు పడ్డాయి.

# లగచర్ల ఘటనపై సమగ్ర విచారణ చేయాలి

## తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇటీవల లగచర్లలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌ను లచ్చిరెడ్డి కలిశారు. లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై దాడి ఘటనపై ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ లగచర్ల ఘటన అధికారులు, రైతులకు మధ్య జరిగిన దాడిగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, అధికారులకు మధ్య ఏనాడు కూడా ఘర్షణ వాతావరణం ఉండదన్నారు. ఉద్యోగులపై ఏదో ప్రమాదవశాత్తు జరిగిన దాడి కాదని, ఇదంతా పక్కా ప్రణాళికతోనే చేశారని చెప్పారు.జేఏసీ నాయకులు డా.జి.నిర్మల, జీఎస్ కుమారస్వామి, ఎస్.రాములు, రమేష్ పాక,, దర్శన్‌గౌడ్, ఫూల్‌సింగ్ చౌహాన్, రాధ, హుస్సేన్‌నాయక్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## క్లుప్తంగా...

### పదవికి న్యాయం చేస్తా

రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్



సాక్షి, హైదరాబాద్: తనకు అప్పగించిన పద వికి న్యాయం చేస్తానని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల గద్దర్ తెలిపారు. సంప్రదాయాలు, వృత్తి కళా కారులను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తానని ఆమె సోమ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు ప దవి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె కృతజ్ఞత లు తెలిపారు. ఇందుకు సహకరించిన ఏఐ సీసీ అగ్రనేత సోనియా గాంధీ, ప్రియాంకాగాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, కొప్పుల రాజు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులకు కూడా వెన్నెల కృతజ్ఞతలు తెలిపారు.

### తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సురేశ్

ప్రధాన కార్యదర్శిగా లింగమూర్తి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సెక్రటేరి యట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఎస్‌వోఏ) ఎన్నికలు సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగాయి. మొత్తం 18 పదవులకు ఎన్నికలు నిర్వహించగా.. ఇందులో 17 పదవులు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షునిగా డాక్టర్ జి.సురేశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికవగా.. ఒక్క ప్రధాన కార్యదర్శికి మాత్రం పోటీ ఉండడంతో ఎన్నిక నిర్వహించారు. ఇందులో 87 ఓట్లతో పి.లింగమూర్తి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. విజేతలకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో, టీఎన్‌జీవో నేతలు సత్యనారాయణ, ముజీబ్ హుస్సేన్, పరమేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

### 'పెద్దింటి' కథలకు కర్ణాటక ప్రభుత్వ పురస్కారం

కన్నడ 'జాల' కథల సంపుటి ఎంపిక



సిరిసిల్ల: తెలంగాణకు చెందిన ప్రముఖ కథ కుడు, సినీ పాటలు, మాటల రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన 'జాల' 12 కథల సంపుటికి కన్నడ భాషలో రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రాష్ట్రస్థాయి కువెంపు భాషా భారతి పురస్కారాలలో.. అనువాద విభాగంలో 'జాల' కథల సంపుటి ఎంపికైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 12 కథలను బెంగళూరుకు చెందిన రచయిత్రి ఎంజీ శుభ మంగళ 'జాల' పేరుతోనే కన్నడలోకి అనువదించారు. పురస్కారం కింద అనువాదకురాలికి రూ.25వేలు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తారు.

### డిగ్రీ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

మూడు ఎన్జీవోలతో సాంకేతిక విద్య ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ విద్యార్థులకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు మూడు ఎన్జీవో సంస్థలతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకున్నట్టు సాంకేతిక విద్య కమిషనరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్‌జీబీఎస్ ఉన్నతి ఫౌండేషన్, బారాబరి కలెక్టివ్ సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్, లాంచ్ లీడ్ ఫౌండేషన్‌లకు కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎ.దేవసేన మధ్య ఈ ఎంవోయూ కుదిరింది. పరిశ్రమల డిమాండ్‌ను తీర్చడానికి అవసరమైన నైపుణ్యాలు, వనరులతో ఈ సంస్థలు విద్యార్థులను తీర్చిదిద్దుతాయని అధికారులు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ అనంతరం ధ్రువపత్రాలను అందజేస్తారు.

### ఎట్టకేలకు స్టాండింగ్ కౌన్సెళ్ల నియామకం

వివిధ కార్పొరేషన్లకు న్యాయవాదుల నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, అథారిటీల తరపున హైకోర్టులో వాదనలు వినిపించడానికి ప్రభుత్వం న్యాయవాదులను నియమించింది. ఈ మేరకు జీవో 732 నుంచి జీవో 761 వరకు 30 మందిని స్టాండింగ్ కౌన్సెళ్లుగా నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి టి.తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. గత డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆశావహులు వీటికోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. 11 నెలల తర్వాత సర్కార్ ఎట్టకేలకు స్టాండింగ్ కౌన్సిళ్లను నియమించడంపై హైకోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. వీరంతా మూడేళ్ల పాటు ఆయా కార్పొరేషన్, మున్సిపాలిటీ, అథారిటీలకు స్టాండింగ్ కౌన్సెళ్లుగా పనిచేస్తారు.

స్టాండింగ్ కౌన్సెళ్ల వివరాలు
సాక్షి ప్లస్ (ఈ-పేపర్)లో..

## 2 నెలల తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు

**ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తర్వాతే కొలువుల భర్తీకి సర్కారు నిర్ణయం**

**జాబ్ క్యాలెండర్‌ను నమ్ముకున్న అభ్యర్థుల్లో ఆందోళన**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగ నియామకాల ప్రక్రియకు బ్రేక్ పడినట్లయింది. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక ఇవ్వడానికి జనవరి 11 వరకు గడువు ఉంది. దీంతో కనీసం రెండు నెలల తర్వాతే.. ఉద్యోగ ప్రకటనలకు సంబంధించి ఏదైనా కదలిక వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను నమ్ముకుని.. పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, ముఖ్యంగా షార్ట్ టర్మ్ కోచింగ్ కోసం అధిక మొత్తంలో ఫీజులు చెల్లించిన వారిలో తీవ్ర గందరగోళం నెలకొంది. పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

### నిలిచిన నోటిఫికేషన్లు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించి వార్షిక జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. వచ్చే ఏడాది ఏప్రిల్ నెల వరకు భర్తీ చేయనున్న ఉద్యోగాలు, వాటికి సంబంధించిన నోటిఫికేషన్లను ఏయే నెలల్లో విడుదల చేస్తామనే అంశాన్ని అసెంబ్లీ వేదికగా ప్రకటించింది. జాబ్ క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 24న మూడు రకాల నోటిఫికేషన్లు విడుదల కావాల్సి ఉంది. వీటిల్లో ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, రాష్ట్ర ప్రభుత్వ ఇంజనీరింగ్ విభాగం, అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తదితర ఉద్యోగాల భర్తీకి సంబంధించినవి ఉన్నాయి. అయితే, అవి విడుదల కాలేదు.

### జనవరి 11 వరకూ గడువు..




జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన వన్‌మెన్ కమిషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఎస్సీల స్థితి గతులను అధ్యయనం చేసి రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కమిషన్ ఈనెల 11న బాధ్యతలు స్వీకరించింది. రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థితిగతులను అధ్యయనం చేసిన తర్వాత నివేదిక ఇవ్వనుంది. జనవరి 11 వరకు ఈ కమిషన్‌కు గడువు ఉంది. మరోవైపు ఎస్టీ వర్గీకరణ కూడా నిర్వహించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు రాష్ట్రంలో ఎస్టీ వర్గీకరణకు సంబంధించి ఎలాంటి చర్యలు లేవు. దీన్ని బట్టి చూస్తే కనీసం రెండు నెలల తర్వాతే ఉద్యోగ ప్రకటనలకు సంబంధించి ఓ స్పష్టత వస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## కమిషన్ వచ్చాకే వర్సిటీల్లో నియామకాలు!

▶ మొదటి పేజీ తరువాయి

దీన్ని ఏర్పాటు చేశారు. వర్సిటీల వీసీలు, ఉన్నత విద్యారంగ నిపుణులతో ఇది ఏర్పడుతుంది. అయితే 2000 సంవత్సరం వరకు పనిచేసిన కమిషన్ అప్పట్లో ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకుల నియామకాలకే పరిమితమైంది. తర్వాత దీనిని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో కలిపేశారు. విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు ఆయా వర్సిటీల వీసీల నేతృత్వంలో జరుగుతుండగా.. 2014–2022 మధ్య యూనివర్సిటీల్లో ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. దీంతో పెద్ద ఎత్తున ఖాళీలు ఏర్పడ్డాయి. అన్నివైపుల నుంచి ఒత్తిడి రావడంతో 2022 సెప్టెంబర్ 12న కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేశారు. ఏ వర్సిటీకి ఆ వర్సిటీ నియామకాలు చేపడుతుండటం వల్ల అవకతవకలు జరుగుతున్నాయని, అన్ని వర్సిటీలకు కలిపి బోర్డు నియామకాలు అప్పట్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ అప్పట్నుంచీ కూడా బోర్డు ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికే యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర కలిపి 3 వేలకు పైగా పోస్టులు ఖాళీ అయ్యాయి. వీటిని భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటిస్తున్నా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. తాజాగా మళ్లీ కాలేజ్ సర్వీస్ కమిషన్ తెరపైకి రావడంతో నియామకాలు ఇప్పట్లో జరుగుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**తేడా ఏంటి?**

ప్రభుత్వ నిర్ణయంతో కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు, కాలేజ్ సర్వీస్ కమిషన్‌కు తేడా ఏంటనే చర్చ మొదలైంది. రెండు దశాబ్దాల క్రితం కాలం చెల్లిన కమిషన్‌ను ఎందుకు తెస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. బోర్డు నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టాలంటే..తొలుత వర్సిటీలు ఖాళీలను వెల్లడిస్తాయి. అన్ని వర్సిటీలకు కలిపి బోర్డు ఉమ్మడిగా పరీక్ష నిర్వహిస్తుంది. మెరిట్ ఆధారంగా బోధన, బోధనేతర సిబ్బందిని ఎంపిక చేసి వర్సిటీలకు సిఫారసు చేస్తుంది. ఇందులో వీసీల ప్రమేయం ఏమాత్రం ఉండదు. ఇక సర్వీస్ కమిషన్‌కు వచ్చేసరికి ఖాళీలను కమిషనే గుర్తిస్తుంది. ఎందుకంటే ప్రతి యూనివర్సిటీ వీసీ ఇందులో సభ్యులుగా ఉంటారు. నియామకాల ప్యానెల్‌లోనూ వీసీ ఉంటారు. కాబట్టి వీసీల పెత్తనానికి అవకాశం ఉంటుంది. అయితే వీసీలు అవినీతికి పాల్పడుతున్నారని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో వీసీ పెత్తనానికి అవకాశం ఉన్న కాలేజ్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చర్చనీయాంశమవుతోంది.

**యూనివర్సిటీల్లో బోధన సిబ్బంది పరిస్థితి ఇదీ..**

| యూనివర్సిటీ | మంజూరైన పోస్టులు | ఉన్న సిబ్బంది | ఖాళీలు |
|---|---|---|---|
| ఉస్మానియా | 1257 | 376 | 891 |
| కాకతీయ | 409 | 86 | 323 |
| జేఎన్‌టీయూహెచ్ | 410 | 169 | 241 |
| అంబేడ్కర్ | 86 | 34 | 52 |
| తెలంగాణ | 152 | 61 | 91 |
| మహాత్మాగాంధీ | 70 | 35 | 35 |
| పాలమూరు | 95 | 21 | 74 |
| శాతవాహన | 63 | 16 | 47 |
| జేఎన్‌ఏఫైన్‌ఆర్ట్స్ | 55 | 17 | 58 |
| పీఎస్‌టీయూ | 72 | 14 | 58 |
| ఆర్‌జీయూకేటీ | 146 | 19 | 127 |

### కమిషన్ ఎలా చెల్లుతుంది?



కాలేజ్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసేటప్పుడు చట్టపరమైన సమస్యలను పరిశీలించాలి. వర్సిటీలు యూజీసీ పరిధిలో ఉంటాయి. యూజీసీ అనుమతి లేకుండా, కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయకుండా కమిషన్ ద్వారా వర్సిటీల అధ్యాపకులను నియమించడం చట్టపరంగా ఎలా చెల్లుతుంది?

– ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ (పూర్వ కాలేజ్ కమిషన్ సభ్యుడు)

### ఏదో ఒక సాకుతో జాప్యం సరికాదు



బోర్డును రద్దు చేస్తారో.. కాలేజ్ సర్వీస్ కమిషన్‌ను తెస్తారో..ఏదో ఒకటి చేసి తక్షణం యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టాలి. ఏ విధానంలోనైనా లోపాలు ఉంటాయి. వాటిని సరిచేసుకుని వెళ్ళాలి. ఏదో ఒక సాకుతో నియామకాల్లో జాప్యం సరికాదు.

– ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ (న్యాక్ మాజీ డైరెక్టర్, అంబేడ్కర్ వర్సిటీ మాజీ వీసీ)

### నియామకాలు చేపట్టకపోతే కష్టం




వర్సిటీల్లో పోస్టులు భారీ సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. ఇది విద్యా ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బోర్డును రద్దు చేసి, కమిషన్ తీసుకొచ్చినా ఇబ్బంది లేదుగానీ, తక్షణమే నియామకాలు చేపట్టకపోతే వర్సిటీల మనుగడకే ప్రమాదం.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి (ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్)

## ఈ నెల 25 వరకు తదుపరి చర్యలు తీసుకోం

**పీజీ మెడికల్ సీట్ల భర్తీపై హైకోర్టుకు ఏజీ హామీ**



సాక్షి, హైదరాబాద్: పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సు సీట్ల భర్తీలో 'స్థానిక' వివాదం నేపథ్యంలో ఈ నెల 25 వరకు సీట్ల భర్తీపై తదుపరి చర్యలు తీసుకోబోమని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. మెరిట్ జాబితాను కూడా ప్రకటించబోమని చెప్పింది. దీంతో తదుపరి విచారణను న్యాయస్థానం 25కు వాయిదా వేసింది. తెలంగాణ మెడికల్ కాలేజీల నిబంధనలు 2021లోని రూల్ ౩(ఐఐ)(జీ), (జీజీ) చెల్లుబాటును సవాల్ చేస్తూ హైకోర్టులో మంచిర్యాలకు చెందిన డాక్టర్ ఎస్.సత్యనారాయణ, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ వి.రజిత పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవో 148 చట్టవిరుద్ధమని, దీని ప్రకారం తెలంగాణలో బ్యాచిలర్ మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులను మాత్రమే పీజీ మెడికల్ సీటుకు స్థానిక కోటా కింద పరిగణిస్తారన్నారు. తమను స్థానిక అభ్యర్థులుగా పరిగణించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే తెలంగాణ వెలుపలి విద్యా సంస్థల్లో(సిద్దార్థ మెడికల్ కాలేజీ) చదివిన వారిని స్థానికులుగా పేర్కొనడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలా దాదాపు 100కుపైగా పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) విజ్ఞప్తి చేశారు. తదుపరి విచారణ వరకు ఎటువంటి కౌన్సెలింగ్ నిర్వహించబోమని హామీ ఇచ్చారు.

## విద్యార్థికి గుండు కొట్టించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సస్పెన్షన్

**ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో విద్యార్థికి గుండు కొట్టించిన ఘటనలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రెహమాన్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మంలోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి ఈనెల 12న చైనా దేశంలో మాదిరి కటింగ్ చేయించుకోగా సీనియర్ విద్యార్థులు మందలించారు. దీంతో అతను ట్రిమ్ చేయించుకున్నాడు. ఇదిలా ఉండగా కాలేజీ హాస్టల్ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆఫీసర్‌గా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రెహమాన్.. ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాక సెలూన్‌కు తీసుకెళ్లి గుండు చేయించాడు. ఈ ఘటనతో మనస్తాపం చెందిన విద్యార్థి ప్రిన్సిపాల్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటికప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను హాస్టల్ విధుల నుంచి తొలగించగా, డీఎంఈ ఆదేశాలతో త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ కమిటీ విచారణ అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రవర్తన సరిగా లేదని, విద్యార్థికి గుండు కొట్టించిన విషయం నిజమేనని నివేదిక ఇవ్వడంతో రెహమాన్‌ను సస్పెండ్ చేస్తూ వైద్య విద్య డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ర్యాగింగ్ ఘటనలో నలుగురిపై వేటు

**నల్లగొండ మెడికల్ కాలేజీలో ఒక జూనియర్ డాక్టర్, ముగ్గురు విద్యార్థుల సస్పెన్షన్**

**నల్లగొండ టౌన్:** నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కేరళ రాష్ట్రానికి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ చేసిన ఘటనకు సంబంధించి ఒక జూనియర్ డాక్టర్, మరో ముగ్గురు విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఇందులో జూనియర్ డాక్టర్‌ను మూడు నెలలపాటు, 2020 బ్యాచ్‌కి చెందిన మెడికోను ఆరు నెలలు, మొదటి సంవత్సరం విద్యార్థిని నెల రోజులపాటు, అలాగే 2023 బ్యాచ్‌కు చెందిన మరో మెడికోను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ ర్యాగింగ్ నిరోధక కమిటీ చైర్మన్, ప్రిన్సిపాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వు కాపీలను మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయానికి పంపించారు. కాగా, కేరళ విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడిన జూనియర్ డాక్టర్‌తో పాటు ముగ్గురు విద్యార్థులపై ర్యాగింగ్ నిరోధక కమిటీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## సంక్షేమ పథకాల విస్తృతికే సర్వే

- నెలాఖరులోగా నూరుశాతం ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం
- 2014 సమగ్ర సర్వే వివరాలను నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎందుకు వెల్లడించలేదు : మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతపర్చేందుకే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టినట్టు రాష్ట్ర రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వం అన్ని రకాల అంశాలతో ఈ సర్వేను శాస్త్రీయంగా నిర్వహిస్తోందని, ప్రజలు కూడా సహకరిస్తున్నారన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 17వ తేదీనాటికి రాష్ట్రవ్యాప్తంగా 58.3% ఇళ్లను సర్వే చేశామని, నెలాఖరులోగా నూరుశాతం సర్వే పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే సర్వే చేసిన ఇళ్లకు సంబంధించి వివరాలను కంప్యూటరీకరిస్తున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. ప్రజల స్థితిగతులు తెలుసుకొని ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలను విస్తృతం చేయడంతోపాటు కొత్త పథకాల అమలు కోసం ఈ సర్వే ఎంతో ఉపయోగ పడుతుందని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వే ప్రక్రియను నిర్వహిస్తోందన్నారు. తాజాగా చేపడుతున్న సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని మంత్రి వ్యాఖ్యానించారు. మంచి ఉద్దేశంతో చేపడుతున్న సర్వేను ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, అధికారులకు వివరాలు ఇవ్వకుండా తప్పుదారి పట్టించేలా ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ పథకాల్లో కోతపడుతుందని, పలు రకాల బెనిఫిట్స్ ఆగిపోతాయంటూ ప్రతిపక్ష పార్టీలు దుర్మార్గంగా మాట్లాడుతున్నాయని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర సర్వే చేసిందని, కానీ ఆ సర్వేకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయలేదన్నారు. ప్రజల ఆస్తులు తెలుసుకొని వాటిని కొల్లగొట్టేందుకు అప్పటి సర్వేను బీఆర్‌ఎస్ ప్రభుత్వం వినియోగించుకుందన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం చేపట్టే సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచేలా ఉంటుందని చెప్పారు.

## పరీక్షల వేళ.. ఫీజుల పేచీ!

▶ మొదటి పేజీ తరువాయి

డిగ్రీ, పీజీ విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

**జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందంటూ..**

రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, సిబ్బందికి వేతనాలు ఇవ్వడం కూడా కష్టంగా మారిందని కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బకాయిలు చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని గుర్తు చేస్తున్నాయి. ఇప్పటికే నాలుగైదు నెలలుగా సిబ్బందికి సరిగా వేతనాలు చెల్లించలేదని.. భవనాల అద్దె, ఇతర ఖర్చులకూ ఇబ్బంది నెలకొందని పేర్కొంటున్నాయి.

**వివిధ కేటగిరీల కింద 'ఫీజు'బకాయిలివీ.. (రూ.కోట్లలో)**

| కేటగిరీ | 2021-22లో | 2022-23లో | 2023-24లో |
|---|---|---|---|
| ఎస్సీ | 38.7 | 275.33 | 375.33 |
| ఎస్టీ | 40.5 | 130.54 | 245.54 |
| బీసీ | 325.4 | 952.4 | 1,125.2 |
| ఈబీసీ | 125.5 | 285.56 | 355.23 |
| మైనారిటీ | 85.52 | 200.26 | 382.26 |
| మొత్తం | 615.62 | 1,844.09 | 2,483.56 |

### పరీక్షలు జరగనివ్వండి ప్లీజ్



ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి చర్చలు జరిపారు. ఈ వివరాలను ఆయన మీడియాకు తెలిపారు. పరీక్షలు బహిష్కరిస్తే విద్యార్థులు ఆందోళన చెందే అవకాశం ఉందని.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఆందోళనకు దిగవద్దని కాలేజీలను కోరానని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం సీఎం కలవాలని సూచించినట్టు చెప్పారు. వారు పరిస్థితిని అర్థం చేసుకుంటారనే నమ్మకం కలిగిందన్నారు.

– ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

### బకాయిలు చెల్లించాలి

గత నెలలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి హామీ మేరకు ఆందోళన విరమించాం. కానీ ఆ హామీ నిలబెట్టుకోలేదు. కాలేజీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి. మా నిరసన తెలియజేయడానికే నవంబర్ 19 నుంచి కాలేజీల్లో నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించాం.

– డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి, ప్రైవేటు పీజీ, డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు

## వైద్యరంగంలో కృత్రిమ మేధ

**క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రంగా రాష్ట్రాన్ని మారుస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు**




సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు, ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను త్వరలో క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మారుస్తామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ పరిశోధన, అభివృద్ధిలో దేశం దృష్టిని ఆకర్షిస్తున్న రాష్ట్రానికి సిలికాన్ వ్యాలీ సంస్థలను తీసుకొస్తామని ఆయన వెల్లడించారు. 'వైద్య రంగంలో కృత్రిమ మేధ'అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఏఐజీ చైర్మన్ డా.నాగేశ్వరరెడ్డి, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన డా. డీయన్ హో, నారాయణ వైద్యాలయ వైస్ చైర్మన్ వీరేన్ శెట్టి, ప్రపంచ ఆరోగ్యసంస్థ డిజిటల్ హెల్త్ విభాగం సభ్యుడు డా. రాజేంద్ర గుప్తాలు పాల్గొన్న ఈ సదస్సులో శ్రీధర్‌బాబు ప్రసంగించారు. నాలుగో పారిశ్రామిక విప్లవానికి కేంద్రంగా ఉన్న హైదరాబాద్ ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగించే దిశగా ముందుకు నడుస్తుందన్నారు. ఆస్పత్రుల్లో రోగుల సమాచారాన్ని పొందుపర్చడంలో పలు సంస్థలు ఇప్పటికే ఏఐ సహాయాన్ని తీసుకుంటున్నాయని, ఇది రోగులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. వైద్య సంరక్షణలో కృత్రిమ మేధ వినియోగంపై ఒక రోడ్ మ్యాప్‌ను రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర హెల్త్ సైన్సెస్ ఫౌండేషన్ డైరెక్టర్ శక్తి నాగప్పన్, ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, టీజీఐఐసీ సీఈవో వి.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 65.02 శాతం కుటుంబ సర్వే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే సోమవారానికి 65.02 శాతం పూర్తయినట్లు సమాచార, పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ తెలిపారు. 1,16,14,349 నివాసాలలో సర్వే పూర్తి చేయాల్సి ఉండగా.. 75,75,647 నివాసాలలో (65.02%) పూర్తయింది. సర్వేలో అత్యధికంగా ములుగు జిల్లా 95.3% పూర్తి చేసింది. 97,552 ఇళ్లకు.. 92,928 ఇళ్లలో సర్వే పూర్తి చేసి మొదటి స్థానంలో ఉంది. నల్లగొండ జిల్లాలో 5,04,542 నివాసాలకు.. 4,49,434 నివాసాల్లో (89.1%) సర్వే పూర్తి చేసుకొని రెండో స్థానంలో నిలిచింది. జనగామ జిల్లాలో 1,59,452 నివాసాలకు.. 1,37,069 ఇళ్లలో (86%) సర్వే పూర్తి చేసుకొని మూడో స్థానంలో ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 25,05,517 నివాసాలకు.. 11,10,883 (44.3%) నివాసాలలో సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించండి

**పీఆర్ డైరెక్టర్ సృజనకు టీపీఎస్ఏ వినతి**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) సర్వీస్ మ్యాటర్స్, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పీఆర్ శాఖ డైరెక్టర్ సృజనకు తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ (టీపీఎస్ఏ) విజ్ఞప్తి చేసింది. అన్ని గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా పునర్వ్యవస్థీకరించి, జోన్లవారీగా కేడర్ కేటాయించాలని కోరింది. 2019 నుంచి జేపీఎస్‌ల సర్వీస్‌ను లెక్కిస్తూ రెగ్యులరైజేషన్ కాలాన్ని నాలుగేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించి ప్రొబేషన్ ప్రకటించాలని పేర్కొంది. ఔట్‌సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీల విధానాన్ని రద్దుచేసి, ప్రస్తుతం పనిచేస్తున్న ఓపీఎస్‌లను జేపీఎస్ సర్వీస్‌గా పరిగణించి రెగ్యులరైజ్ చేయాలని కోరింది. సోమవారం ఈ మేరకు పీఆర్ డైరెక్టర్‌కు టీపీఎస్ఏ అధ్యక్షుడు పి.మధుసూదనరెడ్డి, ప్రధానకార్యదర్శి ఇ.శ్రీనివాస్, తదితరులు వినతిపత్రం సమర్పించారు.








నా రహస్యం గురించి నిశ్శబ్దాన్ని పాటించినంతకాలం అది నా బందీ.
నోరు జారితే దానికి నేను బందీని.
– ఆర్థర్ షోపెన్‌హావర్



సాక్షి
మంగళవారం, 19 నవంబర్ 2024

# రగులుతున్న అగ్నిపర్వతం!

ఏణ్ణర్థం దాటినా... మణిపూర్ మండుతూనే ఉంది. జాతుల మధ్య ఘర్షణ తగ్గకపోగా, అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా పదిరోజుల క్రితం ఓ కుకీ మహిళ అత్యాచారం – హత్య, దానికి ప్రతిగా మెయితీలపై కుకీ తీవ్రవాదుల దాడులు, చివరకు ఓ సహాయ శిబిరం నుంచి నవంబర్‌లో అపహరణకు గురైన ఓ పసిబిడ్డతో సహా ఆరుగురు అమాయక మెయితీలు ప్రాణాలు కోల్పోవడం... ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. సీఎం సహా రాష్ట్రంలో ప్రజా ప్రతినిధుల ఇళ్ళపై దాడులతో చివరకు రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో కర్ఫ్యూ, ఇంటర్నెట్ స్తంభన, వివాదాస్పదమైన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం విధింపు, కేంద్రం నుంచి అదనపు బలగాలను పంపడం దాకా వెళ్ళింది. ప్రభుత్వ మనుగడకు ముప్పేమీ లేకున్నా, బీజేపీ సర్కారుకు తమ మద్దతును ఉపసంహరించుకున్నట్టు నేషనల్ పీపుల్స్ పార్టీ ప్రకటించడం మిత్రుల్లోనూ బీజేపీ పట్ల పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనం. గత 2023 మేలో హింసాకాండ మొదలైనప్పటి నుంచి జాతుల ఘర్షణల్లో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 60 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. ఎంతసేపటికీ బాహ్య శక్తులు కారణమంటూ ఆరోపించడం, శుష్కవాగ్దానాలు చేయడమే తప్ప, రాష్ట్రం రావణకాష్ఠమైనా పరిస్థితిని అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తిగా విఫలమయ్యారు.

మణిపూర్ సామాజిక – ఆర్థిక జీవితంలో జాతుల ఉనికి అత్యంత కీలకమైనది. దాన్నిబట్టే ఆ ఈశాన్య రాష్ట్రంలో భూములపై హక్కులు, తదనుగుణంగా రాజకీయ సైద్ధాంతిక విభేదాలు రూపు దిద్దుకుంటూ వచ్చాయి. దాదాపు డజనుకు పైగా గిరిజన తెగలను కలిపి, బ్రిటీషు పాలనా కాలంలో కుకీలు అని పేరుపెట్టారు. విభిన్న జాతుల్లో ప్రధానమైనవైన మెయితీ వర్గానికీ, కుకీలకూ మధ్య పాలకులు తమ స్వార్థప్రయోజనాల కోసం అగ్నికి ఆజ్యం పోశారు. అదే అసలు సమస్య. జనరల్ వర్గానికి చెందిన మెయితీలు తమకు కూడా షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) హోదా కల్పించాలని కోరుతున్నారు. అయితే, దానివల్ల తమ ప్రయోజనాలు దెబ్బ తింటాయని కుకీల ఆందోళన. మరోపక్క మిజోరమ్‌తోనూ, పొరుగున మయన్మార్‌లోని చిన్ రాష్ట్రంతోనూ జాతి సంబంధాలున్న కుకీల వాంఛ వేరు. మణిపూర్ నుంచి తమ ప్రాంతాన్ని విభజించి, ప్రత్యేక పాలనా వ్యవస్థ ఏర్పాటు చేయాలని వారు బలంగా వాదిస్తున్నారు. ఇది చాలదన్నట్టు మెయితీ వర్గానికి చెందిన మణిపూర్ ప్రస్తుత ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ, కుకీలను అణచివేస్తున్నారనే అభిప్రాయం రోజురోజుకూ బలపడుతూ వచ్చింది. ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణమయ్యాయి.

కారణాలు ఏమైనా, రాష్ట్రంలోని బీజేపీ పాలిత ప్రభుత్వ సారథి అన్ని వర్గాలనూ ఒక తాటి మీదకు తీసుకురావడంలో విఫలమవడంతో బాధ్యత అంతా కేంద్రం భుజాల మీద పడింది. కేంద్ర హోమ్‌శాఖ మొన్న అక్టోబర్‌లో మెయితీ, కుకీల వర్గాల రాజకీయ ప్రతినిధులతో సమావేశం జరిపింది కానీ, శాంతిసాధన దిశగా అడుగులు పడలేదు. ప్రత్యేక శాసనవ్యవస్థతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతం తమకు కావాల్సిందేనని కుకీలు భీష్మించుకు కూర్చున్నారు. మణిపూర్ విభజనతో మాత్రమే సాధ్యం. అయితే, కేంద్ర జోక్యంతో సమస్యను పరిష్కరించవచ్చని ఇప్పటికీ కుకీలు భావిస్తున్నారు. ఇంత సంక్షోభంలోనూ అది ఓ సానుకూల అంశం. ఢిల్లీ పెద్దలు దాన్ని వినియోగించుకోవాలి. కానీ, అలా జరుగుతున్నట్టు లేదు. విధానపరంగా, రాజకీయంగా సీఎం విఫలమయ్యారని తెలుస్తున్నా, గద్దె మీది బీరేన్‌సింగ్‌ను మార్చడానికి బీజేపీ, కేంద్రంలోని ఆ పార్టీ పెద్దలు ఎందుకు ముందుకు రావడం లేదో తెలియదు. బీరేన్‌పై అంత ప్రేమ ఎందుకన్నది బేతాళప్రశ్న. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ప్రగతి అంటే ఇదేనా? మణిపూర్‌ను దేశంలో అంతర్భాగమని వారు అనుకోవట్లేదా? ఈశాన్యంలో పార్టీ విస్తరణపై ఉన్న శ్రద్ధలో కాసింతైనా శాంతిస్థాపనపై కాషాయ పెద్దలకు ఎందుకు లేదు?

అంతకంతకూ క్షీణిస్తున్న పరిస్థితులు ప్రభుత్వంతో పాటు రాజకీయ పక్షాలు సైతం బాధ్యతను వదిలేశాయనడానికి సూచన. ఈ సంక్షుభిత ఈశాన్య రాష్ట్రానికి ఇప్పుడు కాస్తంత సాంత్వన కావాలి. బాధిత వర్గాలన్నిటినీ ఓదార్చి, ఉపశమనం కలిగించే పెద్ద మనసు కావాలి. పౌరసమాజాన్ని కూడా భాగస్వామ్యపక్షం చేసి, సమస్యకు రాజకీయ పరిష్కారం చూడడమే మార్గం. అందుకు కేంద్ర సర్కారు ఇప్పటికైనా చిత్తశుద్ధితో చొరవ తీసుకోవాలి. పాలకులు మణిపూర్‌ను వట్టి శాంతిభద్రతల కోణం నుంచే చూస్తే కష్టం. దాని వల్ల సామాన్య ప్రజానీకానికీ, ఈశాన్య ప్రాంతంలోని సాయుధ బలగాలకూ కష్టాలు పెరుగుతాయి. రాష్ట్రంలో చేజారిన పరిస్థితుల్ని ఇప్పటికైనా చక్కదిద్దేందుకు కేంద్రం ప్రయత్నించకపోతే, అది దేశ సమగ్రతకే ప్రమాదం. పొరుగున మయన్మార్, బంగ్లాదేశ్‌లలో సంక్షుభిత వాతావరణం నెలకొని ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో అప్రమత్తత అత్యవసరం.

అనేక సాయుధ తీవ్రవాద గ్రూపులతో, ఇట్టే చొరబాట్లకు చాలా అవకాశం ఉన్న సరిహద్దుల్లో మణిపూర్ ఉందని విస్మరించరాదు. కేవలం సాయుధ బలగాల మోహరింపుతో అక్కడ శాంతి సాధ్యం కాదు. హింసలో తాత్కాలిక విరామాన్ని చూపి, అదే శాంతి అని నమ్మబలకడం మూర్ఖత్వం. అన్ని వర్గాల మధ్య సామరస్యం, సహజీవనం సాగేలా రాజకీయ ఏర్పాటు చేయగలిగితేనే హింసకు తెర పడుతుంది. కేంద్రం ఇప్పటికైనా చిత్తశుద్ధితో అందుకు సర్వశక్తులూ ఒడ్డాలి. లేదంటే, అగ్ని పర్వతం సమీపంలోనే ఉన్నా అలసత్వంతో వ్యవహరిస్తున్నట్టే! దాదాపు 33 లక్షల సోదర భారతీయ జనాభాను స్వార్థ ఆర్థిక, అధికార ప్రయోజనాల కోసం గాలికి వదిలేస్తున్నట్టే! గుజరాత్, ముజఫర్ నగర్, ఢిల్లీ లాంటి అనేక చోట కొద్ది రోజుల్లో హింసకు ముకుతాడు వేయగలిగినచోట ఇన్ని నెలలుగా ఒక రాష్ట్రాన్ని మంటల్లో వదిలేయడం ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ పాలకులకు సిగ్గుచేటు!

# ఏఐ రేసును గెలిచే మార్గం

విశ్లేషణ



అనిరుధ్ సూరి

**భారతదేశం కృత్రిమ మేధా శక్తి కేంద్రంగా అవతరించాలంటే మౌలిక సదుపాయాలు ఒక్కటే చాలవు, పరిశోధనా ప్రతిభ కూడా అవసరం. ఇటీవల ఇండియాలో పర్యటించిన మెటా చీఫ్ ఏఐ సైంటిస్ట్ యాన్ లెకూన్ దీన్నే నొక్కిచెప్పారు. అమెరికా సిలికాన్ వ్యాలీలోని అత్యుత్తమ ప్రతిభావంతుల్లో ఎక్కువ మంది భారత సంతతికి చెందిన వారే. కనీసం వారిలో కొందరినైనా వెనక్కు తేవాలి. వారు ఇక్కడ అభివృద్ధి చెందడానికి అవసరమైన వ్యవస్థను కల్పించాలి. ఇప్పుడు ఏఐలో ఫ్రాన్స్ కీలకంగా మారిందంటే దానికి కారణం, ఎక్కడెక్కడో పని చేస్తున్న ఫ్రెంచ్ ప్రతిభావంతులను తిరిగి ఫ్రాన్స్ వైపు ఆకర్షించేలా చేసిన వారి ఏఐ వ్యూహం. ఇది మనకు ప్రేరణ కావాలి.**

ఎన్విడియా సంస్థకు చెందిన జెన్సన్ హువాంగ్, మెటా సంస్థకు చెందిన యాన్ లెకూన్ ఇటీవలి భారత్ సందర్శనలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కు భారతీయ మార్కెట్ ప్రాముఖ్యాన్ని గురించి మాత్రమే నొక్కి చెప్పడంలేదు; భారతదేశం కృత్రిమ మేధా శక్తి కేంద్రంగా అవతరించాలన్నా, జాతీయ ఏఐ మిషన్ విజయవంతం కావాలన్నా ఏఐ మౌలిక సదుపాయాలు మాత్రమే సరిపోవు; అగ్రశ్రేణి కృత్రిమ మేధ పరిశోధనా ప్రతిభ అవసరం.


మెటా సంస్థకు చెందిన చీఫ్ ఏఐ సైంటిస్ట్ యాన్ లెకూన్ తన పర్యటనలో భాగంగా ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ చెన్నై సహా పలు విద్యాసంస్థలలో ప్రసంగించారు. 2018లో ట్యూరింగ్ ప్రైజ్ విజేత అయిన లెకూన్, కృత్రిమ మేధ ఉత్పత్తి అభివృద్ధిపై మాత్రమే భారత్ దృష్టి పెట్టకుండా, ప్రపంచ కృత్రిమ మేధా పరిశోధనలో తన భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఏఐలో అత్యాధునిక పరిశోధన అవకాశాల కొరత, 'బ్రెయిన్ డ్రెయిన్' (పరిశోధకులు వేరే దేశాలకు వెళ్లిపోవడం) భారత్ తన సొంత ఏఐ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉన్న ప్రాథమిక సవాళ్లని ఆయన ఎత్తి చూపారు.

## ప్రతిభ అవసరం!

దీనికి విరుద్ధంగా, గత నెలలో జరిగిన ఎన్విడియా ఏఐ సదస్సులో రిలయెన్స్ అధినేత ముఖేష్ అంబానీతో వేదికను పంచుకున్న జెన్సన్ హువాంగ్ భారత్ సరసమైన కృత్రిమ మేధ మౌలిక సదుపాయాలను నిర్మించాలని నొక్కి చెప్పారు. అయితే, ఇండియాలోని అత్యున్నత స్థాయి పరిశోధనా ప్రతిభ గురించి ఆయన దాదాపుగా ప్రస్తావించలేదు. ఏఐ మౌలిక సదుపాయాలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత, భారత్ తన 'నేషనల్ ఏఐ మిషన్' (ఎన్ఏఐఎమ్)లో కంప్యూటర్ మౌలిక సదుపాయాలకు ఇచ్చిన ప్రాధాన్యతకు అనుగుణంగానే ఉంది. మిషన్ నిధులలో సగం వరకు దీనికే కేటాయించారు.

అర్థవంతమైన ఏఐ పరిశోధనకు కంప్యూటర్ కనీస అవసరం అని అంగీకరించాలి. జాతీయ ఏఐ మిషన్‌లో భాగంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయంపై దృష్టి సారించిన మూడు ఏఐ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఈఓ)ను ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియా ఇటీవల ప్రకటించింది. అలాగే 'ఏఐ ఫర్ ఆల్'(అందరికీ కృత్రిమ మేధ) భావనపై దృష్టిని కేంద్రీకరించింది. అయితే, 10,000 జీపీయూ కంప్యూటర్ మౌలిక సదుపాయాలు, 3 సెక్టోరల్ సీఓఈలు మాత్రమే దేశంలో అత్యాధునిక ఏఐ పరిశోధనను సొంతంగా ప్రారంభించలేవు. రాబోయే నెలల్లో భారత్ జీపీయూలను పొందడంపై దృష్టి పెట్టినప్పటికీ, ఏఐలో పోటీతత్వాన్ని పెంచే కీలకమైన అంశం నిర్లక్ష్యానికి గురవుతోంది.

జాతీయ ఏఐ మిషన్ తన మూలస్తంభాలుగా ప్రతిభ, నైపుణ్యాలను కలిగివుందనడంలో సందేహం లేదు. కానీ అగ్రశ్రేణి పరిశోధనా ప్రతిభను ఆకర్షించడం, ఉన్నదాన్ని నిలుపుకోవడం, శిక్షణ ఇవ్వడంపై



భారతదేశ అవసరాన్ని ఇది నొక్కి చెప్పడం లేదు. బదులుగా, ఇది గ్రాడ్యుయేట్, పోస్ట్–గ్రాడ్యుయేట్ స్థాయిలలో కృత్రిమ మేధ పాఠ్యాంశాల సంఖ్యను, ప్రాప్యతను పెంచడంపై దృష్టి పెట్టే ఏఐ ఫ్యూచర్ స్కిల్స్ ప్రోగ్రామ్‌ను ఊహిస్తోంది.

ఫ్యూచర్‌స్కిల్స్ ప్రోగ్రామ్ ఏఐ పట్ల అవగాహనను, విద్యను పెంపొందించడంలో సహాయపడుతుంది. కానీ రాబోయే రెండు మూడేళ్లలో భారత్‌లో అత్యాధునిక ప్రతిభావంతుల సమూహాన్ని నిర్మించడంలో ఇది తోడ్పడదు. లెకూన్ ఎత్తి చూపినట్లుగా, ప్రస్తుతం ఏఐలో అత్యాధునిక ప్రతిభ లేకపోతే ఈ ఆటలో భారత్ విజయం సాధించలేదు.

## ఫ్రాన్స్ విజయగాథ

ఉదాహరణకు లెకూన్ స్వదేశమైన ఫ్రాన్స్‌ను చూడండి. అమెరికా, చైనాలకు పోటీగా ఉన్న తమదైన ఏఐ శక్తిని ఫ్రాన్స్ కోల్పోతున్నట్లు అక్కడి నాయకులు గ్రహించారు. అందుకే తాజా ఏఐ టెక్ వేవ్ కార్యక్రమాన్ని అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. ఫ్రెంచ్ ఏఐ వ్యూహం, ఎక్కడెక్కడో పని చేస్తున్న ఫ్రెంచ్ ప్రతిభావంతులను తిరిగి ఫ్రాన్స్ వైపు ఆకర్షించడం చుట్టూ తిరుగుతుంది. గూగుల్ డీప్‌మైండ్, మెటాలో ఫండమెంటల్ ఏఐ రీసెర్చ్ (ఫెయిర్) బృందంతో కలిసి పనిచేసిన ఫ్రెంచ్ వ్యవస్థాపకులు కేవలం ఏడాది క్రితమే ఫ్రెంచ్ స్టార్టప్ అయిన మిస్ట్రాల్‌ను ప్రారంభించారు. ఇది ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ వేదికకు అగ్ర పోటీదారులలో ఒకటిగా నిలవడమే కాక, ఏఐ ప్రపంచంలో ఫ్రాన్స్ స్థానాన్ని ప్రధాన స్థాయికి తీసుకొచ్చింది.

ప్రపంచ వేదికపై ఫ్రాన్స్ ఈ విజయం వెనుక ఉన్న మరొక కారణాన్ని కూడా లెకూన్ ఎత్తి చూపారు. పదేళ్ల క్రితం ఫ్రాన్స్‌లో మెటా సంస్థకు చెందిన ఫెయిర్ జట్టును ఏర్పాటు చేశారు. ఇది చాలా మంది ఫ్రెంచ్ పరిశోధకులకు ఏఐ పరిశోధనను వృత్తిగా మలుచుకునేలా ప్రేరేపించింది. ఇదే మిస్ట్రాల్ వంటి ఫ్రెంచ్ ఏఐ స్టార్టప్‌ల విజయానికి దోహదపడిందని చెప్పారు.

## నిలుపుకోవాల్సిన ప్రతిభ

భారత్ కూడా ఇలాగే చేయాలి. సిలికాన్ వ్యాలీలోని అగ్రశ్రేణి ఏఐ పరిశోధనా ప్రతిభలో ఎక్కువ మంది భారతీయ మూలాలకు చెందినవారే అన్నది సత్యం. ఒకట్రెండు ఉదాహరణలను చూద్దాం. చాట్‌జీపీటీకి చెందిన ప్రధాన భాగమైన ట్రాన్స్‌ఫార్మర్‌లు వాస్తవానికి 'అటెన్షన్ ఈజ్ ఆల్ యు నీడ్' అనే గూగుల్ రీసెర్చ్ పేపర్‌లో భాగం. ఆ పేపర్ సహ రచయితలలో ఆశిష్ వాశ్వానీ, నికీ పర్మార్ ఇద్దరూ భారతీయ సంతతికి చెందినవారు. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వాశ్వానీ బీటెక్ చేయగా, పుణె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ టెక్నాలజీలో పర్మార్ చదివారు. మద్రాస్ ఐఐటీ పూర్వ విద్యార్థి అరవింద్ శ్రీనివాస్ గతంలో ఓపెన్‌ఏఐలో పరిశోధకుడు. పెర్‌ప్లెక్సిటీ.ఏఐని ప్రారంభించారు. ఇది ప్రస్తుతం సిలివాన్ వ్యాలీలోని హాటెస్ట్ ఏఐ స్టార్టప్‌లలో ఒకటిగా పరిగణించబడుతోంది.

ఇలాంటి ప్రతిభను తిరిగి భారత్‌కు తేవాలి, లేదా ప్రతిభావంతులను నిలుపుకోవాలి. బెంగళూరు, గురుగ్రామ్, హైదరాబాద్, చెన్నై, ముంబై లేదా భారతదేశంలో ఎక్కడైనా అభివృద్ధి చెందడానికి అవసరమైన పరిశోధనా వ్యవస్థను కల్పించాలి. ఐఐటీ మద్రాస్ రీసెర్చ్ పార్క్‌లో చేసినట్లుగా, చిన్న ప్రదేశాల్లో కూడా అభివృద్ధి చెందడానికి వీలు కల్పించే వ్యవస్థ ఈ రంగంలో అద్భుతమైన పురోగతికి, అనేక విజయ గాథలకు దారి తీస్తుంది. ఏఐకి కూడా అదే వ్యూహాన్ని వర్తింపజేస్తే అది ఇండియాను ప్రధాన ఏఐ కేంద్రంగా మలచగలదు.

అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ఏఐ ఒక మూలస్తంభంగా ఉండాలి. ప్రధాన భారతీయ కార్పొరేట్‌లతో పాటు, ప్రాథమిక పరిశోధన చేయడానికి, ఈ ప్రతిభను ఆహ్వానించగల కనీసం మూడు, నాలుగు ఏఐ ల్యాబ్‌లకు నిధులు సమకూర్చాలి. ఈ ల్యాబ్‌లకు జాతీయ ఏఐ మిషన్ కింద కొనుగోలు చేయడానికి ప్రతిపాదించిన కంప్యూట్–ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అధునాతన ఏఐ చిప్‌లతో సహా క్లిష్టమైన ఏఐ మౌలిక సదుపాయాలను అందించవచ్చు.

అయితే, ఏఐలో పరిశోధనా ప్రతిభ ఇప్పటికే భారతదేశంలో లేదని చెప్పడం లేదు. మన విశ్వవిద్యాలయాలు ఏఐ, సంబంధిత రంగాలలో గొప్ప పరిశోధకులను ఉత్పత్తి చేస్తూనే ఉన్నాయి. ఎన్విడియాతో సహా అనేక ప్రపంచ కంపెనీలు ఇక్కడున్న తమ ఏఐ ల్యాబ్‌లలో వేలాది మంది భారతీయులను కలిగి ఉన్నాయి. ఈ పునాది, అత్యుత్తమ అగ్రశ్రేణి ఏఐ ప్రతిభను ఆకర్షించడం, దాన్ని నిలుపుకోవడంతో సహా జాతీయ ఏఐ మిషన్ విజయంలో సహాయపడుతుంది. చాలా మంది అంచనాల ప్రకారం, కృత్రిమ మేధలో విజయ ఫలాలు చాలా మధురంగా ఉండగలవు.

వ్యాసకర్త 'ద గ్రేట్ టెక్ గేమ్' రచయిత; 'కార్నెగీ ఇండియా' నాన్ రెసిడెంట్ స్కాలర్ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### కావాల్సిన ప్రణాళిక



స్వచ్ఛమైన గాలిని సాధించడం సాధ్యమే. కానీ దాన్ని స్థానిక ప్రభుత్వానికి వదిలి పెట్టలేం. దానికి జాతీయ ప్రణాళిక కావాలి. స్వచ్ఛమైన గాలితో సందడిగా ఉండే నగరాలు ఎలా ఉంటాయనే దానికి యూఎస్ఏ, జపాన్, చైనా నుండి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఢిల్లీ, ఇతర భారతీయ నగరాలకు ఇది అవసరం.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

### దేవ రాగం



మీ గురువు స్వామి హరిదాసులా ఎందుకు పాడలేకపోతున్నారని తాన్‌సేన్‌ను అడుగుతాడు అక్బర్. అప్పుడు తాన్‌సేన్ ఇచ్చిన సమాధానం గమనించదగ్గది: నేను ఈ భూమి ప్రభువు కోసం పాడుతాను, ఆయన ప్రభువుల ప్రభువు కోసం పాడతారు. (హరిదాసును అక్బర్, తాన్‌సేన్ సందర్శించడం; 1750 నాటి రాజస్థానీ మినియేచర్ పెయింటింగ్‌ను జతచేస్తూ.)

– ఇరా ముఖోటీ, రచయిత్రి

### స్నేహితుడేనా?



మిమ్మల్ని ఒకరు – వేగంగా పొమ్మనొచ్చు, మందు తాగమని బలవంతం చేయొచ్చు, తాగి నడపమనొచ్చు, డ్రగ్స్ తీసుకొమ్మనొచ్చు, మీ అంతరాత్మ ఒప్పుకోనిది ఏదో చేయమనొచ్చు. అతను మీ స్నేహితుడు కాదు. వీలైనంత త్వరగా దూరం జరగండి.

– అరుణ్ బోత్రా, పోలీస్ అధికారి

### మరణపు శ్వాస



నిన్న రాత్రి ఢిల్లీలోని గాలి సిగరెట్ పొగలా, మండుతున్న బొగ్గులా వాసన వస్తోంది. ఎయిర్ ప్యూరిఫయర్లు ఎందుకూ కొరగావు. ఇది ఉత్తుత్తి కాలుష్యం కాదు– నెమ్మదిగా పీల్చుకునే మరణం.

– సౌతిక్ బిస్వాస్, జర్నలిస్ట్

### వేరే ఎందుకు?



డెస్టినేషన్ వెడ్డింగ్‌కు రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రమే డెస్టినేషన్ కావాలని కోరుకుంటున్నాను.

– మధు మీనన్, ఫొటోగ్రాఫర్

ఇన్ బాక్స్

## ఇది కనీస అవసరం

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 2013 నుంచి ప్రపంచ వ్యాప్తంగా 'ప్రపంచ టాయిలెట్ దినోత్సవం' జరుపుకుంటున్నా నేటికీ ప్రపంచంలో 350 కోట్ల ప్రజలకు టాయిలెట్ (మరుగుదొడ్డి) సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. టాయిలెట్ సౌకర్య లేమి కారణంగా ముఖ్యంగా మహిళలు, పిల్లలు, బాలికలు... తీవ్రమైన మానసిక, ఆరోగ్య, సామాజిక సమస్యలకు గురవుతున్నారు. అనేక పాఠశాలలు, పరిశ్రమలు, ఇతర పని ప్రదేశాల్లో సరైన టాయిలెట్ సదుపాయాలు, మంచినీటి సౌకర్యం వంటివి లేకపోవడం వల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 41.9 కోట్లమంది బహిరంగ మలవిసర్జన చేస్తున్నారనీ, సుమారు 220 కోట్లమంది ప్రజలకు మంచినీటి సౌకర్యం లేదనీ, 11.5 కోట్లమంది కుంటలూ, చెరువులు, బావులు వంటి వాటిలోని సురక్షితం కాని నీరు తాగుతున్నారనీ గణాంకాలు చెబుతున్నాయి. సరైన మంచినీరు, శానిటేషన్, ఆరోగ్య సదుపాయాలు లేకపోవడంతో ప్రతిరోజూ వెయ్యి మంది ఐదేళ్ల లోపు పిల్లలు మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

ఇక మన భారతదేశంలో 2019–21లో విడుదలైన ఒక నివేదిక ప్రకారం 69.3 శాతం మంది మాత్రమే మరుగుదొడ్ల సౌకర్యాలు కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే నేటికీ 19.4 శాతం మంది మనదేశంలో బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. 2014 అక్టోబర్ 2వ తేదీన దేశ వ్యాప్తంగా 'స్వచ్ఛ భారత్ మిషన్' ప్రారంభించినా నేటికీ అందరికీ టాయిలెట్ సౌకర్యాలు అందుబాటులోకి రాలేదు.

మనదేశం త్వరలో ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 'వికసిత్ భారత్'గా ఆవిర్భవించాలనే లక్ష్యాలను నిర్దేశించుకుంది. కనీసం ప్రజలందరికీ టాయిలెట్ సౌకర్యం కల్పించకుండా ఇది సాధ్యం కాదు. అందుకే ప్రభుత్వాలు ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాలి.

– ఐ. ప్రసాదరావు; ఉపాధ్యాయుడు, కాకినాడ
(నేడు ప్రపంచ టాయిలెట్ దినోత్సవం)

# అరశతాబ్ది కిందే విత్తులు చల్లిన నాయకత్వం

అభిప్రాయం




దిలీప్ రెడ్డి

'ఈ స్పృహ ఈనాటిది కాదు. దీనికి యాభయ్యేళ్లకు పైబడిన చరిత్ర ఉంది. మానవ కారక కాలుష్యాల వల్ల ముంచుకొస్తున్న ముప్పు పర్యావరణ మార్పు దుష్ఫలితాలను ఎదుర్కోవడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థిక సహాయం చేయాలన్నది ఒప్పందం. అంతే తప్ప, ఆ పేరుతో పెట్టుబడుల్ని సాయంగా చూపి వ్యాపారం చేయడం కాదని ఇవాళ మనం నిర్దిష్టంగా డిమాండ్ చేస్తున్నాం. పదమూడేళ్ల కింద (2011 కోపెన్‌హాగెన్) మీరే అంగీకరించి, సంసిద్ధత ప్రకటించినట్టు ఏటా ఇవ్వాల్సిన లక్ష కోట్ల డాలర్ల పర్యావరణ ఆర్థిక సహాయాన్ని మీ మీ వ్యాపారాల వృద్ధికి బంగారు బాట చేసుకోకండి' అని తాజాగా భారత్ స్పష్టం చేసింది. అజర్‌బైజాన్‌లోని 'బాకు'లో 'కాప్–29' సదస్సు జరుగుతున్న సందర్భంలో భారత్ ఈ ప్రకటన వెలువరించింది.

ఇవాళ 140 కోట్ల మానవ వనరుల శక్తిగా, మార్కెట్ ప్రపంచానికి గమ్యస్థానంగా ఉన్న భారత్, శాసించాల్సిన చోట నామ మాత్రపు పాత్రకే పరిమితమౌతోంది. కారణం, పర్యావరణ స్పృహ, దూరదృష్టి, ప్రపంచ దృక్పథం కలిగిన నాయకత్వం లేకపోవడమేనన్నది కొట్టొచ్చినట్టు కనిపించే వాస్తవం. యాభై ఏళ్ల కింద, నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ చూపిన పర్యావరణ దృక్పథం, చేసిన ఆలోచనలు కాలం కన్నా ఎంతో ముందున్నాయి. తదుపరి అయిదారు దశాబ్దాల్లో అభివృద్ధి–పర్యావరణ పరిరక్షణ మధ్య తలెత్తబోయే ఘర్షణను గుర్తించారు. ఇదే విషయమై సంపన్న–పేద దేశాల మధ్య బంధాలకు సరికొత్త నిర్వచనాల అవసరాన్ని ఆమె సహేతుకంగా అంచనా వేశారు. అభివృద్ధి పేరిట ప్రకృతి వనరులను అవసరాలకూ, దామాషాకూ మించి కొల్లగొట్టడాన్ని పర్యావరణ నేరంగానే చూశారామె! విఘాతం కలిగించిన వారే మూల్యం/ నష్టపరిహారం చెల్లించాలన్న ఆలోచనకు ఆమె నాడే బీజం వేశారు.

భారతదేశపు పర్యావరణ దృక్పథానికి, భావధారకు మూలాలు 1971–72 నాటి పాలకుల ఆలోచనల్లో, కేంద్ర ప్రభుత్వ చర్యల్లో కనిపిస్తాయి. నాటి ప్రధాని ఇందిరాగాంధీ తీసుకున్న వివిధ నిర్ణయాలు, చేపట్టిన పలు చర్యలు దీన్ని ధ్రువీకరిస్తాయి. స్వీడన్ వినతి మేరకు ఐక్యరాజ్యసమితి చొరవతో మొదటి ప్రపంచ పర్యావరణ సదస్సు స్టాక్‌హోమ్‌లో 1972 జూన్‌లో జరిగింది. కానీ, అంతకు ముందే 1972 ఫిబ్రవరిలోనే 'పర్యావరణ ప్రణాళిక–సమన్వయ జాతీయ కమిటీ' (ఎన్సీఈపీసీ) భారత్‌లో ఏర్పాటయింది. దీని ఏర్పాటుకు ఇందిరాగాంధీ చొరవ కారణం. ఆ కమిటీయే 1985లో కేంద్ర 'పర్యావరణ అటవీ మంత్రిత్వ' శాఖగా రూపాంతరం చెందింది. 1971 డిసెంబరులో ఆమె సిమ్లాలో ఉన్నారు. పాక్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ అవతరణ తర్వాతి పరిణామాల్లో... పాకిస్తాన్ ప్రధాన మంత్రి జుల్ఫికర్ అలీ భుట్టోతో ఆమె దౌత్య చర్చలు జరుపుతున్నారు. అంతటి ఒత్తిడిలోనూ, సిమ్లా నుంచే ఆమె బిహార్ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. అభివృద్ధి పేరుతో చేపట్టిన ఒక ప్రాజెక్టుకు అటవీ భూమిని రాష్ట్ర ప్రభుత్వం బదలాయిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందనీ, అది పర్యావరణానికి హాని చేసే



ఇందిరా గాంధీ

తప్పుడు చర్య అవుతుంది కనుక ఉపసంహరించుకోవాలనీ ఆ లేఖలో పేర్కొన్నారు.

## దక్షిణ ప్రపంచానికి గొంతిచ్చిన వైనం

స్టాక్‌హోమ్ పర్యావరణ వేదికను ఇందిరాగాంధీ ఎంతో వ్యూహాత్మకంగా, ప్రభావవంతంగా వాడుకున్నారు. అక్కడ ఆమె ఒక అరుదైన ఆలోచనాత్మకమైన ప్రసంగం చేశారు. ఆతిథ్య స్వీడన్ కాకుండా ఆమె ఒక్కరే దేశాధినేత హోదాలో 'ప్లీనరీ ప్రసంగం' చేశారు. 'ఆ సదస్సు తర్వాత పదేళ్లకు పైగా ఆ ఊపు ఆమెలో కనిపించింది. దాని ఫలితంగానే, ఇప్పటికీ దేశంలో గొప్ప రక్షణాయుధాలుగా ఉన్న పలు ప్రగతిశీల అటవీ, వన్యప్రాణి–సహజవనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ చట్టాలు ఆ కాలంలోనే వచ్చాయ'ని ఆమె సమకాలికులైన ప్రభుత్వాధికారులు ఆ యా సందర్భాల్లో వ్యాఖ్యానించేవారు. స్వల్ప జనాభా ఉన్న సంపన్న దేశాలు సౌఖ్యాలకు మరిగి, అసాధారణ స్థాయిలో ప్రకృతి సహజ వనరుల్ని కొల్లగొడుతూ చేస్తున్న పర్యావరణ హానిని ఆమె సోదాహరణంగా ఎండగట్టారు. అభివృద్ధి–పర్యావరణ ఘర్షణను విడమర్చారు. కాలుష్య నివారణ కోసం విధించే కట్టుబాట్లు వెనుకబడ్డ దేశాల ప్రగతికి ప్రతిబంధకం అయ్యే తీరును ఎత్తిచూపడమే కాక 'కాలుష్య కారకులే నష్టాల మూల్యం చెల్లించాల'నే వాదనను తెరపైకి తెచ్చి, మూడో ప్రపంచ దేశాల గొంతుకయ్యారు. 'పర్యావరణ వాదననే మనం నెత్తికెత్తుకుంటే... యుద్ధం, పేదరికం వంటి సంక్షోభాలు అప్రాధాన్యమవుతాయేమో?' అంటూ సదస్సు ఛైర్మన్‌గా ఉన్న యూఎన్ ప్రతినిధి మారిస్ స్ట్రాంగ్ వ్యక్తం చేసిన భయాన్ని ఆమె తిప్పికొట్టారు. 'ప్రకృతి పరిరక్షణ' అనేది అభివృద్ధి–పేదరిక నిర్మూలన బాధ్యతకు వ్యతిరేకం కాదనీ, అదే వారి జీవనప్రమాణాల వృద్ధికి దోహదపడుతుందనీ ఆమె అదే వేదిక నుంచి స్పష్టం చేశారు. సంపద, హోదా, అధికార పరంగా మనమెంత బలిష్ఠులమైనా, పర్యావరణ మార్పు విపరిణామాలకు ప్రభావితులం కాకుండా తప్పించుకోజాలమని ఆనాడే హెచ్చరించారు.

పర్యావరణ స్పృహగల వారిప్పుడు వాడుతున్న 'ఒకే పృథ్వి' 'జీవులున్న ఏకైక గ్రహం' వంటి మాటల్ని ఇందిరాగాంధీ 70లలోనే వినియోగించారు. 'ప్రపంచం ఏ మూల నుంచో తరచూ సమాచారం అందుతోంది, దేశం వెనుక దేశం అభివృద్ధి పేరిట ప్రకృతి విధ్వంసానికి తెగిస్తోంది, ఇలా సాగితే దీనికి ముగింపేమిటి?' అని ఆమె ప్రశ్నించారు. సాటి మనుషుల్ని రక్షించడం, దోషుల్ని శిక్షించడమే కాదు, సకల జీవుల పట్ల కరుణతో ఉండాలని బుద్ధుడు, అశోకుడు 2 వేల ఏళ్ల కింద ఏర్పరచిన బాట, భారతీయ సంస్కృతిని ఆమె స్టాక్‌హోమ్ వేదిక నుంచి జగతికి వినిపించారు. అతి పురాతనమైన ఋగ్వేదాన్ని ఉటంకిస్తూ ఇందిరాగాంధీ ఆనాడు స్టాక్‌హోమ్‌లో చెప్పిన 'ప్రకృతి నుంచి తీసుకున్నంత, తిరిగి వెనక్కి ఇవ్వటం మానవ ధర్మం' అన్న మాట, మనమంతా ఆచరించాల్సిన అక్షరసత్యం!

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్, పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్ । (నేడు ఇందిరాగాంధీ జయంతి)

## అలిఖిత సత్యమే శ్రేష్ఠం

ఒకప్పుడు మహారాష్ట్రలో ఒకే సమయంలో ఏకనాథ్, నివృత్తినాథ్, ముక్తాబాయి అనే గొప్ప ఆధ్యాత్మిక వేత్తలు ఉండేవారు. నివృత్తినాథ్, ముక్తాబాయి ఒకే ప్రాంగణంలో ఉండేవారు. ఏకనాథ్ కొంత దూరంలో ఉండేవారు. ఒక రోజు ఒక వ్యక్తి నివృత్తినాథ్ వద్దకు వచ్చి, ఏకనాథ్ ఒక లేఖను రాసి ఆయనకు అందచేయమన్నారనీ, చదివి జాబు రాసిస్తే తీసుకురమ్మన్నారనీ చెప్పాడు. లేఖ అందుకున్న నివృత్తినాథ్ దాన్ని చదువుతూ పరమానంద భరితుడై ప్రక్కనున్న ముక్తాబాయికి దాన్నిచ్చి 'ఏకనాథ్ రాసిన ఈ లేఖను చదువు, ఎంత అద్భుతంగా ఉందో తెలుస్తుంది' అన్నాడు.

జ్యోతిర్మయం

ముక్తాబాయి ఆ లేఖను అందుకొని పూర్తి ఏకాగ్రతతో దాన్ని పైనుంచి క్రిందివరకు పరిశీలించింది. ఆమె కళ్ళవెంట ఆనంద భాష్పాలు రాలుతుండగా పరవశంతో 'లోకనాథ్ ఒక్కడే ఇంత అద్భుతంగా రాయగలడు' అంటూ రెండు చేతులు జోడించి నమస్కరించింది. నివృత్తినాథ్ అదే లేఖను అలాగే ఆ వ్యక్తికి ఇచ్చి 'మా సమాధానం ఇందులో ఉంది. తీసుకెళ్ళి లోకనాథ్ గారికి అందచేయండి' అన్నాడు. అప్పుడు లేఖను తెచ్చిన వ్యక్తి దాన్ని విప్పి చూశాడు. అందులో ఒక్క మాటాలేదు. అంతా ఖాళీగా ఉంది. అతడూ, అక్కడున్న ఇతరులూ ఆశ్చర్య చకితులయ్యారు. 'లోకనాథ్ ఏమి రాశాడు? వీళ్ళేమి చదివారు? వీళ్ళిచ్చిన సమాధాన మేమి?' అనుకొని వారి సందేహాన్ని నివృత్తినాథ్‌కు విన్నవించారు. అప్పుడు నివృత్తినాథ్ వారితో మాటలకు, ఆలోచనలకు, రాతలకు అందని దాన్ని గూర్చి ఏకనాథ్ ఆ ఖాళీ లేఖ ద్వారా తెలియచేశాడనీ, దాన్ని గ్రహించి మేము, 'ఔను అది అలాంటిదని చెప్పటానికి మీరు ఎంచుకొన్న పద్ధతి (ఖాళీ లేఖను పంపటం) చాలా సబబైనదనీ, మాకు కల్గిన బ్రహ్మానందం వర్ణింప, లిఖింప వీలుకానిదనీ అలాగే ఖాళీగా వెనక్కు ఇచ్చాం' అని వివరించాడు (పుటలు–240 241. ది ట్రూ నేమ్–ఓషో). లిఖింపబడిన, వర్ణింపబడిన సత్యం కంటే లిఖింపబడని, వర్ణింపబడని సత్యం శ్రేష్ఠమని ప్రతి ఒక్కరు అనుభవపూర్వకంగా తెలుసుకోవలసిందే!

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.చవితి రా.9.01 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఆరుద్ర రా.7.01 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.25 నుండి 9.13 వరకు, తదుపరి రా.10.31 నుండి 11.19 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.13 నుండి 10.46 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.10, **సూర్యాస్తమయం:** 5.21.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

## ఖమ్మంలో ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

- 960 కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ సీజ్
- పిండి వంటలు, మిఠాయిల్లో కేన్సర్ కారకాలున్నట్లు గుర్తింపు



అధికారులు సీజ్ చేసిన కల్తీ అల్లం పేస్ట్

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మంలో ఆహార పదార్థాలు, ఇతర తినుబండారాల్లో విక్రయదారులు పెద్ద ఎత్తున కల్తీకి పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం అన్ని జిల్లాల్లో ఆహార తనిఖీలు చేపడుతోంది. ఖమ్మంలో సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారి వి.జ్యోతిర్మయి నేతృత్వంలో ఐదుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పలు ఆహార తయారీ కేంద్రాలు, అల్లం, వెల్లుల్లి స్టోరేజీ, విక్రయ కేంద్రాలు, స్వీట్ తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేశారు. ఖమ్మం రిక్కాబజార్‌లో ఉన్న మ్యాజిక్ అల్లం, వెల్లుల్లి తయారీ కేంద్రంలో తనిఖీ చేయగా లైసెన్స్ లేకుండానే పేస్ట్ తయారు చేయడం, అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ ఉంచడం, విక్రయించడం, ఫినాయిల్, డిటర్జెంట్‌లు, రసాయనాల పక్కనే వీటిని ఉంచడాన్ని గమనించారు. కల్తీ పేస్ట్‌గా అనుమానిస్తూ రూ.1.32 లక్షల విలువైన 960 కేజీల అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను సీజ్ చేసి శాంపిల్స్ సేకరించారు. ఓ ఖార్ఖానాలో స్వీట్ల తయారీని తనిఖీ చేసిన అధికారులు కేన్సర్ కారకాలను వినియోగిస్తున్నట్లు గుర్తించి ధ్వంసం చేశారు. మయూరిసెంటర్‌లోని ఓ స్వీట్ షాపులో గడువు తీరిన, అధిక మోతాదులో రంగులను వాడిన పదార్థాలను గుర్తించారు. వాటిని ధ్వంసం చేసి విక్రయదారులకు నోటీసులు జారీ చేశారు.

## యువకుడి వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య



హాసిని

భువనగిరి క్రైం: యువకుడి వేధింపులు భరించలేక డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలోని కిసాన్‌నగర్‌లో ఈ ఘటన జరిగింది. కిసాన్‌నగర్‌కు చెందిన ఎలగందుల హాసిని (19) హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. కాగా, వలిగొండ మండలం టేకులసోమారం గ్రామానికి చెందిన నారగోని నిఖిల్ అనే యువకుడు భువనగిరి పట్టణంలో ఉంటూ హాసిని ఇంటి సమీపంలో ఉన్న సూపర్ మార్కెట్లో పనిచేస్తున్నాడు. వస్తువుల కోసం సూపర్ మార్కెట్‌కు వచ్చే హాసినితో నిఖిల్‌కు పరిచయం ఏర్పడింది. ఇటీవల కాలంలో నిఖిల్ సోషల్ మీడియాలో హాసినికి అసభ్యకర మెసేజ్‌లు పంపుతూ ప్రేమించాలని వేధిస్తున్నాడు. అతని వేధింపులతో విసిగిన హాసిని తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో కార్తీక పౌర్ణమికి ఇంటికి వచ్చిన హాసిని ఆదివారం రాత్రి ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హాసిని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు

- ఐదుగురు మావోయిస్టులపై రూ.28 లక్షల రివార్డు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్, నారాయణపూర్ జిల్లా నార్త్ అబూజ్‌మడ్ అడవుల్లో శనివారం జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన ఐదుగురు మావోయిస్టులను గుర్తించారు. ఈ మేరకు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ సోమవారం వివరాలు వెల్లడించారు. ఎదురు కాల్పుల్లో మృతి చెందిన వారిలో డీకేసీఎం కమాండర్ వనోజామిచ్చే కారమ్, ప్లాటూన్ మెంబర్ సంతోశ్ కర్మామీ, మనీశ్, సురేశ్, పునీత ఉన్నారని తెలిపారు. వీరిపై మొత్తం రూ.28 లక్షల రివార్డు ఉందని పేర్కొన్నారు. కాగా, మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎదురుకాల్పుల సమయంలో టేకుమెట్ల, ముస్పర్సీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా కనిపించిన పలువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, వారి కోసం కుటుంబీకులు రెండు రోజులుగా అటవీ ప్రాంతాల్లో గాలించారు. కాగా, యువకులను సోమవారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని, అందరూ క్షేమంగా ఉన్నారని ఐజీ సుందర్‌రాజ్ ధ్రువీకరించారు.

## దక్షిణ రింగు భూనిర్వాసితులకు అధిక పరిహారం

- భూముల మార్కెట్ విలువ సవరించాలని నిర్ణయం
- జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు
- ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి హరిచందన



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డులోని దక్షిణ భాగం పరిధిలో సేకరించే భూములకు పరిహారం భారీగా పెంచే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రింగురోడ్డు ఉత్తర భాగాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతుండగా, దక్షిణ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా చేపడుతున్న సంగతి తెలిసిందే. భూసేకరణ ప్రక్రియలో భాగంగా అవార్డులు పాస్ చేసి పరిహారం చెల్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దక్షిణ భాగంలో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రింగురోడ్డు అలైన్‌మెంటును ఖరారు చేసే కసరత్తు మొదలుపెట్టింది. ఆమేరకు భూసేకరణ జరగాల్సి ఉంది. పరిహారం మొత్తం పెంచి ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా భూముల మార్కెట్ విలువను పెంచాలని నిర్ణయించింది. మార్కెట్ విలువ పెంచి పరిహారాన్ని భూసేకరణ, పునరావాస చట్టం -2013 ప్రకారం చెల్లించనుంది. మార్కెట్ విలువలు పెంచేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలంటూ రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. భూ యజమానులకు చట్టబద్ధంగా పరిహారం అందాలని, నష్టపోయామనే భావన వారిలో ఎక్కువగా కనిపించొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

### ప్రాజెక్టు నిర్వహణ విభాగం ఏర్పాటు

భారీ రోడ్డు ప్రాజెక్టులు నిర్వహించే ఎన్‌హెచ్ఏఐలో మాదిరి దక్షిణ రింగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వహణ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఓఆర్ఆర్‌తో రేడియల్ రోడ్ల ద్వారా అనుసంధానాన్ని ఈ విభాగం ఖరారు చేస్తుంది. ఇందులో పర్యావరణ విభాగానికి సంబంధించి జిల్లా అటవీ అధికారి, సాంకేతిక విభాగంలో ఒక చీఫ్ ఇంజనీర్, ఇద్దరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పరిపాలన విభాగానికి సంబంధించి అకౌంటెంట్ ఉండనున్నారు. అటవీ, రోడ్లు, భవనాలు, ఆర్థిక శాఖల నుంచి ఈ అధికారులు డిప్యుటేషన్‌పై పనిచేయనున్నారు. అలాగే, రీజినల్ రింగురోడ్డు పురోగతి పరిశీలనకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి దాసరి హరిచందనను నియమించారు. ఇక దక్షిణ రింగుకు సంబంధించి డీపీఆర్ తయారీ, టెండర్ల వ్యవహారం పర్యవేక్షించేందుకు కన్సల్టెన్సీ సేవలు తీసుకోనుంది. కన్సల్టెన్సీ సంస్థ ఖరారుకు వీలుగా ఆర్ఎఫ్‌పీ బిడ్లు ఆహ్వానించాలంటూ రోడ్లు, భవనాల శాఖ ఈఎన్‌సీని ఆదేశించింది.

## ఆడుతూ అనంతలోకాలకు..

- గుండెపోటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి



ప్రహర్షిక

ఖమ్మం రూరల్: అప్పటివరకు తల్లిదండ్రులతో ఆడుతూ పాడుతూ గడి పిన చిన్నారి గుండెపోటుతో మృతిచెందింది. ఖమ్మం జిల్లా రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంకు చెందిన కుర్రా వినోద్, లావణ్య దంపతులకు నాలుగేళ్ల కుమార్తె ప్రహర్షిక ఉంది. సోమవారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న పాప.. ఒక్కసారిగా ఛాతీ పట్టుకుని కుప్పకూలింది. కుటుంబసభ్యులు చిన్నారిని ఖమ్మం ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కళ్ల ముందే మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## రెండు దశల్లో మామునూరు విమానాశ్రయ నిర్మాణం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పనులపై అధికారులకు సూచనలు ఇస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సాక్షి, హైదరాబాద్: వరంగల్ శివారులోని మామునూరులో విమానాశ్రయాన్ని రెండు దశల్లో నిర్మించనున్నట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. తొలుత చిన్న విమానాలను నడు పుతూ, భవిష్యత్‌లో ఎయిర్‌బస్ లాంటి పెద్ద విమానాలను నడిపేలా అభివృద్ధి చేస్తామన్నారు. పెద్ద విమానాలు దిగేందుకు కావాల్సిన రన్‌వేను ముందుగానే సిద్ధం చేయనున్నట్టు పేర్కొన్నారు. సోమ వారం సాయంత్రం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎనిమిది నెలల్లో చిన్న విమానాల ఆపరేషన్‌కు వీలుగా, పెద్ద విమానాల నిర్వహణను ఏడాదిన్నరలో సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. తిరుపతి, విజయవాడ, ఢిల్లీ, ముంబై, బెంగళూరు లాంటి ప్రాంతాలకు విమాన సర్వీసులు ప్రారంభిస్తామని, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు ఢిల్లీ నుంచి నేరుగా వరంగల్‌కు వచ్చే కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని పేర్కొ న్నారు. తదుపరి కొత్తగూడెం, రామగుండం విమా నాశ్రయాలను నిర్మిస్తామని చెప్పారు. హైదరాబాద్-విజయవాడ రోడ్డు విస్తరణ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమవుతోందని, ఫిబ్రవరి నాటికి టెండర్లు పిలు స్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ముందుకు సాగకుండా జాప్యం జరుగుతూ వచ్చిన ఉప్పల్ ఫ్లైఓవర్ పనులను తాము కొలిక్కి తెచ్చా మని, మేడిపల్లి నుంచి నారపల్లి సీపీఆర్ఐ వరకు పనులు దాదాపు పూర్తయ్యాయని, ఉప్పల్ నుంచి మేడిపల్లి వరకు ఏడాదిన్నరలో పూర్తి చేస్తామ న్నారు. శ్రీశైలం రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్‌ను చేపట్టే యోచనలో ఉన్నామని, కేంద్రం సహకరిస్తే దాన్ని సిద్ధం చేస్తామని తెలిపారు. ఢిల్లీ-ముంబై, ముంబై-నాగ్‌పూర్, చెన్నై-కన్యాకుమారి ఎక్స్ ప్రెస్‌వే తరహాలో రీజినల్‌రింగురోడ్డు దక్షిణ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సిద్ధం చేయబోతోంద న్నారు. విమానాశ్రయం, ప్రతిపాదిత ఫోర్త్ సిటీతో దీనిని అనుసంధానిస్తామన్నారు. వచ్చే నెలలో టెండర్లు పిలిచేందుకు ప్రయత్నిస్తున్నామని, దీనికి అలైన్‌మెంట్ ఖరారుకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో అధికారుల బృందాన్ని నియమించామని చెప్పారు. నిధుల కోసం జైకా, వరల్డ్ బ్యాంకు, ఏడీబీలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు పేర్కొ న్నారు. ఉత్తర భాగానికి సంబంధించి ఎన్‌హెచ్ఏఐ భూసేకరణ పరిహారాన్ని ఖరారు చేయలేదని, ఇంకా టెండర్లు పిలవలేదన్నారు. వరంగల్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.4 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని చెప్పారు. ఢిల్లీలో దోమల బాధ తట్టుకోలేక కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్నారని ఎద్దేవా చేశారు.

### తెలంగాణ తల్లి విగ్రహ పనులు పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి

- సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ నిర్మాణ పనులను సోమవారం సాయంత్రం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా కూడా నాణ్యత లోపించకూడదని, నిత్యం ఉన్నతాధికారులు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ విగ్రహాన్ని డిసెంబర్ మొదటి వారంలో ఆవిష్కరించనున్న నేపథ్యంలో పనులు వేగంగా చేయాలని అధికారులకు సూచించారు.

### సచివాలయ ప్రధాన గేటు పూర్తిగా తొలగింపు

సచివాలయం తూర్పు వైపు ఉన్న బాహుబలి గేటుగా పిలిచే ప్రధాన గేటును అధికారులు పూర్తిగా తొలిగించారు. గతంలో ఈ ప్రధాన గేటు నుంచి అప్పటి సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి రాకపోకలు సాగించేవారు. అయితే సచివాలయ ప్రధాన గేటు లోపల తెలంగాణ తల్లి విగ్రహాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో ఆ గేటును తొలగిస్తున్నా మని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రధాన గేటు పూర్తిగా కనిపించకుండా ర్యాక్‌లు ఏర్పాటు చేశారు. ఈశాన్యం వైపు ఉన్న నాలుగో గేటుకు పక్కనే మరో గేటును నిర్మించాలని నిర్ణయించారు. దీని కోసం అక్కడ ప్రస్తుతం ఉన్న ఇనుప గ్రిల్స్ తొలగించారు. ఈ గేటు నుంచే ముఖ్యమంత్రి రాకపోకలు ఉంటాయని సమాచారం. నైరుతి, ఈశాన్య గేట్లను కలుపుతూ రోడ్డు నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ గేట్ల మార్పు విషయం చర్చనీయాంశమైంది.

## నిజామాబాద్ మేయర్ భర్తపై దాడి



శేఖర్‌ను పైకి లేపుతున్న స్థానికుడు

ఖలీల్‌వాడి: భూ వివాదంలో నిజామాబాద్ నగర మేయర్ నీతూ కిరణ్ భర్త, బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ దండు చంద్రశేఖర్‌పై ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న షేక్ రసూల్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో నగరంలోని నాగారం క్వార్టర్స్ వద్ద ఈ ఘటన జరిగింది. దాడి సందర్భంగా కింద పడిపోయిన చంద్రశేఖర్‌ను రసూల్ కాలుతో తన్నడమేకాక ఇనుప సుత్తితో ముఖంపై కొట్టాడు. దీంతో చంద్రశేఖర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు వెంటనే చంద్రశేఖర్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం నిందితుడు షేక్ రసూల్ వీడియో విడుదల చేస్తూ .. శేఖర్ అనుచరులు తనకున్న వంద గజాల భూమిని కబ్జా చేసి రూ.2 లక్షలు డిమాండ్ చేశారని, మూడేళ్లుగా శేఖర్‌ను వేడుకున్నా వినిపించుకోకపోవడంతో దాడి చేసినట్లు పేర్కొన్నాడు.

## ప్రతి అంశాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు
- మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో బీసీ రిజర్వేషన్లపై అభిప్రాయ సేకరణ



కుల సంఘాలతో మాట్లాడుతున్న బూసాని వెంకటేశ్వరరావు. పక్కన కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అన్ని కులాలు, జాతుల ఆవేదనను అర్థం చేసుకున్నామని, కుల సంఘం ప్రతినిధులు చెప్పిన ప్రతి అంశాన్ని నోట్ చేసుకున్నామని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల గుర్తింపు అంశంపై సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రాష్ట్ర బీసీ డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరులోని వివిధ కుల సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంఘాల నుంచి స్వీకరించిన వినతులను నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. బీసీ కమిషన్ రికమండేషన్ ఆధారంగా రిజర్వేషన్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కేటాయింపు ఎలా ఉండాలో తెలుసుకునేందుకే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ఇప్పటి దాకా ఐదు జిల్లాల్లో కమిషన్ పర్యటన ముగిసిందన్నారు. సేకరించిన అంశాలపై ప్రభుత్వానికి 30 రోజుల్లో సమగ్ర నివేదిక ఇస్తామని చెప్పారు. మొత్తం 65 సంఘాల నాయకులు కమిషన్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అంతకుముందు ఆయనకు కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కమిషన్ కార్యదర్శి సైదులు, అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిర పాల్గొన్నారు.

## సర్వేలో పాల్గొనకపోతే ప్రజలకే నష్టం

- ఏ కులం వారు ఎంత ఉన్నారనేది సర్వే ద్వారానే తెలుస్తుంది
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



మీడియాతో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్. చిత్రంలో సభ్యులు బాలలక్ష్మి, రాపోలు జయప్రకాశ్, సురేందర్

నల్లగొండ: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనకపోతే ప్రజలే నష్టపోతారని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. బీసీలు ఎంత మంది ఉన్నారో... ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందాలంటే సర్వే జరగాల్సిన అవసరముందని చెప్పారు. బీసీ కమిషన్ సోమవారం నల్లగొండకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ నిర్వహించింది. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మీడియాతో మాట్లాడుతూ సర్వేపై అపోహలు నమ్మొద్దన్నారు. ప్రభుత్వం వద్ద ప్రతి ఒక్కరి ఆస్తుల వివరాలు ఉన్నాయని, ప్రస్తుతం సర్వే ద్వారా ఇచ్చినంత మాత్రాన వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే 84 శాతం సర్వే పూర్తయ్యిందని, అందుకు కలెక్టర్‌ను ఆయన అభినందించారు.

### బీసీ హక్కుల రక్షణ కోసమే కమిషన్

కమిషన్ ఉందే బీసీ హక్కుల రక్షణ కోసమని చైర్మన్ నిరంజన్ అన్నారు. వారికి అన్యాయం జరిగితే కమిషన్ చూస్తూ ఊరుకోదన్నారు. కమిషన్ పదవీ కాలం పూర్తయ్యేలోపు తాము సమర్థవంతంగా పనిచేసి బీసీ కమిషన్ అంటే ఏమిటో నిరూపించుకుంటామన్నారు. బీసీలపై అట్రాసిటీ కేసులు పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, కమిషన్ ఇలాంటి విషయంలో చర్యలు తీసుకుంటుందన్నారు. అన్ని కులాల అభిప్రాయాలు విన్నామని, బీసీలతో పాటు ముస్లింల అభిప్రాయాలు కూడా తీసుకున్నామని, వీటన్నింటిని రిపోర్టు తయారుచేసి ప్రభుత్వానికి అందిస్తామన్నారు. నాయీ బ్రాహ్మణులు కూడా దేవాలయాల్లో పనిచేస్తున్నారని వారికి పూజారులుగా ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంలో కమిషన్ ప్రభుత్వానికి తగిన సూచనలు చేస్తుందన్నారు. బీసీ ఏ నుంచి ఎస్టీలో చేర్చాలని బెస్త కులస్తులు కోరారని చెప్పారు. ముదిరాజ్‌లు, ఉప్పర కులాలను బీసీ డీ నుంచి బీసీ ఏలో కలపాలని కోరారని, రజకులను బీసీ ఏ నుంచి ఎస్సీ గ్రూప్‌లో చేర్చాలని కోరినట్టు తెలిపారు. పిచ్చకుంట్ల కులస్తులు ఆ పదాన్ని తొలగించాలని కోరారన్నారు. బీసీల సమస్యలన్నీ తెలుసుకున్నామని, వాటన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని చైర్మన్ చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మితో పాటు ఉమ్మడి జిల్లా కలెక్టర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## సీఓ2 నుంచి మిథనాల్

**దేశంలోనే తొలి ప్రయోగాత్మక ప్లాంట్ సింగరేణిలో ఏర్పాటు**

- రోజుకు 500 కేజీల సీఓ2 నుంచి 180 కేజీల మిథనాల్ ఉత్పత్తి
- కోల్ ఇండియా, ప్రైవేట్ సంస్థలతో కలిసి సింగరేణి ఏర్పాటు
- డిసెంబర్ 31 నాటికి పూర్తి : సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్



ప్లాంట్

సాక్షి, హైదరాబాద్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని 1,200 మెగావాట్ల సింగరేణి విద్యుత్ కేంద్రంలో వెలువడే కార్బన్‌డయాక్సైడ్ (సీఓ2) వాయువు నుంచి మిథనాల్ ఉత్పత్తికి సింగరేణి బొగ్గు గనుల సంస్థ శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మక ప్లాంట్‌ను రూ.20 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తోంది. థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ప్రక్రియలో భాగంగా బొగ్గును మండించడంతో పెద్ద మొత్తంలో కార్బన్‌డయాక్సైడ్ విడుదలవుతుంది. రోజుకు 500 కేజీల కార్బన్ డయాక్సైడ్ సేకరించి, హైడ్రోజన్‌తో రసాయన చర్యకు గురిచేయడం ద్వారా మిథనాల్ ద్రావణాన్ని ఉత్పత్తి చేస్తారు. విద్యుత్ కేంద్రం చిమ్నీకి అనుసంధానం చేసి మిథనాల్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. డిసెంబర్ 31 నాటికి ఇది పూర్తవుతుందని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. సింగరేణి విద్యుత్ కేంద్రంలో వెలువడే కర్బన ఉద్గారాలను 99.9 శాతం వరకు వాతావరణంలో కలవకుండా నివారించేందుకు ఎలక్ట్రో స్టాటిక్ ప్రెసిపిటేటర్స్ (ఈఎస్‌పీ)ను ఏర్పాటు చేశామని ఓ ప్రకటనలో చెప్పారు. దీంతో అనుమతించిన పరిమితులకు లోబడే కర్బన ఉద్గారాలను విద్యుత్ కేంద్రం విడుదల చేస్తుండగా, వాటినీ రీసైకిల్ చేసి మిథనాల్‌ను తయారు చేయనున్నట్లు వివరించారు.

### విజయవంతమైతే భారీ ప్లాంట్

మిథనాల్ ప్లాంట్‌కి సంబంధించిన సివిల్ పనులు పూర్తి కాగా..కార్బన్‌డయాక్సైడ్‌ను సంగ్రహించే యూనిట్, హైడ్రోజన్ జనరేటర్, కంప్రెషర్, మిథనాల్ డిస్టిలేషన్ యూనిట్లను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కోల్ ఇండియా అనుబంధ పరిశోధన సంస్థ 'సీఎంపీడీఐఎల్' ఆర్థిక సహకారంతో ఇథనాల్ ప్లాంట్‌ను చేపట్టారు. నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను బెంగళూరుకు చెందిన జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్, బ్రెత్ అప్లైడ్ సైన్సెస్ సంస్థలకు అప్పగించారు. ప్లాంట్ రోజుకి 180 కేజీల మిథనాల్‌ను ఉత్పత్తి చేయనుండగా, సింగరేణి సంస్థ విక్రయించడం లేదు. ప్రయోగాత్మక ప్లాంట్ విజయవంతమైతే వ్యాపార విస్తరణలో భాగంగా భారీ మిథనాల్ ఉత్పత్తి ప్లాంట్‌ను నిర్మించి వాణిజ్య విక్రయాలు జరపాలని సంస్థ భావిస్తోంది. మిథనాల్‌ను ఎరువులు, అక్రిలిక్ ప్లాస్టిక్, సింథటిక్ ఫైబర్ వస్త్రాలు, ప్లైవుడ్, పెయింట్స్ తయారీలో వినియోగిస్తారు. దేశంలో 120 మిలియన్ టన్నుల మిథనాల్‌ను వినియోగిస్తుండగా, 80 మిలియన్ టన్నులు ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతోంది.


**తెలంగాణ ఫుడ్స్**
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ)
(ISO 22000:2018 ధృవీకృత కంపెనీ)
రోడ్ నం.14, IDA, నాచారం, హైదరాబాద్-500076, A.P, ఇండియా
ఇ-మెయిల్: projects.tfoods@gmail.com వెబ్‌సైట్: http://tfoods.telangana.gov.in

Ref.No.TF/MM/SRGP/378/2023-24 రీ-ఇ-టెండరు ప్రకటన తేది:18-11-2024

తెలంగాణ ఫుడ్స్ ఆవరణలో రెడీ-టు-ఈట్ ఫుడ్ ప్లాంట్ కొరకు గోధుమ 10MTs/Hr. మరియు సెనగపప్పు/ సోయాబీన్, వేరుశెనగ & అటుకులు మొదలైన 5MTs/Hr. కోసం గ్యాస్ (ఎల్పీజీ) రోస్టర్స్ యొక్క రూపకల్పన, సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట కొరకు తెలంగాణ ఫుడ్స్ ఇ-టెండరు కోరుతోంది. బిడ్ల దాఖలుకు ముగింపు తేది & సమయం: 05-12-2024న ఉ.11.00 గం.వరకు. గమనిక: నియమనిబంధనలు, స్పెసిఫికేషన్లు మొదలైనటో పూర్తి టెండరు ప్రకటన మరియు టెండరు షెడ్యూలును 18-11-2024న ఉ.11.00 గం. నుండి వెబ్‌సైట్ http://tender.eprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

DIPR RO No.6740-PP/CL/Advt/1/2024-25, Dt.18.11.2024 సం/- డిప్యూటీ జనరల్ మేనేజర్

**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం**
తెలంగాణ రాష్ట్ర విద్య మరియు సంక్షేమ మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ :: హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండరు ప్రకటన నం. SE/TGEWIDC/HYD/NIT/367 to 374/2024-25, తేది:16.11.2024

తెలంగాణ రాష్ట్రంలో సివిల్ పనుల (8 పనులు) నిర్మాణం కొరకు అర్హతగల కాంట్రాక్టర్ల అందరి నుండి టెండర్లు కోరబడుచున్నవి. అంచనా వ్యయం : రూ. 66.39 నుండి రూ. 853.00 లక్షలు. ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు మరియు స్వీకరణకు చివరి తేది : 30.11.2024న సా.4.00 గం. వరకు. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.inను చూడండి లేదా స్వయంగా సంప్రదించండి: సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TGEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, ఇ-సేవ ఎదురుగా, ఎల్బీ స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం.29565991.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, హైదరాబాద్

DIPR RO No. 6693-PP/CL/Advt/1/2024-25, Dt. 18.11.2024

తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, పంచాయతీ రాజ్, మెదక్**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

NIT No.HD/Tender/186-241/2024-25 తేది: 18-11-2024

మొత్తం (56) పనులలో గ్రామీణ రోడ్ల మరియు వంతెన నిర్మాణములు CRR గ్రాంట్స్‌లో మరియు ఇతర పనులకు క్రింద దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం అంచనా వ్యయం: రూ.97.73 కోట్లు. పాల్గొనేందుకు అప్లోడ్ తేదీ నుండి కనీసం 7 పనిరోజులతో ప్రతి టెండరు కోసం 19-11-2024 నుండి 21-12-2024 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ నుండి టెండరు షెడ్యూళ్లను పొందవచ్చును. ఇతర వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ http://tender.telangana.gov.in నుండి పొందవచ్చును. ఇమెయిల్ ఐడి: se_pr_mdk@telangana.gov.in, ఆఫీస్ ల్యాండ్ లైన్ నం. 08452-295457

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పిఆర్ రీజియన్ మెదక్

DIPR RO No.6732-PP/CL/Advt/1/2024-25, Dt: 18.11.2024

తెలంగాణ ప్రభుత్వం
**దేవాదాయ-ధర్మాదాయ శాఖ**
G.O.Rt. No. 421, రెవెన్యూ (ఎండోమెంట్స్-II) డిపార్ట్‌మెంట్, తేది : 11-11-2024
ఫారం-I (రూల్ 4(1) చూడండి)

దేవాలయం పేరు : శ్రీ హనుమాన్ దేవస్థానం, కర్మన్‌ఘాట్ (గ్రా), సరూర్‌నగర్ (మం), రంగారెడ్డి జిల్లా. ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా! ఈ ప్రకటన తేదీ నుండి (20) రోజుల తర్వాత, చట్టం 33/2007 ద్వారా సవరించబడిన విధంగా తెలంగాణ ఛారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టం 1987 (చట్టం 30/87)లోని సెక్షన్ 15లో సబ్-సెక్షన్(1) క్రింద ప్రభుత్వం ద్వారా శ్రీ హనుమాన్ దేవస్థానం, కర్మన్‌ఘాట్ (గ్రా), సరూర్‌నగర్ (మం), రంగారెడ్డి జిల్లాకు వంశపారంపర్యంకాని ధర్మకర్తల మండలి నియమించబడుతుంది. ఆసక్తిగల వ్యక్తులు ధర్మకర్తగా నియామకం కొరకు వారి దరఖాస్తులను చట్టంలోని సెక్షన్ 17లో సబ్-సెక్షన్ (3) క్రింద రూల్స్‌లోని ఫారం-II ప్రకారం నిర్ణీత నమూనాలో ఈ ప్రకటన తేదీ నుండి ఇరవై రోజుల్లోగా సంబంధిత దేవస్థానం యొక్క కమిషనర్, దేవాదాయ- ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ మరియు జాయింట్ కమిషనర్/డిప్యూటీ కమిషనర్ / అసిస్టెంట్ కమిషనర్ గారికి పంపవలెను.

సం/- ఇ.శ్రీధర్, ఐ.ఎ.ఎస్., కమిషనర్

DIPR RO No.6709-PP/CL/Advt/1/2024-25, Dt. 18.11.2024

**తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్**
మిల్క్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ, హైదరాబాద్-500017. ఇమెయిల్ ID: gmmpfhyd.tgddcf@gmail.com

టెండర్ ప్రకటన నం.558-516/DGM(PI)/GM/MPF/2024 తేది:14-11-2024

తెలంగాణలోని మిల్క్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ, హైదరాబాద్ వద్ద దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం www.tender.telangana.gov.in ద్వారా అనుభవంగల మరియు పేరెన్నిక గల తయారీదారులు/ సరఫరాదారులు/అధీకృత డీలర్లు/ ఏజెన్సీల నుండి టెక్నికల్ కమ్ కమర్షియల్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు నం.558, టెండరు వివరణ: "ఒక సంవత్సరం అనగా 2024-2025 కాలానికి M.P.F, హైదరాబాద్ వద్ద ఆటోమేటిక్ ఫామ్ ఫిల్ & సీలింగ్ మెషిన్స్, ఆటోమేటిక్ కప్ ప్యాకింగ్ మెషిన్స్, ఫ్లేవర్డ్ మిల్క్ ఫిల్లింగ్ మెషిన్స్ & ఘీ ప్యాకింగ్ మెషిన్స్ యొక్క ఆపరేషన్, రిపేర్ & మెయింటెనెన్స్ కొరకు వార్షిక మెయింటెనెన్స్ కాంట్రాక్టు". టెండరు నం.516, టెండరు వివరణ: రెండు సంవత్సరాల కాలానికి MPF, హైదరాబాద్ వద్ద "ET ప్లాంట్ & RO ప్లాంట్ ఆపరేషన్ & మెయింటెనెన్స్ కొరకు వార్షిక మెయింటెనెన్స్ కాంట్రాక్ట్". బిడ్ల డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 16-11-2024న ఉ.11.00 గం. నుండి. షెడ్యూల్స్ ముగింపు తేది: 02-12-2024న మ.3.00 గం. వరకు. సంప్రదించాల్సిన నం. 9121160521.

సం/- జనరల్ మేనేజర్ (MPF), TGDDCF Ltd., హైదరాబాద్

DIPR Ro No.6698-PP/CL/Advt/1/2024-25, Dt:18.11.2024

SAI
**రిక్రూట్‌మెంట్ సెల్**
హెడ్ ఆఫీస్, గేట్-10, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కాంప్లెక్స్, లోధి రోడ్, న్యూఢిల్లీ -110003.

ఫైల్ నం.: 01-04001(02)/113/2024-HO - Recruitment Cell తేది: 06-11-2024

కాంట్రాక్ట్ ప్రాతిపదికపై యంగ్ ప్రొఫెషనల్ ఉద్యోగం కొరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దరఖాస్తులు కోరుతోంది.

యువజన వ్యవహారాలు మరియు క్రీడలు మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల సంస్థ అయిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI), గరిష్టంగా 4 సంవత్సరాలు కాలవ్యవధి కొరకు కాంట్రాక్ట్ ప్రాతిపదికపై యంగ్ ప్రొఫెషనల్ 50 ఉద్యోగాలకు నియామకం కోసం అర్హతగల, యోగ్యతగల మరియు ప్రేరణగల భారత పౌరుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. ఉద్యోగ వివరాలు మరియు ఇతర వివరాలు SAI వెబ్‌సైట్ అనగా http://sportsauthorityofindia.nic.inలో లభిస్తాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనుట కొరకు షెడ్యూలు దిగువ ఇవ్వబడినది:

1. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేది: 08-11-2024 (ఉ.10.00 గం.)
2. ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేది: 30-11-2024 (సా.05.00 గం.)

డిప్యూటీ డైరెక్టర్
రిక్రూట్‌మెంట్ సెల్
SAI హెడ్ ఆఫీస్

CBC - 47103/12/0012/2425

SAI
**రిక్రూట్‌మెంట్ సెల్**
హెడ్ ఆఫీస్, గేట్-10, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కాంప్లెక్స్, లోధి రోడ్, న్యూఢిల్లీ -110003.

ఫైల్ నం.: 01-04001(02)/115/2024-HO - Personnel Division తేది: 06-11-2024

కాంట్రాక్ట్ ప్రాతిపదికపై జూనియర్ కన్సల్టెంట్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉద్యోగం కొరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దరఖాస్తులు కోరుతోంది.

యువజన వ్యవహారాలు మరియు క్రీడలు మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల సంస్థ అయిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI), గరిష్టంగా 4 సంవత్సరాలు కాలవ్యవధి కొరకు కాంట్రాక్ట్ ప్రాతిపదికపై జూనియర్ కన్సల్టెంట్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఒక ఉద్యోగానికి నియామకం కోసం అర్హతగల, యోగ్యతగల మరియు ప్రేరణగల భారత పౌరుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. ఉద్యోగ వివరాలు మరియు ఇతర వివరాలు SAI వెబ్‌సైట్ అనగా http://sportsauthorityofindia.nic.inలో లభిస్తాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనుట కొరకు షెడ్యూలు దిగువ ఇవ్వబడినది:

(i) ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేది: 08-11-2024 (ఉ.10.00 గం.)
(ii) ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేది: 30-11-2024 (సా.05.00 గం.)

డిప్యూటీ డైరెక్టర్
రిక్రూట్‌మెంట్ సెల్
SAI హెడ్ ఆఫీస్

CBC - 47103/12/0010/2425

**भारी जल संयंत्र, मणुगूरु HEAVY WATER PLANT, MANUGURU**
**ई-निविदाएं आमंत्रित करने हेतु सूचना Notice Inviting e-Tenders**

महाप्रबंधक, एचडब्ल्यूपी (एम) भारत के राष्ट्रपति की ओर से, निम्नलिखित कार्यों के लिए दो बोली प्रणालि पर ऑनलाइन आइटम दर आमंत्रित करते हैं ।

The General Manager, HWP (M) invites on behalf of President of India online item rate on two bid system for followings work (s).

एनआईटी नंबर : एचडब्ल्यूपीएम/एमयू/टीजी/2415 NIT No. HWPM/MU/TG/2415

कार्य का नाम : सीपीपी, एचडब्ल्यूपीएम पर ऑनलाइन लीक सीलिंग का काम होता है.
Name of Work : Online Leak Sealing works at CPP, HWPM.

अनुमानित लागत Estimated Cost : Rs. 8,86,000/- बयाना राशि Earnest Money : Rs. 17,720/-

पूर्ण होने की अवधि : कार्य आदेश जारी होने की तिथि से दो वर्ष ।
Period of completion : Two year from date of issue of Work Order.

बोली जमा करने की अंतिम समय और तारीख (ऑनलाइन) : 25-11-2024 को 17-00 बजे तक
Last Time and Date of Submission of bid (Online) : Up to 17-00 hrs. on 25-11-2024

The bid forms and other details can be obtained from the website : https://eprocure.gov.in/eprocure/app.
The NIT is also available on www.hwb.gov.in
बोली प्रपत्र और अन्य विवरण वेबसाइट : https://eprocure.gov.in/eprocure/app से प्राप्त किए जा सकते हैं ।
एनआईटी www.hwb.gov.in पर भी उपलब्ध है ।

Sd/-
GENERAL MANAGER
महाप्रबंधक

सं.No. भापसं (म) HWP(M)/ प्रशा (सा) Admn(G)/एनआईटी NIT/16/2024/677 Dt. 18.11.2024.

# వైరి సేనల హోరాహోరీ!

## 2 కూటములు, 6 ప్రాంతాలు • మహారాష్ట్రలో సై అంటే సై • రాష్ట్ర చరిత్రలోనే సంక్లిష్ట ఎన్నికలు

రెండు జాతీయ పార్టీలు. నాలుగు ప్రాంతీయ పార్టీలు. పలు చిన్న పార్టీలు. భారీ సంఖ్యలో స్వతంత్రులు, రెబెల్స్. వెరసి మహారాష్ట్ర చరిత్రలోనే అత్యంత సంకుల సమరానికి రంగం సిద్ధమైంది. కనీవినీ ఎరగనంత పోటాపోటీగా సాగుతున్న అసెంబ్లీ ఎన్నికల పోరు చివరి దశకు చేరుకుంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని ఆరు ప్రాంతాలకు గాను ఏకంగా నాలుగింట విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) ఆధిపత్యమే సాగింది. అధికార మహాయుతి కూటమి కొంకణ్‌లో మాత్రమే కాస్త పరువు నిలుపుకుంది. అదే జోరును కొనసాగించాలని ఎంవీఏ, మిగతా ప్రాంతాల్లోనూ పాగా వేయాలని మహాయుతి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి.

### పశ్చిమ మహారాష్ట్ర

షుగర్ బెల్ట్‌గా పిలిచే ఈ ప్రాంతం అత్యధికంగా 70 అసెంబ్లీ స్థానాలకు నిలయం. గత అసెంబ్లీ ఎన్నికల్లో అవిభక్త ఎన్సీపీ ఏకంగా 27 స్థానాలు నెగ్గింది. బీజేపీకి 20, కాంగ్రెస్‌కు 12, అవిభక్త శివసేనకు 5 స్థానాలు దక్కాయి. శివసేన, ఎన్సీపీల్లో చీలిక అనంతరం జరిగిన ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఈ ప్రాంతంలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఎంవీఏ ఐదింటిని నెగ్గి స్వల్ప పైచేయి సాధించగా మహాయుతి నాలుగింటితో సరిపెట్టుకుంది. మిగతా స్థానంలో నెగ్గిన స్వతంత్ర అభ్యర్థి కూడా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా లోక్‌సభ ఫలితాలే పునరావృతం కావచ్చని భావిస్తున్నారు. ఇక్కడ ఎన్సీపీ అజిత్, శరద్ పవార్ వర్గాలు ఏకంగా 20 స్థానాల్లో ముఖాముఖి తలపడుతుండటం విశేషం. లోక్‌సభ పోరులో పవార్ వర్గం ఏకంగా 3 స్థానాల్లో నెగ్గగా అజిత్ వర్గానికి ఒక్క సీటూ దక్కకపోవడం విశేషం. పవార్ల కంచుకోట బారామతి ఈ ప్రాంతంలోనే ఉంది. ఆ స్థానంపై పట్టు నిలుపుకునేందుకు శరద్ పవార్ సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. పార్టీని చీల్చిన అజిత్ పవార్ ఇక్కడ బరిలో ఉండటంతో ఆయన్ను ఎలాగైనా ఓడించాలని కంకణం కట్టుకున్నారు. మేనల్లుడు యుగేంద్రను అజిత్‌పై బరిలో దించారు. పశ్చిమ మహారాష్ట్రలో సహకార సంఘాల హవా నడుస్తుంటుంది. రైతు సమస్యలు ఈసారి ఇక్కడ ప్రధానాంశంగా మారాయి.

### కొంకణ్

ఎంవీఏపై పాలక కూటమి స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించిన ఏకైక ప్రాంతం. లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి 6 స్థానాల్లో మహాయుతి ఏకంగా ఐదింట నెగ్గింది. దాన్ని నిలుపుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా కొంకణ్‌కు పోర్టు, మల్టీమోడల్ కారిడార్, మెగా రిఫైనరీ తదితర భారీ ప్రాజెక్టులను ప్రకటించింది. దాంతో ఎంవీఏ కూటమి తన ప్రచారాన్ని ఈ ప్రాంతంలో శివాజీ విగ్రహం కూలిపోయిన ఘటన చుట్టే తిప్పుతూ లబ్ధి పొందే ప్రయత్నాల్లో పడింది. కొంకణ్ శివసేన చీఫ్, సీఎం ఏక్‌నాథ్ షిండే కంచుకోట. ఇక్కడి కోప్రీ–పచ్‌పాఖడీ నుంచి ఆయన బరిలో దిగారు. షిండేపై ఆయన రాజకీయ గురువు ఆనంద్ డిఘే మేనల్లుడు కేదార్ ప్రకాశ్‌ను ఉద్ధవ్ సేన పోటీకి నిలిపింది.

### విదర్భ

మహారాష్ట్రలో అత్యంత వెనకబడ్డ ప్రాంతాల్లో ఒకటి. లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి 10 స్థానాల్లో ఏకంగా ఏడు ఎంవీఏ ఖాతాలో పడ్డాయి. వాటిలో ఐదింటిని కాంగ్రెసే నెగ్గింది. మరాఠాలతో పాటు ఓబీసీలు, దళితులు ఇక్కడ చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉంటారు. ఒకప్పుడు ఈ ప్రాంతం కాంగ్రెస్ కంచుకోట. కానీ 20 ఏళ్లుగా ఇక్కడ బాగా బలహీనపడుతుండగా బీజేపీ పుంజుకుంటోంది. దీనికి తోడు ప్రత్యేక విదర్భ రాష్ట్ర డిమాండ్‌కు మద్దతివ్వడం బీజేపీకి ఆదరణను మరింత పెంచింది. అధికారాన్ని నిలుపుకోవాలంటే విదర్భలో వీలైనన్ని ఎక్కువ స్థానాలు నెగ్గడం మహాయుతికి కీలకం. దాంతో పారిశ్రామిక హబ్‌తో పాటు ఈ ప్రాంతంపై వరాల వర్షం కురిపించింది. ఇక్కడ దాదాపుగా అన్ని పార్టీలకూ రెబెల్స్ బెడద తీవ్రంగా ఉంది. రైతు సమస్యలు కూడా ఇక్కడ ఓటర్లను బాగా ప్రభావితం చేసేలా కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో బీజేపీ నుంచి ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, పీసీసీ చీఫ్ నానా పటోలే పోటీ చేస్తున్నారు.

### మరాఠ్వాడా

రాష్ట్రంలో అత్యంత వర్షాభావ ప్రాంతం. లోక్‌సభ ఎన్నికల్లో ఎంవీఏ హవా సాగింది. ఏడింట 6 స్థానాలు విపక్ష కూటమి ఖాతాలోకే వెళ్లాయి. మిగతా ఒక్క స్థానాన్ని షిండే శివసేన గెలుచుకుంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన బీజేపీ, అవిభక్త శివసేన 46 స్థానాలకు గాను 28 సీట్లను గెలుచుకున్నాయి. మరాఠాలను ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ మనోజ్ జరంగే ఉద్యమించిన నేపథ్యంలో ఈసారి మాత్రం ఆ పరిస్థితి లేదు. మరాఠా రిజర్వేషన్లు కీలకంగా మారడం మహాయుతికి ఇబ్బంది కలిగించేదే. మరాఠా ఓట్లపై ఎంవీఏ, ఓబీసీ ఓట్లపై మహాయుతి ఆశలు పెట్టుకున్నాయి. మరాఠాలు, ఓబీసీలతో పాటు ముస్లింలు కూడా ఇక్కడ చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉంటారు.


### ఉత్తర మహారాష్ట్ర

ఇది ప్రధానంగా వ్యవసాయ ప్రాంతం. లోక్‌సభ ఎన్నికల్లో ఏడింటి ఆరు సీట్లు ఎంవీఏ ఖాతాలో పడగా బీజేపీ ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. ఈ ప్రాంతంలో ఉల్లి రైతులు ఎక్కువ. ఉల్లి ఎగుమతుల నిషేధంతో కేంద్రం తమ పొట్ట కొట్టిందన్న ఆగ్రహం వారిలో కనిపిస్తోంది. ఇది మహాయుతికి బాగా చేటు చేసేలా కనిపిస్తోంది. నాసిక్, పరిసర ప్రాంతాల్లో గణనీయంగా ఉన్న గిరిజనుల ఓట్లు కూడా ఇక్కడ కీలకమే. గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఇటీవలి లోక్‌సభ పోరులోనూ వారు ఎంవీఏ కూటమికే దన్నుగా నిలిచారు.

### ముంబై

దేశ ఆర్థిక రాజధాని. ముంబైతో పాటు శివారు ప్రాంతాల్లో కలిపి 36 అసెంబ్లీ స్థానాలున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి ఆరు స్థానాల్లో మహాయుతికి దక్కింది రెండే. ముంబైపై బాగా పట్టున్న ఉద్ధవ్ శివసేన 3 స్థానాలు చేజిక్కించుకుంది. ఈసారి షిండే, ఉద్ధవ్ సేనల మధ్య ఇక్కడ హోరాహోరీ సాగుతోంది. వీటికి తోడు మహారాష్ట్ర నవనిర్మాణ సేన కూడా ఇక్కడ గట్టి ప్రభావమే చూపుతుంది.

**- సాక్షి, నేషనల్ డెస్క్**




| ప్రాంతం | అసెంబ్లీ స్థానాలు |
|---|---|
| (మొత్తం 288) | |
| పశ్చిమ మహారాష్ట్ర | 70 |
| విదర్భ | 62 |
| మరాఠ్వాడా | 46 |
| కొంకణ్ | 39 |
| ముంబై | 36 |
| ఉత్తర మహారాష్ట్ర | 35 |

**ఎవరెన్ని చోట్ల పోటీ**

| మహాయుతి | |
|---|---|
| బీజేపీ | 152 |
| శివసేన (షిండే) | 78 |
| ఎన్సీపీ (అజిత్) | 52 |
| **ఎంవీఏ** | |
| కాంగ్రెస్ | 102 |
| శివసేన (యూబీటీ) | 96 |
| ఎన్సీపీ (ఎస్పీ) | 87 |

**వరాల జల్లులు**

- రెండు కూటములూ ఈసారి తమ మేనిఫెస్టోల్లో అన్ని వర్గాలపైనా వరాల వర్షం కురిపించాయి.
- లడ్కీ బెహన్ యోజన మొత్తాన్ని రూ.1,500 నుంచి రూ.2,100కు పెంచుతామని మహాయుతి ప్రకటించగా తామొస్తే ఏకంగా రూ.3,000 ఇస్తామని ఎంవీఏ పేర్కొంది.
- మహాయుతి రైతు రుణ మాఫీ హామీకి పోటీగా తాము ఏకంగా రూ.3 లక్షల దాకా రైతు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది.
- 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మహాయుతి హామీ ఇస్తే నిరుద్యోగ యువతకు నెలకు రూ.4,000 ఇస్తామని ఎంవీఏ చెప్పింది.



# రష్యాపై భీకర దాడులకు బైడెన్ పచ్చజెండా

- లాంగ్‌రేంజ్ క్షిపణులు ప్రయోగించడానికి అనుమతి
- రష్యా భూభాగంలోకి మరింత ముందుకు చొచ్చుకెళ్లనున్న ఉక్రెయిన్ సైన్యం

**బ్రెజీలియా:** ఉక్రెయిన్–రష్యా మధ్య యుద్ధం మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. ఉత్తర కొరియా నుంచి వేలాది మంది సైనికులను రష్యా దిగుమతి చేసుకుంటోంది. వారిని ఉక్రెయిన్ సరిహద్దుల్లో మోహరిస్తోంది. ఉక్రెయిన్‌పై భీకర దాడులకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీనికి విరుగుడుగా ఉక్రెయిన్, దాని మిత్రపక్షాలు కొత్త వ్యూహానికి తెరతీశాయి. ఉక్రెయిన్‌కు అందజేసిన లాంగ్‌రేంజ్ మిస్సైళ్ల వాడకంపై ఇప్పటిదాకా ఉన్న పరిమితులను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సడలించారు. రష్యా భూభాగంలోకి మరింత ముందుకు చొచ్చుకెళ్లి దాడులు చేసేందుకు తాజాగా అనుమతి ఇచ్చారు. అమెరికా అధికార వర్గాలు ఈ విషయం వెల్లడించాయి. బైడెన్ నుంచి అనుమతి రావడంతో ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్(ఏటీఏసీఎం)ను రష్యాపై ప్రయోగించేందుకు ఆస్కారం ఏర్పడింది. దీనివల్ల రష్యాకు భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముగింపు పలుకుతానని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ప్రత్యర్థి అయిన జో బైడెన్ యుద్ధాన్ని మరింత ఉధృతం చేసే దిశగా నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. శత్రుదేశంపై కేవలం మాటలతో దాడులు చేయలేమంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. కొన్ని విషయాలు నోటితో చెప్పలేమని, క్షిపణులే మాట్లాడుతాయని పేర్కొన్నారు. అమెరికా సహా పశ్చిమదేశాలు ఇచ్చిన కీలక ఆయుధాలను రష్యాపై ప్రయోగించడానికి అనుమతి ఇవ్వాలంటూ జో బైడెన్‌పై కొన్ని నెలలుగా ఒత్తిడి వచ్చింది. ఆ ఒత్తిడికి తలొగ్గి ఆయన అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో డొనాల్డ్ ట్రంప్‌ను ఇరుకున పెట్టాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం.

**అగ్నికి బైడెన్ ఆజ్యం పోస్తున్నారు: రష్యా**

అమెరికా సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యాపై ప్రయోగించడానికి అధ్యక్షుడు జో బైడెన్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై రష్యా అధికార వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అగ్నికి ఆజ్యం పోస్తున్నారంటూ బైడెన్‌పై మండిపడ్డాయి. తమను రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలని హెచ్చరించాయి. అయితే, ఈ వ్యవహారంపై రష్యా అధినేత పుతిన్ ఇంకా స్పందించలేదు.

## అనిల్ దేశ్‌ముఖ్ కారుపై రాళ్ల దాడి

**తలకు తీవ్ర గాయాలు**



**నాగ్‌పూర్:** మహారాష్ట్ర మాజీ హోంమంత్రి, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్) సీనియర్ నేత అనిల్ దేశ్‌ముఖ్ కారుపై గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దేశ్‌ముఖ్ తీవ్రంగా గాయపడ్డారు. తలకు బలమైన గాయం తగిలింది. సోమవారం ప్రచారం చివరిరోజున అనిల్ దేశ్‌ముఖ్ నార్ఖేడ్ గ్రామంలో ప్రచారం ముగించుకొని కటోల్‌కు తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆయన కారుపై రాళ్ల వర్షం కురిపించారు. గాయపడ్డ అనిల్ దేశ్‌ముఖ్‌ను కటోల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనిల్ దేశ్‌ముఖ్ తనయుడు సలీల్ దేశ్‌ముఖ్ ఎన్సీపీ (ఎస్పీ) టికెట్‌పై కటోల్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న సంగతి తెలిసిందే.

# గ్లోబల్ సౌత్‌ను పట్టించుకోవాలి

## ఏ చర్చలకైనా అప్పుడే సార్థకత • జీ20 శిఖరాగ్ర సదస్సులో మోదీ

**రియో డిజనిరో:** ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల కమ్ముకున్న యుద్ధ మేఘాలు దక్షిణార్ధ గోళ (గ్లోబల్ సౌత్) దేశాలను అతలాకుతలం చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఫలితంగా ఆహార, ఇంధన, ఎరువుల సంక్షోభాలతో అవి సతమతమవుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. వాటిని తక్షణం పరిష్కరించడంపై జీ20 కూటమి ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ''గ్లోబల్ సౌత్ సవాళ్లు, అవసరాలకు ముందుగా పెద్దపీట వేయాలి. అప్పుడు మాత్రమే జీ20 జరిపే ఏ చర్చలైనా, తీసుకునే ఏ నిర్ణయాలైనా ఫలవంతం అవుతాయి'' అని స్పష్టం చేశారు. రెండు రోజుల జీ20 శిఖరాగ్ర సదస్సు బ్రెజిల్‌లోని రియో డిజనిరోలో సోమవారం మొదలైంది. తొలి రోజు సదస్సును ఉద్దేశించి 'ఆకలి, పేదరికంపై పోరు–సోషల్ ఇంక్లూజన్' అంశంపై మోదీ ప్రసంగించారు. గ్లోబల్ సౌత్ సమస్యలు, సవాళ్లను ప్రధానంగా ప్రస్తావించారు. ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ గతేడాది ఢిల్లీలో జరిగిన జీ20 సదస్సులో పలు నిర్ణయాలు తీసుకున్న వైనాన్ని గుర్తు చేశారు. ''గ్లోబల్ సౌత్‌కు ప్రాధాన్యం పెంచే చర్యల్లో భాగంగా ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వం కల్పిస్తూ ఢిల్లీ శిఖరాగ్రం నిర్ణయం తీసుకుంది. అన్ని దేశాలనూ కలుపుకునిపోయేలా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు ప్రాథమ్యమివ్వాలని నిర్ణయించింది. 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిత' అన్నదే మూలమంత్రంగా సదస్సు జరిగింది. ఆ ఒరవడిని మరింతగా కొనసాగించాలి'' అని సదస్సులో పాల్గొన్న పలువురు దేశాధినేతలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. ఐక్యరాజ్యసమితి మొదలుకుని పలు అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమన్న భారత వైఖరిని మోదీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

**భారత్ తీరు ఆచరణీయం**

పేదరికం, ఆకలి సమస్యలపై పోరులో భారత్ ముందుందని మోదీ వివరించారు. ''ప్రజలందరినీ కలుపుకుని పోవడమే ప్రధాన లక్ష్యంగా మా ప్రభుత్వ పదేళ్ల పాలన సాగింది. 80 కోట్లకు పై చిలుకు ప్రజలకు ఆహార ధాన్యాలను ఉచితంగా అందజేస్తున్నాం. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఆరోగ్య బీమా, పెద్ద పంటల బీమా, పంట రుణాల పథకాలు అమలు చేస్తున్నాం. తద్వారా 25 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయట పడ్డారు'' అని వివరించారు. గ్లోబల్ సౌత్‌తో పాటు ఇతర దేశాలు కూడా వీటిని అనుసరిస్తే అద్భుత ఫలితాలుంటాయన్నారు. పేదరికం, ఆకలిపై పోరాటానికి అంతర్జాతీయ కూటమిని ఏర్పాటు చేయాలని జీ20 శిఖరాగ్రంలో తొలి రోజు నిర్ణయం జరిగింది.



**బైడెన్‌తో మోదీ భేటీ**

జీ20 శిఖరాగ్రం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని మోదీ సోమవారం సమావేశమయ్యారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల అనంతరం వారి మధ్య ఇది తొలి భేటీ. వారిద్దరూ పలు ద్వైపాక్షిక అంశాలు మాట్లాడుకున్నట్టు సమాచారం.

**ఘనస్వాగతం**

జీ20 భేటీ కోసం బ్రెజిల్ వెళ్లిన మోదీకి ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయుల సంస్కృత శ్లోకాలాపన, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, స్పెయిన్ అధినేత పెడ్రో శాంచెజ్, సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ తదితరులతో ప్రధాని భేటీ అయ్యారు.

# అప్రమత్తంగా ఉండాలి!


**మణిపూర్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించాలి**

- ఆ దిశగా వెంటనే చర్యలు చేపట్టండి
- అధికారులకు అమిత్ షా ఆదేశం

**న్యూఢిల్లీ/ఇంఫాల్:** ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండ, ప్రజల భద్రత, తాజా పరిణామాలపై కేంద్ర హోంశాఖ అమిత్ షా వరుసగా రెండో రోజు సోమవారం సైతం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మణిపూర్ అధికారులతోపాటు కేంద్ర ప్రభుత్వ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో సాధ్యమైనంత త్వరగా శాంతి భద్రతలను పునరుద్ధరించాలని, ఆ దిశగా వెంటనే చర్యలు చేపట్టాలని అమిత్ షా ఈ సందర్భంగా ఆదేశించారు. మణిపూర్‌లో కేంద్ర బలగాల మోహరింపుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధారణ పరిస్థితులు నెలకొనేదాకా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ గత ఏడాదిన్నర కాలంగా అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. మైతేయి, కుకీ వర్గాల మధ్య హింసాకాండలో ఇప్పటిదాకా 220 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

**మణిపూర్‌కు 50 కంపెనీల బలగాలు**

మణిపూర్‌కు అదనంగా 50 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సెస్(సీఏపీఎఫ్) బలగాలను పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బలగాల్లో 5,000 మందికిపైగా సిబ్బంది ఉంటారని అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. రాష్ట్రంలో భద్రతా పరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి, శాంతి భద్రతలను పునరుద్ధరించడానికి అదనపు బలగాలను రంగంలోకి దించాలని నిర్ణయించినట్లు తెలియజేశాయి. కేంద్ర హోంశాఖ ఇప్పటికే 20 అదనపు సీఏపీఎఫ్ కంపెనీలను మణిపూర్‌కు పంపించింది. ఇందులో 15 సీఆర్‌పీఎఫ్, ఐదు బీఎస్ఎఫ్ కంపెనీలు ఉన్నాయి. మరో వారం రోజుల్లోగా అదనంగా 50 కంపెనీలను పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



**ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు**

మణిపూర్ సమగ్రతపై ఏర్పాటైన సమన్వయ కమిటీ(కోకోమీ) నేతృత్వంలో నిరసనకారులు కర్ఫ్యూ నిబంధనలను ధిక్కరిస్తూ సోమవారం ఇంఫాల్ వెస్ట్ జిల్లాలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేశారు. జిరిబామ్‌లో ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారుల హత్యకు నిరసనగా వారు తాళాలు వేసే కార్యక్రమం చేపట్టారు. కోకోమీకి మైతేయిల్లో బలమైన పట్టుంది. రాష్ట్రంలో ఇంటర్నెట్, మొబైల్ ఫోన్ సేవలను మరో రెండు రోజులపాటు నిలిపివేస్తూ మణిపూర్ ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకుంది.

**మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం సమావేశం**

మణిపూర్ పరిణామాలపై చర్చించడానికి ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ సోమవారం సాయంత్రం మంత్రులు, ఎన్డీయే ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. శాంతి భద్రతలపై సమీక్షించారు. మణిపూర్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) మద్దతు ఉపసంహరించిన సంగతి తెలిసిందే. 60 స్థానాలున్న మణిపూర్ అసెంబ్లీలో ఎన్‌పీపీకి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరించినప్పటికీ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదు. బీజేపీకి 32 మంది ఎమ్మెల్యేలు ఉండగా, నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు, జేడీ(యూ)కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు సైతం ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు.

## బీజేపీలో చేరిన కైలాశ్ గహ్లోత్

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే, ఢిల్లీ మాజీ రవాణా శాఖ మంత్రి కైలాశ్ గహ్లోత్ బీజేపీలో చేరారు. మంత్రి పదవికి, ఆప్ సభ్యత్వానికి ఆదివారం రాజీనామా సమర్పించిన ఆయన సోమవారం బీజేపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, హర్ష్ మల్హోత్రాల సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఆయనకు కేంద్ర మంత్రులు పార్టీ సభ్యత్వాన్ని అందజేసి సాదరంగా ఆహ్వానించారు. కైలాశ గహ్లోత్ చేరికను కేంద్ర మంత్రులు ఢిల్లీ రాజకీయాల్లో గొప్ప మలుపుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా గహ్లోత్ మాట్లాడుతూ, 'రాజీనామా అంత తేలికైన చర్య కాదు. అన్నా హజారే ఉద్యమ రోజుల నుంచి ఆప్‌తో ఉన్నాను. న్యాయవాద వృత్తి వదిలేసి, ఢిల్లీ ప్రజలకు సేవల చేయడమే లక్ష్యంగా పనిచేశాను. ఆ విలువలకు భంగం వాటిల్లింది. అందుకే పార్టీని వీడా' అని తెలిపారు.

## లారెన్స్ బిష్ణోయి సోదరుడు అన్మోల్ అరెస్టు

**న్యూఢిల్లీ:** కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయి సోదరుడు అన్మోల్ బిష్ణోయి అమెరికాలో అరెస్టయ్యాడు. సోమవారం కాలిఫోర్నియాలో అతడిని అక్కడి అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు ముంబై పోలీసు వర్గాలు తెలియజేశాయి. ఇండియాలో పలు హై–ప్రొఫైల్ కేసుల్లో నిందితుడైన అన్మోల్ గత ఏడాది ఇండియా నుంచి పరారయ్యాడు. పలు హత్య కేసుల్లో అతడి కోసం దర్యాప్తు సంస్థలు గాలిస్తున్నాయి. అన్మోల్ ఆచూకీ తెలిపినవారికి రూ.10 లక్షల రివార్డు ఇస్తామని కూడా ప్రకటించాయి. పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్యల్లో అతడి హస్తం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసులో నిందితుడైన అన్మోల్‌ను అమెరికా అధికారులు తొలుత కెనడాకు అప్పగించే పరిస్థితి కనిపిస్తోంది. కెనడాలో విచారించిన తర్వాత ఇండియాకు తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు ముంబై క్రైమ్ బ్రాంచ్ వర్గాలు వెల్లడించాయి.

# ఏక్ హై తో మోదీ, అదానీ సేఫ్ హై

- వారిద్దరూ సహకరించుకుంటూ సురక్షితంగా ఉంటున్నారు
- దేశ సంపదను మోదీ సంపన్న మిత్రులకు కట్టబెడుతున్నారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆగ్రహం

**ముంబై/రాంచీ:** 'ఏక్ హై తో సేఫ్ హై' అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. సేఫ్ అంటే సురక్షితంతోపాటు బీరువా అనే అర్థం కూడా ఉంది. మోదీ పిలుపునకు, ముంబైలో అదానీ గ్రూప్‌నకు కట్టబెట్టిన ధారావి అభివృద్ధి పథకాన్ని ముడిపెడుతూ విమర్శలు గుప్పించారు. రాహుల్ సోమవారం ముంబైలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తన వెంట ఒక సేఫ్(చిన్నపాటి బీరువా) కూడా తీసుకొచ్చారు. అందులోంచి రెండు పోస్టర్లు బయటకు లాగారు. ఒక పోస్టర్‌పై నరేంద్ర మోదీ, గౌతమ్ అదానీ ఫోటో, మరో పోస్టర్‌పై ధారావి మ్యాప్ ఉంది. మోదీ, అదానీ ఫోటోపై 'ఏక్ హై తో సేఫ్ హై' అనే పిలుపును ముద్రించారు. కలిసి ఉంటే సురక్షితంగా ఉంటామని మోదీ చెబుతున్నారని, వాస్తవానికి సురక్షితంగా ఉన్నది ఎవరని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. మోదీ, అదానీ కలిసికట్టుగా ముందుకుసాగుతూ, ఒకరికొకరు చక్కగా సహకరించుకుంటూ సురక్షితంగా ఉంటున్నారని మండిపడ్డారు. ధారావి అభివృద్ధి ప్రాజెక్టు పేరిట రూ.లక్ష కోట్ల విలువైన భూమిని అదానీకి అప్పగించారని మండిపడ్డారు. కేవలం అదానీ ప్రయోజనాల కాపాడేలా ధారావి ప్రాజెక్టు టెండర్లు రూపొందించారని విమర్శించారు. ధారావి ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి బడా పారిశ్రామికవేత్తల కోసమే మోదీ ప్రభుత్వం పని చేస్తోందని ధ్వజమెత్తారు. బాధితులకు న్యాయం జరిగేదాకా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. ఇతర పారిశ్రామికవేత్తలకు దక్కిన ప్రాజెక్టులను నరేంద్ర మోదీకి సన్నిహితులైన బిలియనీర్లకు అప్పగించేలా కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. దేశంలో ఓడరేవులు, విమానాశ్రయాలతోపాటు దేశ సంపదను కేవలం ఒకే ఒక్క వ్యక్తికి కట్టబెడుతున్నారని ఆరోపించారు.

**మోదీ, అమిత్ షా, అదానీ కలిసుంటారు**

''ప్రధాని మోదీ ప్రవచిస్తున్న 'ఏక్ హై తో సేఫ్ హై'కి అసలు అర్థం నేను చెబుతా. నరేంద్ర మోదీ, అమిత్ షా, గౌతమ్ అదానీ కలిసి ఉంటే సురక్షితంగా ఉంటారు. ఆ ముగ్గురూ కలిసే ఉంటున్నారు. దేశ సంపద మొత్తం అదానీ, అంబానీ లాంటి బడా బాబుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. టెండర్లలో పారదర్శకతకు పాతరవేసి, ప్రాజెక్టులను వారికి కట్టబెడుతున్నారు'' అని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. ఆయన సోమవారం జార్ఖండ్ రాజధాని రాంచీలో మీడియాతో మాట్లాడారు. మణిపూర్ గత ఏడాదిన్నర కాలంగా మండిపోతున్నా ప్రధాని మోదీ మొద్దునిద్ర వీడడం లేదని అన్నారు. హింసాకాండలో అమాయక ప్రజలు చనిపోతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. రిజర్వేషన్లకు తాము వ్యతిరేకంగా కాదని రాహుల్ తేల్చిచెప్పారు. రిజర్వేషన్లను మరింత పెంచాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు.




# ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి

- పెరిగిపోయిన వాయుకాలుష్యం • 494గా ఏక్యూఐ
- మేం చెప్పేదాకా గ్రాప్–4 నిబంధనలే: సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని సోమవారం తీవ్రమైన వాయుకాలుష్యం, పొగమంచుతో ఉక్కిరిబిక్కిరైంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) ఏకంగా 494కు పడిపోయింది. కళ్లలో మంటలు, గొంతులో గరగర, శ్వాస ఆడకపోవడం తదితర సమస్యలతో ఢిల్లీ వాసులు అవస్థలు పడ్డారు. ఆరేళ్లలో కాలుష్యం ఈస్థాయికి చేరడం ఇది రెండోసారి మాత్రమే. ఇది వృద్ధులు, చిన్నారులే కాకుండా ఆరోగ్యవంతులపైనా ప్రభావం చూపుతుందని డాక్టర్లు ఆందోళన వెలిబుచ్చారు. పరిస్థితి విషమించినా గ్రాప్–4 నిబంధనల అమలులో అధికారులు జాప్యం చేస్తున్నారంటూ సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది. ఏక్యూఐ 450 దిగువకు వచ్చినా గ్రాప్–4 నిబంధనలనే కొనసాగించాలని ఆదేశించింది. ఆదివారం ఢిల్లీలో ఏక్యూఐ 441గా నమోదు అయింది. కాలుష్య నమోదుకు ఢిల్లీలో 39 స్టేషన్లుండగా 15 చోట్ల ఏక్యూఐ 500 పైచిలుకు నమోదు కావడం గమనార్హం. కొన్నిచోట్ల ఏకంగా 900 కూడా దాటేసింది! ఢిల్లీలో వాహనాలకు సరి, బేసి సంఖ్య విధానాన్ని అమలు చేయాలని ఆలోచిస్తున్నట్లు పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ తెలిపారు. వాయు కాలుష్య తీవ్రతను దృష్టిలో పెట్టుకొని 10, 12వ తరగతులకు కూడా ఆన్‌లైన్‌లోనే క్లాసులు నిర్వహించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం నుంచి 10, 12 తరగతులకు కూడా ఆన్‌లైన్ క్లాసులనే నిర్వహిస్తామని ఢిల్లీ సీఎం ఆతిశి 'ఎక్స్'లో వెల్లడించారు. వీరితో పాటు మిగతా క్లాసులకు ఇదివరకే అమలవుతున్నట్లుగా ఆన్‌లైన్ క్లాసులు ఉంటాయని తెలిపారు. వాతావరణం అనుకూలించక పోవడంతో ఢిల్లీ విమానాశ్రయంలో సోమవారం 15 విమానాలను దారి మళ్లించారు. వందకు పై చిలుకు విమానాలు ఆలస్యమయ్యాయి.

# సాక్షి హైదరాబాద్

మంగళవారం । 19 । నవంబర్ । 2024




**ప్రేమించిన వ్యక్తే కాలయముడు**

మైనర్ బాలికను ఇన్‌స్టాగ్రాంలో పరిచయం చేసుకుని..హత్యచేసి మృతదేహాన్ని నిర్మానుష్య ప్రాంతంలో పడేసిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. -8లో



**బీ ది మెన్.. బీ ది బ్రేవ్!**

పురుషుల కోసం కూడా ప్రత్యేకంగా ఓ రోజు ఉంది. అదే నవంబర్ 19. ఈ రోజును అంతర్జాతీయ మెన్స్ డేగా జరుపుకోవాలని 1969లోనే నిర్ణయించినా..అంతగా ప్రాచుర్యం రాలేదు.
- సిటీప్లస్‌లో



గరిష్ఠం/కనిష్ఠం
**30.0/17.0**

**వాతావరణం**

నగరంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళ పొగమంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

## 25లోగా పాలపిట్ట ఎస్టీపీ సిద్ధం



పాలపిట్ట ఎస్టీపీ నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షిస్తున్న జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్

సాక్షి, సిటీబ్యూరో: వందశాతం మురుగు శుద్ధి కోసం ఎస్టీపీల ప్రాజెక్టు ప్యాకేజీ–3లో భాగంగా నిర్మిస్తున్న పాలపిట్ట ఎస్టీపీ నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ నెల 25లోగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి పాలపిట్ట నిర్మాణ పనులపై సమీక్షించారు. సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన ఎలక్ట్రో మెకానికల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల వేగవంతానికి కార్మికుల సంఖ్యను రెట్టింపు చేయాలని చెప్పారు. పనులు జరిగేటప్పుడు రక్షణ చర్యలు పాటించాలని ఆదేశించారు. సుందరీకరణ కోసం గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్ పనులు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో ఎస్టీపీ సీజీఎం పద్మజ, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

## ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఓఎస్‌డీగా వెంకటశేఖర్



సాక్షి, సిటీబ్యూరో: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ దానకిశోర్‌కు ఓఎస్‌డీగా (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా ఎంవీ వెంకట శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయన డిప్యుటేషన్‌పై ఎంఆర్‌డీసీఎల్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఓఎస్‌డీగా బాధ్యతలు చేపట్టారు.



# మీటర్‌కు షాక్.. రీడింగ్‌కు బ్రేక్!

గ్రేటర్‌లో నెలకు సగటున 20 వేల విద్యుత్ మీటర్లకు రిపేర్లు.. 4620 మీటర్లు దగ్ధం

**అక్టోబర్ 2023 నుంచి 2024 మార్చి వరకు పాడైన మీటర్లు..**

| సర్కిల్ | మీటర్ స్టకప్ | మీటర్ బర్న్ |
|---|---|---|
| బంజారాహిల్స్ | 5977 | 935 |
| సైబర్‌సిటీ | 8992 | 4151 |
| హబ్సిగూడ | 11235 | 1747 |
| హైదరాబాద్ సెంట్రల్ | 11896 | 2241 |
| హైదరాబాద్ సౌత్ | 11015 | 3673 |
| మేడ్చల్ | 18248 | 1595 |
| రాజేంద్రనగర్ | 13869 | 4488 |
| సరూర్‌నగర్ | 11892 | 1950 |
| సికింద్రాబాద్ | 7789 | 612 |
| వికారాబాద్ | 3583 | 2115 |
| సంగారెడ్డి | 14936 | 4215 |



- గడువు ముగియక ముందే కాలిపోతున్న వైనం
- యావరేజ్ బిల్లింగ్‌తో నష్టపోతున్న వినియోగదారులు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో విద్యుత్ మీటర్ల పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. లూజ్ కాంటాక్ట్, ఎర్తింగ్ నిర్వహణ లోపం, విద్యుత్ పంపిణీలో హెచ్చుతగ్గులు మీటర్ల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నెలకు సగటున 20 వేల మీటర్లు స్టకప్ (రీడింగ్ నమోదు ఆగిపోవడం) అవుతుండగా, సుమారు 4620 మీటర్లు దగ్ధం అవుతుండటంపై ఆందోళన వ్యక్తం అవుతుంది. తరచూ మీటర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటం, సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా విద్యుత్ బిల్లులు జారీ చేస్తుండటంతో వినియోగదారులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే ప్రతి యూనిట్‌కు పక్కాగా లెక్క కట్టాలని భావించిన డిస్కం మాన్యువల్ మీటర్ల స్థానంలో ఎలక్ట్రానిక్ తర్వాత డిజిటల్ మీటర్లంటూ ఎప్పటికప్పుడు మారుస్తుంది. నాణ్యతకు పెద్దపీట వేయాల్సిన అధికారులు పలు మీటర్ల తయారీ కంపెనీలతో కుమ్మక్కై నాసిరకం మీటర్లను కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**కనెక్షన్ల సంఖ్య కన్నా ఎక్కువ కొనుగోలు**

హెచ్‌పీఎల్ ఎలక్ట్రానిక్ అండ్ పవర్ లిమిటెడ్, హిమాచల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ , జెనిసస్ పవర్ ఇన్‌ఫ్రాస్టక్చర్, సైనో పవర్ లిమిటెడ్, అవాన్ మీటర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల నుంచి ప్రస్తుత కనెక్షన్ల కంటే ఎక్కువ మీటర్లు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా హెచ్‌పీఎల్ సంస్థ నుంచి కొనుగోలు చేసిన మీటర్లే. గ్రేటర్ జిల్లాల్లో 11 సర్కిళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 53 లక్షల వరకు గృహ, 8 లక్షలకుపైగా వాణిజ్య, 50 వేలకుపైగా పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సర్కిల్ పరిధిలో నెలకు 5 వేల మీటర్లు స్టకప్ అవుతుంటే, 2500 నుంచి 4000పైగా మీటర్లు కాలిపోతున్నాయి. 2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు 1,19,432 మీటర్లు స్టకప్ కాగా, 27,722 మీటర్లు కాలిపోవడం గమనార్హం. సాంకేతిక సమస్యలు తలెత్తి పని చేయకుండా పోయిన ఈ విద్యుత్ మీటర్లలో చాలా వరకు ఓ ప్రముఖ కంపెనీవే ఉండటంతో ఆ కంపెనీ ఉత్పత్తుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆ కంపెనీ మీటర్లే అధికం..**

మీటరు కాలిపోవడానికి లూజ్ కాంటాక్ట్, షార్ట్ సర్క్యూట్, వర్షానికి తడిసిపోవడం ప్రధాన కారణమని డిస్కం పేర్కొంది. కానీ నిజానికి చాలా మీటర్లు నాణ్యత లోపం వల్లే కాలుతున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సమీపంలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు నాణ్యతకు పెద్ద పీట వేస్తున్నాయి. ధర కొంత ఎక్కువైనా నాణ్యమైన కంపెనీల నుంచి మీటర్లను కొనుగోలు చేసి వినియోగదారులకు అమర్చుతున్నాయి. కానీ మన డిస్కం మాత్రం ఇతర రాష్ట్రాలు నిరాకరించిన ఓ కంపెనీ మీటర్లను కొనుగోలు చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యతలేని మీటర్లను కొనుగోలు చేసి, బిగిస్తుండటం వల్ల అమర్చిన కొద్ది రోజులకే అవి పాడై పోతున్నట్లు సీనియర్ ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. ఒక వేళ మీటరు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే దాన్ని రీప్లేస్ చేయాల్సిన బాధ్యత సదరు సంస్థపై ఉన్నా...స్తంభించిన మీటర్లు మినహా వివిధ కారణాలతో కాలిపోయిన మీటర్లను రీ ప్లేస్ చేయడం లేదు.

# ఐ ఫోన్లతో డబుల్ సెంచరీ!

**ఘరానా సైబర్ నేరగాడి ఆటకట్టు**

- ఓఎల్‌ఎక్స్‌లో పోస్టుల ఆధారంగా ప్లాన్
- దాన్ని ఖరీదు చేస్తానంటూ విక్రేతకు ఎర
- వారితో డిలీట్ చేయించి తాను పోస్టింగ్
- ఆపై అమాయకుల నుంచి డబ్బు స్వాహా
- తెలుగు రాష్ట్రాల్లో 200 మంది బాధితులు
- నిందితుడికి చెక్ చెప్పిన పంజగుట్ట కాప్స్



సాక్షి, సిటీబ్యూరో/పంజగుట్ట: యజమాని అతడు కాదు... విక్రయించేది–ఖరీదు చేసేదీ కూడా అతగాడు కానేకాదు... అయినప్పటికీ ఈ–కామర్స్ సైట్‌లో ఫోన్లకు సంబంధించిన పోస్టులు చేసిన వారిని సంప్రదించి డిలీట్ చేయిస్తాడు... ఆపై అవే వివరాలను తాను పోస్టు చేస్తాడు...క్రయవిక్రయాలు చేసే వారిని ఓ 'ప్లాట్‌ఫామ్' పైకి తీసుకువస్తాడు..ఆ ఇద్దరినీ కలిపి తాను 'లాభపడతాడు'. కేవలం ఐఫోన్లనే టార్గెట్‌గా చేసుకుని, ఈ వినూత్న పంథాలో తెలుగు రాష్ట్రాల్లో 200 మందిని మోసం చేసి రూ.60 లక్షలు స్వాహా చేసిన ఘరానా మోసగాడు మరిశర్ల బాలాజీ నాయుడిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేసినట్లు ఏసీపీ ఎస్.మోహన్‌కుమార్ ప్రకటించారు. ఇన్‌స్పెక్టర్ బి.శోభన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రవణ్ కుమార్‌లతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు.

**కంప్యూటర్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్...**

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి చెందిన బాలాజీ నాయుడు అక్కడి ఎస్వీ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఆపై బెంగళూరుకు మకాం మార్చిన ఇతగాడు తొలినాళ్లల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పని చేశాడు. జల్సాలు, బెట్టింగ్స్, ఆన్‌లైన్ గేమింగ్స్‌కు జీతం డబ్బులు చాలకపోవడంతో తేలిగ్గా డబ్బు సంపాదించడానికి నేరబాట పట్టాడు. ఇందులో భాగంగా వివిధ పేర్లతో సిమ్‌కార్డులు తీసుకునే ఇతగాడు తరచు తన ఫోన్లు మారుస్తూ ఉంటాడు. 2018 నుంచి మోసాలు చేయడం మొదలెట్టిన బాలాజీ ఇప్పటి వరకు 30 ఫోన్లు మార్చినట్లు పోలీసులు గుర్తించారు. సెకండ్ హ్యాండ్ వస్తువులు విక్రయించడానికి ఉపకరించే ఈ–కామర్స్ సైట్ ఓఎల్‌ఎక్స్ ఆధారంగా మోసాలు ప్రారంభించాడు. ఆ సైట్/యాప్‌ను ఆద్యంతం గమనించే బాలాజీ సెకండ్‌హ్యాండ్ ఐఫోన్ల విక్రయానికి సంబంధించి తెలుగు రాష్ట్రాల్లోని వాళ్లు పెట్టిన పోస్టుల్ని గుర్తిస్తాడు. వాటిలో కొన్ని ఎంపిక చేసుకుని అందులోని ఫొటోతో పాటు ఇతర వివరాలు కాపీ చేసుకుని భద్రపరుచుకుంటాడు.

**వారితో తీయించి తాను పోస్టు చేసి...**

ఆపై ఆ పోస్టు చేసిన వ్యక్తిని సంప్రదించే బాలాజీ ఏమాత్రం బేరసారాలు లేకుండా ఆ ఫోన్ తాను ఖరీదు చేస్తున్నట్లు, త్వరలోనే సంప్రదించి కలుస్తానని చెప్తాడు. అలా వారి నమ్మకాన్ని పొంది ఓఎల్‌ఎక్స్ నుంచి పోస్టు తీసేలా చేస్తాడు. కొద్దిసేపటి తర్వాత తన వద్ద ఉన్న ఫొటో, వివరాలతో తానే ఆ ఫోన్ విక్రయిస్తున్నట్లు అదే ఓఎల్‌ఎక్స్‌లో పోస్టు చేసే బాలాజీ..తక్కువ రేటు పొందుపరుస్తాడు. ఈ పోస్టును చూసిన వాళ్లల్లో ఆకర్షితులైన వాళ్లు ఫోన్ ద్వారా బాలాజీని సంప్రదిస్తారు. వారితో బేరసారాలు పూర్తి చేసే అతగాడు..ఫలానా చోట తనను కలిసి, నగదు చెల్లించి, ఫోన్ తీసుకువెళ్లాలని సూచిస్తాడు. అదే సమయంలో ఫోన్ అసలు యజమానికి సంప్రదించే బాలాజీ అతడినీ ఆ ప్రాంతానికి రమ్మని, నగదు చెల్లించి ఫోన్ తీసుకుంటానని చెప్తాడు. అలా ఫోన్ యజమాని, తన ప్రకటన చూసి ఖరీదు చేయడానికి ఆసక్తి చూపిన వ్యక్తి కలుసుకోవడానికి కొద్దిసేపటి ముందు వారిని మరోసారి సంప్రదిస్తాడు. తాను రాలేకపోతున్నానని, తన సోదరుడు వస్తున్నాడని చెప్పి, ఫోన్ రేటు విషయం చెప్తే అంత డబ్బు పెట్టి ఎందుకు కొంటున్నావు? అని మందలిస్తారంటూ వారికి చెప్తాడు. ఈ కారణంగానే రేటు విషయం చర్చించ వద్దంటూ ఇద్దరికీ చెప్తాడు. ఇలా ఆ ఇద్దరూ కలిసిన తర్వాత ఖరీదు చేసే వ్యక్తిని బుట్టలో వేసుకుని యజమాని వద్ద ఫోన్ చూసిన వెంటనే నగదు తనకు బదిలీ చేసేలా చేస్తాడు. ఆపై తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుంటాడు. క్రయవిక్రేతలు మాత్రం కొద్దిసేపు ఘర్షణ పడి, అసలు విషయం తెలుసుకుని ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోతారు. ఇలా ఇతగాడు తెలుగు రాష్ట్రాల్లో 200 మందిని ముంచి రూ.60 లక్షలు స్వాహా చేశాడు. ఈ డబ్బును దఫాబెట్, సారా, రమ్మీటైమ్, రమ్మీ సర్కిల్ వంటి గేమింగ్, బెట్టింగ్ యాప్స్‌లో పెట్టడం, జల్సాలు చేయడం చేసి ఖర్చు చేస్తాడు. కొన్ని సందర్భాల్లో బాధితులకు నేరుగా ఆయా యాప్స్‌కు సంబంధించిన క్యూర్ కోడ్స్ పంపి, నేరుగా డబ్బు వాటికే పంపేలా చేశాడు. ఇతగాడిని కటకటాల్లోకి పంపిన పంజగుట్ట పోలీసులు రెండు ఫోన్లు, మూడు సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. బాలాజీపై నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో 138 ఫిర్యాదులు, తెలుగు రాష్ట్రాల్లో 19 కేసులు నమోదై ఉన్నాయి. ఇటీవల పంజగుట్టలో 3, మధురానగర్‌లో మరో 3 కేసులు నమోదు కాగా..మరో 25 కేసులు ఉన్నట్లు గుర్తించారు.

# చెరువుల పునరుజ్జీవానికి చర్యలు షురూ

**భక్షికుంట, రేగులకుంటలను పరిశీలించిన హైడ్రా**

- ఆనంద్ మల్లిగవాడ్ కృషితో ఈ రెండూ అభివృద్ధి
- ఆయనతో కలిసి అధ్యయనం చేసిన ఏవీ రంగనాథ్
- అతి తక్కువ ఖర్చుతో పునరుజ్జీవంపై ప్రధాన దృష్టి
- తొలి దశలో పది చెరువులు చేపట్టాలని నిర్ణయం



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని జలవనరుల పరిరక్షణలో భాగంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చెరువుల పునరుజ్జీవంపై దృష్టి పెట్టింది. అతి తక్కువ ఖర్చుతో వీటికి పునరుజ్జీవం కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన, పర్యావరణవేత్త ఆనంద్ మల్లిగవాడ్‌తో కలిసి పని చేయనుంది. ఈయన ఇప్పటికే చందానగర్‌లోని భక్షికుంట, రేగులకుంటకు పునరుజ్జీవం ఇచ్చారు. సోమవారం ఆనంద్‌తో కలిసి చందానగర్, మియాపూర్‌లకు వెళ్లిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆ రెండు చెరువుల్నీ పరిశీలించారు. 6.2 ఎకరాలు, 17 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ రెండు చెరువులూ ఏళ్లుగా కాలుష్యం, ఆక్రమణల కాటుకు గురయ్యాయి. వీటి చుట్టుపక్కల ఉన్న జనావాసాలతో పాటు పారిశ్రామిక వ్యర్థాల కారణంగా ఈ దుస్థితి వచ్చింది. కొన్నేళ్ల క్రితం కార్పొరేట్ సంస్థలు వీటికి పునరుజ్జీవం కల్పించడానికి ముందుకు వచ్చాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీ (సీఎస్సార్) పథకంతో, సహజసిద్ధమైన విధానంలో, పర్యావరణ సమతుల్యంతో భక్షికుంట, రేగులకుంటలకు పునరుజ్జీవం కల్పించడానికి ఫెనోమా, సేల్స్‌ఫోర్స్ సంస్థలు ప్రాధాన్యం ఇచ్చాయి. దీనికోసం ఈ రెండు సంస్థలు ఆనంద్ మల్లిగవాడ్‌కు సంబంధించిన మల్లిగవాడ్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాయి. వివిధ రకాలైన జల వృక్షాలు, మొక్కలను పెంచడం ద్వారా నీటిని శుద్ధి చేస్తూ, మురుగు నీటిని మళ్లిస్తూ చెరువులకు పునరుజ్జీవం కల్పించడంలో ఆనంద్ మల్లిగవాడ్ నిష్ణాతుడు. ఈ విధానాల్నే అవలంబించిన ఆయన భక్షికుంట, రేగులకుంటలకు ఊపిరి పోశారు.

**ఆనంద్ సహకారం కోరిన హైడ్రా**

'గ్రేటర్' పరిధిలో ఉన్న చెరువును పరిరక్షించి, పునరుజ్జీవం కల్పించడానికి కృషి చేస్తున్న హైడ్రా ఈ క్రతువులో ఆనంద్ మల్లిగవాడ్ సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గతంలో ఆయన్ను హైదరాబాద్‌కు ఆహ్వానించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇటీవల బెంగళూరు వెళ్లిన రంగనాథ్ అక్కడ ఆనంద్ చేపట్టిన చెరువుల పునరుజ్జీవ ప్రాజెక్టుల్ని ప్రత్యక్షంగా పరిశీలించి వచ్చారు. రాజధానిలోని చెరువులకు పూర్వవైభవం కల్పించడంలోనూ ఖర్చు తక్కువగా ఉండాలని నిర్ణయం తీసుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ అందుకు చర్యలు ప్రారంభించారు. వీటిలో భాగంగా ఆనంద్ మల్లిగవాడ్‌ను మరోసారి నగరానికి ఆహ్వానించి ఆ రెండు చెరువుల వద్దకు సోమవారం స్వయంగా వెళ్లి అధ్యయనం చేశారు. అలాగే అపర్ణ హిల్ రాక్ గేటెడ్ కమ్యూనిటీ నిర్వాహకులు ఎస్టీపీ ద్వారా మురుగు నీటిని శుద్ధి చేసి కాలువలలోకి మళ్లిస్తున్న తీరును పరిశీలించారు. రేగులకుంట చెరువులో నీటి స్వచ్ఛతను పరిశీలించి స్థానికులతో మాట్లాడిన హైడ్రా కమిషనర్ పూర్తి వివరాలు తెలుసుకున్నారు. హైడ్రా ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమైన రంగనాథ్–ఆనంద్ మల్లిగవాడ్ భవిష్యత్తు కార్యాచరణకు కసరత్తు చేస్తున్నారు. రేగులకుంట, భక్షికుంట మాదిరిగా నగరంలో 10 చెరువులను మొదటి దశలో అభివృద్ధి చేసి, పునరుజ్జీవం కల్పించాలని హైడ్రా నిర్ణయించింది. రేగుకుంట పరిధిలో ఉన్న దీప్తిశ్రీ నగర్‌లో ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించిన వారిపై చర్యలు తీసుకోవాలని రంగనాథ్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. దాదాపు 5 వేల గజాల స్థలం కబ్జా కాకుండా చూడాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చెరువులతో పాటు వివిధ కాలనీల్లో పార్కులు, ఇతర ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను హైడ్రా కాపాడుతుందని రంగనాథ్ స్పష్టం చేశారు.



స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆనంద్ మల్లిగవాడ్

# వచ్చే వారమే.. ఇక!

- జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయానికి వచ్చేది ఈ నెల 25 తర్వాతే..
- స్టాండింగ్ కమిటీ సమావేశం.. కీలక నిర్ణయాలకు విరామం

సాక్షి, సిటీబ్యూరో: రవాణాశాఖ కమిషనర్‌గా ఉన్న ఇలంబర్తి అక్టోబర్ 18వ తేదీన జీహెచ్ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. పట్టుమని పది రోజులు కూడా విధులు నిర్వర్తించకుండానే కేంద్ర ఎన్నికల సంఘం ఆయనకు ఝార్ఖండ్‌లో ఎన్నికల అబ్జర్వర్‌గా బాధ్యతలప్పగించింది. ఈ నెల 11వ తేదీన జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇలంబర్తిని రవాణాశాఖ కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి..జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమిస్తూ పూర్తి పగ్గాలు అప్పగించింది. కానీ..ఆయన నేటికీ జీహెచ్ఎంసీకి రాలేదు. ఈ వారంలో ఇక వచ్చే అవకాశం లేదని జీహెచ్ఎంసీ వర్గాల సమాచారం. బహుశా వచ్చే సోమవారం నుంచి ఆయన ఇక బల్దియాలోనే ఉండనున్నారు. అప్పటికి ఝార్ఖండ్ ఎన్నికల విధులు ముగిసిపోనున్నట్లు తెలిసింది.

**వర్చువల్‌గా నిర్వహిస్తున్నా..**

ఇలంబర్తి అదనపు బాధ్యతలున్నప్పటి నుంచే ఝార్ఖండ్‌లో ఉన్నప్పటికీ, ఆన్‌లైన్ , టెలికాన్ఫరెన్స్, వెబినార్, వాట్సాప్ గ్రూప్స్‌ను వినియోగించుకొని పనులు ఆగకుండా సూపర్‌వైజ్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తూ వారిని ఉరుకులు,పరుగులు పెట్టిస్తున్నారు. కమిషనర్‌గా కార్యాలయంలో లేరనే కానీ.. పనులు మాత్రం ఆగలేదని జీహెచ్ఎంసీ అధికారుల సంభాషణల్ని బట్టి తెలుస్తోంది.

**ఆగిన బడ్జెట్.. స్టాండింగ్ కమిటీ సమావేశాలు**

జీహెచ్ఎంసీ పనులు చాలావరకు ఆగకుండా జరుగుతూనే ఉన్నప్పటికీ.. డిప్యూటీ కమిషనర్ల బదిలీల వంటివి సైతం జరిగినప్పటికీ.. కమిషనర్ ప్రత్యక్షంగా ఉండాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరగడం లేవు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించిన బడ్జెట్ ముసాయిదా ఖరారు కాలేదు. బడ్జెట్ లెక్కలను కమిషనర్ స్వయంగా పరిశీలించి, ఖరారు చేయాల్సి ఉన్నందున నవంబర్ 10వ తేదీనాటికే ముసాయిదా బడ్జెట్ స్టాండింగ్ కమిటీ ముందుకు రావాల్సి ఉండగా, రాలేదు.

**ఇదే తొలిసారి..**

జీహెచ్ఎంసీ చరిత్రలోనే ఇన్ని రోజుల పాటు కమిషనర్ లేకుండా ఉండటం ఇదే ప్రథమం. సాధారణంగా కమిషనర్ పోస్టులో ఉన్న వారు ఒకటి రెండు రోజుల సెలవుపెట్టినా.. మరో సీనియర్ ఐఏఎస్ అధికారికి ఇన్‌ఛార్జిగా బాధ్యతలప్పగించేవారు. కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడే ఇలంబర్తి ఝార్ఖండ్ వెళ్లాల్సి వచ్చినందున వేరే ఎవరికీ అదనపు బాధ్యతలు కానీ, ఇన్‌ఛార్జిగా బాధ్యతలు కానీ అప్పగించలేదు. అలా.. కమిషనర్ లేకుండానే జీహెచ్ఎంసీ నడుస్తోంది.

# వందేళ్ల చరిత్ర కలిగిన చర్చిలకు ఎవిక్షన్ నోటీసులు

**సేక్రడ్ హార్ట్, సీఎస్ఐ చర్చిలను ఖాళీ చేయాలంటున్న రైల్వే అధికారులు**

- స్థలాలు మావంటూ..నెల రోజుల గడువు విధించిన వైనం
- లీజు డబ్బులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం: చర్చి నిర్వాహకులు

అడ్డగుట్ట: రైల్వే స్థలాల్లో ఉన్న చర్చిలను ఒక నెల లోగా ఖాళీ చేయాలని రైల్వే అధికారులు ఇటీవల పలు చర్చిలకు ఎవిక్షన్ నోటీసులు జారీ చేశారు. వందేళ్ల చరిత్ర కలిగిన చర్చిలను ఖాళీ చేయండంటూ ఇచ్చిన నోటీసుల పట్ల పలు క్రైస్తవ సంఘాలు అభ్యంతరాలు తెలుపుతున్నాయి. లాలాగూడలోని సేక్రడ్ హార్ట్ క్యాథలిక్ చర్చి, అదే ప్రాంతంలోని సీఎస్ఐ(చర్చి ఆఫ్ సౌత్ ఇండియా) చర్చిలను ఖాళీ చేయాలంటూ రైల్వే ఉన్నతాధికారులు ఈ నెల 13న ఎవిక్షన్ నోటీసులు జారీ చేశారు. దీంతో చర్చి నిర్వాహకులతో పాటు చర్చికి వచ్చే వాళ్లు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

సుమారు వంద సంవత్సరాల నుంచి నిత్యం ప్రార్థనలు, ఆరాధనల మధ్య కొనసాగుతున్న చర్చిలను ఖాళీ చేయాలని చెప్పడం అన్యాయం అని అంటున్నారు. చర్చి స్థలం లీజ్ డబ్బులు ఎప్పటికప్పుడు చెల్లిస్తూ, విద్యుత్, తాగు నీటి నల్లా బిల్లు సకాలంలో కడుతున్నప్పటికీ ఈ విధంగా నోటీసులు జారీ చేసి ఖాళీ చేయమని చెప్పడం సరైంది కాదంటున్నారు చర్చి నిర్వాహకులు. తాము సొంత ప్రయోజనాల నిమిత్తం ఎటువంటి పనులు చేయడం లేదని, ఒక సామాజిక వర్గానికి చెందిన దైవ ప్రార్థనాలు, ఆరాధనలు మాత్రమే చేస్తున్నామని వెల్లడించారు.


**నెల గడువుతో నోటీసు**

ఈ చర్చిల స్థలం తమకు చెందినదని, ఎటువంటి అనుమతులు లేకుండా వీటి నిర్మాణాలు చేపట్టారని రైల్వే మంత్రిత్వ శాఖ చెబుతోంది. డిసెంబర్ 12వ తేదీ లోపు చర్చి స్థలాన్ని ఖాళీ చేయాలంటూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఎవిక్షన్ నోటీసులు జారీ చేస్తూ ఆదేశించారు. ఖాళీ చేయకుంటే పబ్లిక్ ప్రెమిసెస్ చట్టం–1971 ప్రకారం తొలగిస్తామని, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. తమ స్థలంలో చట్ట విరుద్ధంగా చర్చిలను నిర్మించారని ఈ నోటీసుల్లో రైల్వే అధికారులు స్పష్టం చేశారు.

**అన్ని రకాల డాక్యుమెంట్లు ఉన్నాయి : చర్చిల నిర్వాహకులు**

రైల్వే స్థలంలో అక్రమంగా చర్చిలను నిర్మించుకున్నామని రైల్వే అధికారులు చేస్తున్న ఆరోపణలను ఎదుర్కొనేందుకు తాము అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని చర్చిల నిర్వాహకులు పేర్కొన్నారు. లీజుతో పాటు నిర్మాణానికి సంబంధించిన అన్ని రకాల డాక్యుమంట్లు, బ్లూ ప్రింట్‌లు తమ వద్ద భద్రంగా ఉన్నాయని, అప్పట్లోనే రైల్వే అధికారులతో ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నట్లు కూడా తెలిపారు. వీటన్నింటినీ రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

**నోటీసులివ్వడం అన్యాయం**



వందేళ్ల చరిత్ర ఉన్నటు చర్చిల స్థలాన్ని ఖాళీ చేయాలంటూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదేశించడం అన్యాయం. మేము ఇక్కడ కమర్షియల్ పర్పస్ కోసం రిక్రియేషన్ క్లబ్ వంటివి నిర్వహించడం లేదు. భక్తులు ఎంతో ఇష్టం, ధ్యానంతో దైవ ప్రార్థనలు, ఆరాధనలు చేసుకునే వీలు కల్పిస్తున్నాం. వచ్చేది క్రిస్మస్ పండుగ..ఇటువంటి సమయంలో సుమారు వంద సంత్సరాల నుంచి కొనసాగుతున్న చర్చిలను అర్థాంతరంగా ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడం సరైంది కాదు. – రెవరెండ్ జార్జ్ క్రిస్టోఫర్



లాలాగూడలోని సేక్రడ్ హార్ట్ క్యాథలిక్ చర్చి



లాలాగూడలోని సీఎస్ఐ చర్చి ప్రార్థనా స్థలం

కోటి దీపోత్సవంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, కిషన్‌రెడ్డి



## దీపం ఐక్యతకు చిహ్నం.. ఐక్యతే మన బలం...

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



కవాడిగూడ: ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం సోమవారం 10వ రోజుకు చేరుకుంది.వేదికపై కాశీవిశాలాక్షి, విశ్వనాథుని కళ్యాణమహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, కిషన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ... దీపం ఐక్యతకు చిహ్నం అని, ఐక్యతే భారతీయుల బలం అన్నారు. ఇటువంటి దీపోత్సవాల ద్వారా ప్రతి ఇల్లు ఒక దేవాలయమై జ్ఞానసంపదకు క్షేత్రం కావాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులచే మహాదేవునికి కోటి పుష్పార్చన చేయించారు.

# ప్రేమించిన వ్యక్తే కాలయముడు

- ఉప్పుగూడ పారిశ్రామిక వాడల్లో మృతదేహం లభ్యం
- వీడిన బాలిక మిస్సింగ్ మిస్టరీ

మియాపూర్: మైనర్ అమ్మాయిని ఇన్‌స్టాగ్రాంలో పరిచయం చేసుకుని హత్యచేసి మృతదేహాన్ని నిర్మానుష్య ప్రాంతంలో పడేసిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు నిందితులిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ సోమవారం కేసు వివరాలను తెలిపారు. అశోక్ కుటుంబం మియాపూర్‌లోని టీకు నర్సింహనగర్‌లో నివాసముంటోంది. చిన్న కుమార్తె(17) గత నెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదని బాలిక తల్లి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉప్పుగూడకు చెందిన విఘ్నేష్ అలియాస్ చింటు(22)పై అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఉప్పుగూడకు చెందిన విఘ్నే‌ష్‌ను మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా బాలికను నగరంలోని ఫలక్‌నుమా దేవాలయంలో పరిచయం చేసుకుని ఇన్‌స్టాలో చాటింగ్ చేసుకునేవారని చెప్పాడు. ఈ క్రమంలో వారు ప్రేమించుకున్నారు. దీంతో అమ్మాయి గత నెల ఇంటినుంచి వెళ్లిపోయింది. విఘ్నేష్ ఆ బాలికను మీర్‌పేట్‌లోని స్నేహితులు సాకేత్, కళ్యాణిల గదిలో ఉంచాడు. అమ్మాయి తరచూ పెళ్లిచేసుకోమని ఒత్తిడి చేయడంతో ఈ నెల 8న పెళ్లిచేసుకున్నట్లు దండలు మార్చుకుని ఫోటోలుదిగి అమ్మాయి తల్లిదండ్రులకు పంపించాడు. అనంతరం బాలికను హత్యచేయాలనే పథకం పన్నాడు. 8న విఘ్నేష్.. అమ్మాయి గొంతు నులిమి మొఖంపై దిండుపెట్టి ఊపిరాడకుండా చేసి హత్యచేశాడు. అదేరోజు అర్ధరాత్రి సాకేత్, కళ్యాణిలతో కలిసి మృతదేహాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సాకేత్.. బాలిక మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లి ఉప్పుగూడ దగ్గరలోని పారిశ్రామిక వాడలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేసి చెత్తాచెదారం కప్పి అక్కడి నుండి వెళ్లిపోయాడు. విఘ్నేష్ తనకేమి తెలియనట్లు అమ్మాయి తల్లిదండ్రులకు కాల్ చేసి అమ్మాయి మీ దగ్గరకు వస్తుందని చెప్పి ఇక్కడి నుండి వెళ్లిందని, వచ్చిందా అని అడిగాడు. అనుమానించిన తల్లిదండ్రులు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విఘ్నేష్‌ను విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. పారిశ్రామిక వాడకు వెళ్లి చూడగా మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పెళ్లిచేసుకోవాలని తరచూ ఒత్తిడి చేయడంతోనే హత్యచేసినట్లు తెలిపారు. హత్యచేసిన విఘ్నేష్, అతనికి సహకరించిన సాకేత్, కళ్యాణిలను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



బాలికతో నిందితుడు విఘ్నేష్ (ఫైల్)



నిందితులు విఘ్నేష్, సాకేత్

## మద్యం మత్తులో యువకుల వీరంగం

బంజారాహిల్స్: మేమంతా పోలీసు అధికారుల పిల్లలమని, తాగి వాహనాలు నడిపినా, ప్రమాదాలకు పాల్పడి ప్రాణాలు తీసినా మమ్మల్ని ఎవరూ ఏమి చేయలేరంటూ మద్యం మత్తులో ఉన్న ఐదుగురు యువకులు నడిరోడ్డుపై వీరంగం సృష్టించారు. ఈ సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఆదివారం రాత్రి యాచారానికి చెందిన గోవింద్ తన ఆటోను శ్రీనగర్‌కాలనీ మెయిన్‌రోడ్డులో మెడికల్ షాపు ముందు ఆపి లోనికి వెళ్లాడు. బయటకు వచ్చి చూసేసరికి ఐదుగురు యువకులు మద్యం మత్తులో బాలెనో కారులో అదుపుతప్పిన వేగంతో వచ్చి ఆటోను వెనుక నుంచి ఢీకొట్టారు. అలాగే గోవింద్‌కు కూడా గాయలయ్యాయి. ఆటోను ఢీకొట్టిన ఈ కారు ముందున్న మరో 2 ఆటోలు, ఒక కారును కూడా ఢీకొట్టాయి. డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు ఆగిపోగా బాధితులంతా కారు వద్దకు చేరుకుని ఎందుకు ఇలా నిర్లక్ష్యంగా నడుపుతున్నారంటూ ప్రశ్నించారు. పీకలదాకా మద్యం సేవించి మత్తులో ఉన్న వీరంతా మేం పోలీసు అధికారుల కుమారులం..తలచుకుంటే మిమ్మల్ని బొక్కలో వేయిస్తాం..అంటూ బెదిరిస్తూ అటు నుంచి వెళ్లిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కారులో ఉన్న ఐదుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిజాయితీ చాటిన లాలాపేట వాసి



నగదును లాలాగూడ పోలీసుకు అప్పగిస్తున్న సతీష్‌యాదవ్

లాలాపేట: తార్నాక లాలాపేట ప్రాంతానికి చెందిన సతీష్ యాదవ్ అనే యువకుడు సోమవారం లాలాపేటలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలోంచి నడుచుకుంటూ వెళుతుండగా రోడ్డుపై ఓ బ్యాగ్ కనిపించింది. దాన్ని తీసుకుని చూడగా అందులో రూ 2 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించి అదే ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కిషోర్‌యాదవ్‌కు సమాచారం అందించాడు. ఇద్దరూ కలిసి ఆ నగదును లాలాగూడ పోలీసు స్టేషన్‌లో పోలీసులకు అప్పగించారు. లాలాగూడ పోలీసులు సతీస్‌యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## ఆలయం వద్ద పేలుడు.. ఒకరికి తీవ్ర గాయాలు



మైలార్‌దేవ్‌పల్లి: దేవాలయం వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఒకరు గాయపడ్డారు. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన మేరకు.. రామాంతపూర్ ప్రాంతానికి చెందిన సుగుణరామ్ (55) లక్ష్మిగూడ(మార్వాడి సమాజ్) రాజస్థాన్ ప్రజాపతి శ్రీశ్రీ యాదే మాత మందిరంలో పూజారిగా ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఆలయం ప్రధాన రహదారి ఫుట్ పాత్‌పై పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా ఒక్కసారిగా అక్కడ ఉన్న పేలుడు పదార్థం భారీ శబ్దంతో పేలింది. ఈ క్రమంలో ఆ పూజారికి బలంగా గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి పేలుడుకు గల కారణాలు వెతుకుతున్నారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్

- హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- జనం దృష్టిని మళ్లించేందుకు సీఎం డ్రామాలు
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రా రెడ్డి

తుర్కయంజాల్: రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెరలేపాడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి విమర్శించారు. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని.. 11 నెలలు గడుస్తున్నా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని అన్నారు. హామీల అమలు గురించి బీజేపీ ప్రశ్నిస్తుండటంతో సీఎం హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని దుయ్యబట్టారు. తాజాగా లగచర్ల ఘటన కూడా ఇందులో భాగమేనని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డీఎన్ఏ తెలంగాణది కాదని విమర్శిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిది టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే డీఎన్ఏలలో ఏదో చెప్పాలని ప్రశ్నించారు. ఇటీవల బీజేపీకి చెందిన 20 మంది నాయకులు మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజలతో కలిసి నిద్ర చేశామని.. స్వయంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ ప్రాంత ప్రజలతో చర్చించకుండానే ఏకపక్షంగా మూసీ పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్లను కూలగొట్టే కార్యక్రమానికి తెరలేపారని మండిపడ్డారు. 1000 అడుగుల విస్తీర్ణంలో ఉన్న మూసీ నదిలో 300 ఫీట్ల వెడల్పుతో రిటైనింగ్ వాల్ కట్టి సమస్యకు పరిష్కారం చూపాచ్చని, మిగిలిన దాంట్లో బ్యూటిఫికేషన్ వంటి పనులు చేపట్టుకోవచ్చని సూచించారు. గంగా నది ప్రక్షాళనకు రూ. 38వేల కోట్లను ఖర్చు చేశారని కేవలం 52 కిలోమీటర్ల మూసీ నది కోసం రూ.1.50 లక్షల కోట్లు ఎలా అవుతుందని నిలదీశారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీకి మూటలను పంపించేందుకే ఈ వ్యవహారం అని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్‌లు, జాతీయ రహదారుల నిర్మాణం శరవేగంగా చేపడుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు విమర్శలు మానుకుని, క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు రాణి రుద్రమ, బండారు విజయలక్ష్మి, సుభాష్, సునీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషను కాపాడుకుందాం

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ



జవహర్‌నగర్: తెలుగు భాషను కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిదీ అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. సోమవారం బిట్స్ పిలానీ క్యాంపస్‌లో గోదావరి కళామంజరి ఆధ్వర్యంలో తెలుగు భాషకు పట్టాభిషేకం సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఎన్‌వీ రమణ మాట్లాడుతూ తెలుగు భాష మన జీవన విధానమని తెలుగులోనే మాట్లాడుదాం అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి చైర్మెన్ గుమ్మడి గోపాల కృష్ణ తెలుగు పద్యాలతో పాటలు పాడి ఆలరించారు. కార్యక్రమంలో నాగేశ్వరావు, బిట్స్ పిలానీ అధ్యాపకుడు నాగరాజు కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

## తీరు మారాల్సిందే..

- వేళకు రాని అధికారులపై కలెక్టర్ సీరియస్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'కొంత మంది జిల్లా స్థాయి అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజావాణి సహా ఇతర సమీక్ష సమావేశాలను లైట్ తీసుకుంటున్నారు. ఫీల్డ్ విజిట్‌లో ఉన్నట్లు పేర్కొంటూ సమావేశాలకు కిందిస్థాయి అధికారులను పంపుతున్నారు. ఇలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోను' అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్ వేదికగా సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కొంత మంది అధికారులు ఉదయం 11 దాటినా హాజరు కాకపోవడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే కార్యక్రమానికి జిల్లా అధికారులు గైర్హాజరవుతుండటం, కిందిస్థాయి అధికారులను పంపుతుండటం, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఆ వెంటనే ఇదే అంశంపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఆదేశాలను ధిక్కరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. సమన్వయంతో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలని సూచించారు. ప్రతి పనిలోనూ అంకిత భావం, నిరుపేదలకు స హాయం చేసి ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చుకోవాలన్నారు. వారంలో మూడు రోజులు ఫీల్డ్‌లో ఉండాలని, కిందిస్థాయి అధికారుల పనితీరును పరిశీలించి, వారికి తగు సూచనలు ఇవ్వాలని అన్నారు. నిబంధనల మేరకు పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి





ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాలో బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగులు

కవాడిగూడ: దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల వృద్ధిలో కీలక పాత్ర పోషించిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం విస్మరించడం దుర్మార్గమని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బి.ఎస్ రాంబాబు అన్నారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు రిటైరీస్ ఆర్గనైజేషన్స్ పిలుపు మేరకు తెలంగాణ బ్యాంకు రిటైరీస్ బ్యాంకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులతో మహాధర్నా చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెలంగాణ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రమణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు రిటైరీస్ ఆర్గనైజేషన్స్ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎం దేశ్ పాండే ఈ ధర్నాను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ అప్‌డేషన్ జరగకపోవడం దారుణం అన్నారు. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సుముఖంగా లేకపోవడం విచారకరం అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం.ఎస్ రావు పాల్గొన్నారు.

## పెళ్లింట్లో భారీ చోరీ

- 133 తులాల బంగారం,
- 80 తులాల వెండి
- రూ.2.5లక్షల నగదు అపహరణ



వివరాలు అడిగి తెలుసుకుంటున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి పట్టణంలోని ఓ పెళ్లి ఇంట్లో ఆదివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. పెళ్లివారంతా హల్దీ వేడుకలో ఉండగా.. దుండగులు తమ పని తాము చేసుకొని వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదుతో శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ సత్యనారాయణ వెంటనే పెళ్లింటికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శంకర్‌పల్లి సీఐ తెలిపిన మేరకు.. పట్టణానికి చెందిన పార్శి బాలకృష్ణ వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు. తన కూతురు వివాహం ఈనెల 20న ఉండడంతో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఇంటి బయట హల్దీ ఫంక్షన్ ఏర్పాటు చేసుకున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు వేడుక కోసం బయట ఉన్నారు. రాత్రి 11గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి.. వేసుకున్న నగలు పెడదామని చూసేసరికి లాకర్ తెరిచి ఉంది. అనుమానం వచ్చి మొత్తం పరిశీలించగా 133 తులాల బంగారం (17 ఆభరణాలు), 80 తులాల వెండి, రూ.రెండున్నర లక్షల నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్‌టీం, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నారు.

# భూములిచ్చేది లేదు

## ఫ్యూచర్ సిటీ రహదారి భూ బాధితుల తీర్మానం

- భూమికి భూమి ఇచ్చి తీరాల్సిందే
- లేదంటే మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి
- తేల్చి చెప్పిన రైతులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణం కోసం భూములు ఇచ్చేది లేదని బాధిత రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రాలు అందించారు. అంతకు ముందు రాచలూరులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న వారందరినీ ఒప్పించిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని తీర్మానించారు. కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మించడానికి సిద్ధమైంది. అందుకు సంబంధించి ఓఆర్ఆర్ 13 ఎగ్జిట్ నుంచి బేగరికంచె పరిధిలో నిర్మిస్తున్న స్కిల్స్ యూనివర్సిటీ వరకు తొలి విడతలో 300 అడుగుల రహదారి నిర్మించడానికి భూసేకరణ చేపట్టింది. ఇటీవల గ్రామాలు, సర్వే నంబర్ల వారీగా ఏయే భూముల నుంచి ఎంత మేర సేకరించనుందో ప్రకటించింది. రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు ఆయా భూముల్లో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. పనులు చేస్తున్న అధికారులను ఇటీవల రాచులూరు రెవెన్యూలో రైతులు అడ్డుకున్న విషయం విధితమే.



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

### నష్టపోకుండా చూడాలి

శ్రీశైలం రహదారిని విస్తరించి గతంలో కొత్తూరు గేట్ నుంచి నిర్మించిన 200 అడుగుల రహదారిని ఉపయోగించుకోవచ్చని సూచించారు. దీంతో తాము భూములు కోల్పోవాల్సిన అవసరం ఉండదని తెలిపారు. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం రైతులంతా నష్టపోకుండా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. తమ పొలాలు ఇవ్వడానికి ఎవరూ సుముఖంగా లేరని స్పష్టం చేశారు. భూమికి భూమి లేదంటే ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరం రూ.4కోట్ల నుంచి రూ.5 కోట్లు ధర పలుకుతోందని.. దాని ప్రకారం పరిహారమా అనేది రైతులను ఒప్పించి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ 100-400 గజాల లోపు ప్లాట్లు అమ్మబడును & రిసెప్షనిస్ట్ కావలెను. వసతి కలదు. Ph: 7981748732 [SCA24000659]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [800517]

BUSINESS OFFER

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9398709618 [H-796650]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Mohammad Mubeen W/o, Naseeroddeen R/o H.no. 3-92/4/3, Plot No 108, Manasani Colony, Kuntloor, Hayathnagar, Ranga Reddy District - 501505, have changed my name to Mubeen. [DA-39243]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715 [H-783362]

Wanted

■ హాస్టల్‌లో క్లీనింగ్ చేయడానికి 45-50 సం॥ల వయస్సు ఉన్న సింగిల్ లేడీ కావలెను. వసతి, ఉచిత భోజనం & నెల జీతం ఇవ్వ బడును. దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి. Ph: 9848880991 [HA-14778]

■ రిసెప్షన్, యాంకర్లు, టి.కా, డా॥ఎంట్రీ పా / వు టైం, వీ॥ఎడిటర్స్, కలె॥, ఆ- బాయ్స్, డ్రై॥, ITI, డిప్లొమా, PG సూపర్ వై, హెల్పర్స్ జీ: 12-20K ఫ్రీ హాస్టల్. 9505261777 [H-783605]

■ బంజారాహిల్స్, రోడ్డు నెంబర్ 12 నందు పనిచేయుటకు అనుభవం ఉన్న మరియు హిందీ వచ్చి, అన్ని రకాల కార్లు నడుపుటకు డ్రైవర్లు కావలెను. జీతం + ESI + PF+ బోనస్+ గ్రాట్యూటి కలదు. @ Midwest Limited. ఫోన్: 7993338970 [HA-905]

■ సెక్యూరిటీ గార్డ్స్, వాచ్‌మెన్ అర్జెంటుగా కావలెను. LB నగర్, హయత్ నగర్, మౌలాలి, నాగోల్, నిజాంపేట్. జీతం: 10K-12K + రూం. ఫోన్: 8331837003 [HA-14776]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253919]

■ ప్రముఖ వసుంధర ఓల్డ్ ఏజ్ హోంలో పని చేయుటకు హెల్పర్స్, ఆయాలు, ANM, GNM, నర్సులు అర్జెంట్‌గా కావలెను. జీ : 12,000/- నుండి 24,000/-, రూం + భో ఫ్రీ. ఫోన్ : 95424 49944 [V- 823885]

■ అన్నపూర్ణ హోమ్‌కేర్‌లో కేర్ టేకర్స్, పేషెంట్ కేర్, పెద్దవారికి సేవ చేయడానికి ఆయాలు, ANM/GNM నర్సులు, స్త్రీ/పురుషులు కావలెను. జీతం : 16000 to 30000 రూమ్+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9390427694 [HA-904]

■ క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-1]

■ Wanted Collection Executive, No Consultancy, Direct job, Bike Must & Should be Age:25-30, Job Role: Field Work (All Areas in Hyd) Off: Dilsukhnagar. Ph: 7075239265 [HA-14767]

FACULTY TEACHERS

■ Teachers to Teach Hindi, Maths, Social (VI-X) also Admins at Krishnaveni Talent School, Musheerabad. Sal : neg Ph: 9640800563 [SCA24000644]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

| | | | |
|---|---|---|---|
| దిల్‌సుఖ్‌నగర్ | 9912348016 | రాజేంద్రనగర్ | 9010202372 |
| ఎల్.బి.నగర్ | 9912225475 | కూకట్‌పల్లి | 9912225476 |
| తార్నాక | 9010202751 | బాలానగర్ | 9951602997 |
| సికింద్రాబాద్ | 9010299013 | మల్కాజ్‌గిరి | 9505507562 |
| చిక్కడపల్లి | 9912225453 | మెహదీపట్నం | 9912225468 |
| అబిడ్స్ | 9705144457 | చందానగర్ | 9912225453 |
| అమీర్‌పేట్ | 9505507563 | ఉప్పల్ | 7095250115 |

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఖైరతాబాద్:** సైఫాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్, చెట్ల తొలగింపులో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సైఫాబాద్ డివిజన్ అసిస్టెంట్ మేనేజర్ తెలిపారు. బంజారా ఎవెన్యూ ఫీడర్ పరిధిలో సరస్వతిశిశు మందిర్, శ్రీసాయి అపార్ట్‌మెంట్, టాప్ పిన్ హోటల్ ఏరియా, వీఆర్‌కాలనీ పార్క్, నవీన్‌నగర్, ఆనంద్‌నగర్ మజీద్, క్రిష్టఫర్ స్కూల్ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, ఎర్రమంజిల్ పరిధిలోని భగత్ సింగ్ స్టాచ్యూ, పద్మావతినగర్ పోస్టాఫీస్, మోర్ సూపర్‌మార్కెట్ లేన్, పద్మావతి నగర్ చమన్ ఏరియాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు, కింగ్ కోటీ, తాజ్‌మహల్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు కింగ్ కోఠీ హాస్పిటల్, సెయింట్ జోషఫ్ రోడ్డు, మ్యూజిక్ కాలేజ్ రోడ్డు, పార్ట్ ఆఫ్ రాంకోటి, తాజ్‌మహల్ రోడ్డు, కింగ్‌కోఠీ సర్కిల్, ఫెర్నాండేజ్ హాస్పిటల్, గన్‌ఫౌండ్రీ స్ట్రీట్ నెంబర్ 03, సూర్య లోక్ చర్చ్ కంపౌండ్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కామినేని, శాంతాబాయి నర్సింగ్ హోం ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బొగ్గుల కుంట వాటర్‌వర్క్స్ ఏరియా, కామినేని హాస్పిటల్, ఫెర్నాండేజ్ హాస్పిటల్, సంతోష్ సప్న థియేటర్, అబిడ్స్ మెయిన్ రోడ్డు, శాంతాబాయి నర్సింగ్ హోం, అబిడ్స్ ఎంసీహెచ్ ఏరియా, కలెక్టర్ ఆఫీస్ ఏరియా పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని దీనిని వినియోగదారులు గమనించాలని కోరారు.

**వెంగళరావునగర్‌లో..**

మెథడిస్ట్‌కాలనీ, ఎస్‌ఆర్‌ఆర్‌పురం 11కెవీ ఫీడర్లు, కుందన్‌బాగ్, మోతీనగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మెథడిస్ట్ కాలనీ, రైల్వేట్రాక్, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్, రాక్‌గార్డెన్, ఎస్‌ఆర్‌ఆర్‌పురం సైట్-1, రాజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ సోమవారం తెలిపారు. అదేవిధంగా గ్రీన్‌పార్క్, రాజీవ్‌నగర్ 11కెవీ ఫీడర్లు బేగంపేట, మోతీనగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీన్ పార్క్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, కళ్యాణ్‌నగర్, రాజీవ్‌నగర్, బీఎస్ పురి, సెర్వెల్ కో ఆపరేటివ్, జయంతినగర్, శ్రీరామ్‌నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని వినియోగదారులు గమనించగలరని వారు తెలిపారు.

## నాణ్యతలో రాజీపడొద్దు



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

**వెంకటేశ్వరకాలనీ:** సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత విషయంలో అధికారులు రాజీపడొద్దని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి సూచించారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 14 కాలనీలో సోమవారం సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఇక్కడ ఉన్న బీటీ రోడ్డు దెబ్బతినడంతో ప్రతిపాదనలు రూపొందించి రూ. 28 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె సూచించారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో మూడు ఇళ్లు దగ్ధం

**బాధితులకు శాశ్వత గృహాలు ఏర్పాటు చేయాలి : వెల్లండ వెంకటేష్**



గుడిసెలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని నందగిరిహిల్స్ పక్కన ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీలో సోమవారం ఉదయం ఓ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మూడు ఇళ్లు పూర్తిగా కాలిపోగా, మరో రెండు ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఘటనా స్థలాన్ని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సందర్శించి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే సహాయక చర్యలు కూడా చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులను ఆదుకుంటామని హామీనిచ్చారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా వీరంతా ఇక్కడే నివసిస్తున్నారని, ఇంత వరకు శాశ్వత గృహాలు నిర్మించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. మూడుసార్లు గెలిచిన దానం నాగేందర్ ఇప్పటి వరకు వీరికి న్యాయం చేయలేదని, ఇప్పటికైనా వీరికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల క్రితం దుర్గాభవానీనగర్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా బాధిత కుటుంబాలకు ఇప్పటికీ నష్టపరిహారం ఇవ్వలేదన్నారు.

## కొత్త వక్ఫ్ బిల్లుకు జమాతే ఇస్లామిక్ హింద్ వ్యతిరేకం



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ సాదతుల్లా హుసైనీ

**కాచిగూడ:** కొత్త వక్ఫ్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తుందని జమాతే ఇస్లామీ హింద్ తన వైఖరిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ముందు పూర్తి స్పష్టతతో నివేదికన సమర్పించిందని జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు సయ్యద్ సాదతుల్లా హుసైనీ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మలిక్ మోతాసీమ్ ఖాన్, ప్రొఫెసర్ సలీంలతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ నెల 15,16,17 తేదీల్లో నగరంలో జరిగిన సమాతే ఇస్లామిక్ హింద్ అఖిల భారత సభ్యుల సమ్మేళనంలో ఆమోదించిన తీర్మానాలను ఆయన వెల్లడించారు. మతోన్మాద శక్తుల ద్వారా కొనసాగుతున్న విధ్వంసకర వ్యూహాలు మన దేశంలోని ముస్లింలకు మరింత సవాల్‌గా మారే పరిస్థితులను కలిగి ఉన్నాయని ఆరోపించారు. మతపరమైన సంస్థలు, ప్రార్థన స్థలాలు, ఆస్తులను లక్ష్యగా చేసుకుని జరుగుతున్న దాడులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. బుల్డోజింగ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ప్రభుత్వాలు కూల్చివేతలను కొనసాగిస్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో శాంతి, న్యాయ స్థాపన ఏర్పాటుకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## లేజర్‌గన్‌తో స్పీడ్ రైడర్లకు
# ముకుతాడు..!

### వేగం 60కి మించితే జరిమానాలు

- 1 నుంచి కేబీఆర్ పార్కు రోడ్డులో లేజర్ గన్ ఏర్పాటు
- 18 రోజుల్లో 1324 మందిపై కేసు
- ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా
- రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారుల చర్యలు

నగరంలో కొన్ని ప్రాంతాల్లో బైక్ రైడర్లు రయ్..రయ్ అంటూ దూసుకెళ్తున్నారు.. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో వీరి స్పీడ్‌కు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. దీంతో తరచూ వీరు ప్రమాదాల బారీనపడటమే కాకుండా ఇతరుల ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో వీరికి ముకుతాడు వేసేందుకు ట్రాఫిక్ అధికారులు లేజర్‌గన్లను ఏర్పాటు చేసి 60కి మించి వేగంతో వెళ్లిన వారికి జరిమానాలు విధిస్తూ ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు చేపట్టారు.

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రహదారులపై రయ్..రయ్‌మంటూ మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్న స్పీడ్ రైడర్లకు ట్రాఫిక్ పోలీసులు 'లేజర్ గన్'తో ముకుతాడు పెడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్లిన వాహనదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. లేజర్ గన్ ద్వారా స్పీడ్ లిమిట్ దాటిన వాహనాలను గుర్తించి వారికి జరిమానాలు కూడా విధిస్తున్నారు. ఇటీవల కాలంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ రహదారులపై అతి స్పీడ్ కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వీటిని అదుపు చేసేందుకు రోడ్డు పక్కన సీక్రెట్‌గా స్పీడ్‌ను నమోదు చేస్తూ హద్దులు దాటిన వారిని గుర్తిస్తున్నారు. దీనిలో భాగంగానే బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని కేబీఆర్ పార్కు చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు లేజర్ గన్ ఏర్పాటు చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి స్పీడ్ లిమిట్ దాటిన వారిని గుర్తించి చలాన్లు విధిస్తున్నారు. ఈ రోడ్డులో స్పీడ్ లిమిట్ 60కి మించరాదని నిబంధనలు విధించారు. 18 రోజుల్లో ఇప్పటి వరకు లిమిట్ 60 దాటిన 1324 మందిపై కేసులు కూడా నమోదు చేశారు. ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజూ 100 నుంచి 150 మంది వరకు మితిమీరిన వేగంతో లిమిట్ 60 దాటి దూసుకుపోతున్నట్లుగా లేజర్ గన్ ద్వారా తేలింది. ఈ రోడ్లలో స్పీడ్ లిమిట్ 60 దాటితే జరిమానాలు విధిస్తామని పోలీసులు వెల్లడించారు. ప్రతిరోజూ ఇక్కడ ఉంటే ట్రాఫిక్ పోలీసు స్పీడ్‌గా వెళ్లే వాహనాలపై నిఘా పెడతారని పేర్కొన్నారు. కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు వెళ్లే వాహనాలు ఇక నుంచి నిర్దేశించిన స్పీడ్‌లోనే వెళ్లాలని పేర్కొంటున్నారు.



లేజర్‌గన్‌తో స్పీడ్ లిమిట్‌ను నమోదు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు





మితిమీరిన వేగంతో వెళ్తూ కెమెరాకు చిక్కిన బైక్

# నిమ్స్‌లో సౌకర్యాలు పెంచాలి

**నిమ్స్‌లో పీ.వై.ఎల్, పీ.ఓ.డబ్ల్యూ సర్వే**

**లక్డీకాపూల్:** నిమ్స్‌లో రోగుల సంఖ్యకు తగ్గట్టు సౌకర్యాలు పెంచాలని ప్రొగ్రెసివ్ యూత్ లీగ్ (పీ.వై.ఎల్) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి బీ.ఎస్ కృష్ణ కోరారు. వైద్యరంగంలో ప్రతిష్టాత్మకమైన నిమ్స్ ఆస్పత్రిలో సోమవారం పీ.వై.ఎల్, ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ప్రతినిధి బృందం సర్వే నిర్వహించింది. సర్వే అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ సర్వేలో పలు అంశాలలో డొల్లతనం బయటపడిందన్నారు. ముఖ్యంగా ఆస్పత్రి నిర్వహణలో యాజమాన్యం వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందన్నారు. ఈ ఆస్పత్రికి మెరుగైన వైద్య సేవలు పొందేందుకు నిత్యం వేలాదిమంది ఔట్ పేషెంట్ విభాగానికి వస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో సోమవారం 4 వేల వరకు ఓపీ రోగులు వచ్చినట్టు పేర్కొన్నారు. అయితే అందుకు అనుగుణంగా ఆస్పత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు కల్పించలేని పరిస్థితిలో యాజమాన్యం ఉందన్నారు. ఆయా విభాగాలకు వచ్చిన రోగులకు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఫ్రీ పార్కింగ్ సౌకర్యం ఉన్నప్పటికీ నిమ్స్‌లో మాత్రం పెయిడ్ పార్కింగ్ వ్యవస్థ కొనసాగుతుందన్నారు. రోగుల వెంట వచ్చే వారి సహాయకులకు కనీస వసతులు కల్పించాలని కోరారు. ఈ మేరకు నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్పకు వినతి పత్రాన్ని సమర్పించామని కృష్ణ తెలిపారు. ఈ సర్వే కార్యక్రమంలో పీ.వై.ఎల్, పీ.ఓ.డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ ప్రదీప్, డి.స్వరూప, పీ.వై.ఎల్, పీ.ఓ.డబ్ల్యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు ఎం. రవికుమార్, బీ.ఎస్ కృష్ణ, లక్ష్మీబాయి, వరలక్ష్మి, జిల్లా నాయకులు నిర్మల, బంగారి శ్రీనివాస్, కొల్లూరు భీమేష్, ఎల్లప్ప, కొల్లూరు శంకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న పీవైఎల్, పిఓడబ్ల్యూ ప్రతినిధి బృందం

## రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

**సనత్‌నగర్:** రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు బేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ)లో 'రోడ్డు ప్రమాదాలు-నివారణ'అంశంపై సోమవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు వాహనదారుల అవగాహనారాహిత్యమే కారణమన్నారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ఫుట్‌పాత్ లేనప్పుడు రోడ్డుపై వెళ్లేటప్పుడు కుడివైపున మాత్రమే నడవాలని, దీనివల్ల ఎదురు వచ్చే వాహనాలను గుర్తించి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నడపవద్దన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌తోనే కాకుండా అవగాహనా కార్యక్రమాల ద్వారా కూడా ట్రాఫిక్ ప్రమాదాలను నివారించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## భగవద్గీత శ్లోకాల పోటీలు

**బంజారాహిల్స్:** తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో డిసెంబర్ 11వ తేదీన గీతా జయంతిని పురస్కరించుకుని భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించడం జరుగుతుందని పరిషత్ సహాయ కార్యనిర్వహణాధికారి చతుర్వేదల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు పోటీల వివరాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. నవంబర్ 23న కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో, డిసెంబర్ 2వ తేదీన వికారాబాద్ వేంకటేశ్వర స్వామి దేవాలయం, 7న సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ స్కూల్, 9న హిమాయత్‌నగర్ టీటీడీ కళ్యాణ మండపం వద్ద నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 6వ అధ్యాయనం ఆత్మ సంయమ యోగంపై శ్లోక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 6, 7 తరగతులు మొదటి గ్రూపు, 8, 9 తరగతులు రెండో గ్రూపు, అదేవిధంగా సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై 18 సంవత్సరాల లోపు వారికి మూడో గ్రూపు, 18 సంవత్సరాలు పైబడిన వారికి నాల్గో గ్రూపుగా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. వివరాలకు 90308 50336, 90300 00964 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులు

## 'జేఈఎస్' నూతన కార్యవర్గం ఏకగ్రీవం

**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ (జేఈఎస్) నూతన కార్యవర్గాన్ని వార్షిక జనరల్ బాడీ మీటింగ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యా రంగంలో అనుభవజ్ఞులైన నిష్ణాతులతో కూడిన 15 మందిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. జేఈఎస్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడిగా ఏ.మురళీముకుంద్, ఉపాధ్యక్షుడిగా ఆర్.బాలమురళీకృష్ణ, టి.హరిశ్చంద్రప్రసాద్, సెక్రటరీగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏ. దినకర్‌బాబు, జాయింట్ సెక్రటరీగా ఏ ఆకర్ష్ కృష్ణ, కోశాధికారిగా చార్టెడ్ అకౌంటెంట్ బీ. రామకృష్ణుడులు ఎంపికయ్యారు. అలాగే కమిటీ సభ్యులుగా వాసవీ అకాడమీ సెక్రటరీ ఎం.కృష్ణమూర్తి, ఎం.ఆనంద్, నృపతుంగ స్కూల్స్ సెక్రటరీ ముకుంద్ కులకర్ణి, ఈఎస్‌టీ డాక్టర్ పి. వీరా సరోజ్, మెకానికల్ ఇంజినీరింగ్ జీ. శ్రీధర్, సివిల్ ఇంజనీర్ కె. దిలీప్, కె. దివ్య, ఆర్. కల్పన, మైక్రో బయోలజిస్ట్ నాగరంగ లిఖిత తదితరులను ఎన్నుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ కమిటీ కృషి చేయనుంది. అలాగే ఇంటర్నేషనల్ స్కూల్స్ కేంబ్రిడ్జి, ఐబీ కరిక్యులమ్‌తో రానున్న రోజుల్లో విద్యాబోధనకు శ్రీకారం చుట్టనున్నారు.

## ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

**ఫిలింనగర్:** పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. వరుసగా చేస్తున్న ఈ ఫుట్‌పాత్ ఆక్రమణల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. ఆస్పత్రి వెనుక గేటు వద్ద ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగిస్తున్న క్రమంలో డబ్బాలు ఏర్పాటు చేసిన వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మరోసారి డబ్బాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో ఫిలింనగర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్, ఎస్ఐ నరేందర్, ఫిలింనగర్ ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

## చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

**పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలి**

**కాచిగూడ:** చిరుధాన్యాలు శరీరానికి అవసరమైన పోషకాలన్నీ అందిస్తాయని, అదే సమయంలో చిన్నచిన్న అనారోగ్యాలు మొదలు, కేన్సర్, కొన్ని రకాల గుండెజబ్బుల్లాంటివి రాకుండా కాపడటంలో కీలకపాత్ర పోషిస్తాయని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలి అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని అక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్ వలీ పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చిరుధాన్యాలవైపు మన ఆహార దృష్టిని మార్చవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. చిరుధాన్యాల్ని ఒకేసారి కాకుండా నెమ్మదిగా జీవన విధానంలో చేర్చుకోవాలని, రోజువారీ తీసుకునే ఆహారంలో ఆరవై శాతం వరకూ చిరుధాన్యాలతో చేసిన పదార్థాలుండేలా చూసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులలో స్థిరమైన, ఆరోగ్యకరమైన ఆహార ఎంపికల పట్ల లోతైన అవగాహన కలిగించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 'ఖాదర్ వలి సిరి జీవన విధానం కళాత్మకం' అనే పేరుతో లయన్స్ క్లబ్ ప్రతినిధి ఎస్. ధనంజయ్య ప్రచురించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వేద కుమార్, డైరెక్టర్ మణికొండ ప్రార్థన, కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల, ప్రిన్సిపాల్ రేఖరావు, ఫాతిమా ఖాజీమ్, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి భూ సర్వే

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పక్కన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని షేక్‌పేట మండల సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి తదితర సిబ్బంది సర్వే చేశారు. ఈ స్థలాన్ని 2023, మే 9వ తేదీన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం నిర్ణయిస్తూ కేటాయించారు. సుమారు 2635 గజాల విస్తీర్ణంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు మొదటి, రెండో అంతస్తుల్లో, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని మూడో అంతస్తులో నిర్మించేందుకు రూ.కోటిన్నర మంజూరయ్యాయి. సర్కారీ పోరంబోకు స్థలంగా ఉన్న ఈ స్థలం సర్వే నెంబర్ 403లో ఉంది. రెవెన్యూ అధికారులు ఈ స్థలాన్ని ఇస్తే ట్రాఫిక్ విభాగం నిర్మాణాలు చేపట్టనున్నారు. జిల్లా కలెక్టర్ కూడా ఈ స్థల కేటాయింపుపై అప్పట్లోనే నిర్ణయం తీసుకున్నారు.



స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

## అడ్డా 247తో యాక్సిస్ బ్యాంక్ ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకుంటున్న యాక్సిస్ బ్యాంక్, అడ్డా 247 ప్రతినిధులు

**బంజారాహిల్స్:** దేశంలోని అతిపెద్ద ప్రైవేటు రంగ బ్యాంకుల్లో ఒక్కటైన యాక్సిస్ బ్యాంక్ అడ్డా 247తో వ్యూహాత్మక ఒప్పందం చేసుకుంది. నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన సృజనాత్మకత ఉన్న వారిని ప్రోత్సహించేందుకు ఈ ఒప్పందం తోడ్పడనుంది. ఈ ఒప్పందం ద్వారా మెరుగైన నైపుణ్యం ఉన్నవారికి యాక్సిస్ బ్యాంక్‌లో సేల్స్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్‌తో పాటు వినియోగదారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఒక వేదికగా నిలవనున్నదని యాక్సిస్ బ్యాంక్ మానవ వనరుల విభాగాధిపతి రాజ్‌కమల్ వెంపటి అన్నారు. సోమవారం జరిగిన ఒప్పంద కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత దృక్కోణాన్ని మార్చి వారిని సరైన మార్గంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అడ్డా 247 ద్వారా సాంకేతిక ప్రతిభను అభివృద్ధి చేసి ఉపయోగించుకుంటామన్నారు. అడ్డా 247 వ్యవస్థాపకుడు, సీఈఓ అనిల్ నగర్ మాట్లాడుతూ అడ్డా 247 అనేది 2010లో బ్యాంక్ పవర్‌గా ప్రారంభించబడిందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంక్ ఉద్యోగాలను ఆశించే వారికి శిక్షణ ఇవ్వడం ప్రారంభించామన్నారు. గత 14 ఏళ్లలో ఈ వ్యవస్థను నిర్మించడానికి గణనీయమైన పెట్టుబడులు పెట్టామన్నారు. తాము ప్రధానంగా డిజిటల్ బ్యాంకింగ్‌పై దృష్టిసారించినట్లు వివరించారు. అడ్డా 247 స్కిల్లింగ్, హయ్యర్ ఎడ్యుకేషన్ సీఈఓ మల్జీత్‌సింగ్ భాసిన్ మాట్లాడుతూ సేల్స్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, వినియోగదారుల సేవా కేంద్రంలో అవసరమైన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి వర్క్‌ఫోర్స్‌ను రూపొందించడంలో యాక్సిస్ బ్యాంక్‌తో భాగస్వామ్యం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

## వేడుకగా రుద్రయాగ సహిత నవచండీ యాగం



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

**బంజారాహిల్స్:** బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలోని శ్రీ విజయగణపతి ఆలయంలో పది రోజులుగా జరుగుతున్న రుద్రయాగ సహిత నవచండీ మహాయాగోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. పూజల్లో భాగంగా సోమవారం ఆలయంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనములు, రుత్వికరణములు, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం, నీరాజనం మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ పూజాదికాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు తెలిపారు.

## అంబేడ్కర్ వర్సిటీలో 27న వంటావార్పు



నిరసన వ్యక్తం చేస్తున్న వర్సిటీ ఉద్యోగులు

**బంజారాహిల్స్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలం జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్‌పర్సన్ ప్రొఫెసర్ పల్లవీ కాబ్దే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈ నెల 27న విశ్వవిద్యాలయంలో వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నేతలు డాక్టర్ రజని, కృష్ణారెడ్డి, యాకేష్ దైద ఉన్నారు. మరోవైపు విశ్వవిద్యాలయంలో గత 60 రోజులుగా కొనసాగుతున్న మధ్యాహ్న భోజన విరామ సమయంలో జరిగిన నిరసనలో జేఏసీ నేతలు పుష్పా చక్రపాణి, ఆనంద్ పవార్, చంద్రకళ, ప్రమీలా కేతావత్, మేరీ సునంద, కాంతం ప్రేమ్‌కుమార్, బ్రహ్మానంద నాయుడు, అవినాష్, కిషోర్, రాఘవేంద్ర, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





## మహిళ అదృశ్యం

**వెంగళరావునగర్:** మతిమరుపు లేని మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పి.నిర్మల భర్త, కుమారుడు, ఆమె తల్లి లక్ష్మమ్మ (80) కలిసి పదేళ్లుగా రహమత్‌నగర్‌లో ఉంటుంది. లక్ష్మమ్మకు మతిమరుపు ఉండటంతో తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమెను తెలిసిన ఎవరో ఒకరు మళ్లీ తీసుకువస్తుంటారు. ఈ క్రమంలో ఈనెల 16న లక్ష్మమ్మ ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమార్తె నిర్మల ఇతర కుటుంబ సభ్యులు లక్ష్మమ్మ కోసం అన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# నిర్లక్ష్యం వీడరా..!

- మూతల్లేని మ్యాన్‌హోళ్లతో వాహనదారులకు ప్రమాదాలు
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

**బంజారాహిల్స్:** సమస్యలపై ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.తెరిచిన మ్యాన్‌హోళ్లు, మూతల్లేని మ్యాన్‌హోళ్ల వల్ల బస్తీల్లోని జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2 జవహర్ కాలనీ రోడ్ నెం. 7 మూలమీద మ్యాన్‌హోల్ మూత దెబ్బతిన్నదని మూడు నెలలుగా చెబుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం మానేశారు. మరమ్మతులు చేస్తున్నట్లుగా ఓ బారికేడ్‌ను తీసుకొచ్చి ఈ మ్యాన్‌హోల్ చుట్టూ పెట్టి వెళ్ళిపోయారని స్థానికులు వాపోతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్‌లో మేయర్ ఇంటి సమీపంలో ఓ మ్యాన్‌హోల్ దెబ్బతిని నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో దీనిని గమనించకుండా వస్తున్న వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఇప్పటికే ఇక్కడ 10 మందికిపైగా గాయపడినట్లు స్థానిక వ్యాపారి తెలిపారు. పాదచారులను, వాహనదారులను అప్రమత్తంగా చేసేలా ఓ కర్రను ఏర్పాటు చేసినట్లు వ్యాపారి తెలిపాడు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి మూతల్లేని మ్యాన్‌హోళ్ళకు మూతలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.



ఎన్బీటీ నగర్ మేయర్ ఇంటి సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

## కార్పొరేట్ అనుకూల విధానాలతో ప్రజలకు కష్టం


సదస్సులో మాట్లాడుతున్న పశ్య పద్మ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కనీస మద్దతు ధరను ప్రకటించి గ్యారెంటీ చట్టాన్ని ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికుల హక్కులను కాపాడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం నాయకులు పశ్య పద్మ, టీయూసీఐ నాయకులు కె.సూర్యం, ఐఎన్‌టీయూసీ నాయకులు విజయ్‌కుమార్, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ.. రైతు, కార్మిక, ప్రజల జీవనోపాధిని రక్షించడంతో పాటు దేశంలో ప్రైవేటీకరణను ఆపాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర పాలకుల కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశ ప్రజలు, రైతులు, కార్మికులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నిపంటలకు మద్దతు ధర వ్యవసాయ ఖర్చులకు 50శాతం అదనంగా జోడించి అమలు చేయాలని వారు అన్నారు. రైతులందరికీ పూర్తిగా పంట రుణాలను మాఫీ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, భూసేకరణ చట్టం 2013ను అమలు చేయాలని, అటవీ హక్కుల చట్టం 2006ను పటిష్టంగా అమలు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేయాలని, కౌలురైతులను గుర్తించి అన్ని ప్రభుత్వ పథకాలను వర్తింపచేయాలని, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, అధిక ధరలను తగ్గించి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని, అసంఘటిత కార్మికులకు యూనివర్సల్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్‌ను ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు నాగన్న గౌడ్, ఏఐటీయూసీ నాయకులు బాలరాజు, సీఐటీయూ నాయకులు జె.వెంకటేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి.సాగర్, వివిధ సంఘాల నాయకులు వి.ప్రభాకర్, జక్కుల వెంకటయ్య, విస్సా కిరణ్, మామిడాల భిక్షపతి, జి.వెంకటేశ్వర్లు, ఆర్.వెంకట్రాములు, కాంతయ్య, బి.కొండల్, పెద్దాపురం రమేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## రాత్రికి రాత్రే వైఎస్సార్ విగ్రహం తొలగింపు

### అభిమానులు నిలదీయడంతో మళ్లీ ఏర్పాటు పనులు

- శివరాంపల్లిలో ఘటన
- దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలంటున్న అభిమానులు


వైఎస్ విగ్రహాన్ని తొలగించి రోడ్డు పక్కనే పెట్టిన దృశ్యం


విగ్రహం దిమ్మెను ధ్వంసం చేసిన దృశ్యం


దిమ్మె నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కె.ఎస్.దయానంద్

రాజేంద్రనగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిపై ఉన్న అభిమానంతో అభిమానులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న విగ్రహాన్ని శివరాంపల్లి ప్రజాభవన్ కమిటీ వారు ఆదివారం అర్ధరాత్రి తొలగించారు. విగ్రహాన్ని ప్రధాన రహదారి పక్కనే పడేసి.. దిమ్మెను పూర్తిగా ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న వై.ఎస్.అభిమానులు కె.ఎస్.దయానంద్, పంబాల రాజు ప్రజా భవన్ వద్దకు చేరుకుని విగ్రహాన్ని ఎవరు తొలగించారు? ఎందుకు తొలగించారు? అంటూ నిలదీశారు. దీంతో కమిటీ సభ్యులు విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేస్తామని తెలిపి.. నిర్మాణ పనులను ప్రారంభించారు. స్థానికులు తెల్పిన వివరాల ప్రకారం... 2010 ఆగస్టు 2వ తేదీన శివరాంపల్లి ప్రజా భవన్ ప్రధాన రహదారి పక్కనే డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులంతా కలిసి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వర్ధంతి, జయంతి రోజున పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రజా భవన్‌కు వెళ్లేందుకు మరో గేట్‌ను నిర్మించేందుకు కమిటీ సభ్యులు విగ్రహాన్ని తొలగించాలని నిర్ణయించారు. దీనిపై అభిమానులకు, స్థానికులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అర్ధరాత్రి సమయంలో విగ్రహాన్ని తొలగించి దిమ్మెను ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్, వై.ఎస్ అభిమాని కె.ఎస్.దయానంద్, పంబాల రాజులు సంఘటన స్థలానికి చేరుకుని కమిటీ సభ్యులను నిలదీయడంతో తమకు ఏమీ తెలియదని.. ఎవరూ తొలగించారో తెలియదని వెల్లడించారు. చివరకు విగ్రహం తొలగింపు తప్పేనని.. తిరిగి దిమ్మె నిర్మించి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అప్పటికప్పుడే నిర్మాణ పనులను ప్రారంభించారు.

**విగ్రహం తొలగించిన వారిపై కేసు నమోదు చేయాలి :కె.ఎస్.దయానంద్**

విగ్రహాన్ని తొలగించిన విషయమై పోలీసులు విచారణ ప్రారంభించాలని కె.ఎస్.దయానంద్ కోరారు. అతి సున్నితమైన ఇలాంటి సంఘటనలతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. విగ్రహాన్ని తొలగించిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## బైబ్యాక్ పాలసీ పేరుతో టోకరా!

### సువర్ణభూమి ఇన్‌ఫ్రాపై సీసీఎస్‌లో ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: బైబ్యాక్ పాలసీ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థ సువర్ణభూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ తమను నిండా ముంచిందంటూ కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సోమవారం నగర నేర పరిశోధన విభాగంలో (సీసీఎస్) ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ చేస్తున్న అధికారులు వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్తున్నారు. బాధితుల కథనం ప్రకారం.. సువర్ణభూమి సంస్థకు బొల్లినేని శ్రీధర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, బొల్లినేని దీప్తి డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ సంస్థ 2021లో బైబ్యాక్ స్కీమ్ పేరుతో ప్రత్యేక పథకం ప్రకటించింది. దీనికి ఆకర్షితులైన దాదాపు 30 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, రూ.35 లక్షల నుంచి రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టారు. ఆ సమయంలో కొంత స్థలాన్ని వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ.. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలు, హద్దులు పేర్కొనలేదు. అదేమని ప్రశ్నిస్తే... మీరు పెట్టిన పెట్టుబడికి గ్యారంటీగా మాత్రమే ఈ రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, ఒప్పందం ప్రకారం రెండేళ్లలో రూ.55 లక్షలు ఇచ్చి ఆ స్థలం తీసుకుంటామని నమ్మబలికారు. దీంతో అనేక మంది పెట్టుబడి పెట్టారు. అయితే గడువు తీరినా డబ్బు ఇవ్వకపోవడం, రిజిస్ట్రేషన్ చేసిన స్థలం వివరాలు చెప్పకపోవడంతో బాధితులు సంస్థ నిర్వాహకుల్ని నిలదీశారు. వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో సోమవారం 30 మంది బాధితులు సీసీఎస్ డీసీపీ ఎస్.శ్వేతను కలిసి ఫిర్యాదు చేశారు. తమలాంటి వాళ్లు వందల్లో ఉన్నారని బాధితులు చెప్తున్నారు.

## హెల్దీ ఇండియాకు సిరిధాన్యాలు ఎంతో అవసరం


డాక్టర్ ఖాదర్‌వలీ సన్మాన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఇంజినీర్లు

- మిల్లెట్స్ మ్యాన్ ఆఫ్ ఇండియా, పద్మశ్రీ, డాక్టర్ ఖాదర్‌వలీ

రాయదుర్గం: ఆరోగ్య భారత్‌కు సిరిధాన్యాల అవసరం ఉందని మిల్లెట్స్ మ్యాన్ ఆఫ్ ఇండియా, పద్మశ్రీ, డాక్టర్ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రాంగణంలోని కన్వెన్షన్ సెంటర్‌లో 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు అధ్యక్షతన దేశీయ ఆహార పద్ధతుల వలన కలిగే ప్రయోజనాలను 'హెల్త్ టాక్' పేరుతో 'ఎస్కీ', తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ సంయుక్తంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి నిత్యం కావాల్సిన ఆహార పదార్థాలను సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉత్పత్తి చేసుకోవచ్చని ఆయన సూచించారు. కొర్రలు, అండుకొర్రలు, సామలు, అరికెలు, ఊదలు అనే ఐదు చిరుధాన్యాలు మనిషి జీవన విధానంలో బాగా పని చేస్తాయన్నారు. అంతరించిపోతున్న ఐదు రకాల సిరి ధాన్యాల పునరుద్ధరణ ఆరోగ్యం ఇండియాకు ఎంతో అవసరం అన్నారు. తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎస్కీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ఎం.శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి సేవలో..


కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడి సేవలో జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి సేవలో సోమవారం సాయంత్రం జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. కీసరగుట్టకు విచ్చేసిన ఆమెకు ఆలయ పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం మేయర్ విజయలక్ష్మికి వేదపండితులు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆమె కీసరగుట్ట ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న దీపోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేయాలి


హైదరాబాద్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు బృందం

సాక్షి, సిటీబ్యూరో: దళిత, గిరిజన బెస్ట్ అవైలబుల్ స్కీంకు సంబంధించి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య నగర శాఖ ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధుల బృందం హైదరాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి సోమవారం వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత విద్యార్థులు 19వేల మంది, గిరిజన విద్యార్థులు 6వేల మంది మొత్తం 25 వేల మంది చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఫీజులు చెల్లించాల్సిన ప్రభుత్వం రెండేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో చదువులకు కోత పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా సుమారు 8 మాసాలు చెల్లించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావొస్తున్నా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్కీం కింద చదువుతున్న విద్యార్థుల ఫీజులను చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాఖ్య ఉపాధ్యక్షులు శ్రీమాన్ నాయక్ సహాయ కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

## గ్రేటర్‌లో 11,10,883 కుటుంబాల సర్వే పూర్తి

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సోమవారం నాటికి గ్రేటర్‌లో 45 శాతం సర్వే పూర్తయ్యింది. సర్వేలో తప్పులు లేకుండా జోనల్ అధికారులు, నోడల్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమర్థవంతంగా సర్వే జరిగేందుకు కృషి చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. సర్వేలో భాగంగా సోమవారం ఒక్క రోజే 1,50,227 కుటుంబాల సర్వే పూర్తి చేయగా, ఇప్పటి వరకు 11,10,883 కుటుంబాల వివరాలను సేకరించినట్లు పేర్కొంది.

## ఆర్‌బీఐ 90 క్విజ్‌లతో 90వ వార్షికోత్సవం


ఆర్బీఐ 90 క్విజ్ పోటీలో రాష్ట్రస్థాయిలో నిలిచిన విజేతలు

లక్డీకాపూల్: రిజర్వ్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) ఈ సంవత్సరం తన కార్యకలాపాలను ప్రారంభించి 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏడాది పాటు జరుగుతున్న పలు కార్యక్రమాల్లో భాగంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని దేశ వ్యాప్తంగా సాధారణ జ్ఞాన – ఆధారిత క్విజ్ పోటీని ఆర్బీఐ 90 క్విజ్ పేరుతో నిర్వహించింది. జట్టు ఆధారిత పోటీని బహుళ దశల్లో నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో సెప్టెంబర్–19 నుంచి మూడు రోజులు జరిగింది. ఈ దశలో పనితీరు ఆధారంగా రాష్ట్రస్థాయిలో పాల్గొనడానికి 90 జట్లను ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలను హైటెక్‌సిటీలోని నోవోటెల్ హెచ్‌ఐసీసీలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం పాల్గొన్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి చెందిన జట్టు (సయ్యద్ మొహమ్మద్‌హష్మీ, హుస్సేన్ అహ్మద్) విజేతగా నిలిచింది. గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ (జేఎన్‌టీయూహెచ్) వరుసగా రెండు, మూడవ స్థానాల్లో నిలిచాయి. మొదటి మూడు జట్లకు బహుమతులు వరుసగా రూ.2 లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.లక్ష చొప్పున అందజేశారు. ముంబైలో వచ్చే నెలలో జాతీయ ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## డ్రగ్స్‌తో బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

### ఆర్టీసీ ఎండీ సజ్జనార్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

చిక్కడపల్లి: తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో వచ్చేనెల 21న నెక్లెస్ రోడ్డులో నిర్వహిస్తున్న డ్రగ్స్ రహిత తెలంగాణ 2కె రన్‌లో తెలంగాణ యువత విద్యావంతులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు ప్రజాసంఘాలు పాల్గొనాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత తెలంగాణ 2కె రన్ పోస్టర్‌ను సోమవారం సాయంత్రం ఆవిష్కరించి మాట్లాడారు. డ్రగ్స్‌కు అలవాటుపడి యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకొని తల్లిదండ్రులకు మానసిక క్షోభ మిగల్చడం సరి కాదన్నారు. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వం, అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి కెరీర్‌పై దృష్టి సారించాలని కోరారు. తెలంగాణ విద్యా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పెండెం తారక్‌గౌడ్, అనిల్ బిరుదు, కేరీర్ అశోక్, రాజబాబు, సాయినాథ్, సాయినాథ్‌రెడ్డి, శ్యామ్, రాంప్రసాద్, బెల్లంకొండ పాల్గొన్నారు.

## రెండోదశ మరింత పటిష్టంగా..

- మెట్రో రైల్ ప్రతిపాదనలను రూపొందించాం..
- హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి
- ఆడిట్ వారోత్సవాలు ప్రారంభం




సాక్షి, సిటీబ్యూరో: భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆడిట్, అకౌంట్స్ శాఖ పాత్ర చాలా కీలకమని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. భారత ఆడిట్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్(ఏజీ ఆఫీస్)లో సోమవారం ఆడిట్ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ప్రజాధనం పూర్తిగా సద్వినియోగం కావడంతో పాటు వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్న వ్యయాన్ని తగు విధంగా పరిశీలించే లక్ష్యంతో పనిచేస్తున్న సీఏజీ, ఈ వారోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన కలిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న దశలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొనే యంత్రాంగాన్ని అన్ని విభాగాల్లో సన్నద్ధం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రస్థానంలో ఎదురైన అనేక సమస్యలు, సవాళ్లను ఆయన వివరించారు. మెట్రో రెండో దశకు ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు సిద్ధం చేసి మంత్రి మండలి ఆమోదంతో కేంద్రానికి పంపించినట్లు పేర్కొన్నారు. మొదటి దశలో ఆర్థికంగా, సామాజికంగా ఎదురైన అనేక సమస్యలను అధిగమించేలా.. రెండో దశలో మరింత పటిష్టంగా ప్రతిపాదనలను రూపొందించినట్లు వివరించారు. కార్యక్రమంలో రీజినల్ కెపాసిటీ బిల్డింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ సి.శైలజ, తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆడిట్(సెంట్రల్) హేమ మునివెంకటప్ప, అకౌంటెంట్ జనరల్ ఆడిట్ పి.మాధవి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ఆడిట్ వి.ఎం.వి.నావల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో పెరిగిన చలి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ శివారులో చలి పంజా విసురుతోంది. రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం చలి తీవ్రత మరింత పెరిగింది. నగరంలో సగటున కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 డిగ్రీలకు పడిపోయాయి. శివార్లలో మాత్రం సగటున 15 డిగ్రీలకు కనిష్ఠ ఉష్ణోగత నమోదవుతోంది. తెల్లవారుజాము పొగ మంచు కమ్మేస్తున్నా.. ఆ తర్వాత పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత సగటున 30.4 డిగ్రీల వరకు నమోదవుతోంది. రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత మైనస్‌లో పడిపోతున్నాయి. అత్యల్ప ఉష్ణోగ్రత పటాన్‌చెరులో 12.4 డిగ్రీలుగా నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

**నగర శివారులో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా**

| ప్రాంతం | డిగ్రీలు |
|---|---|
| పటాన్‌చెరు | 12.4 |
| రాజేంద్రనగర్ | 13.3 |
| హకీంపేట | 15.5 |
| హయత్‌నగర్ | 16.6 |
| దుండిగల్ | 17.8 |

## తెలుగుభాష అభివృద్ధికి కృషి చేసిన సీపీ బ్రౌన్


సీపీ బ్రౌన్‌కు నివాళులర్పిస్తున్న జయసూర్య, కళాజనార్దన మూర్తి, వెంకటరెడ్డి, షహనాజ్ బేగం

చిక్కడపల్లి: మాతృభాష ఆంగ్లం అయినప్పటికీ.. బ్రిటిష్ అధికారిగా తెలుగు నెలపై విధులు నిర్వర్తిస్తున్న సందర్భంలో సీపీ బ్రౌన్ తెలుగు భాషపై ఆసక్తితో భాషాభివృద్ధికి విశేష కృషి చేశారని ప్రముఖ జర్నలిస్టు జయసూర్య కొనియాడారు. బ్రౌన్ తెలుగు భాష ప్రేమికుడు అని అభివర్ణించారు. త్యాగరాయ గానసభలోని కళాదీక్షితులు కళా వేదికపై గానసభ నిర్వహిస్తున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా సీపీ బ్రౌన్ యాదిలో సంస్మరణ సమావేశం సోమవారం నిర్వహించారు. జయసూర్య మాట్లాడుతూ వేమన శతక పద్యాలు సమగ్రంగా సేకరించే నిమిత్తం ఎందరో పండితులను సంప్రదించారని గుర్తుచేశారు. తెలుగు భాష కోసం తన ఆదాయంలో కొంత భాగం వెచ్చించి భాషావేత్తల సలహాలు తీసుకుని నిఘంటువు వెలువరించిన మహనీయుడు బ్రౌన్ అని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దన మూర్తి అధ్యక్షత వహించిన సభలో గుదిబండి వెంకటరెడ్డి సాహితీవేత్త షహనాజ్ బేగం, కాంగ్రెస్ నాయకులు శ్రీమణి, గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి పాల్గొన్నారు.

## పీసీబీతో కలిసి పని చేయనున్న హైడ్రా

- మెంబర్ సెక్రటరీతో భేటీ అయిన రంగనాథ్
- పారిశ్రామిక వ్యర్థాలపై సంయుక్త నిఘాకు నిర్ణయం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చెరువుల పరిరక్షణలో భాగంగా హైడ్రా అధికారులు కాలుష్య నియంత్రణ మండలితో (పీసీబీ) కలిసి పని చేయనున్నారు. దీనికి సంబంధించిన కీలక భేటీ సోమవారం సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయంలో జరిగింది. ఇందులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, పీసీబీ మెంబర్ సెక్రటరీ జి.రవి సహా కీలకాధికారులు పాల్గొన్నారు. చెరువుల్లోకి మురుగు నీరు, వరద నీటి కాలువలోకి పారిశ్రామిక వ్యర్థాలు వచ్చి కలుషితం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. పారిశ్రామిక వ్యర్థాలు అనధికారికంగా ఎక్కడా డంప్ కాకుండా చూసేందుకు ఇరు విభాగాల సిబ్బంది పటిష్ట నిఘా ఉంచనున్నారు. చెరువులు, కాలువల్లో పారిశ్రామిక వ్యర్థాలు కలుస్తున్నాయా? లేదా? అనే విషయం తేల్చడానికి మీటర్లు పెట్టి పరీక్షించ గలిగే, ఆ వ్యర్థాలు ఏ కంపెనీకి చెందినవనే విషయాన్ని గుర్తించగలిగే వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. పరిశ్రమల వర్గాలతో సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలు కచ్చితంగా పాటించేలా అవగాహన కల్పించడంతో పాటు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. స్థానికులు, పర్యావరణ వేత్తలు, విద్యార్థులతో చెరువుల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు వారి భాగస్వామ్యంతో కాలుష్యానికి చెక్ చెట్టాలని నిర్ణయించారు. కాలుష్యానికి సంబంధించిన కేసులు, ఫిర్యాదులను లోతుగా విచారించి చర్యలు తీసుకోనున్నారు.

**చెరువుల్లో కలుషిత నీటిని కలిపితే.. కఠిన చర్యలు**

చెరువుల్లో కలుషితం నీటిని వదిలితే కఠిన చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. చందానగర్ డివిజన్ పరిధిలోని భక్షికుంట సమీపంలో కొందరు బిల్డర్లు షెడ్లు వేసి నిర్మాణదారులు వ్యర్థాలను కలుషిత నీటిని చెరువులో కలుపుతున్నారని మా దృష్టికి వచ్చిందని, దీంతో పరిశీలించడం జరిగిందన్నారు. 15 రోజుల్లో కలుషితనీరు రాకుండా ఏర్పాటు చేసుకోవాలని షెడ్డు నిర్మాణాదారులకు సూచించడం జరిగిందని తెలిపారు. మళ్లీ చెరువులో కలుషిత జలాలను కలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు, ఆనంద్ మల్లిగావార్డు ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్‌రే కావాలా.. రెండు రోజులు ఆగాల్సిందే..

### గాంధీలో మూలనపడ్డ ఎక్స్‌రే మెషిన్లు

- ఏడింటిలో పనిచేయని యంత్రాలు ఐదు
- ఆరునెలలుగా రెండింటితో నెట్టుకొస్తున్న వైనం
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నిరుపేద రోగులు


ఎక్స్‌రే కోసం బారులు తీరిన రోగులు

గాంధీఆస్పత్రి: తెలంగాణ వైద్యప్రదాయిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఎక్స్‌రే మెషిన్లు పనిచేయకపోవడంతో సరైన వైద్యం అందక నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ ఉదాసీన వైఖరి రోగుల పాలిట శాపంగా మారింది. గాంధీ ఆస్పత్రి రేడియాలజీ విభాగంలో మొత్తం ఏడు ఎక్స్‌రే మెషిన్లు ఉండగా వాటిలో ఐదు యంత్రాలు కొన్ని నెలలుగా మూలన పడ్డాయి. కేవలం రెండు మెషిన్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో ఎక్స్‌రే కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రమాదాలకు గురై గాంధీ అత్యవసర విభాగానికి ప్రతిరోజూ సుమారు 150 మంది వస్తుంటారు. వీరికి ఎక్స్‌రే తప్పనిసరి. ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, ఇతర విభాగాలకు చెందిన సుమారు 250 మంది ఇన్, అవుట్ పేషెంట్లకు సంబంధిత వైద్యులు ఎక్స్‌రే ద్వారా వైద్యసేవలు అందిస్తుంటారు.

**నాలుగున్న వేల మందికి రెండు ఎక్స్‌రే యంత్రాలు**

రెండు వేలు ఇన్ పేషెంట్లు, రెండున్నర వేల అవుట్ పేషెంట్లు, ప్రాణాపాయస్థితిలో అత్యవసర విభాగానికి వచ్చే రోగులకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ప్రతిరోజూ వైద్యం అందిస్తుంటారు. మొత్తం నాలుగున్న వేల మందికి కేవలం రెండు ఎక్స్‌రే మెషిన్లే అందుబాటులో ఉన్నాయి. ఓపీకి వచ్చే నిరుపేద రోగులు రోజుల తరబడి ఎక్స్‌రే కోసం వేచి ఉండలేక ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. గాంధీ రేడియాలజీ, ఓపీ సెంట్రల్ ల్యాబోరేటరీలో 1000 ఎంఏ డీఆర్ మెషిన్లు రెండు ఉన్నాయి. వీటిలో ఒకటి కొన్ని నెలలుగా పనిచేయడంలేదు. పన్నెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన 500 ఎంఏ, ఇతర మిషన్లు ఐదు ఉండగా, వీటిలో ఒకటి మాత్రమే పనిచేస్తోంది. ఆయా యంత్రాల కాలపరిమితి ముగిసి తరచూ మొరాయిస్తున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

**బకాయిలు చెల్లిస్తేనే మరమ్మతులు**

గాంధీ రేడియాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే మెషిన్లకు ఆయా కంపెనీలే యాన్యువల్ మెయింటనెన్స్ కాంట్రాక్టు(ఏఎంసీ) నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తాయి. ఆయా సంస్థలకు కొన్నేళ్లుగా ఏఎంసీ బకాయిలు చెల్లించలేదని తెలిసింది. పాత బకాయిలు చెల్లిస్తేనే యంత్రాలకు మరమ్మతులు చేస్తామని ఆయా సంస్థలు చెప్పడంతో మరమ్మతుల్లో తీవ్ర జాప్యం నెలకొన్నట్లు ఆస్పత్రికి చెందిన ఓ అధికారి తెలిపారు. తక్షణమే ప్రభుత్వంతో పాటు వైద్యమంత్రి, ఉన్నతాధికారులు, ఆస్పత్రి పాలన యంత్రాంగం స్పందించి కాలం చెల్లిన ఎక్స్‌రే మిషన్ల స్థానంలో అత్యాధునిక ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటు చేయాలని నిరుపేద రోగులు కోరుతున్నారు.

**రెండు వారాల్లో అందుబాటులోకి..**

రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే మెషిన్లు మరమ్మతుల అంశం వైద్యమంత్రి దృష్టిలో ఉంది. ఆయా సంస్థ యాజమాన్యాలతో చర్చించాం. స్పెయిన్‌తో పాటు ముంబై నుంచి కొన్ని పార్టులు(యంత్ర విడిభాగాలు) రావాల్సి ఉంది. అవి వచ్చిన వెంటనే మరమ్మతులు చేపట్టి రెండు వారాల్లో ఎక్స్‌రే యంత్రాలను అందుబాటులోకి తెస్తాం. రోగులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాం. అదనపు సిబ్బందిని నియమించి ఎక్స్‌రే విభాగ సమయాన్ని పెంచాం.

– ప్రొఫెసర్ రాజకుమారి, గాంధీ సూపరింటెండెంట్



INTERNATIONAL MENSDAY November 19

మాతృదినోత్సవం.. బాలల దినోత్సవం.. మహిళా దినోత్సవం.. ఇలా ఎన్నో రోజులు.. పండుగలను ఎంతో ఘనంగా జరుపుకొంటుంటాం. పురుషుల కోసం కూడా ప్రత్యేకంగా ఓ రోజు ఉంది. అదే ఏటా నవంబర్ 19న అంతర్జాతీయంగా జరుపుకోవాలని అందరూ సంకల్పం చెప్పకొన్నారు. కానీ మహిళా దినోత్సవం మాదిరిగా పురుషుల దినోత్సవానికి పెద్దగా ప్రత్యేకత ఉండదు. వాస్తవానికి చాలాకాలం నుంచి పురుషులకూ అంకితమైన రోజు ఒకటి ఉందని చాలా మందికి తెలియదు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి చాలా ఏళ్ల చరిత్ర ఉన్నట్టే.. పురుషుల దినోత్సవానికీ ఓ చరిత్ర ఉంది. 1969 నుంచే అంతర్జాతీయ పురుషుల దినోత్సవం అనే కాన్సెప్ట్ మనుగడలో ఉంది. పైగా మిగతా దినోత్సవాలను గొప్పగా జరిపే మగవాళ్లు తమ కోసం ప్రత్యేకంగా ఉన్న రోజును మాత్రం పెద్దగా పట్టించుకోరని చెప్పకోవచ్చు. ఎంతసేపూ మిగతా వారి గురించి ఆలోచిస్తారే తప్ప తమ గురించి ఆలోచించుకోరు. అందుకే వారి త్యాగాన్ని గుర్తిస్తూ.. పురుషులకు ఈ రోజును కేటాయించారు. - సాక్షి, సిటీబ్యూరో

# బీ ది మెన్.. బీ ది బ్రేవ్!

## నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



హైదరాబాద్ వైబ్స్

### అనేక ఒత్తిళ్లు అధిగమిస్తూ..

రకరకాల వేధింపుల సంగతి పక్కనపెడితే..ఉద్యోగాలు, వ్యాపారాలు, పని ప్రదేశాల్లో వీరు ఎదుర్కొనే ఒత్తిళ్లు తక్కువేమీ కాదు.. మహిళలు చెప్పుకున్నంత తేలికగా మగవారు బయటపడలేరు. దీంతో పాటు కుటుంబ భారం, ఆర్థిక పరిస్థితులు వంటి ఇతరత్రా ఒత్తిళ్ల కారణంగా మానసికంగా పురుషులు అంతకంతకూ బలహీనులుగా మారుతున్నారని పలు సర్వేలు చెబుతున్నాయి. అందుకే ఆత్మహత్యల విషయంలో మహిళల కన్నా పురుషుల్లోనే 3 రెట్లు ఎక్కువ కనిపిస్తుంది.

### వెలుగు చూడనివెన్నో...

ఎక్కడ చూసినా మహిళాభివృద్ధి, సంక్షేమం గురించే మాట్లాడుతుంటాం. పురుషుల హక్కులు, వారి రక్షణ గురించి చివరికి పురుషులే పట్టించుకోరు. ఎవరైనా ముందడుగేసి చెప్పుకున్నా..! చిన్నచూపు చూస్తారు. లేదా సమాజంలో గౌరవం పోతుందని బయటపెట్టని, వెలుగు చూడని ఘటనలు లేకపోలేదు. ఈ విషయాన్ని పలు అంతర్జాతీయ, జాతీయ సంస్థల సర్వేలు సైతం తేటతెల్లం చేస్తున్నాయి. చిన్న వయసులో బాలల పై జరిగే లైంగిక దాడుల్లో ఆడపిల్లలపై జరిగే దాడులు 45 శాతం కాగా, మగ పిల్లలపై జరిగేవి 55 శాతంగా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వీటిపై ఎవరూ మాట్లాడరు.

**పురుషుల హక్కుల కోసమూ పోరాడాల్సిన పరిస్థితి**

**ఎన్నో ఏళ్లుగా మెన్స్ డే ఉన్నా సమాజానికి పట్టని వైనం**

**మగవారి త్యాగాల గురించి మగవారే కితాబిచ్చుకోవాలి**



ఏటా నవంబర్ 19న అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ పురుషుల దినోత్సవం జరుపుతారు. 1992 ఫిబ్రవరి 7న ప్రొఫెసర్ థామస్ ఓస్టర్ ఈ రోజును ప్రారంభించినా.. ట్రినిడాడ్, టొబాగో దేశస్తులు ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. దక్షిణ ఐరోపాకు చెందిన మాల్టా దీవిలో ఈ ఉత్సవాన్ని 1994 ఫిబ్రవరి 7 నుంచి క్రమం తప్పకుండా జరుపుతున్నారు. ఐక్యరాజ్య సమితి ఆమోదంతో మొదట 1999లో ట్రినిడాడ్ టొబాగోకు చెందిన వైద్యుడు డాక్టర్ జెరోమ్ టీలక్సింగ్ అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని పునఃప్రారంభించారు. ఈ రోజున ప్రపంచంలోని మగవారంతా.. మగవారిని మెచ్చుకుంటారు. వారి శ్రమ, కృషిని ప్రశంసిస్తారు. మగవారి ద్వారా ఈ ప్రపంచం ఎలా ముందుకు వెళ్తున్నదో చర్చిస్తారు. సమాజంలో మగవాళ్ల పాత్ర ఎలా ఉందో చెప్పుకుంటారు. అలాగే సమాజానికి మేలు చేసిన గొప్ప గొప్ప పురుషులను ఈ రోజున కీర్తిస్తారు. వారిని రోల్ మోడల్స్‌గా భావిస్తూ.. వారు సమాజానికి చేసిన సేవల్ని చెబుతారు.

### మన దగ్గర పుట్టి 18 ఏళ్లు..

భారత దేశంలోని పురుషుల హక్కుల సాధనా సంస్థ సేవ్ ఇండియన్ ఫ్యామిలీ (సిఫ్) నవంబర్ 19, 2007న దేశంలో మొదట ఈ వేడుకను నిర్వహించారు. అప్పటికే 498 చట్టం కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న పురుషుల పుణ్యమానీ ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో అప్పటి నుంచీ దీన్ని ఏటా కొనసాగిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సేవ్ ఇండియన్ ఫ్యామిలీకి దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ శాఖలు ఉన్నాయి. పురుషుల హక్కుల కోసం సిఫ్ ఆధ్వర్యంలో 24/7 కాల్ సెంటర్ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అనేక అంశాల్లో పురుషుల హక్కుల గురించి సిఫ్ ఉద్యమిస్తోంది.

### పెరుగుతున్న డ్రాప్ అవుట్స్..

అన్ని విషయాల మాదిరిగానే చదువులోనూ గత కొంత కాలంగా మగపిల్లల్లో డ్రాప్ అవుట్స్ పెరిగిపోతున్నారు. ఆర్థిక స్థితిగతులు, కుటుంబ పోషణ భారం వంటి కారణాలు, మగపిల్లాడు ఎలాగైనా బతికేస్తాడు.. అనే నిర్లక్ష్యంతో చదువుకు దూరమవుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీనికితోడు మగవారిపై జరిగే గృహహింసను ఎవరూ పట్టించుకోరు. నూటికి 80 శాతం ఘటనలు వెలుగు చూడవు అంటే అతిశయోక్తి లేదు.

### చుట్టుముడుతున్న ఆరోగ్య సమస్యలు..

పెరుగుతున్న ఖర్చులు, ఆర్థిక భారాలు మగవారిని మానసిక బలహీనులుగా మారుస్తున్నాయి. ఎప్పుడు ఊడతాయో తెలియని ఉద్యోగాలు, మరోవైపు పెరుగుతున్న ఖర్చులు, అటూ ఇటూ కాని జీతాలు వంటి సమస్యలతో అనేక రోగాలపాలవుతున్నారు. దీంతో బీపీ, మధుమేహం, గుండె జబ్బులు తదితర ఆరోగ్య సమస్యలతో పురుషులు సతమతమవుతున్నారు. అయినా ముఖంపై చెదరని చిరునవ్వుతో కుటుంబ బాధ్యతలను నెత్తిన వేసుకుని బాధ్యగా మెలిగే మగవారికి హ్యాపీ మెన్స్ డే..







# ట్రెండీ టాటూస్.. బ్యూటీ లుక్స్..

**యునిసెక్స్ సెలూన్ ప్రారంభించిన వర్ష**

సాక్షి, సిటీబ్యూరో: బ్యూటీ, అధునాతన ఫ్యాషన్ హంగులతో పాటు ట్రెండీ టాటూస్ కూడా ఈ తరం పోష్ కల్చర్‌లో భాగమయ్యాయని జబర్దస్త్ ఫేమ్, ప్రముఖ టెలివిజన్ నటి వర్ష తెలిపారు. మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన అనిక్ యునిసెక్స్ బ్యూటీ సెలూన్, టాటూస్ సెలూన్‌ను వర్ష ప్రారంభించారు. మహిళలు అమితంగా ఇష్టపడే బ్యూటీ, టాటూ సేవలు ఒకే వేదికలో అందించడమే కాకుండా గ్లోబల్ వేదికగా ఈ తరం అనుసరిస్తున్న టిప్స్‌తో సౌందర్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. టాటూ ఆర్టిస్ట్రీ, నెయిల్ సర్వీసెస్, నాణ్యతగల సౌందర్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి అంకితభావంతో కృషి చేస్తున్నామని ఫ్రాంచైజ్ యజమాని అనిల్ తెలిపారు. అత్యాధునిక ట్యాగ్‌లు, ఫ్యాషన్ అవసరాలు తీర్చడానికి వన్-స్టాప్ షాప్, ఇక్కడి క్యూరేటెడ్ సేకరణలో టర్కీ, వియత్నాం నుంచి దిగుమతి చేసుకున్న ప్రీమియం దుస్తులు, ఉపకరణాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఏఐ లీగల్ టెక్నాలజీ..

# ఇంటరాక్ట్

సాక్షి, సిటీబ్యూరో: న్యాయవాద వృత్తి నిపుణులకు ఉపకరించే అత్యాధునిక లీగల్ టెక్నాలజీ ఉత్పత్తులకు పేరొందిన లెక్సిలెగిస్ ఏఐ ఇంటరాక్ట్ పేరుతో సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ఇదొక శక్తివంతమైన రీసెర్చ్ టూల్‌గా పేర్కొన్నారు. దీని ద్వారా న్యాయశాస్త్ర నిపుణులు తమ విభిన్న రకాల డాక్యుమెంట్లను విశ్లేషించడానికి, పోల్చుకోవడానికి, ఏఐని ఉపయోగించి అనవసరమైనవి కాక కీలకమైన సమాచారాన్ని క్రోడీకరించుకోవడానికి, అనువాదానికి.. ఇలా విభిన్న రకాలుగా ఉపకరిస్తుందని వివరించారు.

# ఈవీ కార్ల అమ్మకాల్లో రికార్డ్..

**నగరంలోని రామ్ గ్రూప్ కార్యాలయంలో వేడుకలు..**

సాక్షి, సిటీబ్యూరో: కేవలం 50 రోజుల్లో రెండు వందల విండ్సర్ ఈవీ కార్లు అమ్మిన సందర్భంగా నగరంలోని రామ్ గ్రూప్ కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. నవంబర్ 17న ఏకంగా వంద ఎమ్‌జీ విండ్సర్ కార్లను అమ్మి దేశంలోనే అత్యధిక ఈవీ వాహనాలు అమ్మిన గ్రూప్‌గా రామ్ గ్రూప్ నిలిచిందని సంస్థ దక్షిణ జోనల్ సేల్స్ హెడ్ సౌరవ్ తెలిపారు. తెలంగాణలో వినియోగదారుల డిమాండ్ తీర్చడానికి నెలకు 800 నుంచి 1000 వాహనాలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. గత నెల్లో విండ్సర్ ఈవీ నిష్పత్తి విభాగంలో అత్యధిక మార్కెట్ షేర్‌ను సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ గ్రూప్ సీఈఓ అభినంద్, రామ్ గ్రూప్ ఎంజీ సీఈఓ శివ తేజ పాల్గొన్నారు.




మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ) క్రీడలో సిటీ కుర్రాడు సత్తా చాటుతున్నాడు. ప్రత్యర్థులపై పంచ్‌లతో రెచ్చిపోతున్నాడు. ఓవైపు బీటెక్ చదువును కొనసాగిస్తూనే.. వీలు చిక్కినప్పడల్లా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటూ క్రీడల్లో రాణిస్తున్నాడు. అతడే మోహిత్. ఇప్పటికే ఏకంగా ఏడు బంగారు పతకాలు కైవసమయ్యాయంటే అతని పంచ్ పవరేంటో అర్థం చేసుకోవచ్చు. - సాక్షి, సిటీబ్యూరో

# లోకల్ లైగర్!

## మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో సిటీ కుర్రాడి సత్తా

**ఇప్పటికే ఏడు బంగారు పతకాలు కైవసం**

**పంచ్‌లతో ప్రత్యర్థులను చిత్తు చేస్తున్న మోహిత్**



పీర్జాదిగూడలోని మేడిపల్లి ఏపీ ఇన్ఫో ప్రైడ్‌లో నివాసముంటున్న ఎస్ మోహిత్‌కు చిన్నతనం నుంచే క్రీడలంటే అమితాసక్తి. దీంతో అతని పేరెంట్స్ స్కూల్లో తైక్వాండో శిక్షణలో చేర్పించారు. దీంతో పాఠశాల స్థాయిలోనే అనేక పోటీల్లో మెడల్స్ సాధించాడు. యుక్త వయసులోకి వచ్చాక తైక్వాండో నుంచి ఎంఎంఏ వైపు ఆసక్తి మళ్లింది. దీంతో గ్రాప్లింగ్ (రెజ్లింగ్) శిక్షణ మొదలుపెట్టాడు. బీటెక్ చదువుతూనే సాయంత్రం వేళ నారాయణగూడలో శిక్షణ ప్రారంభించాడు. రెజ్లింగ్, బాక్సింగ్, కరాటే, తైక్వాండో, స్ట్రైకింగ్ వంటి కొట్లాట క్రీడలను మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ అంటారు.

**తైక్వాండో నుంచి ఎంఎంఏ..**



### యూట్యూబ్‌లో టెక్నికల్ స్కిల్స్..

గతేడాది సర్దార్ పటేల్ కేసరిగా పిలిచే జిల్లా స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ సమయంలో బీటెక్ పరీక్షల కారణంగా ప్రాక్టీస్‌కు పెద్దగా టైం దొరకలేదు. దీంతో యూట్యూబ్‌లో మునుపటి మ్యాచ్‌లు, ఎంఎంఏ ప్రొఫెషనల్స్ అస్లల్ జుబ్లీ, అలెక్స్ పెరీరా వీడియోలను చూసి, టెక్నికల్ స్కిల్స్ ప్రాక్టీస్ చేశాడు. ఈ పోటీలో 90 కిలోల కేటగిరిలో పాల్గొని, మహారాష్ట్ర ప్రత్యర్థులను చిత్తు చేసి బంగారు పతకం సాధించాడు. ఈ ఏడాది ఓపెన్ కిక్‌బాక్సింగ్ టోర్నమెంట్‌లో స్వర్ణం గెలిచిన తర్వాత బెల్ట్ మ్యాచ్ కోసం పోటీపడ్డాడు. ప్రత్యర్థి తన కంటే 5–6 కిలోల బరువు ఎక్కువగానే ఉన్నాడు. అయినా సరే నైపుణ్యం, దృఢ సంకల్పంతో మ్యాచ్‌లో ప్రత్యర్థిని రెండు సార్లు నాకౌట్‌తో పడగొట్టగలిగాడు.

### ఇండియాకు ప్రాతినిధ్యం నా లక్ష్యం..

చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడలు కూడా తప్పనిసరిగా నేర్చుకోవాలి. దీంతో శారీరకంగా, మానసికంగా చురుగ్గా ఉంటారు. ఎంఎంఏ క్రీడ శిక్షణ, మార్గదర్శకత్వం చేయడంతో పాటు ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించాలన్నదే నా లక్ష్యం. - మోహిత్

# 3 రోజులు.. 3 వేల కాస్ ప్లేయర్లు

## ముగిసిన కామిక్ కాన్ 2024..

సాక్షి, సిటీబ్యూరో: కేవలం 3 రోజుల కార్యక్రమం.. కానీ 3 వేల మంది కాస్‌ప్లేయర్లు, వారి ప్రదర్శనలు వీక్షించడానికి దాదాపు 40 వేల మంది అభిమానులు. ఇదెక్కడో కాదు.. నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా క్రంచైరోల్ నిర్వహించిన హైదరాబాద్ కామిక్ కాన్–2024 కార్యక్రమానికి లభించిన స్పందన. దేశంలోనే అతిపెద్ద పాప్ కల్చర్ ఈవెంట్‌గా గుర్తింపు పొందడమే కాకుండా వేల మంది కాస్‌ప్లేయర్, కామిక్ లవర్స్‌ను అలరించింది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా మారుతి సుజుకి అరేనా హైదరాబాద్ కామిక్ కాన్ – 2024 8వ ఎడిషన్ నగరంలో ఎపిక్ కాస్‌ప్లే, గేమింగ్, పాప్ కల్చర్‌తో పాటు కామిక్ పుస్తకాలు, మాంగా, యానిమే, సూపర్ హీరో చలనచిత్రాలు తదితర వినోదభరిత కమ్యూనిటీలను ఒకే వేదిక పైకి చేర్చింది.

### పవర్ ప్యాక్డ్ ప్రదర్శనలు..

ప్రముఖ కళాకారులు కరణ్ కాంచన్, గీక్ ఫ్రూట్, డైసుకి కాస్‌ప్లే బ్యాండ్ వారి పవర్ ప్యాక్డ్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. హైదరాబాద్ కు ఇష్టమైన సయ్యద్ బషార్‌తో పాటు హర్ష్ గుజ్రాల్, అజీమ్ బనాత్వాల్లా, రవి గుప్తా వంటి ఫేమస్ హాస్యనటులు వేదికపై నవ్వుల సునామీ సృష్టించారు. ముఖ్యంగా అంతర్జాతీయ హాస్య పుస్తక రచయిత జోష్ బ్లేలాక్ హాజరవడం విశేషం. అమర్ చిత్ర కథ, బృందాకవి, ఆల్ఫా కామిక్స్, టెర్రా బై త్రిష్లా, చిత్ర ఛాయా, పెంగ్విన్ రాండమ్ హౌస్ వంటి భారతీయ కామిక్స్ ప్రదర్శనలో అలరించాయి.






### ప్రతి పంచ్ ఆస్వాదించారు

ఇది ఒక అద్భుత వేదిక, ఢిల్లీ కామిక్ కాన్ తర్వాత మళ్లీ ఇక్కడ ప్రదర్శన ఇవ్వడం సంతృప్తిగా ఉంది. ప్రతి ఒక్కరూ శ్రద్ధగా, ఆసక్తిగా ప్రతి పంచ్ ఆస్వాదిస్తున్నారు. ఇప్పటివరకూ నగరంలో 50 పైగా ప్రదర్శనలు చేశాను. నాకిష్టమైన నగరాల్లో హైదరాబాద్ ప్రధానమైనది. - హర్ష్ గుజ్రాల్, ప్రముఖ హాస్యనటుడు

### ఇదే మొదటిసారి..

నా సొంత నగరంలో ప్రదర్శన ఇవ్వడం, ఈ గొప్ప పాప్–కల్చర్ మహోత్సవాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. కాస్‌ప్లేను ఇష్టపడ్డాను కానీ వాటిని ఇంత పెద్ద సంఖ్యలో చూడటం ఇదే మొదటిసారి. నోడ్విన్ డ్రీమ్ హాక్ కొన్ని అద్భుతమైన గేమింగ్ జోన్లను ఏర్పాటు చేయడం ఆకట్టుకుంది. - సయ్యద్ బషార్, స్టాండ్-అప్ కమెడియన్




విద్యుత్ దీపాల వెలుగుల్లో కాళోజీ కళాక్షేత్రం

# కళామ తల్లికి దివ్య మణిహారం

ఆధునిక హంగులతో వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రం
నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
రాష్ట్ర సాంస్కృతిక రంగంలో ఇదో మైలురాయి

హనుమకొండ అర్బన్: కళామతల్లి శిఖలో మరో మణిహారం కొలువుదీరనుంది. కళల కాణాచి వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత ప్రజా కవి కాళోజీ నారాయణరావు విగ్రహాన్ని కూడా ఆవిష్కరించనున్నారు. అధునాతన హంగులు, రాజసం ఉట్టిపడేలా రూ.95 కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణం ఆకట్టుకుంటోంది. తెలంగాణ కళా, సాంస్కృతిక రంగానికి ఈ క్షేత్రం ఓ మణిహారంగా మారనుంది.





**ప్రధాన ఆకర్షణలివీ..**

- హనుమకొండ బాలసముద్రంలోని సర్వే నంబర్ 1066 'కుడా' (హయగ్రీవాచారి కాంపౌండ్) భూమిలో 4.20 ఎకరాల్లో నిర్మించారు.
- 1.77 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు.
- 1,127 మందితో ప్రధాన ఆడిటోరియం సీటింగ్ సామర్థ్యం
- సెంట్రలైజ్డ్ ఏసీతో అత్యాధునిక ఆడియో, విజువల్ సిస్టమ్‌తో ప్రదర్శనలు
- చిన్న చిన్న సాంస్కృతిక సమావేశాల కోసం ప్రత్యేకంగా నాలుగు మినీ హాళ్లు
- గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇందులో కాళోజీ నారాయణరావు ఫొటోలు, జ్ఞాపకాలు, పురస్కారాలను ప్రదర్శిస్తారు.

## బీఆర్ఎస్ నేత కొణతం దిలీప్ అరెస్ట్.. విడుదల

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారంటూ కేసు
- రిమాండ్ తిరస్కరించిన కోర్టు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతు న్నారన్న ఆరోపణలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బీఆర్ఎస్ నాయకుడు కొణతం దిలీప్‌ను సోమవారం అరెస్టు చేశారు. ఈయన గతంలో ప్రభుత్వ డిజిటల్ మీడియా విభాగం డైరెక్టర్‌గానూ పనిచేశారు. దిలీప్‌పై సైబర్ క్రైమ్ ఠాణాలో ఇప్ప టికే నమోదై ఉన్న కేసుకు పోలీసులు అదనపు సెక్షన్లు జోడించి.. అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. 'తెలుగు స్క్రైబ్, అబ్బాసాయిరామ్01, అశోక్‌రెడ్డి ఎస్ఎల్‌జీ' అనే 'ఎక్స్' హ్యాండిల్స్‌లో రాజకీయ ఉద్రిక్తతలను పెంచేలా, ప్రజల మధ్య అశాంతిని రగిల్చేలా పోస్టులు పెట్టారంటూ ఆదర్శ నగర్‌కు చెందిన సంజీవరెడ్డి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వాన్ని అవమానపరిచేవిధంగానూ పోస్టులు చేశారన్నారు. దీని ఆధారంగా పోలీసులు సెప్టెంబర్ 28న ఐటీ యాక్ట్‌లోని 67 సెక్షన్‌తోపాటు బీఎన్ఎస్ 353(1)(బీ), 353(2), 352, 193, 196 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువైతే గరిష్టంగా ఐదేళ్ల శిక్ష పడుతుంది. ఏడేళ్లలోపు శిక్షపడే కేసుల్లో నోటీసులు ఇవ్వడం మినహా అరెస్టు చేసే అవకాశం లేదు. రెండు నెలల క్రితం దిలీప్‌పై నమోదైన ఓ కేసులోనూ పోలీసులు తొలుత అరెస్టు చేయాలని భావించినా... చివరకు నోటీసులే ఇచ్చారు. తాజా కేసులో మాత్రం పోలీసులు తమ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ఆధారంగా అదనపు సెక్షన్లు జోడించారు. దీంతో 336(4) (ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్స్ ఫోర్జరీ), 61(2)(ఎ) (కుట్ర), 111 (బీ) (ఆర్గనైజ్డ్ క్రైమ్) సెక్షన్లు కొత్తగా చేరాయి. ఈ కేసులో నేరం రుజువైతే ఫోర్జరీకి అత్యధికంగా ఏడేళ్లు, కుట్ర కేసులో జీవిత ఖైదు పడే అవకాశాలుండటంతో పోలీసులకు దిలీప్‌ను అరెస్టు చేసే అవకాశం దొరికింది. దీంతో పోలీసులు సోమవారం దిలీప్‌ను సైబర్ క్రైమ్ ఠాణాకు రప్పించి అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఇంటి వద్ద హాజరు పరి చారు. జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని కోరగా, న్యాయమూర్తి తిరస్కరించారు. దీంతో పోలీసులు దిలీప్‌కు నోటీసులు ఇచ్చి విడుదల చేశారు.

**ప్రశ్నిస్తే సంకెళ్లు.. నిలదీస్తే అరెస్టులు: కేటీఆర్**

రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సంకెళ్లు, నిలదీస్తే అరెస్టులు అనే రీతిలో పాలన సాగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కొణతం దిలీప్ అరెస్టును ఖండించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ రోజులేనని మరోసారి ఈ అక్రమ అరెస్టు రుజువు చేసిందన్నారు. ప్రభుత్వం కక్షపూరిత, ప్రతీకార చర్యలను మానుకోవాలని హరీశ్‌రావు హితవు పలికారు.

## వాతలపై వాకౌట్

- మీరు హామీ ఇచ్చినట్లుగా విద్యుత్తు చార్జీలను తగ్గించకపోగా.. ప్రజలపై రూ.17 వేల కోట్లకుపైగా కరెంట్ భారం వేస్తారా?
- అప్పులపైనా అడ్డగోలుగా అబద్ధాలు చెబుతారా?.. ఇది మోసాల బడ్జెట్
- సర్కారును మండలిలో నిలదీసిన విపక్ష వైఎస్సార్‌సీపీ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

# పోరుగడ్డ నుంచి విజయోత్సవాలు

- నేటి నుంచి కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలన వేడుకలు
- వరంగల్ సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి రేవంత్

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 19 నుంచి ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం వరంగల్‌లో ప్రారంభమయ్యే ఈ వేడుకలు ఏడాది పాటు సాగనున్నాయి. ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రచారం సాగించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల అధికార యంత్రాంగానికి ఆదేశాలు వెళ్లాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తమ పరిధిలో ఈ కార్యక్రమాలు నిర్వహించేలా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. తొలిరోజు వరంగల్‌లో జరిగే ప్రజా విజయోత్సవాల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొననున్నారు. బుధవారం సిరిసిల్ల జిల్లా వేములవాడ, గురువారం మహబూబ్‌నగర్‌లో జరిగే కార్యక్రమాల్లో కూడా సీఎం పాల్గొననున్నారు. బహిరంగ సభలు జరిగే ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

**వరంగల్‌లో లక్షమందితో సభ**

ప్రజా పాలన విజయోత్సవాలకు ఓరుగల్లు ముస్తాబైంది. లక్ష మంది మహిళలతో మంగళవారం బహిరంగసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేడుకలు నిర్వహించే హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానానికి 'ఇందిరా మహిళా శక్తి ప్రాంగణం'గా నామకరణం చేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, ధనసరి సీతక్క, కొండ సురేఖ సహా మరికొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొననున్నారు.

**సీఎం షెడ్యూల్ ఇదీ..**

సీఎం రేవంత్ మధ్యాహ్నం 2:30 గంటలకు హెలికాప్టర్‌లో హనుమకొండ కుడా గ్రౌండ్స్‌కు చేరుకుంటారు. ముందుగా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఆర్ట్ గ్యాలరీని సందర్శిస్తారు. 3 గంటలకు ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన విజయోత్సవ వేదికకు చేరుకుంటారు. 3:20కి అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించి.. మహిళా స్వయం సహాయక సంఘాలు, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్యల సభ్యులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు అక్కడి నుంచే వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా బ్యాంక్ లింకేజ్ చెక్కులు, బీమా చెక్కులు పంపిణీ చేస్తారు. అనంతరం సాయంత్రం 4:40 సమయంలో బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

# కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ చార్జిషీట్లు

ఏడాది పాలన వైఫల్యాలను ఎత్తిచూపుతూ వచ్చే నెల 1 నుంచి 5 వరకు ఆందోళనలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై చార్జీషీట్లు విడుదల చేయాలని.. వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. వచ్చే నెల (డిసెంబర్) 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో... డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమైంది. రైతులు, మహిళలు, యువత, ఇతర వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏమిటి, వాటిని సరిగా అమలు చేయని తీరుపై నియోజక వర్గ, మండల, గ్రామ స్థాయిల్లో వివిధ రూపాల్లో ప్రచారం చేయాలని నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్ నగర శివార్లలోని బొంగులూరులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీజేపీ రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.

**రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయిల్లో చార్జిషీట్లు..**

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, నియోజక వర్గాల స్థాయిల్లో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఇచ్చిన ఇతర హామీల అమల్లో వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ భావిస్తోంది. డిసెంబర్ 1న రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయిల్లో ఈ మేరకు చార్జిషీట్లను విడుదల చేయనుంది. దీనితోపాటు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించనున్నారు. ప్రభుత్వం హామీలు, అమలు చేయని తీరును తెలుపుతూ జిల్లా కలెక్టర్లు మొదలు తహసీల్దార్ల దాకా మెమోరాండాలు సమర్పించనున్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో మండలాల్లో మోటర్ సైకిల్ యాత్రలు... 4, 5 తేదీల్లో యువ, మహిళా, కిసాన్ తదితర మోర్చాల వారీగా ప్రచార కార్యక్రమాలు చేపడతారు.

**తొలుత పాదయాత్రలు చేయాలనుకున్నా..**

కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను ఎండగట్టేలా డిసెంబర్ 1 నుంచి 7 వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, సభలు నిర్వహించాలని బీజేపీ తొలుత నిర్ణయించింది. కానీ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా నాలుగేళ్లు ఉన్నందున.. ఇప్పుడే పాదయాత్రలు వంటివి చేపట్టడం కంటే వికేంద్రీకరణ పద్ధతుల్లో కార్యాచరణ ప్రణాళిక చేపట్టడం మంచిదనే ఆలోచనకు వచ్చినట్టు బీజేపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. తొలుత సంస్థాగతంగా బలపడటంపై దృష్టి పెట్టనున్నట్టు వెల్లడించారు. బీజేపీ వర్క్‌షాపులో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డి.ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి, కాసం వెంకటేశ్వర్లు, జిల్లా పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

**'6 గ్యారంటీలు కాదు.. 6 అబద్ధాలు' పేరిట కరపత్రాలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్ధాలతో ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శిస్తూ కరపత్రాలు పంపిణీ చేయాలని బీజేపీ నిర్ణయించింది. వాటిలో మహిళలకు నెలకు రూ.2,500, కల్యాణ లక్ష్మి పథకంలో అదనంగా తులం బంగారం, ఇతర హామీల అమలు నుంచి వెనక్కి వెళ్లడం, రైతుభరోసా, రూ.4 వేల నిరుద్యోగ భృతి జాడ లేకపోవడం వంటి అంశాలను ప్రస్తావించనుంది. ఇక ఈ నెలాఖరుకల్లా రాష్ట్రంలో పోలింగ్ బూత్ కమిటీల ఎన్నికలు పూర్తి చేసుకుని.. తర్వాత మండల, జిల్లా కమిటీల ఎన్నికలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. డిసెంబర్ 25 నాటికి రాష్ట్ర కమిటీ ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తోంది.

# వచ్చే ఎన్నికల నాటికి హరీశ్ బీఆర్ఎస్‌లో ఉండరు..

- తండ్రి, కొడుకు, బిడ్డ మాత్రమే ఆ పార్టీలో మిగులుతారు
- రూ.8 లక్షల కోట్ల అప్పుతో కేసీఆర్ తెలంగాణను బజారుకీడ్చారు
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉండదని..మాజీమంత్రి హరీశ్‌రావు కూడా ఆ పార్టీలో ఉండరని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ జోస్యం చెప్పారు. తండ్రీకొడుకు, బిడ్డ తప్ప ఎవ్వరూ బీఆర్ఎస్‌లో ఉండరని వ్యాఖ్యానించారు. సోమవారం సంగారెడ్డిలో జరిగిన పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చిన కేసీఆర్.. తెలంగాణను బజారుకీడ్చారని, అలాంటి రాష్ట్రాన్ని తాము రిపేర్ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రం బంగారు తెలంగాణ కాలేదని, కేవలం కేసీఆర్ కుటుంబమే బంగారు కుటుంబమైందని ఎద్దేవా చేశారు. ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా పనిచేసినన్ని రోజులు కేసీఆర్ ఏనాడు ప్రజలను కలవలేదని, కనీసం మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కలిసిన దాఖలాల్లేవని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో మాత్రం సామాన్య కార్యకర్త సీఎంను కలిసేందుకు వీలుంటుందన్నారు. జనవరిలో మరిన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని వెల్లడించారు. కార్పొరేషన్ల డైరెక్టర్ పోస్టులను త్వరలోనే ఇస్తామన్నారు.

**సీఎంని వ్యతిరేకించినా అది పార్టీ కోసమే..**

కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలోనూ ఉండదని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని వ్యతిరేకించినా అది పార్టీ కోసమే గానీ వ్యక్తిగతం కాదని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకునే బాధ్యత తమలాంటి నాయకులపై ఉందని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం అభివృద్ధి చేశారో హరీశ్‌రావు చెప్పాలని, తాము 11 నెలల్లో చేసిన అభివృద్ధిని చూపించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. ప్రతీ కార్యకర్త కూడా సీఎంను కలిసే వెసులుబాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందన్నారు.

**గతంలో నిరంకుశ పాలన: మంత్రి దామోదర**

తెలంగాణలో గతంలో నిరంకుశపాలన కొనసాగిందని మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, సెట్విన్ కార్పొషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నాయకులు గాలి అనిల్‌కుమార్, నీలం మధు, ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మహేశ్‌గౌడ్‌కు ఇందిరాగాంధీ అవార్డు**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలు మత సామరస్యం, జాతీయ సమైక్యత కోసం కృషి చేస్తూ.. తెలంగాణ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మహేశ్‌గౌడ్‌కు ఇటీవల ఇందిరాగాంధీ ఎక్సలెన్స్ అవార్డు 2024ను ప్రకటించారు. సోమవారం ఫోరం అధ్యక్షుడు రాజనారాయణ ముదిరాజ్ ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తోందన్నారు.

# మోదీజీ.. సవాల్ చేస్తున్నా కమిటీని పంపండి!

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో ప్రచారం చేసిన రేవంత్ సోమవారం పుణేలో మీడియాతో మాట్లాడారు. మోదీ ప్రధాని అయ్యాక కార్పొరేట్ కంపెనీలకు రూ.16 లక్షల కోట్ల అప్పులు మాఫీ చేశారని.. అదే తాము రైతులకు రుణమాఫీ చేస్తే బీజేపీ నేతలు ప్రశ్నించడం ఏమిటని నిలదీశారు.

**హామీలు అమలు చేశాం.. వచ్చి చూడండి**

తెలంగాణలో కాంగ్రెస్ హామీల అమలు విషయంలో ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ''ఇచ్చిన హామీలన్నింటిలో విఫలమైన ప్రధాని మోదీ.. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలోని కాంగ్రెస్ ప్రభుత్వాల హామీలపై ఆరోపణలు చేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేసింది. ఈ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో నేను మోదీకి సవాల్ విసురుతున్నాను. కేంద్ర మంత్రి లేదా కేంద్ర ఉన్నతాధికారి ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసి తెలంగాణకు పంపండి. మేం ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేస్తున్న వివరాలన్నీ వారికి ఇస్తాం. అవసరమైతే వారు హైదరాబాద్‌కు వచ్చేందుకు విమాన ఖర్చులు కూడా మేమే భరిస్తాం. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం సోమవారం ముగిసింది. మంగళవారం బీజేపీ నాయకులు హైదరాబాద్‌కు వస్తే సచివాలయంలో కూర్చోబెట్టి నేను చెప్పిన ప్రతి అంశంపై వివరాలు అందజేస్తా. అందులో ఏవైనా తప్పులు ఉంటే క్షమాపణలు చెబుతా..'' అని చెప్పారు. తమ గ్యారంటీలన్నీ కచ్చితమైనవని, మోదీలా విఫల హామీలు కాదని వ్యాఖ్యానించారు. బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ కాదని.. భారతీయ జూటా (అబద్ధాల) పార్టీ అని అభివర్ణించారు.

# రేవంత్ హిట్ వికెట్

- కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేస్తూ సెల్ఫ్ బౌల్డ్ అయింది
- ఒక్క పేదవాడి ఇల్లూ కూల్చకుండానే మేము అభివృద్ధి చేశాం: హరీశ్‌రావు


'కేసీఆర్' ప్రీ రిలీజ్ వేడుకలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో రాకేశ్ తదితరులు

తుర్కయాంజాల్: పేదల ఇళ్ల జోలికెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి హిట్ వికెట్ అయ్యారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్‌లోని జేబీ క్రికెట్ గ్రౌండ్స్‌లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత మాధవరం నర్సింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ చాంపియన్ ట్రోఫీ– 2024 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హరీశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క పేదవాడి ఇల్లు కూల్చకుండానే తాము అభివృద్ధి చేశామన్నారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేస్తూ సెల్ఫ్ బౌల్డ్ అయిందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు చేసిందని, కాంగ్రెస్ పార్టీ ఏడాదిలో రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కళాశాలల యాజమాన్యాలు డబ్బులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరితే.. 8 శాతం కమీషన్ అడుగుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఒకేఒక్కడు కేసీఆర్: హరీశ్ రావు**

'సహజంగా ఎవరైనా పవర్‌లో ఉన్న పార్టీ కోసం సినిమా తీస్తారు. కానీ, అధికారంలో లేకపోయినా కేసీఆర్‌పై సినిమా తీశాడంటే అది రాకేశ్‌లో ఉన్న ప్రేమ అనుకోవచ్చు, లేకుంటే దమ్ము, ధైర్యం అనుకోవచ్చు. ముఖ్యమంత్రులు వస్తుంటారు.. పోతుంటారు. కానీ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది మాత్రం ఒకేఒక్కడు కేసీఆర్. ఆ అవకాశం ఇంకొకరికి లేదు' అని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. 'జబర్దస్త్' ఫేమ్ రాకింగ్ రాకేశ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్) ప్రీ రిలీజ్ వేడుకలో హరీశ్‌రావు మాట్లాడారు. 'కేసీఆర్‌పై రాకేశ్ ఒక అద్భుతమైన సినిమా తీయడం చాలా సంతోషం. కేసీఆర్ అంటే ఒక చరిత్ర. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాదు.. ఈ రాష్ట్రాన్ని పదేళ్ల పాటు అద్భుతంగా అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు. రజనీకాంత్ ఒకసారి హైదరాబాద్ వచ్చినప్పుడు.. 22 ఏళ్ల తర్వాత నేను ఇక్కడికి వచ్చాను.. నేను హైదరాబాద్‌లో ఉన్నానా? న్యూయార్క్‌లో ఉన్నానా? అని అన్నారు. అంటే కేసీఆర్‌గారు పల్లెల్నీ అభివృద్ధి చేశారు. హైదరాబాద్‌నీ అభివృద్ధి చేశారు.' అని చెప్పారు.

# నేను కాదు.. మీరే గులాములు!

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు అలవాటైంది. తెలంగాణలో నిర్మాణాత్మకమైన రాజకీయాలు నడపాల్సిన బాధ్యత బీజేపీపై ఉంది. మాటలతో మభ్యపెట్టి, ప్రజలను రెచ్చగొట్టి ఎవరూ ఎక్కువ కాలం నిలవలేరు..''అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ సోమవారం రంగారెడ్డి జిల్లాలోని వేద కన్వెన్షన్‌లో 'ప్రభుత్వ ఏడాది పాలన, వైఫల్యాలు'అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. తప్పు డు వాగ్దానాలు, రెచ్చగొట్టే ప్రసంగాలతో అధికారంలోకి వచ్చిన సీఎం, మంత్రులు వెళ్లి మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు.

**ఎక్కడ భూములు అమ్ముదామా అనే ధ్యాసే..**

కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. 365 రోజులైనా అమలు చేయలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్‌లాగే రేవంత్ కూడా వ్యవహరిస్తున్నారని.. సమస్యలపై ప్రశ్నించే వారిపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ''మూసీ ప్రక్షాళనకు రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు చెబుతున్నారు. ఆ నిధులు ఎక్కడి నుంచి తెస్తారు? ఇప్పటికే సామర్థ్యానికి మించి కేసీఆర్ అప్పులు చేశారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడు, ఏ భూములు అమ్ముదామా? ఎక్కడ అప్పులు తీసుకొద్దామా?''అని ఆలోచిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని.. అభివృద్ధి పనులకు టెండర్ వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని ఆరోపించారు. నిర్మాణాత్మకంగా పనిచేసే వారు కాకుండా కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్లు మాత్రమే పనిచేస్తున్నారని విమర్శించారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆ రాష్ట్రాలను దివాలా తీయించిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి వస్తున్న రెవెన్యూలో 50శాతం అప్పుల చెల్లింపులకే సరిపోతోందన్నారు. అంబానీ, అదానీలతో బీజేపీకి సంబంధం లేకపోయినా అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నా సీఎంకు చీమకుట్టినట్టు కూడా లేదని.. ప్రశ్నించే హిందూ సంఘాలపై కేసులు పెడుతున్నారని చెప్పారు.

**బీజేపీ ఎంపీలను అడ్డుకోవడం దారుణం**

'లగచర్ల'బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలను అరెస్ట్ చేయడాన్ని కిషన్‌రెడ్డి ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నిర్వాసితులతో మాట్లాడి, ఒప్పించాల్సిన సర్కారు.. పోలీసులతో గిరిజన బిడ్డలపై దమనకాండకు పాల్పడుతోందని ఆరోపించారు.

# ట్రైసిటీకి మహర్దశ

- వరంగల్ మహానగర అభివృద్ధికి రూ.4,962.47 కోట్లు
- ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కేటాయింపు
- భూగర్భ డ్రైనేజీ, వరద కాలువల పనులకే మెజారిటీ నిధులు
- వేములవాడ రాజరాజేశ్వరుడి క్షేత్రం అభివృద్ధికి రూ.127.65 కోట్లు

సాక్షి, హైదరాబాద్: వరంగల్, హనుమకొండ, ఖాజీపేట ట్రైసిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా కేటాయింపులు చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాల్లో భాగంగా వరంగల్ మహానగర అభివృద్ధికి ఏకంగా రూ.4,962.47 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

**కేటాయింపులు ఇలా..**

వరంగల్ నగర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వరద నీటి కాలువల నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల కోసమే రూ.4,170 కోట్లు కేటాయించారు. ఇప్పటికే ప్రకటించిన మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ కోసం రూ.205 కోట్లు కేటాయించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు రూ. 160.92 కోట్లు, టెక్స్‌టైల్ పార్కులో రోడ్లు, పాఠశాలలు, ఇతర సదుపాయాల కోసం రూ.33.60 కోట్లు, టెక్స్‌టైల్ పార్కుకు భూములు ఇచ్చిన రైతులకు 863 ఇందిరమ్మ ఇళ్లకు గాను రూ.43.15 కోట్లు, కాళోజీ కళాక్షేత్రానికి రూ.85 కోట్లు కేటాయించారు. ఇక పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు రోడ్డు విస్తరణకు రూ. 65 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. నయీమ్‌నగర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.8.3 కోట్లు, వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ భవనం కోసం రూ.32.50 కోట్లు, ఇన్నర్ రింగ్‌కు రూ.80 కోట్లు , భద్రకాళి ఆలయం వద్ద పాలిటెక్నిక్ కాలేజీ కొత్త భవనానికి రూ.28 కోట్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లకు రూ.49.50 కోట్లు, వరంగల్ ఉర్దూ భవన్, షాదీఖానా కోసం రూ.1.50 కోట్లు కేటాయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో వివిధ విభాగాల పరిధిలో నగరంలో చేపట్టే పనులకు ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు పరిపాలన అనుమతులు కూడా మంజూరు చేశారు.

**రాజన్న గుడికి రూ.127.65 కోట్లు**

ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరుడి క్షేత్రం అభివృద్ధి పనులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం రూ.127.65 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో దేవాలయం పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు దానకిశోర్ మూడు వేర్వేరు ఉత్తర్వులు విడుదల చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాలకు రూ.76 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో రూ. 50 కోట్లు 2024 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా విడుదల చేయగా, మరో రూ.26 కోట్లను 2025–26 ఆర్థిక సంవత్సరానికి విడుదల చేయనున్నట్లు తెలిపింది. అలాగే వేములవాడ ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు ఉన్న రోడ్లను వెడల్పు చేసేందుకు రూ.47.85 కోట్లు మంజూరు చేస్తూ సర్కార్ మరో ఉత్తర్వు జారీ చేసింది. అలాగే మూలవాగులో ఉన్న బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల కమాన్ జంక్షన్ వరకు రూ.3.8 కోట్ల డ్రైనేజీ నిర్మాణ పనులకు పరిపాలన ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

# సంక్రాంతికి సన్నబియ్యం లేనట్టే!

▶ మొదటి పేజీ తరువాయి

70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నామని, అందులో 35 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం వస్తుందని చెప్పారు. ఈ సన్న ధాన్యం ఉగాది నుంచి ఇస్తే 9 నెలలకు సరిపోతుందన్నారు.

**13.13 ఎల్ఎంటీ ధాన్యం సేకరణ**

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగం పుంజుకుంటుందని కమిషనర్ చౌహాన్ చెప్పారు. ఇప్పటివరకు 13.13 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇందులో 10.11 లక్షల టన్నులు దొడ్డు ధాన్యం కాగా 3.02 లక్షల టన్నులు సన్న ధాన్యమన్నారు. ఇందులో 12.40 ఎల్ఎంటీ ధాన్యాన్ని మిల్లులు, గోడౌన్‌లకు పంపించినట్టు చెప్పారు. రూ. 3 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, రైతులకు రూ.1,560 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఇక సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ కింద రైతులకు రూ. 9.21 కోట్లు చెల్లించామన్నారు. 362 మంది డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వడం లేదని, సీఎంఆర్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని, ఎవరికీ బలవంతంగా ధాన్యం ఇవ్వడం లేదని చెప్పారు. కొందరు మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీని భూతంగా చూపుతున్నారన్నారు. సీఎంఆర్ అప్పగించిన వెంటనే బ్యాంక్ గ్యారంటీని మిల్లర్లకు తిరిగి ఇచ్చేస్తామని, ఇతర అప్పులకు వాటిని మినహాయించుకోమని స్పష్టం చేశారు.

**సన్న ధాన్యానికి 4 వేల కేంద్రాలు**

సన్న ధాన్యం, దొడ్డు ధాన్యం పండించిన చోట జిల్లా కలెక్టర్లు జియోగ్రాఫికల్ సిస్టం ద్వారా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సన్న, దొడ్డు ధాన్యానికి వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. 4వేలకు పైగా సన్నధాన్యం కేంద్రాలు ఉన్నాయన్నారు.

మిస్ యూనివర్స్ - 2024

'మిస్ యూనివర్స్' పోటీలు ఎప్పుడూ ఆసక్తికరమే.
అయితే తాజాగా మెక్సికోలో జరిగిన 'మిస్ యూనివర్స్–2024'కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.
ఈ పోటీ నేపథ్యంలో కేవలం విజేత గురించి మాత్రమే కాదు ఈ పోటీలో పాల్గొన్న ఎంతోమంది గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నారు.
అందానికి సంబంధించిన సంప్రదాయ కొలమానాలను సవాలు చేసి వేదిక మీద నిలిచిన వారి మొదలు గృహహింస, లైంగిక హింస బాధితులుగా చీకట్లో మగ్గి ఆ చీకటి నుంచి బయటికి వచ్చి ప్రపంచ వేదికపై వెలిగిపోయిన వారు ఉన్నారు.



# అందం అర్థం మారుతోంది..!




## నలభైలలో...

40 ఏళ్ల వయసులో మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొన్న మహిళగా బియాట్రిస్ నజోయా తన ప్రత్యేకతను చాటుకుంది. ఎన్నో అడ్డంకులను అధిగమించిన 'మిస్ యూనివర్స్ మాల్టా' నజోయా ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తోంది. నజోయా ముగ్గురు పిల్లలకు తల్లి. సింగిల్ మదర్.

'శారీరకంగా, మానసికంగా ఎన్నో వేధింపులు ఎదుర్కొన్నాను. హీనమైన పరిస్థితులను చూశాను. మనకు తప్ప మన సంతోషానికి తెర వేసే శక్తి ఎవరికీ లేదని నిరూపించాలనుకున్నాను. ఆత్మగౌరవంతో ముందుకు వెళ్లాను. మనం బయటికి ఎలా కనిపించినా లోపల అందంగా ఉంటాం. ఆ అందాన్ని చూడగలగాలి' అంటుంది నజోయా. 'నిజానికి ఆమె ఎప్పటికీ విజేత. కంటికి కనిపించని కిరీటం ఆమె తలపై కనిపిస్తుంది' అంటారు నజోయా అభిమానులు.

## హిజాబ్‌తో...




'మిస్ యూనివర్స్' పోటీలో పాల్గొన్న తొలి హిజాబీ (ముస్లిం సంప్రదాయ వస్త్రం హిజాబ్‌తో) మహిళగా ఖదీజా ఒమర్ చరిత్ర సృష్టించింది. 23 సంవత్సరాల ఖదీజా సోమాలియ నుంచి 'మిస్ యూనివర్స్' పోటీలో పాల్గొన్న తొలి మహిళ.

కెన్యాలోని శరణార్థి శిబిరంలో జన్మించింది. యార్క్ యూనివర్శిటీలో గ్రాడ్యుయేట్ అయిన ఖదీజా కమ్యూనిటీ బిల్డింగ్, బ్రాండ్ డెవలప్‌మెంట్‌లో ప్రావీణ్యం సాధించింది. బ్యూటీ ఇన్‌ఫ్లూయెన్సర్, మోడల్, ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తోంది. స్ఫూర్తిదాయకమైన కథలను చెప్పడంలో నేర్పరి. 'మిస్ వరల్డ్ 2021' కిరీటాన్ని గెలుచుకున్న మొదటి హిజాబీగా చరిత్ర సృష్టించింది.

## బార్బీ బొమ్మకు అందాల కిరీటం!



'ఈసారి విశ్వసుందరి కిరీటాన్ని బార్బీ బొమ్మ గెలుచుకుంది' అనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. 'బార్బీ బొమ్మకు అందాల కిరీటం ఏమిటీ?!' అనే ఆశ్చర్యంలో ఉండగానే అసలు విషయం తెలిసిపోయింది. 'మిస్ యూనివర్స్–2024' అందాల కిరీటాన్ని గెలుచుకున్న 21 సంవత్సరాల విక్టోరియా కెజార్ ముద్దు పేరు... బార్బీ డాల్. కెజార్ అచ్చం 'బార్బీ'లా ఉంటుందని ఆలా పిలుస్తారు.

## బ్యూటీ స్పాట్...

ఈసారి విశ్వసుందరి పోటీ విజేత కంటే ఎక్కువమంది దృష్టిని ఆకర్షించింది ఈజిప్ట్‌కు చెందిన లోగినా సలాహ్. చర్మంపై తెల్లటి మచ్చలు (బొల్లి) వల్ల ఎనిమిది సంవత్సరాల వయసు నుంచే ఎన్నో రకాల అవమానాలు ఎదుర్కొంది. సలాహ్ మిస్ యూనివర్స్ పోటీలోకి అడుగుపెట్టడం అనేది ఊహకు కూడా అందని విషయం. సంప్రదాయ సౌందర్య ప్రమాణాలను బ్రేక్ చేసిన వ్యక్తిగా ఎందరికో స్ఫూర్తినిచ్చే చారిత్రక సందర్భం కూడా. బ్లాగర్, ఇన్‌ఫ్లూయెన్సర్, మోడల్, మేకప్–ఆర్టిస్ట్‌గా రాణిస్తున్న సలాహ్‌కు సోషల్ మీడియాలో లక్షలాది మంది ఫాలోవర్‌లు ఉన్నారు.

'స్కిన్ పాజిటివిటీ'ని ప్రచార అంశంగా తన ప్రయాణాన్ని ప్రారంభించి ఎంతోమంది యువతుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపింది సలాహ్.

సలాహ్ సక్సెస్‌ఫుల్ బిజినెస్ ఉమన్ మాత్రమే కాదు సానుకూల మార్పు, ఆత్మవిశ్వాసం... మొదలైన అంశాలలో వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి గొప్ప వక్తగా పేరు తెచ్చుకుంది. న్యూయార్క్‌లోని బెవర్లీ హిల్స్ ఇంటర్నేషనల్ బ్యూటీ స్కూల్ నుంచి లైసెన్స్ పొందిన సలాహ్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో క్రియేటివ్ లుక్స్‌పై ట్యుటోరియల్స్‌ను నిర్వహించేది.

2023లో దుబాయ్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొనడం ద్వారా గ్లామర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది.

'బియాండ్ ది సర్ఫేస్ మూమెంట్' వేదిక ద్వారా బాలికలు, యువతులలో సామాజిక స్పృహ కలిగిస్తోంది. దుబాయ్‌లో నివసిస్తున్న 34 సంవత్సరాల సలాహ్ ఒక బిడ్డకు తల్లి. సింగిల్ మదర్.

'మిస్ యూనివర్స్ 2024'లో లోగినా సలాహ్ టాప్ 30లో చోటు సాధించింది.

## ఎత్తు ఎంతైనా... అంతెత్తున!




షానే మెకింతోష్ అందాల పోటీలో పోటీపడిన వారిలో ఎత్తు తక్కువగా ఉన్న కంటెస్టెంట్‌గా చరిత్ర సృష్టించింది.

ఆమె ఎత్తు 5 అడుగుల 1 అంగుళం.

'మిస్ యూనివర్స్ జిబ్రాల్టర్' ఫైనల్‌లో మెకింతోష్ ఇచ్చిన సమాధానం న్యాయ నిర్ణేతల హృదయాలను గెలుచుకుంది. 'నేను చిన్నగా కనిపించవచ్చు... కానీ ఆత్మవిశ్వాసంతో అంతెత్తున కనిపిస్తాను'

'మిస్ యూనివర్స్ జిబ్రాల్టర్ 2024' అందాల కిరీటాన్ని గెల్చుకున్న విజేతగా అందరి దృష్టిని ఆకర్షించింది షానే మెకింతోష్. 34 ఏళ్ల తరువాత 'మిస్ యూనివర్స్' పోటీలో జిబ్రాల్టర్‌కు ప్రాతినిధ్యం వహించిన తొలి మహిళగా రికార్డ్ సృష్టించింది.

## బంగారు పక్షి



'మిస్ యూనివర్స్' కిరీటం మిస్ అయిపోయినా 'గోల్డెన్ బర్డ్' కాస్ట్యూమ్‌తో ఎంతోమంది హృదయాలను గెల్చుకుంది రియా సింఘా. 'మిస్ యూనివర్స్'కు మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన రియా సింఘా ధరించిన 'ది గోల్డెన్ బర్డ్' దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఏడాది ప్రారంభంలో 'మిస్ యూనివర్స్ ఇండియా' కిరీటాన్ని గెల్చుకున్న సింఘా సింబాలిక్ దుస్తుల్లో రన్‌వేపై నడుస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. శ్రేయస్సు, సంపదకు బంగారు పక్షి చిహ్నం. ఈ డ్రెస్‌ను వియత్నాం డిజైనర్ గుయెన్ ఎన్లోక్ డిజైన్ చేశారు.

# గేదెను వదిలేసి వచ్చేదెలా?


బర్రె ఆలన, పాలన: హీరాదేవి

● ఓ 'హీరా'యిన్... ఫిల్మ్ ఫెస్టివల్ కథ

ఉత్తరాఖండ్‌కు చెందిన 80 ఏళ్ల హీరా దేవి గతేడాది 'ఫైర్' (చితి) అనే హిందీ చిత్రంలో 'హీరోయిన్'గా నటించారు. ఆ చిత్రం 'టాలిన్ బ్లాక్ నైట్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్'కు ఇండియా నుండి అధికారికంగా పోటీకి ఎంపికైంది కూడా. విషయం ఏమిటంటే – ఉత్తర ఐరోపాలోని ఎస్టోనియా దేశానికి రాజధాని అయిన టాలిన్ పట్టణంలో జరుగుతున్న ఆ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ రోజు (నవంబర్ 19) సాయంత్రం 'ఫైర్'ను ప్రదర్శిస్తున్నారు. ఇక విశేషం ఏమిటంటే – చిత్ర దర్శకుడు వినోద్ కప్రీ తనతో పాటుగా హీరా దేవిని ఎస్టోనియా తీసుకువెళ్లేందుకు ఎట్టకేలకు ఆమెను ఒప్పించగలిగారు. చిత్ర బృందంతో కలిసి హీరాదేవి ఆదివారం ఎస్టోనియా విమానం ఎక్కేశారు. అదేం విశేషం అంటారా? తన బర్రెను వదలి తను వచ్చేదే లేదని హీరా దేవి మొరాయించారు మరి!


'ఫైర్' చిత్రంలో కథానాయికగా హీరా దేవి

అసలు 'ఫైర్' చిత్రంలో నటించే ముందు కూడా ఆమె ఒక పట్టాన ఊరు దాటేందుకు అంగీకరించలేదు. ''షూటింగ్ కోసం రోజూ నేను మీతో వచ్చేస్తుంటే ఇక్కడ నా బర్రెను ఎవరు చూసుకుంటారు?'' అని ఆమె ప్రశ్న. ఇప్పుడు ఎస్టోనియా వెళ్లటానికి ఆమె అడుగుతూ వచ్చిన ప్రశ్న కూడా అదే.. ''మీతో పాటు విమానం ఎక్కేస్తే ఇక్కడ నా బర్రెను ఎవరు చూసుకుంటారు?'' అని! ''నేను తప్ప నా బర్రెకు ఎవరూ లేరు, నేను రాలేను..'' అని కరాకండిగా చెప్పేశారు హీరా దేవి. ఆమె నిరాకరణ సమంజసమైనదే.

హీరా దేవి ఉంటున్నది 'గడ్డిర్' అనే మారుమూల గ్రామంలో. ఆమె, ఆమె బర్రె తప్ప ఆ ఇంట్లో ఎవరూ ఉండరు. ఇంట్లోనే కాదు, ఆ ఊళ్లో జనం ఉండేది కూడా తక్కువే. అంతా వేరే ఊళ్లకు వలస వెళ్లిపోయారు. హీరా దేవి కూతురు కూడా అక్కడి కి 30 కి.మీ. దూరంలోని బరణి గ్రామంలో ఉంటోంది. హీరా దేవి ఇద్దరు కొడుకులు ఢిల్లీలో స్థిరపడిపోయారు. చివరికి ఆమె పెద్ద కొడుకు చేత చెప్పించి 'ఫైర్'లో హీరోయిన్ పాత్రలో నటించేందుకు ఒప్పించారు చిత్ర దర్శకుడు కప్రీ.

'ఫైర్' 80 ఏళ్ల వయసులో ఉన్న దంపతుల ప్రేమ కథ. ఉత్తరాఖండ్‌లోని మున్స్యారీ గ్రామంలోని ఒక నిజ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం స్క్రీన్ ప్లేను 2018లోనే రాసి పెట్టుకున్నారు వినోద్ కప్రీ. స్థానిక నటుల కోసం వెతకులాటతోనే ఇన్నేళ్లూ గడిచిపోయాయి. ఆఖరికి.. 'గడ్డిర్' గ్రామంలో పసుగ్రాసం కోసం అడవికి వెళుతుండే కొందరు మహిళల ద్వారా హీరా దేవి చలాకీగా ఉంటారని, చక్కగా పాడతారని, భావాలను ముఖంలో భలేగా ఒలికిస్తారని తెలుసుకున్న కప్రీ.. హీరోయిన్ పాత్రకు హీరా దేవిని ఎంపిక చేసుకున్నారు. హీరోగా మున్స్యారీ గ్రామంలో నాటకాలు వేస్తుండే మాజీ సైనికుడు పదమ్ సింగ్‌ని తీసుకున్నారు. 'ఫైర్'లో ఇద్దరూ చక్కగా నటించారు. చిత్రానికి మంచి ఆర్ట్ మూవీగా పేరొచ్చింది. ఆ చిత్రాన్నే ఇవాళ ఎస్టోనియాను ప్రదర్శిస్తున్నారు.

ఇంతకీ – హీరా దేవి తన బర్రెను వదిలి పెట్టి ఎస్టోనియా వెళ్లేందుకు ఎలా అంగీకరించారు?! బర్రెను తను చూసుకుంటానని తల్లికి హామీ ఇచ్చి కూతురు ఆదివారం ఉదయం ఊళ్లోకి దిగగానే... బర్రె కంఠాన్ని ప్రేమగా, మృదువుగా నిమిరి, వెనక్కు తిరిగి తిరిగి బర్రె వైపు చూసుకుంటూ ఎస్టోనియా వెళ్లటం కోసం ఊళ్లోంచి బయటకు అడుగు పెట్టారు హీరా దేవి.

## 26 పశువ్యాధులకు హోమియో చికిత్స: అమూల్‌కు అంతర్జాతీయ పురస్కారం

మూడు భారతీయ డెయిరీ సంస్థలకు అంతర్జాతీయ డెయిరీ ఫెడరేషన్ (ఐడిఎఫ్) 'ఇన్నోవేషన్ ఇన్ సస్టయినబుల్ ఫార్మింగ్ ప్రాక్టీసెస్ 2024' ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కాయి. పాడి పశువులకు సోకే జబ్బులకు చేసే చికిత్సల్లో అల్లోపతి యాంటీబయాటిక్ ఔషధాలకు బదులుగా హోమియోపతి ఔషధాలను వాడి చక్కని ఫలితాలు సాధించినందుకు గాను 'యానిమల్ కేర్' విభాగంలో అమూల్ డెయిరీకి ఈ పురస్కారం ప్రదానం చేసినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. సుమారు 68 వేల పశువులకు సోకిన 26 రకాల సాధారణ వ్యాధులకు హోమియోపతి మందులతో చికిత్స చేయటం ద్వారా అమూల్ డెయిరీ సత్ఫలితాలు సాధించింది. ఇందుకోసం 2024 మే నాటికి 3.30 లక్షల (30 ఎం.ఎల్. సీసాలు) హోమియోపతి మందులను అమూల్ సొంతంగానే ఉత్పత్తి చేసి, 1.80 లక్షల సీసాలను పాడి సహకార సంఘాల రైతులకు పంపిణీ చేసింది. యాంటీబయాటిక్ ఔషధాల వాడకాన్ని తగ్గించటం ద్వారా పశువుల ఆరోగ్యం మెరుగవుతోంది. పాల ఉత్పత్తులు వినియోగించే ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతోందని ఐడిఎఫ్ తెలిపింది. సంప్రదాయ ఆయుర్వేద (ఈవీఎం) చికిత్సా పద్ధతులతో పాటు హోమియో పశువైద్య పద్ధతులను కూడా అమూల్ ప్రాచుర్యంలోకి తేవటం హర్షదాయకం.




పశ్చిమ బెంగాల్‌లోని సుందర్బన్ పాడి, పశు పెంపకందారుల సహకార సంఘానికి ఆర్థిక, సామాజిక విభాగంలో పురస్కారం లభించింది. 4,500 మంది మహిళా రైతులు పూర్తి సేంద్రియ పద్ధతుల్లో పాలు ఉత్పత్తి చేస్తున్నారు. అనేక పాల ఉత్పత్తులను, ఎ2 ఆవు నెయ్యిని తయారు చేస్తున్నారు. సేంద్రియ నాటు కోళ్ల పెంపకంతో పాటు సేంద్రియ పప్పుదినుసులను సైతం ఉత్పత్తి చేసి, ప్రాసెసింగ్ చేసి వినియోగదారులకు నేరుగా విక్రయిస్తూ మహిళా రైతులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధిస్తున్నారు.

ఐడిఎఫ్ పురస్కారం అందుకున్న మరో సంస్థ 'ఆశా మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ'. సౌర విద్యుత్తుతో నడిచే ఇన్‌స్టంట్ మిల్క్ చిల్లర్లను వినియోగించటం ద్వారా చిన్న, సన్నకారు పాడి రైతుల అభ్యున్నతికి వినూత్న రీతిలో దోహదపడటం ఈ ఎఫ్‌పిఓ ప్రత్యేకత.



సాగుబడి
అనూరాధ కార్తె: నవంబర్ 19 నుంచి

సహకార సంఘం అంటే?
సభ్యుల ప్రయోజనాలను నెరవేర్చటమే లక్ష్యంగా పనిచేసే ప్రజాస్వామిక సంస్థ సహకార సంఘం. యాజమాన్యం, నియంత్రణ, నిర్వహణ అన్నీ సభ్యులదే. సభ్యుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అవసరాలు, ఆకాంక్షలను నెరవేర్చటమే సహకార సంఘాల ధ్యేయం.

# సహకార స్ఫూర్తికి జేజేలు!



పరస్పరం సహకరించుకోవటం మానవ సహజ లక్షణం. ఈ లక్షణాన్ని ఒక పద్ధతి ప్రకారం కొనసాగించడానికి సహకార సంఘాలు (కోఆపరేటివ్ సొసైటీలు) దోహదం చేస్తాయి. ప్రపంచ సహకార వ్యవస్థకు 130 ఏళ్ల చరిత్ర, సుసంపన్న వారసత్వం ఉన్నాయి. ప్రపంచ జనాభాలో 12% మంది ఏదో ఒక సహకార సంఘంలో సభ్యులే.

మన దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, వందేళ్లకు పైబడి చక్కగా ఆర్థిక సేవలందిస్తున్న ఘనమైన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (పిఎసిఎస్‌లు), సహకార అర్బన్ బ్యాంకులు అనేకం కనిపిస్తాయి.

ఈ నెల 14 నుంచి సహకార వారోత్సవాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. మరో రెండు ముఖ్య విశేషాలు... ఈ నెల 25 నుంచి 30 వరకు న్యూఢిల్లీలోని భారత మండపం వేదికగా అంతర్జాతీయ సహకార మహాసభ జరగబోతోంది. అంతర్జాతీయ మహాసభ మన దేశంలో జరగటం ఇదే మొదటిసారి. సుమారు రెండు వేల మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఐక్యరాజ్యసమితి 2025వ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ సహకార సంవత్సరం'గా ప్రకటించింది. ఈ పండుగకు కూడా ఈ నెల 25న ఉత్సాహపూరిత వాతావరణంలో న్యూఢిల్లీలో తెర లేవనుంది.

సహకార విలువలకు తిలోదకాలు, అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగం.. వంటి అవశ్యం వదిలించుకోవాల్సిన జాఢ్యాలు మన సహకార వ్యవస్థను పట్టి పీడిస్తున్నప్పటికీ.. మొక్కవోని సహకార స్ఫూర్తి మన సమాజంలో అనుక్షణం వర్థిల్లుతూనే ఉంటుంది. సహకారం కొత్త పుంతలు తొక్కుతూనే ఉంటుంది! ఈ నేపథ్యంలో తలపండిన సహకారవేత్తల అభిప్రాయాలు తెలుసుకుందాం.

## సహకార సంస్థల బలోపేతానికి దోహదం

అంతర్జాతీయ సహకార మహాసభ న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో జరుపుకోవటం సంతోషదాయకం. దేశంలో సహకార సంస్థలన్నీ బలోపేతం కావటానికి, ప్రభుత్వం మరింత దృష్టి కేంద్రీకరించడానికి అంతర్జాతీయ మహాసభ ఉపయోగపడుతుంది. సహకార సంఘాలు చాలా వరకు వ్యవసాయ ఉత్పాదకాల సరఫరా వరకే పరిమితం అవుతున్నాయి. ప్రాసెసింగ్, విలువ జోడింపు, ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించటం, ఉత్పత్తుల బ్రాండింగ్ చేసుకోవాలి. ఆన్‌లైన్, సొంత అవుట్‌లెట్ల ద్వారా విక్రయించాలి. రైతుల ప్రయోజనమే పరమావధిగా ముల్కనూర్ సొసైటీ 60 ఏళ్లుగా ఇటువంటి అనేక సేవలు అందిస్తోంది. గోదాములు నిర్మించటం, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు సహకార సంఘాలకు ప్రభుత్వం తక్కువ వడ్డీకి రుణాలిచ్చి ప్రోత్సహించాలి. శిక్షణపై దృష్టి కేంద్రీకరించాలి. సహకార సంఘాల సభ్యులు, సిబ్బంది, బోర్డు సభ్యులకు సహకార విలువలు, వాణిజ్య, నిర్వహణ నైపుణ్యాల పెంపుదల శిక్షణకు కృషి చెయ్యాలి.



– అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి (94408 00650),
అధ్యక్షులు, ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సంఘం, తెలంగాణ

## సహకారం రాష్ట్ర సబ్జెక్ట్.. కేంద్రం చట్టాలు ఎలా చేస్తుంది?


ప్రపంచవ్యాప్తంగా దేశాల మధ్య, ఒక దేశంలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలను తగ్గించటానికి సహకార వ్యవస్థ ఉపయోగపడుతుంది. చాలా దేశాల్లో సహకార వ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఉంది. నెదర్లాండ్స్‌లో సహకార సంఘాలకు స్వేచ్ఛ ఎక్కువ. అధికారుల జోక్యం ఉండదు. ఫ్రాన్స్‌లో 2008లో ఆర్థిక మాంద్యం దెబ్బకు వాణిజ్య బ్యాంకులు నిలవలేక సహకార బ్యాంకుల్లో విలీనమయ్యాయి. అమెరికాలోనూ కమ్యూనిటీ బ్యాంకులు బలంగా ఉన్నాయి. జర్మనీలో రైతులకు ఎక్కువ రుణాలిస్తున్నది సహకార బ్యాంకులే. న్యూజిలాండ్‌లో డెయిరీ కోఆపరేటివ్‌లదే రాజ్యం. లాటిన్ అమెరికాలో ఇటీవల కోఆపరేటర్లు బలపడుతూ కొత్త సిద్ధాంతాలు ప్రతిపాదిస్తున్నారు.

**జవాబుదారీతనం ఏదీ?**

మన దేశంలో సహకార విస్తరణకు అవకాశాలెక్కువ. మన సంస్కృతిలోనే సహకార స్ఫూర్తి ఉంది. గ్రామీణులు, గిరిజనుల్లో ఇది మరీ ఎక్కువ. అయితే, అధికారులకు అధిక పెత్తనం ఇవ్వటం, జవాబుదారీతనం లేకుండా చేయటం వల్ల మన దేశంలో సహకార వ్యవస్థ దెబ్బతింటున్నది. ఆర్బీఐ నిబంధనలు, సహకార చట్టాల మధ్య వైరుధ్యం అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులను కుంగదీస్తోంది. సహకార విలువలను తుంగలో తొక్కేలా కొన్ని నిబంధనలు ఉంటున్నాయి. అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు, మల్టీస్టేట్ కోఆపరేటివ్‌ల విషయంలో రాష్ట్ర సహకార చట్టాలు నిర్దేశించే నిబంధనలకు భిన్నమైన నిబంధనలను బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ నిర్దేశిస్తోంది. అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు షేర్ క్యాపిటల్ తిరిగి ఇవ్వొద్దని, డైరెక్టర్ల పదవీ కాలం నాలుగేళ్లేనని (సహకార చట్టాల ప్రకారం 5 ఏళ్లు).. ఇలా అనేక విషయాల్లో వైరుధ్యం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడున్న 45 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల్లో 20 బ్యాంకులు వందేళ్ల క్రితం నుంచి ఉన్నవే. ఇవి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక తోడ్పాటునూ పొందటం లేదు.

**పిఎసిఎస్‌లలో బ్యాంకింగ్ సేవలా?**

సహకారం పూర్తిగా రాష్ట్ర సబ్జెక్ట్. రాష్ట్రాలతో చర్చించకుండానే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టాలు చేస్తోంది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో ఇంకో 25 పనులు చేయించాలని కేంద్ర సహకార శాఖ నిర్దేశించింది. ఇందులో బ్యాంకింగ్ సేవలు కూడా ఉన్నాయి. నిధులు దుర్వినియోగం జరగకుండా పర్యవేక్షించేదెవరూ అంటే సమాధానం లేదు. ఇది సరికాదు. అమలు చేయాల్సింది రాష్ట్రాలైనప్పుడు సహకార రిజిస్ట్రార్, ముఖ్య కార్యదర్శితో కనీసం చర్చించకుండానే కేంద్రం నిర్ణయాలు తీసుకుంటే ఎలా? సహకార సంస్థల్లో అక్రమాలకు బాధ్యులను జవాబుదారీ చేయటం లేదు. ఎంత అవినీతి జరిగినా రాష్ట్ర ప్రభుత్వాలు అరెస్టులు, ఆస్తుల రికవరీ వంటి చర్యలు తీసుకోవటం లేదు. సహకార శాఖకు ఇంత పెద్ద వ్యవస్థ ఉన్నప్పటికీ జవాబుదారీతనం లేకుండాపోయింది.



– మానం ఆంజనేయులు (98481 97123),
పూర్వ అధ్యక్షులు, విశాఖ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్, పూర్వ ఉపాధ్యక్షులు, నాఫ్కాబ్

## కేంద్రం తెచ్చిన కొత్తచట్టాలతో చేటు


భారతీయ ఆర్థిక రంగంలో సహకార వ్యవస్థ వాటా 43% వుంది. రైతులు, గ్రామీణ చేతి వృత్తిదారులు, బలహీన వర్గాలు ఈ సహకార వ్యవస్థలో భాగస్వాములు. గత 75 సంవత్సరాలుగా 29 కోట్ల మంది సభ్యులు తమ ఖర్చులు తగ్గించుకొని రూ.40,689 కోట్ల మూలధనంతో సుమారు 9 లక్షల సహకార సంఘాలను స్థాపించుకున్నారు. రూ. లక్షల కోట్ల సహకార ఆర్థిక సౌధాన్ని నిర్మించారు. దీన్ని అక్రమంగా పెట్టుబడిదారుల పరం చేయటానికి పార్లమెంటులో రెండు చట్టాలు చేశారు. వీటిని అమలుచేస్తే జిల్లా స్థాయి సహకార బ్యాంకుల నుంచి ఇఫ్కో, క్రిభ్కో, నాఫెడ్ వంటి పెద్ద సంస్థలన్నీ కారుచౌకగా పెట్టుబడిదారుల పరం అవుతాయి. సహకార సిద్ధాంతాలకు, సహకార సూత్రాలకు ఇది విరుద్ధం. మొత్తంగా భారత రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని రాజ్యాంగ సవరణ చేయకుండానే ఈ చట్టాలు మార్చేస్తున్నాయి. ప్రజలు చైతన్యవంతులై వీటిని అడ్డుకోవాలి. సహకార ధర్మపీఠం తరపున దేశవ్యాప్త ప్రచారోద్యమం చేపట్టాం.



– సంభారపు భూమయ్య (92485 91934),
సీనియర్ సహకారవేత్త, సహకార ధర్మపీఠం, హైదరాబాద్

## ఒకే రంగానికి రెండు చట్టాలెందుకు?

సహకార రంగం ఆర్థిక పురోగతి బాగానే వుంది. కానీ, నడక సరిగ్గా లేదు. సహకార మూల సూత్రాలకు సహకార వ్యవస్థ దూరమైంది. సహకార విద్య, సహకార విలువలకు సంబంధించిన కనీస జ్ఞానం కొరవడిన యంత్రాంగం ఆధ్వర్యంలో తెలుగునాట సహకార వ్యవస్థ నడుస్తోంది. సహకార హక్కులు, బాధ్యతలు తెలియని దుస్థితి. 12 నెలలు శిక్షణ పొందినవారే సహకార సంస్థల్లో సిబ్బందిగా వుండాలన్నది నియమం. ఇప్పుడున్న సహకార సిబ్బందిలో 90 శాతం సరైన శిక్షణ లేనివారే. ఉద్యోగం చేస్తూ మూడు నెలలు, ఆరు నెలల డిప్లొమా అంటూ సర్టిఫికెట్లు పొందిన వారే ఎక్కువ కనిపిస్తున్నారు. వీరిని నడిపించే ఉన్నతోద్యోగుల పరిస్థితి కూడా ఇంతే! ఏ ఇతర రంగాల్లోనూ లేనివిధంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 1964, 1995 సహకార చట్టాలు అమల్లో ఉన్నాయి. ఒకే రంగానికి రెండు చట్టాలేమిటి? 1904, 1912,1932, 1964 సహకార చట్టాలకు రూల్స్ ఉన్నాయి. కానీ, 1995 చట్టం అమల్లోకి వచ్చి 29 ఏళ్లయినా ఇప్పటికీ రూల్స్ లేవు. రిజిస్ట్రార్ బాధ్యతలపై కూడా స్పష్టమైన నిబంధనల్లేవు.



– దాసరి కేశవులు (94402 75055),
సీనియర్ సహకారవేత్త, చైర్మన్, సహకార భూమి జర్నల్ కోఆపరేటివ్ సొసైటీ, విజయవాడ

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



## ఆర్‌సీబీ బౌలింగ్ కోచ్‌గా ఓంకార్ సాల్వి

వచ్చే ఏడాది జరిగే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ 18వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు కొత్త బౌలింగ్ కోచ్‌గా ఓంకార్ సాల్విని నియమించారు. భారత మాజీ క్రికెటర్ ఆవిష్కార్ సాల్వి తమ్ముడైన ఓంకార్ గతంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించాడు. 46 ఏళ్ల ఓంకార్ ప్రస్తుతం ముంబై రంజీ జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్నారు. ఓంకార్ పర్యవేక్షణలో ముంబై రంజీ ట్రోఫీ, ఇరానీ ట్రోఫీ టైటిల్స్‌ను సాధించింది. వచ్చే ఏడాది మార్చి నెలలో ముంబై హెడ్ కోచ్‌గా ఆయన పదవీకాలం ముగుస్తుంది.

## 15వ ర్యాంక్‌తో సీజన్ ముగించిన బోపన్న



భారత టెన్నిస్ డబుల్స్ దిగ్గజం రోహన్ బోపన్న ఈ ఏడాదిని 15వ ర్యాంక్‌తో ముగించాడు. సోమవారం విడుదలైన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) తాజా ర్యాంకింగ్స్‌లో 44 ఏళ్ల బోపన్న మూడు స్థానాలు పడిపోయి 15వ ర్యాంక్‌లో నిలిచాడు. ఇటలీలో జరిగిన సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో బోపన్న-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీ 49వ ర్యాంక్‌లో, శ్రీరామ్ బాలాజీ 71వ ర్యాంక్‌లో, బొల్లిపల్లి రిత్విక్ చౌదరి 75వ ర్యాంక్‌లో ఉన్నారు.



# ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...

**నేడు జపాన్‌తో భారత్ సెమీఫైనల్**
- గెలిస్తే ఐదోసారి ఫైనల్లోకి
- సాయంత్రం గం. 4:45 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

**రాజ్‌గిర్ (బిహార్):** లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి అజేయంగా నిలిచిన భారత మహిళల హాకీ జట్టు కీలక సమరానికి సమాయత్తమైంది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో నేడు మాజీ చాంపియన్ జపాన్‌తో డిఫెండింగ్ చాంపియన్ భారత్ సెమీఫైనల్లో తలపడనుంది. ఇప్పటి వరకు సాధించిన ఫలితాలతో సంబంధం లేకుండా ఈ నాకౌట్ మ్యాచ్‌లో గెలిచిన జట్టు టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. మరో సెమీఫైనల్లో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత చైనాతో మలేసియా పోటీపడుతుంది. సొంతగడ్డపై జరుగుతున్న ఈ టోర్నీలో భారత జట్టు ఆద్యంతం ఆధిపత్యం చలాయించింది. లీగ్ దశలో భారత్ మొత్తం 26 గోల్స్ సాధించి ప్రత్యర్థి జట్లకు కేవలం 2 గోల్స్ మాత్రమే సమర్పించుకుంది. 'డ్రాగ్ ఫ్లికర్' దీపిక ఏకంగా 10 గోల్స్‌తో అదరగొట్టింది. సంగీత కుమారి నాలుగు గోల్స్... ప్రీతి దూబే మూడు గోల్స్ చేశారు. లాల్‌రెమ్‌సియామి, మనీషా చౌహాన్, నవ్‌నీత్ కౌర్ రెండు గోల్స్ చొప్పున సాధించారు. ఉదిత, కెప్టెన్ సలీమా టెటె, బ్యూటీ డుంగ్‌డుంగ్ ఒక్కో గోల్ చేశారు. మరోవైపు జపాన్ జట్టు ఓవరాల్‌గా 6 గోల్స్ మాత్రమే చేసింది. ఈ నేపథ్యంలో భారత్ తమ సహజశైలిలో ఆడితే వరుసగా ఆరో విజయంతో ఐదోసారి ఈ టోర్నీలో టైటిల్ పోరుకు చేరుకుంటుంది. ఇప్పటి వరకు ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఏడుసార్లు జరగ్గా.. భారత జట్టు రెండుసార్లు చాంపియన్‌గా (2016, 2023) నిలిచి, మరో రెండుసార్లు (2013, 2018) రన్నరప్‌తో సరిపెట్టుకుంది. జపాన్ జట్టు మూడుసార్లు (2010, 2013, 2023) ఫైనల్‌కు చేరుకొని ఒకసారి (2010లో) విజేతగా నిలిచి, రెండుసార్లు తుది పోరులో ఓడిపోయింది. 'మా జట్టు బలాలు ఏంటో, బలహీనతలు ఏంటో సభ్యులందరికీ తెలుసు. మా బలాన్ని మరింత పెంచుకొని, భవిష్యత్ టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఈ టోర్నీని వినియోగించు కుంటున్నాం. ఇప్పటి వరకైతే భారత జట్టు అద్భుతంగా ఆడింది. అయితే నాకౌట్ మ్యాచ్ అయినా సెమీఫైనల్లో జపాన్‌ను తక్కువ అంచనా వేయకూడదు' అని భారత జట్టు హెడ్ కోచ్ హరేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు.

# విజయం లేకుండానే...

**2024 ఏడాదిని ముగించిన భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు**
- మలేసియాతో స్నేహపూర్వక అంతర్జాతీయ మ్యాచ్‌ను 1–1తో 'డ్రా'గా ముగించిన టీమిండియా
- తర్వాతి అంతర్జాతీయ మ్యాచ్ వచ్చే మార్చిలో

**సాక్షి, హైదరాబాద్:** భారత ఫుట్‌బాల్ జట్టు 2024ను ఒక్క విజయం లేకుండా ముగించింది. ఏడాదిలో చివరి మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శనే కనబర్చినా చివరకు గెలుపు మాత్రం దక్కలేదు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో సోమవారం భారత్, మలేసియా జట్ల మధ్య జరిగిన అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) స్నేహపూర్వక అంతర్జాతీయ మ్యాచ్ 1–1 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది. మలేసియా తరఫున పావ్లో జోస్ 19వ నిమిషంలో గోల్ సాధించగా... భారత్ తరఫున రాహుల్ భేకే 39వ నిమిషంలో హెడర్ ద్వారా గోల్ కొట్టాడు. రెండో అర్ధభాగంలో గోల్ చేయడంలో ఇరు జట్లు విఫలమయ్యాయి. ఈ ఏడాది మొత్తం 11 మ్యాచ్‌లు ఆడిన మన జట్టు 6 పరాజయాలు, 5 'డ్రా'లు సాధించింది. భారత ఫుట్‌బాల్ జట్టు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత స్పెయిన్‌కు చెందిన మనోలో మార్క్వెజ్‌కు తొలి విజయం ఇంకా అందని ద్రాక్షగానే ఉంది. భారత్ తమ తర్వాతి అంతర్జాతీయ మ్యాచ్ 2027 ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా వచ్చే ఏడాది మార్చిలో ఆడుతుంది.

**జోరుగా ఆరంభం...**

ఆరంభంలో భారత్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించింది. తొలి 15 నిమిషాల పాటు బంతిని తమ ఆధీనంలోనే ఉంచుకున్న జట్టు కొన్ని సార్లు గోల్‌పోస్ట్‌కు చేరువగా వెళ్లగలిగినా... ఆశించిన ఫలితం దక్కలేదు. ఆరో నిమిషంలో రోషన్, చంగ్తే అందించిన పాస్‌తో ముందుకు దూసుకెళ్లిన లాలెంగ్‌మవియా కొట్టిన షాట్ క్రాస్ బార్ మీదుగా దూసుకెళ్లింది. అయితే భారత కీపర్ గుర్‌ప్రీత్‌సింగ్ సంధూ చేసిన తప్పు ప్రత్యర్థికి ఆధిక్యాన్ని అందించింది. భారత బ్యాక్‌లైన్ వద్ద మలేసియాను అడ్డుకునే ప్రయత్నంలో సంధూ తన పోస్ట్ వదిలి ముందుకొచ్చాడు. వెంటనే చక్కగా బంతిని అందుకున్న పావ్లో జోస్ ఖాళీ నెట్‌పైకి కొట్టడంతో మలేసియా ఖాతాలో తొలి గోల్ చేరింది. తర్వాత కొద్దిసేపటికే ఫౌల్ చేయడంతో రాహుల్ భేకే ఎల్లో కార్డ్‌కు గురయ్యాడు. 28వ నిమిషంలో రోషన్ ఇచ్చిన కార్నర్ క్రాస్‌ను అందుకోవడానికి ఎవరూ లేకపోవడంతో భారత్‌కు మంచి అవకాశం చేజారింది. ఈ దశలో కొద్దిసేపు ఇరు జట్లూ హోరాహోరీగా పోరాడాయి. చివరకు భారత్ ఫలితం సాధించింది. బ్రెండన్ ఇచ్చిన కార్నర్ పాస్‌ను బాక్స్ వద్ద ఉన్న భేకే నెట్‌లోకి పంపడంతో స్కోరు సమమైంది.

**హోరాహోరీ పోరాడినా...**

రెండో అర్ధభాగంలో ఇరు జట్లు పైచేయి సాధించేందుకు తీవ్రంగా శ్రమించాయి. అయితే తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యాయి. తొలి అర్ధభాగంతో పోలిస్తే ఈసారి భారత డిఫెన్స్ మెరుగ్గా కనిపించింది. 47వ నిమిషంలో బాక్స్ వద్ద అగ్వెరో కిక్‌ను సందేశ్ జింగాన్ సమర్థంగా అడ్డుకోగా... 53వ నిమిషంలో కార్నర్ ద్వారా భారత ప్లేయర్ బ్రెండన్ చేసిన గోల్ ప్రయత్నం వృథా అయింది. మరో ఏడు నిమిషాల తర్వాత వచ్చిన అవకాశాన్ని ఫరూఖ్ వృథా చేశాడు. చివరి ఐదు నిమిషాల ఇంజ్యూరీ టైమ్‌లో కొన్ని ఉత్కంఠ క్షణాలు సాగాయి. సుమారు 15 వేల మంది ప్రేక్షకులు మద్దతు ఇస్తుండగా భారత్ పదే పదే మలేసియా పోస్ట్‌పైకి దూసుకెళ్లినా గోల్ మాత్రం దక్కలేదు. మరోవైపు భారత కీపర్ సంధూ కూడా ప్రత్యర్థి ఆటగాళ్లను సమర్థంగా నిలువరించగలిగాడు.



భారత జట్టు గోల్ స్కోరర్ రాహుల్‌కు (జెర్సీ నంబర్ 2) సహచరుల అభినందన

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

## సాత్విక్-చిరాగ్ జోడీపైనే దృష్టి



**షెన్‌జెన్ (చైనా):** మూడు నెలల విరామం తర్వాత భారత బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పునరాగమనం చేయనుంది. నేటి నుంచి మొదలయ్యే చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో సాత్విక్-చిరాగ్ జోడీ ఆరో సీడ్‌గా బరిలోకి దిగనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం కచ్చితంగా సాధిస్తుందనుకున్న సాత్విక్-చిరాగ్ జంట క్వార్టర్ ఫైనల్లోనే ఓడిపోయి నిరాశపరిచింది. విశ్వ క్రీడల తర్వాత 11 మెగా టోర్నీలు జరిగినా సాత్విక్-చిరాగ్ ద్వయం ఏ టోర్నీలోనూ పోటీపడలేదు. తొలి రౌండ్‌లో యాంగ్ పో సువాన్-లీ జె హుయె (చైనీస్ తైపీ)తో సాత్విక్-చిరాగ్ ద్వయం తలపడుతుంది.

# సినిమా

## జనవరిలో ఎమర్జెన్సీ



'ఎమర్జెన్సీ' పోస్టర్

**నూ**తన సంవత్సరంలో వెండితెరపై 'ఎమర్జెన్సీ' విధించనున్నారు హీరోయిన్ కంగనా రనౌత్. ఆమె లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. జీ స్టూడియోస్‌తో కలిసి మణికర్ణిక ఫిల్మ్స్‌పై కంగనా రనౌత్ నిర్మించిన ఈ సినిమా కొత్త విడుదల తేదీ ఖరారైంది. 2025 జనవరి 17న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ విషయాన్ని కంగనా రనౌత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించి, 'భారతదేశంలో శక్తివంతమైన మహిళ చరిత్ర, దేశ విధిని మార్చిన క్షణాలు మీ ముందుకు రానున్నాయి' అంటూ కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. భారతదేశ ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ ఉన్న సమయంలో 1975లో విధించిన ఎమర్జెన్సీ టైమ్‌లో జరిగిన ఘటనలతో 'ఎమర్జెన్సీ' మూవీ రూపొందింది. ఈ చిత్రంలో ఇందిరాగాంధీ పాత్రలో నటించారు కంగనా. అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి, మిలింద్ సోమన్, శ్రేయాస్ తల్పాడే, విశాక్ నాయర్ వంటివారు ఇతర పాత్రల్లో నటించారు.



నయనతార

## లవ్ యాక్షన్ డ్రామా



సాయి పల్లవి, నాగచైతన్య

**నా**గ చైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న విడుదల కానుంది. కాగా ఈ సినిమాలోని 'బుజ్జితల్లి..' అనే పాట లిరికల్ వీడియోను ఈ నెల 21న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, కొత్త పోస్టర్స్ రిలీజ్ చేశారు. ''ఈ పాట రాజు (ఈ సినిమాలో నాగచైతన్య పాత్ర పేరు) హృదయంలో ఓ భాగం'' అంటూ 'బుజ్జితల్లి' పాటను ఉద్దేశించి 'ఎక్స్'లో పేర్కొన్నారు నాగచైతన్య. ''ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాలోని డి మచ్చిలేశం గ్రామంలో జరిగిన నిజ జీవిత ఘటనల స్ఫూర్తితో 'తండేల్' రూపొందుతోంది. లవ్, యాక్షన్ డ్రామా అంశాలు ఉన్నాయి. నాగచైతన్య, సాయి పల్లవిల కెమిస్ట్రీ, స్వచ్ఛమైన భావోద్వేగాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: దేవి శ్రీ ప్రసాద్.

## ధనుష్ రకరకాలుగా వేధిస్తారు - గాయని సుచిత్ర



ధనుష్



సుచిత్ర

**హీ**రో ధనుష్‌పై హీరోయిన్ నయనతార చేసిన ఆరోపణలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ధనుష్ పైకి కనిపించినంత మంచివాడు కాదని నయనతార పేర్కొనడం ఆయన ఫ్యాన్స్‌కి నచ్చలేదు. దీంతో నయనతారపై ఆయన ఫ్యాన్స్ ఆన్‌లైన్ వేదికగా విమర్శలు చేస్తున్నారు. అయితే ధనుష్ సరసన నటించిన కొందరు మలయాళ హీరోయిన్లు నయనతారకు సపోర్ట్ చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గాయని సుచిత్ర కూడా ధనుష్‌ని తీవ్రంగా విమర్శించి, మరో దుమారానికి తెరలేపారు. 'సుచీ లీక్స్' పేరుతో పలువురు ప్రముఖ నటీనటుల అంతరంగిక వ్యవహారాలను బట్టబయలు చేసిన సుచిత్ర పలు వివాదాల్లో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఆమె 'సుచీ లీక్స్'లో ధనుష్ పేరు కూడా చోటు చేసుకుంది. కాగా తాజాగా నయనతారకి మద్దతుగా ధనుష్‌పై సుచిత్ర చేసిన కామెంట్స్ కోలీవుడ్‌లో వైరల్‌గా మారాయి. ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో సుచిత్ర మాట్లాడుతూ–''తన సినిమాల్లో అమ్మ పాత్రలు చేసిన నటీమణులను కూడా ధనుష్ వేధిస్తారు. తనతో నటించిన హీరోయిన్లను కూడా వదిలిపెట్టరు. ఆయన ఇప్పటికి 50 చిత్రాలకుపైగా నటించారని, ఆ చిత్ర కథానాయికలందరూ ధనుష్ వేధింపులకు గురైన వారే. తనకు నచ్చనివారి ఇమేజ్‌ను దెబ్బ తీయడానికి ఎంతకైనా తెగిస్తాడు, రకరకాలుగా వేధిస్తాడు'' అని చెప్పారు. సుచిత్ర వ్యాఖ్యలపై ధనుష్ అభిమానులు మండిపడుతున్నారు.

– చెన్నై, 'సాక్షి' సినిమా ప్రతినిధి

## ఓ తల్లి పోరాటం

**న**యనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త సినిమాకు 'రక్కయీ' అనే టైటిల్ ఖరారు చేశారు. సెంథిల్ నల్లసామి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్, మూవీ వర్స్ ఇండియా పతాకాలపై వేదిక్కరన్‌పట్టి శక్తివేల్, ఆదిత్యా పిట్టీ నిర్మిస్తున్నారు. కాగా సోమవారం (నవంబరు 18) నయనతార బర్త్ డే. ఈ సందర్భంగా 'రక్కయీ' సినిమా టైటిల్ టీజర్‌ను, ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్‌లో నయనతార చేసే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు కనిపిస్తున్నాయి. అలాగే తన కూతురు కోసం ఓ తల్లి చేసే వీరోచిత పోరాటం నేపథ్యంతో ఈ సినిమా కథనం ఉంటుందని కోలీవుడ్ సమాచారం. ఈ సినిమాకు సంగీతం: గోవింద్ వసంత, కెమెరా: గౌతమ్ రాజేంద్రన్.

## తప్పులు దిద్దుకుని జీబ్రా చేశాను - ఈశ్వర్ కార్తీక్



**స**త్యదేవ్, డాలీ ధనంజయ హీరోలుగా, ప్రియా భవానీ శంకర్, జెన్నీఫర్ పిక్కినాటో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈశ్వర్ కార్తీక్ మాట్లాడుతూ –''ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత 32 కంపెనీల్లో ఉద్యోగం చేశాను. అయితే నా ఇష్టం సినీ రంగంవైపు ఉందని గ్రహించి సినిమాల్లోకి వచ్చాను. కీర్తి సురేష్‌గారితో 'పెంగ్విన్' సినిమా తీశాను. ఆ మూవీ రిలీజ్ తర్వాత నా రచన నుంచి ప్రేక్షకులు ఏం కోరుకుంటున్నారో గ్రహించి, తప్పులు దిద్దుకుని 'జీబ్రా' చేశాను. ఫైనాన్షియల్ క్రైమ్స్ నేపథ్యంతో ఈ చిత్రం ఉంటుంది. నేను బ్యాంకు ఉద్యోగిగా చేసిన సమయంలో అక్కడ జరిగే కొన్ని తప్పులను గమనించాను. ఆ అనుభవాలను కూడా ఈ సినిమాలో చెప్పే ప్రయత్నం చేశాను. సత్యదేవ్, ధనంజయగార్లు బాగా నటించారు. సత్యరాజ్, ప్రియభవానీ పాత్రలూ ఆసక్తిగా ఉంటాయి. రవి బస్రూర్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నిర్మాతలు బాగా సపోర్ట్ చేశారు. త్వరలో నా కొత్త చిత్రం ప్రకటిస్తాను'' అన్నారు.

## సత్యభామ గుర్తుండిపోతుంది - మానస వారణాసి



**అ**శోక్ గల్లా, మానస వారణాసి జంటగా నటించిన చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. ప్రశాంత్ వర్మ అందించిన కథతో అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించిన చిత్రమిది. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా మానస వారణాసి మాట్లాడుతూ–''నేను హైదరాబాద్‌లో పుట్టాను. మా నాన్నగారు మలేషియాలో ఉద్యోగి. దీంతో నా స్కూలింగ్ అంతా అక్కడే సాగింది. ఇంజినీరింగ్ మాత్రం హైదరాబాద్‌లో పూర్తి చేశాను. ఆ తర్వాత ఓ కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేశాను. మిస్ ఇండియా పోటీల్లో విజేతగా నిలవడంతో మిస్ వరల్డ్ పోటీల్లో ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించాను. ఆ తర్వాత ఓ మూవీ వర్క్‌షాప్‌లో పాల్గొనడంతో సినిమా రంగంపై ఆసక్తి కలిగింది. ఇక 'దేవకి నందన వాసుదేవ' లో నేను విజయనగరం అమ్మాయి సత్యభామ పాత్రలో నటించాను. ఎలాంటి కష్టం వచ్చినా ధైర్యంగా ఎదుర్కొనే అమ్మాయి తను. సత్యభామ పాత్ర ప్రేక్షకులకు గుర్తుండి పోతుంది. నాకు భరతనాట్యంలో ప్రావీణ్యం ఉంది. దీంతో ఈ సినిమాలోని డ్యాన్స్ సాంగ్ 'బంగారం'కు అది కొంత ఉపయోగపడింది. అశోక్ గల్లా, అర్జున్ జంధ్యాలగార్లు సెట్స్‌లో సపోర్టివ్‌గా ఉన్నారు. బాలకృష్ణగారి వల్లే ఈ సినిమా గ్రాండ్‌గా వచ్చింది. హీరో సంతోష్ శోభన్‌తో 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీ చేశాను'' అన్నారు.

## ఉద్వేగంని మంచి సినిమాగా చూడండి - పరుచూరి గోపాలకృష్ణ

''**ఉ**ద్వేగం' చిత్రంలో నేను మంచి పాత్ర చేశాను. ఈ మూవీని చిన్న సినిమాగా కాకుండా ఒక మంచి సినిమా అనుకుని చూసి, ప్రేక్షకులు విజయం చేకూర్చాలి'' అని ప్రముఖ రచయిత, నటుడు పరుచూరి గోపాలకృష్ణ అన్నారు. త్రిగుణ్, దీప్సిక జంటగా మహిపాల్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ఉద్వేగం'. పరుచూరి గోపాలకృష్ణ, శివకృష్ణ, అంజలి, శ్రీకాంత్ భరత్, సురేష్ నాయుడు ఇతర పాత్రలు పోషించారు. జి.శంకర్, ఎల్.మధు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో త్రిగుణ్ మాట్లాడుతూ–''నా కెరీర్‌లో వెనక్కి తిరిగి చూసుకుంటే ఇది నేను చేశాను అని చెప్పుకునే గొప్ప సినిమా 'ఉద్వేగం'' అన్నారు. ''మంచి కథాంశంతో రూపొందిన మా మూవీని ఆదరించాలి'' అని జి.శంకర్, ఎల్. మధు తెలిపారు. ''కోర్టు డ్రామాగా రూపొందిన మా చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అని మహిపాల్ రెడ్డి చెప్పారు.



త్రిగుణ్, పరుచూరి గోపాలకృష్ణ, మహిపాల్ రెడ్డి

## పల్లెటూరి ప్రేమకథ



ఆర్పీ పట్నాయక్

**కి**ట్టు తాటికొండ, కష్మీరా, రోహిత్, సునీల్ రావినూతల, గోపీచంద్ కొండ, వైశాలి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'కరణం గారి వీధి'. దర్శకద్వయం హేమంత్-ప్రశాంత్ తెరకెక్కించారు. సౌత్ బ్లాక్ బస్టర్ క్రియేషన్స్‌పై అడవి అశోక్ నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సంగీత దర్శకుడు, నటుడు ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''కరణం గారి వీధి' టైటిల్ డిజైన్, పోస్టర్ చాలా కొత్తగా ఉన్నాయి. ఈ సినిమా విజయం సాధించి, టీమ్‌కి మంచి పేరు తేవాలి'' అన్నారు. ''పల్లెటూరి నేపథ్యంగా సాగే లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అని హేమంత్-ప్రశాంత్ చెప్పారు. ''త్వరలోనే విడుదల చేస్తాం'' అని అడవి అశోక్ చెప్పారు. ''ఈ చిత్రం చూస్తున్నప్పుడు నిజ జీవితంలో జరిగే కథలాగా అనిపిస్తుంది'' అని సునీల్ రావినూతల, కిట్టు తాటికొండ, రోహిత్, వైశాలి, గోపీచంద్ కొండ తెలిపారు.

## సరికొత్త హరుడు



శ్రీహరి, రామ్‌గోపాల్ వర్మ, లక్ష్మణ రావు

**శ్రీ**హరి, హెబ్బా పటేల్, వెంకట్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకుడు. మైత్రీ బాక్సాఫీస్, మైత్రీ ఆర్ట్స్ బ్యానర్స్‌పై డాక్టర్ లక్ష్మణరావు డిక్కల, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్‌ను డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ–''వైవిధ్యమైన, సరికొత్త కథాంశంతో రూపొందిన చిత్రం 'హరుడు'. ఔట్‌పుట్ బాగా వచ్చింది. ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని తెలిపారు. డాక్టర్ లక్ష్మణరావు డిక్కల మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో తీసిన తొలి చిత్రం 'హరుడు'. పోస్ట్ ప్రొడక్షన్ పనులు చురుగ్గా సాగుతున్న మా సినిమాని త్వరలో రిలీజ్ చేస్తాం'' అని చెప్పారు. సుమన్, అలీ, సలోని ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: ఆనంద్, సంగీతం: మణి జీనా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేష్ కుమార్ కవిట.

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 241 | 79 |
| 77,339 | 23,454 |

**విదేశీ సూచీలు** (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 18,809 | △ | 129 |
| డోజోన్స్ | 43,444 | ▽ | 1 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,109 | △ | 46 |
| డాక్స్ | 19,189 | ▽ | 22 |
| షాంఘై | 3,324 | ▽ | 7 |
| నికాయ్ | 38,221 | ▽ | 422 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## బులియన్ (రూ.లలో)

| ముంబై | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 74,808 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 74,508 |
| వెండి (కిలో) | 89,289 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 84.00 | 85.02 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 105.33 | 108.14 |
| € | యూరో | ఎస్‌బీఐ | 87.76 | 90.36 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 53.59 | 55.77 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 53.59 | 55.77 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 60.43 | 65.11 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.60 | 23.16 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 22.09 | 23.87 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.77 | 12.60 |

# వడ్డీ రేట్లు భారమే..

### భరించే స్థాయికి తగ్గించాలి

- బీమా తదితర ఉత్పత్తులను తప్పుడు మార్గాల్లో కస్టమర్లకు అంటగట్టొద్దు...
- బ్యాంక్‌లకు ఆర్థిక మంత్రి సీతారామన్ సూచన

**ముంబై:** ప్రస్తుత వడ్డీ రేట్లను ప్రజలు భారంగా భావిస్తున్నారని, కనుక వాటిని అందుబాటు స్థాయికి తీసుకురావాలంటూ బ్యాంక్‌లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఎస్‌బీఐ నిర్వహించిన వార్షిక వ్యాపార సదస్సులో భాగంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుతం భారతీయ పరిశ్రమలు కొత్త సామర్థ్యాలపై పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందంటూ.. వడ్డీ రేట్లను తగ్గించడం వికసిత్ భారత్ ఆకాంక్షను సాధించడంలో సాయపడుతుందన్నారు. ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేందుకు వీలుగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించాలని, ఈ విషయంలో ఆహారపరమైన ద్రవ్యోల్బణాన్ని అవరోధంగా చూడడం సరికాదంటూ కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సైతం వ్యాఖ్యానించడం తెలిసిందే. అక్టోబర్ నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం 6.2 శాతానికి చేరడంతో ఆర్‌బీఐ ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు నెలకొన్నాయి.

**సామాన్యులపై ద్రవ్యోల్బణ భారం:** ద్రవ్యోల్బణానికి ప్రధానంగా మూడు లేదా నాలుగు కమోడిటీలు కారణమవుతున్నాయని మంత్రి సీతారామన్ పేర్కొన్నారు. మిగిలిన ప్రధాన ఐటమ్స్ అన్నీ కూడా మూడు లేదా నాలుగు శాతం ద్రవ్యోల్బణం స్థాయిలోనే ఉన్నట్టు చెప్పారు. ద్రవ్యోల్బణం సూచీ లేదా ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపునకు ఆహార ధరలను పరిగణనలోకి తీసుకోవాలా? లేదా అన్న చర్చలోకి తాను వెళ్లాలనుకోవడం లేదన్నారు. ద్రవ్యోల్బణం ఎంతో సంక్లిష్టమైనదని, సామాన్యులపై భారం మోపుతుందంటూ.. సరఫరా వైపు చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించినట్టు చెప్పారు. వృద్ధి మందగమనంపై ఆందోళనలు అక్కర్లేదన్నారు. క్షేత్ర స్థాయిలో కార్యకలాపాలు బలంగా ఉన్నట్టు కొన్ని సంకేతాలు తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధి ప్రభుత్వానికి ముఖ్యమని స్పష్టం చేశారు. బ్యాంక్‌లు ప్రధానంగా రుణ వితరణ కార్యకలాపాలకే పరిమితం కావాలని, బీమా తదితర ఉత్పత్తులను తప్పుడు మార్గాల్లో కస్టమర్లకు అంటగట్టొద్దని, ఇది రుణాలను భారంగా మారుస్తుందని పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగంపై ప్రజల విశ్వాసాన్ని పెంచుకోవడంలో ఇది చాలా కీలకమని సీతారామన్ స్పష్టం చేశారు. ఎంఎస్‌ఎంఈలకు 2025–26లో రూ.6.12 లక్షల కోట్లు, 2026–27లో రూ.7 లక్షల కోట్ల మేర రుణ వితరణ లక్ష్యాలను నిర్దేశించినట్టు ఆమె తెలిపారు.



ముంబైలోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ శత వార్షికోత్సవంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి

### అనైతిక విధానాలను అరికట్టండి: దాస్



**ముంబై:** సరైన కేవైసీ ధ్రువీకరణ లేకుండా ఖాతాలు తెరవడం, అబద్ధాలు చెప్పి ఉత్పత్తులను అంటగట్టడం వంటి అనైతిక విధానాలకు అడ్డుకట్ట వేసే దిశగా బ్యాంకులు గట్టి చర్యలు తీసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు. ఇందుకోసం అంతర్గత గవర్నెన్స్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని పేర్కొన్నారు. తమ పోర్ట్‌ఫోలియోలను క్రియాశీలకంగా సమీక్షించుకుంటూ ఉండాలని చెప్పారు. పరిశ్రమల్లో విప్లవాత్మకమైన మార్పుల వల్ల తలెత్తే ముప్పులు.. సవాళ్లను ముందస్తుగా గుర్తించి, నివారించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రైవేట్ రంగ బ్యాంకుల డైరెక్టర్ల సదస్సులో కీలకోపన్యాసం చేసిన సందర్భంగా దాస్ ఈ విషయాలు తెలిపారు.

# కిరాణాలో... 'క్విక్' పాగా!

### దూసుకెళ్తున్న క్విక్ కామర్స్ రంగం

- 2030 నాటికి 40 బిలియన్ డాలర్లకు మార్కెట్
- డాటమ్ ఇంటెలిజెన్స్ నివేదిక

**న్యూఢిల్లీ:** సౌకర్యవంతంగా నిమిషాల వ్యవధిలోనే సరుకులను డెలివరీ చేసే సేవలకు ఆదరణ పెరుగుతుండటంతో సాంప్రదాయ కిరాణా దుకాణాల మార్కెట్ వాటాను క్విక్ కామర్స్ కంపెనీలు ఆక్రమిస్తున్నాయి. ఒక సర్వేలో పాల్గొన్న వినియోగదారుల్లో 46 శాతం మంది కిరాణా షాపుల నుంచి కొనుగోళ్లు గణనీయంగా తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో క్విక్ కామర్స్ మార్కెట్ పరిమాణం 2030 నాటికి 40 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నట్లు సర్వే నిర్వహించిన డాటమ్ ఇంటెలిజెన్స్ సంస్థ తమ నివేదికలో తెలిపింది. 2024లో ఈ మార్కెట్ 6.1 బిలియన్ డాలర్లుగా నమోదవుతుందని అంచనా. నివేదిక ప్రకారం ఈ ఏడాది కిరాణా అమ్మకాల్లో క్విక్ కామర్స్ మార్కెట్ దాదాపు 1.28 బిలియన్ డాలర్ల వాటాను దక్కించుకోనుంది. 2024 అక్టోబర్‌లో దేశీయంగా 10 నగరాల్లో నిర్వహించిన ఈ సర్వేలో 3,000 మంది పాల్గొన్నారు. పరిశ్రమ వర్గాలు, నిపుణులు, కిరాణా దుకాణాల యజమానుల ఇంటర్వ్యూలు, బ్రోకరేజి సంస్థలు..మీడియా రిపోర్టుల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది.

**సగటు ఆర్డరు రూ. 400..**

ముందుగా ప్రణాళిక వేసుకోకుండా అప్పటికప్పుడు కొనుగోలు చేసే వారికి క్విక్ కామర్స్ మాధ్యమం సౌకర్యవంతంగా ఉంటోంది. నివేదిక ప్రకారం క్విక్ కామర్స్‌ను ఉపయోగించుకునే వినియోగదారుల సగటు ఆర్డరు విలువ సుమారు రూ. 400గా ఉంటోంది. ఆన్‌లైన్‌లో నిత్యావసరాలను షాపింగ్ చేసేవారిలో 75 శాతం మంది గత ఆరు నెలల్లో గణనీయంగా ఇలాంటి కొనుగోళ్లు చేశారు. 82 శాతం మంది వినియోగదారులు కిరాణా స్టోర్స్‌లో నిత్యావసరాల కొనుగోళ్లను పావు భాగం తగ్గించుకుని, దాన్ని క్విక్ కామర్స్ వైపు మళ్లించారు. సాంప్రదాయ రిటైల్ విధానంలో వివిధ దశల్లో ఉండే మధ్యవర్తుల కమీషన్ల బాదరబందీ లేకపోవడంతో క్విక్ కామర్స్ సంస్థలు ఆకర్షణీయమైన ధరకే ఉత్పత్తులను అందిస్తుండటం సైతం కస్టమర్లు వాటివైపు మొగ్గు చూపేందుకు దోహదపడుతోంది. ఈ నేపథ్యంలో నిత్యావసరాల మార్కెట్లో ఆధిపత్యం ఉన్న కిరాణా స్టోర్స్ మనుగడ కోసం పోరాడే పరిస్థితులు నెలకొంటున్నాయి. 'క్విక్ కామర్స్ వినియోగం అసాధారణ వేగంతో పెరిగింది. 2024లో ఇది 74% వృద్ధి నమోదు చేయనుంది. 2023–28 మధ్యలో 48% వార్షిక వృద్ధితో అత్యంత వేగంగా ఎదిగిన మాధ్యమంగా నిలవనుంది' అని నివేదిక పేర్కొంది.



**క్విక్ కామర్స్ 'కిక్'..**

**10–30** నిమిషాల్లో సరుకులను ఇంటి దగ్గరకే అందించే సర్వీసులను క్విక్ కామర్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ విభాగంలో బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ మొదలైనవి టాప్‌లో ఉన్నాయి. షాపింగ్ సౌలభ్యాన్ని కోరుకునే కస్టమర్లకు వేగవంతంగా, సౌకర్యవంతంగా సేవలు అందించడంపై క్విక్ కామర్స్ సంస్థలు ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. నిత్యావసరాల డెలివరీతో మొదలుపెట్టిన క్విక్ కామర్స్ సంస్థలు ప్రస్తుతం వివిధ ఉత్పత్తులకు విస్తరించాయి. ఎలక్ట్రానిక్స్, దుస్తులు, కాస్మెటిక్స్, గృహోపకరణాలు, ఔషధాలు, పెంపుడు జంతువులకు సంబంధించిన ఉత్పత్తులు, పుస్తకాలు మొదలైనవన్నీ కూడా అందిస్తున్నాయి.

### ఎన్విరో ఇన్‌ఫ్రా @రూ.140-148

**ఈ నెల 22–26 మధ్య ఐపీవో**

**న్యూఢిల్లీ:** మురుగునీటి శుద్ధి(సివేజ్ ట్రీట్‌మెంట్), నీటిపారుదల ప్లాంట్లు, వ్యవస్థల అభివృద్ధికి సంబంధించిన టర్న్‌కీ ప్రాజెక్టులు చేపట్టే ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజనీర్స్ ఈ నెల 22న పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. షేరుకి రూ. 140–148 ధరల శ్రేణిలో ప్రారంభంకానున్న ఇష్యూ 26న ముగియనుంది. దీనిలో భాగంగా 3.87 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 5.68 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 650 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లకు 93% వాటా ఉంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 101 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.



# నిఫ్టీకి ఏడోరోజూ నష్టాలే..

### ఐటీ, ఆయిల్ షేర్లలో అమ్మకాలు

**ముంబై:** ఐటీ, ఆయిల్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో నిఫ్టీ ఏడోరోజూ నష్టాలు చవిచూసింది. అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 241 పాయింట్లు నష్టపోయి 77,339 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ నష్టాల ముగింపు. నిఫ్టీ 79 పాయింట్లు కోల్పోయి 23,454 వద్ద నిలిచింది. ప్రథమార్థంలో సెన్సెక్స్ 615 పాయింట్లు క్షీణించి 76,965 వద్ద, నిఫ్టీ 209 పాయింట్లు కోల్పోయి 23,350 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి మెటల్, రియల్టీ, ఆటో, సర్వీసెస్, కన్జూమర్ బ్యాంకులు షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలు కొంతమేర భర్తీ అయ్యాయి. రంగాలవారీగా.., ఐటీ ఇండెక్స్ 2.50%, ఆయిల్‌అండ్‌గ్యాస్ 2%, ఫార్మా, మీడియా సూచీలు 1% చొప్పున పతనమయ్యాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నందున తక్షణ వడ్డీరేట్ల తగ్గింపు ఇప్పట్లో అవసరం లేదంటూ ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలతో ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.



- డిసెంబర్‌లో ఫెడ్ రేట్ల కోత ఉండకపోవచ్చనే సంకేతాలతో టీసీఎస్, ఎంఫసీస్, ఎల్‌టీఐఎం షేర్లు 3% క్షీణించగా.. ఇన్ఫీ 2.50% విప్రో 2% పడ్డాయి.
- డిసెంబర్ నుంచి చైనా కమోడిటీలకు సంబంధించి ఎగుమ తులపై పన్ను రాయి తీలను తగ్గించడం లేదా రద్దు చేయాలనే ప్రతిపాదనలతో మెటల్ షేర్లు మెరిశాయి. నాల్కో 9 శాతం, హిందాల్కో 4%, వేదాంత 3%, టాటా స్టీల్ 2%, ఎన్‌ఎండీసీ 1.50%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఒకశాతం లాభపడ్డాయి.
- ప్రభుత్వం నేచరల్ గ్యాస్ సరఫరాను నెలలో రెండోసారి తగ్గించడంతో గ్యాస్ పంపిణీ సంస్థల షేర్లు పతనమయ్యాయి. ఇంద్రప్రస్థ గ్యాస్ 20% క్షీణించి రూ.325 వద్ద, మహానగర్ గ్యాస్ 14% పడి రూ.1,131 వద్ద ముగిశాయి.

**'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..**

| 100 బిలియన్ డాలర్లకు జీసీసీ రంగం! | మెటాకు సీసీఐ రూ. 213 కోట్ల జరిమానా |
|---|---|

# భవిత

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## విద్య, ఉద్యోగ సమాచారం

### కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 71 వర్క్‌మెన్ పోస్టులు

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన వర్క్‌మెన్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 71.
» **పోస్టుల వివరాలు:** స్కాఫ్‌ఫోల్డర్–21, సెమీ స్కిల్డ్ రిగ్గర్–50.
» **అర్హత:** స్కాఫ్‌ఫోల్డర్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సెమీ స్కిల్డ్ రిగ్గర్ పోస్టుకు నాలుగో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు మొదటి ఏడాది రూ.22,100, రెండో ఏడాది రూ.22,800, మూడో ఏడాది రూ.23,400.
» **ఎంపిక విధానం:** ప్రాక్టికల్/ఫిజికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.11.2024
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

### ఐఐటీ కాన్పూర్‌లో 16 ఆర్‌ఈవో పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) కాన్పూర్ ఒప్పంద ప్రాతిపదికన ఆర్‌ఈవో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫీసర్–06, రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫీసర్(గ్రేడ్–1)–08, రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫీసర్(గ్రేడ్–2)–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ /బీటెక్ (ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/మెకానికల్/మెటలర్జీ/ ఏరోనాటికల్),ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ(సివిల్/ఇన్విరాన్‌మెంటల్/కెమికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ఆర్‌ఈవో పోస్టులకు రూ.78,800 నుంచి రూ.2,09,200, ఆర్‌ఈవో(గ్రేడ్–1) పోస్టులకు రూ.67,700 నుంచి రూ.2,08,700, ఆర్‌ఈవో(గ్రేడ్–2) పోస్టులకు రూ.56,100 నుంచి రూ.1,77,500.
» **వయసు:** ఆర్‌ఈవో పోస్టులకు 48 ఏళ్లు, ఆర్‌ఈవో(గ్రేడ్–1) పోస్టులకు 45 ఏళ్లు, ఆర్‌ఈవో(గ్రేడ్–2) పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**08.12.2024.
» **వెబ్‌సైట్:** https://www.iitk.ac.in

### ఎన్ఐటీటీటీఆర్, చెన్నైలో 14 ఫ్యాకల్టీ పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్(ఎన్ఐటీటీటీఆర్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–09,అసోసియేట్ ప్రొఫెసర్–04, అసిస్టెంట్ ప్రొఫెసర్–01.
» **విభాగాలు:** మెకానికల్, కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్ అండ్ అప్లైడ్ సైన్స్, సివిల్, రూరల్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, కరికులమ్ డెవలప్‌మెంట్, ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్, మ్యాథమేటిక్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష,స్కిల్ టెస్ట్/ఫిజికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.11.2024
» **వెబ్‌సైట్:** https://www.nitttrc.ac.in

### డబ్ల్యూఐఐ, డెహ్రాడూన్‌లో సైంటిస్ట్-సి పోస్టులు

డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఐఐ) డైరెక్ట్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (బయోలాజికల్ /అగ్రికల్చర్/ఇన్విరాన్‌మెంటల్), పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.67,700 నుంచి రూ.2,08,700.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.01.2025
» **రాతపరీక్ష తేది:** 16.02.2025.
» **వెబ్‌సైట్:** https://wii.gov.in

» 2023లో ఇంటర్ ఉత్తీర్ణులు కూడా అర్హులే
» తాజాగా అర్హత నిబంధనల్లో మార్పు
» 2025 మే రెండో వారంలో అడ్వాన్స్‌డ్!

# మూడుసార్లు హాజరయ్యే అవకాశం

**జేఈఈ అడ్వాన్స్‌డ్.. ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్ ఐఐటీ క్యాంపస్‌ల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుల్లో.. ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! జేఈఈ-మెయిన్‌లో ప్రతిభ ఆధారంగా..జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు. ఈ పరీక్ష 2025, మే రెండో వారంలో జరిగే అవకాశం ఉంది. పరీక్ష నిర్వాహక సంస్థ ఐఐటీ-కాన్పూర్.. అడ్వాన్స్‌డ్-2025 అర్హతల్లో మార్పులు చేస్తూ.. తాజాగా ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. జేఈఈ-అడ్వాన్స్‌డ్-2025 తాజా మార్పులు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..**




జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వాహక వర్గాలు.. విద్యార్థులు సన్నద్ధమయ్యేందుకు వీలుగా పరీక్ష విధానం, ఇతర నిబంధనల్లో మార్పులను ముందుగానే తెలియజేస్తున్నాయి. ఇది అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటోంది. అడ్వాన్స్‌డ్–2025 విషయంలోనూ కొన్ని మార్పులు చేశారు. దీంతో.. మరికొంత మందికి ఈ పరీక్షకు హాజరయ్యే అవకాశం లభించనుంది.

**మూడు అటెంప్ట్‌లకు అవకాశం**

- జేఈఈ–అడ్వాన్స్‌డ్–2025 మార్పుల పరంగా ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశం.. అటెంప్ట్‌ల సంఖ్యను పెంచడం! గరిష్టంగా మూడు అటెంప్ట్‌లు ఇచ్చే అవకాశం కల్పిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. దీంతో.. 2023, 2024లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన వారు, అదే విధంగా 2025లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకూ అడ్వాన్స్‌డ్‌కు అర్హత లభించనుంది.
- గత ఏడాది వరకు.. రెండు అటెంప్ట్‌లు రాసేందుకే వీలుండేది. అంటే పరీక్ష నిర్వహించే సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించే వారు, అంతకుముందు సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారికి మాత్రమే పరీక్ష రాసేందుకు అర్హత ఉండేది. అడ్వాన్స్‌డ్–2025కు మాత్రం పరీక్ష నిర్వహించే సంవత్సరానికి ముందు రెండేళ్లలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు హాజరయ్యే వెసులుబాటు కల్పిస్తున్నారు.

**వయో పరిమితి యథాతథం**

జేఈఈ–అడ్వాన్స్‌డ్‌కు అటెంప్ట్‌ల సంఖ్య పరిమితిని పెంచినా.. వయో పరిమితి విషయంలో మాత్రం గతేడాది మాదిరిగానే నిబంధనలు అమలు చేయనున్నారు. అడ్వాన్స్‌డ్–2025కు జనరల్ కేటగిరీ అభ్యర్థులు అక్టోబర్ 1, 2000 తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు అక్టోబర్ 1, 1995 తర్వాత జన్మించి ఉండాలి.

**మెయిన్స్ నుంచి 2.5 లక్షల మందికే**

జేఈఈ–అడ్వాన్స్‌కు మెయిన్స్ ఉత్తీర్ణులను మాత్రమే ఎంపిక చేస్తారు. ఎప్పటి మాదిరిగా మెయిన్స్‌లో మార్కుల ఆధారంగా టాప్‌లో నిలిచిన 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. ఓపెన్ కేటగిరీలో 1,01,250 మందికి, జనరల్–ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 25 వేల మందికి; ఓబీసీ (ఎన్‌సీఎల్) కేటగిరీలో 67,500 మందికి, ఎస్సీ కేటగిరీలో 37,500 మందికి; ఎస్టీ కేటగిరీలో 18,750 మందికి మెయిన్స్ నుంచి అడ్వాన్స్‌డ్‌కు అర్హత లభిస్తుంది.

**పరీక్ష విధానం ఇలా**

జేఈఈ–అడ్వాన్స్‌డ్–2025 పరీక్షను రెండు పేపర్లుగా(పేపర్–1, పేపర్–2)గా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. పేపర్–1లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రతి సబ్జెక్ట్‌లో మూడు సెక్షన్లుగా పరీక్ష ఉంటుంది. పేపర్–1ను 51 ప్రశ్నలతో 180 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్–2ను కూడా 51 ప్రశ్నలతో 180 మార్కులకు నిర్వహిస్తారు. వాస్తవానికి గత మూడేళ్లుగా ప్రశ్నల సంఖ్యలో ఎలాంటి మార్పులు చేయలేదు. కాబట్టి ఈసారి కూడా ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చని చెబుతున్నారు.

## సిలబస్‌పై పట్టుతోనే రాణింపు

**రెండేళ్ల సిలబస్‌పై పట్టు**

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 అభ్యర్థులు.. ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం రెండేళ్ల సిలబస్‌పై పట్టు సాధించాల్సిన ఆవశ్యకత నెలకొంది. అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హతగా పేర్కొన్న జేఈఈ–మెయిన్‌లో పలు అంశాలను తొలగించారు. కానీ..ఇవి జేఈఈ–అడ్వాన్స్‌డ్‌లో ఉంటాయి. విద్యార్థులు మెయిన్స్‌తోపాటు అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను పరిశీలించి అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.

**ప్రత్యేక సమయం**

జేఈఈ–మెయిన్‌లో లేని అడ్వాన్స్‌డ్‌లో ఉన్న ప్రత్యేక అంశాలపై దృష్టి పెట్టాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత మెయిన్‌కు అదనంగా ఉన్న అంశాల రివిజన్‌కు సమయం కేటాయించాలి. అడ్వాన్స్‌డ్‌కు సిలబస్‌ను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగిస్తే.. ఒకే సమయంలో రెండు పరీక్షలకు సన్నద్ధత పొందే అవకాశం ఉంటుంది.

**మ్యాథమెటిక్స్**

ఈ సబ్జెక్ట్‌లో రాణించడానికి కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్‌పై దృష్టి పెట్టాలి. వీటితోపాటు 3–డి జామెట్రీ, కో ఆర్డినేట్ జామెట్రీ, వెక్టార్ అల్జీబ్రా, ఇంటిగ్రేషన్, కాంప్లెక్స్ నెంబర్స్, పారాబోలా, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. ఆయా టాపిక్స్‌ను ప్రాక్టీస్ చేస్తూ ప్రిపరేషన్ సాగించాలి.

**ఫిజిక్స్**

న్యూమరికల్ టైప్ కొశ్చన్స్ ఉండే ఈ విభాగంలో రాణించడానికి మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రో డైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్, సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌లో లోతైన అవగాహన ఏర్పరచుకుంటే మంచి మార్కులు సొంతమవుతాయి.

**కెమిస్ట్రీ**

అభ్యర్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్ కెమిస్ట్రీ. ఇందులో మంచి మార్కుల కోసం కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి–బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

**అన్వయ దృక్పథం**

అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. కాన్సెప్ట్‌లను అన్వయం దృక్పథంతో సాధన చేయాలి. ఇలా చేయడం ద్వారా పరీక్షలో అడిగే మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్, మ్యాచింగ్ టైప్ కొశ్చన్స్ వంటి వాటికి సులభంగా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

**ఆ రెండు పరీక్షలతో సమన్వయం**

- అభ్యర్థులు బోర్డ్ పరీక్షలు, జేఈఈ–మెయిన్ పరీక్షతో సమన్వయం చేసుకుంటూ అడ్వాన్స్‌డ్ దిశగా అడుగులు వేయాలి. మెయిన్ తొలి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా మెయిన్ ఎగ్జామ్ అంశాలపైనే పూర్తిగా దృష్టి పెట్టాలి. ఆ తర్వాత బోర్డ్ పరీక్షలకు సమయం కేటాయించాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత అడ్వాన్స్‌డ్‌కు పూర్తి స్థాయి సమయం కేటాయించాలి. జేఈఈ–మెయిన్ రెండో సెషన్‌కు కూడా హాజరయ్యే అభ్యర్థులు అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. అప్పటికే తాము పూర్తి చేసుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూ వాటికి సంబంధించి ప్రాక్టీస్ కొశ్చన్స్, ప్రీవియస్ కొశ్చన్స్‌ను సాధన చేసేలా సమయ పాలన రూపొందించుకోవాలి.
- ప్రతి వారం వీక్లీ టెస్ట్‌లు, గ్రాండ్ టెస్ట్‌లకు హాజరవుతూ లోటుపాట్లు సరిచూసుకుని వాటిని సరిదిద్దుకుంటూ అడుగులు వేయాలి.
- బోర్డ్ పరీక్షలు, మెయిన్ రెండో సెషన్ తర్వాత అడ్వాన్స్‌డ్ ప్రిపరేషన్ సమయంలో అప్పటికే పట్టు సాధించిన అంశాలపై మరింత లోతైన అవగాహన పొందేలా కృషి చేయాలి.
- ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రాసుకునే విధానం అలవర్చుకోవాలి. ఫలితంగా రివిజన్ విషయంలో సమయం ఆదా చేసుకోవచ్చు.

**జేఈఈ అడ్వాన్స్‌డ్-2025.. ముఖ్య సమాచారం**

- 2023, 2024లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు సైతం పరీక్షకు హాజరయ్యే అవకాశం.
- రెండు పేపర్లుగా జేఈఈ–అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహణ.
- మే నెల రెండో వారం లేదా మూడో వారంలో పరీక్ష!
- జేఈఈ–మెయిన్ నుంచి 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక.
- 23 ఐఐటీ క్యాంపస్‌లలో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్ + ఎంటెక్ కోర్సులు కలిపి మొత్తం 17,760 సీట్లు.
- 2025లో ఈ సంఖ్య కొంత పెరిగే అవకాశం.

## క్లుప్తంగా...

### స్థిరాస్తి సంస్థల్లో ఐటీ సోదాలు

- స్వస్తిక్ సంస్థలో తనిఖీలు
- నగరంతోపాటు చేవెళ్ల, షాద్‌నగర్‌లోనూ సోదాలు

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ సంస్థలే లక్ష్యంగా నగరంలో మరోమారు ఐటీ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి ఐటీ అధికారుల బృందాలు స్వస్తిక్ గ్రూప్ సంస్థలు, స్థిరాస్తి సంస్థల్లో తనిఖీలు చేసినట్టు తెలిసింది. పెద్ద మొత్తంలో పన్ను ఎగవేత ఆరోపణలపై ఐటీ అధికారుల బృందాలు స్వస్తిక్ సంస్థలో సోదాలు చేపట్టినట్టు సమాచారం. నగరంలోని బేగంబజార్, బంజారాహిల్స్, గచ్చిబౌలితోపాటు షాద్‌నగర్, చేవెళ్లలో సోదాలు కొనసాగాయి. సంస్థ కార్యాలయాలతోపాటు మేనేజర్లు కల్పనా రాజేంద్ర, లక్ష్మణ్ ఇళ్లలోనూ సోదాలు కొనసాగినట్టు తెలిసింది. సంస్థ చేపట్టిన భూముల విక్రయాలకు సంబంధించి పలు కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

### మూడేళ్లలో రూ. 24.82 కోట్ల సొత్తు రికవరీ

- 1,400 కేసులకు పైగా పరిష్కారం
- దర్యాప్తులో ఫింగర్ ప్రింట్ బ్యూరో కీలకం

సాక్షి, హైదరాబాద్: కేసుల దర్యాప్తు, చోరీ కేసుల పరిష్కారంలో తెలంగాణ ఫింగర్ ప్రింట్ బ్యూరో ఇచ్చే ఆధారాలు కీలకం అవుతున్నాయి. ఈ ఆధారాలతో 2022 నుంచి 2024 అక్టోబర్ వరకు మొత్తం రూ.24.82 కోట్ల సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఇతర నేరాలకు సంబంధించిన కేసుల్లోనూ ఫింగర్ ప్రింట్ బ్యూరో అధికారులు ఆధారాల సేకరణ, విశ్లేషణలో కీలకంగా పనిచేస్తున్నారు. ఫింగర్ ప్రింట్ బ్యూరో అధికారులు అత్యాధునిక పాపిలాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు. త్వరలో ఆంబిస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం.. 2022లో 452 కేసులు, 2023లో 504 కేసులు, 2024 అక్టోబర్‌లో 464 కేసులను పరిష్కరించారు.

### '15 రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె'

సాక్షి, హైదరాబాద్: సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పదిహేను రోజుల్లోగా పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దుండిగల్ యాదగిరి, ఝాన్సీ సౌజన్య రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పదిహేను రోజుల్లో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకుంటే.. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. ప్రస్తుత సీఎం ఎ.రేవంత్‌రెడ్డి.. పీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు హనుమకొండలో ఉద్యోగుల నిరసన వేదిక దగ్గరికి వచ్చి.. ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. సామాజిక మాధ్యమాల్లో కూడా సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలపై ఆయన హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. తమ సమస్యల పరిష్కారం ఊసే లేకపోవడంపై ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు.



## అందని ద్రాక్ష..


కొంతమంది నుదుటి రాత అంతే.. తరాలు మారినా మారదు. సపోజ్.. ఫర్ సపోజ్.. ఈ నక్క బావను చూడండి.. ఎప్పుడు నచ్చింది తిందామనుకున్నా.. నోటికి అందదు. అప్పట్లో ద్రాక్ష పళ్లు అందలేదు.. ఇప్పుడు ఈ పావురాలు.. బ్యాడ్ లక్‌ను భుజాన వేసుకుని తిరుగుతున్నాడు. వీడికి బ్యాడ్ లక్ ఏమోగానీ.. ఈ ఫొటో తీసిన ఫొటోగ్రాఫర్‌కు మాత్రం ఇది గుడ్ లక్‌నే తెచ్చిపెట్టింది. గోవాకు చెందిన ఎడ్విన్ అనే ఫొటోగ్రాఫర్ దక్షిణాఫ్రికాలోని కలగడి పార్కులో తీసిన ఈ చిత్రం బ్రిటిష్ ఫొటోగ్రఫీ పురస్కారాల్లో 'ల్యాండ్ యానిమల్' కేటగిరీలో విజేతగా నిలిచింది.




ఎడ్విన్

## టుడేస్ గ్రాఫిక్

అదిగో ఏలియన్స్ అంటే.. ఇదిగో ఫ్లయింగ్ సాసర్స్ అంటూ గ్రహాంతరవాసుల ఉనికిపై దశాబ్దాలుగా ఊహాగానాలు కొనసాగుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అంశంపై గ్లోబల్ అడ్వైజర్ ప్రిడిక్షన్స్ అనే సంస్థ ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల్లో ఓ సర్వే నిర్వహించింది. గ్రహాంతరవాసులు భూమిపైకి వస్తారని భావిస్తున్నారో లేదో చెప్పాలని సర్వేలో పాల్గొన్న ప్రజలను అడిగింది. ఇందులో అత్యధికంగా 43 శాతం మంది భారతీయులు గ్రహాంతరవాసులు ఉన్నారని గట్టిగా నమ్ముతున్నామని బదులిచ్చినట్లు తెలిపింది.




(అంకెలు: శాతాల్లో)

- సాక్షి, సెంట్రల్ డెస్క్

# ముతక జననాలు.. ముతక మరణాలు!

## గ్రూప్-3 పరీక్షల్లో దారుణంగా తెలుగు అనువాద ప్రశ్నలు

కొన్నిచోట్ల ఇంగ్లిష్‌లో ఉన్నది ఉన్నట్టుగా తెలుగులోకి..

పూర్తిగా తెలుగు మీడియంలోనే చదివి పరీక్ష రాసినవారి పరిస్థితి ఏమిటనే ఆందోళన.. ప్రశ్నపత్రాల అనువాదంపై కనీస శ్రద్ధ పెట్టలేదని టీజీపీఎస్సీపై విమర్శలు



సాక్షి, హైదరాబాద్: ముతక జననాలు.. ముతక మరణాలు.. ఇదేంటి ఏవో కొత్త పదాల్లా ఉన్నాయా? వీటి అర్థమేమిటనే సందేహం వస్తోందా? ఇవేకాదు గ్రూప్-3 పరీక్షల తెలుగు అనువాదంలో ఇలాంటి సరికొత్త పదాలు మరెన్నో ఉన్నాయి. భారత జనాభా వృద్ధిరేటుకు సంబంధించిన ప్రశ్నలో.. 'ది క్రూడ్ బర్త్ రేట్' అనే ఆంగ్ల పదానికి 'ముతక జననాల రేటు' అనే అనువాదం చేశారు. మరో ప్రశ్నలో 'క్రూడ్ డెత్ రేటు' అంటే.. 'ముతక మరణాల రేటు' అని తెలుగులో ఇచ్చారు. కొన్ని ప్రశ్నలలో తెలుగులో పదాలే లేనట్టుగా నేరుగా ఇంగ్లిష్ పదాలనే తెలుగు లిపి ఇచ్చారు. దీనిపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తెలుగు మీడియం వారి పరిస్థితి ఏమిటి?..:** సాధారణంగా టీజీపీఎస్సీ ఉద్యోగ పరీక్షల ప్రశ్నపత్రాలను ఆంగ్లంలో రూపొందించి, తెలుగులోకి అనువాదం చేస్తుంటారు. రెండు భాషల్లోనూ ప్రశ్నలు ఇస్తుంటారు. ప్రశ్నలు ఆంగ్లంలో సరిగానే ఉన్నా.. తెలుగు అనువాదం మాత్రం దారుణంగా ఉండటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చాలా మంది తెలుగు మీడియంలో చదివినవారే ఉంటారు. వారు తెలుగులో పరీక్ష రాసేందుకు మొగ్గు చూపుతుంటారు. అలాంటి వారికి ఇంగ్లిష్‌లోని ప్రశ్న ఏమాత్రం అర్థంకాకపోయినా, తెలుగులోని అనువాదం సరిగా లేకుంటే సమాధానాలు సరిగా రాయలేని పరిస్థితి ఉంటుంది. కానీ అధికారులు ప్రశ్నపత్రాలను తెలుగులోకి అనువాదం చేసే అంశాన్ని కనీసం పట్టించుకున్నట్టు కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగులోని కొన్ని ప్రశ్నలను చూస్తుంటే ఏదో కొత్త భాష చదువుతున్నట్టుగా ఉందని అభ్యర్థులు వాపోతున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఇంత తేలికగా తీసుకోవడం ఏమిటని మండిపడుతున్నారు. లిప్యంతరీకరణ చేయడమేంటని అడుగుతున్నారు. యూపీఎస్సీ వంటి జాతీయ పరీక్షల్లో ఎలాగూ ఇంగ్లిష్, హిందీలో మాత్రమే ఇస్తుంటారని.. కనీసం రాష్ట్ర స్థాయిలో రాసే పరీక్షల్లోనైనా తెలుగులో చూసుకుని పరీక్ష రాసే పరిస్థితి లేదని వాపోతున్నారు. "గ్రూప్-3 పరీక్ష మాత్రమే కాకుండా రాష్ట్రంలో జరిగే అన్ని రకాల పోటీ పరీక్షల్లో అనువాదం సమస్య ఇలాగే ఉంటోంది. ఈ విషయంలో టీజీపీఎస్సీ ఎందుకు చొరవ తీసుకోవట్లేదో అర్థం కావట్లేదు. దీనితో తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది" అని కృష్ణ ప్రదీప్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ పేర్కొన్నారు.

### మూడు సెషన్ల హాజరు 50.24 శాతం

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-3 ఉద్యోగాల భర్తీకోసం నిర్వహించిన అర్హత పరీక్షలు సోమవారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు మూడు సెషన్లలో జరిగిన ఈ పరీక్షలకు 50.24 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు మొత్తం 5,36,400 మంది దరఖాస్తు చేసుకోగా.. 76.4 శాతం మందే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆ ప్రక్రియలోనే పావు వంతు అభ్యర్థులు పరీక్షలకు దూరమవగా.. మరో పావు వంతు మంది హాల్‌టికెట్లు తీసుకుని కూడా పరీక్షలు రాయలేదు.



## చేతిపంపు.. వెళ్లాలంటే దారెటు?

రేగొండ: జాతరకొచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చేతిపంపు నిరుపయోగమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి శివారు బుగులోని జాతరకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చడానికి ప్రధాన రహదారి పక్కన చేతి పంపును ఏర్పాటు చేశారు. అయితే, రోడ్డుపక్కన ఇటీవల అధికారులు కాలువను తవ్వించడంతో ఈ చేతిపంపు కాలువ మధ్యలోకి వెళ్లిపోయింది. చేతిపంపును అలాగే వదిలేసి చుట్టూ 8 అడుగుల లోతున మట్టి తీశారు. దీంతో చేతిపంపును వినియోగించుకునే అవకాశం లేకుండాపోయింది. అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.


# 'శ్రీవాణి'లో మార్పులు!

### ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు

### ట్రస్టు పేరు మార్పుపై నివేదికకు ఆదేశం

తిరుమల: శ్రీవాణి ట్రస్టు పేరు మార్పుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి తదుపరి సమావేశం నాటికి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సోమవారం ఉదయం తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ నూతన ధర్మకర్తల మండలి తొలి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రైవేట్ బ్యాంకుల్లోని డిపాజిట్లను వెనక్కు తీసుకుని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నారు. శ్రీవారి నిత్య అన్న ప్రసాదం మెనూలో అదనంగా మరొక పదార్థాన్ని చేరుస్తామని చెప్పారు. తిరుమల గోగర్భం డ్యామ్ వద్ద విశాఖ శారద పీఠానికి చెందిన మఠం నిర్మాణంలో అవకతవకలు, ఆక్రమణలు జరిగినట్లు టీటీడీ అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా భవనం లీజు రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. క్యూలలో భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి 2, 3 గంటల్లోనే దర్శనమయ్యేలా నిపుణుల కమిటీని నియమించామన్నారు. తిరుమలలో రాజకీయాలు మాట్లాడినా, ప్రచారం చేసినా కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుపతి స్థానికులకు ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పిస్తామన్నారు. టూరిజం కార్పొరేషన్లు, ఆర్టీసీ ద్వారా ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 ) టికెట్లలో అవకతవకలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సదరు సంస్థల ద్వారా కోటాను పూర్తిగా రద్దు చేస్తామని టీటీడీ చైర్మన్ ప్రకటించారు. టీటీడీలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగస్తులను తొలగిస్తామని, దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కాగా శ్రీవాణి ట్రస్టు పేరును మార్చి ప్రధాన ఖాతాను మార్చడం వల్ల 80 సీ నిబంధన వర్తించక టీటీడీకి ట్యాక్స్ భారం పడే అవకాశం ఉందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# 131 ఈవీలపై పన్ను మినహాయింపు



### రూ. 25.15 లక్షలు మినహాయింపు

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రభుత్వం పన్ను మినహాయింపు ప్రకటించిన నేపథ్యంలో మొదటిరోజు సోమవారం హైదరాబాద్‌లో కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలపైన పన్నులు, ఫీజుల రూపంలో రవాణాశాఖ రూ.25.15 లక్షల మినహాయింపునిచ్చింది. మొదటి రోజు హైదరాబాద్‌లో 121 ద్విచక్ర వాహనాలు, ఆరు కార్లు కొత్తగా అమ్ముడయ్యాయి. కార్లపైన జీవితకాల పన్ను రూపంలో రూ.13.74 లక్షలు, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో మరో రూ.6,000 వరకు వాహనదారులకు రాయితీ లభించింది. అలాగే 121 ద్విచక్ర వాహనాలపై జీవితకాల పన్ను రూపంలో రూ.10.94 లక్షల వరకు వాహనదారులకు రాయితీ లభించడం గమనార్హం. ఆటోలు, గూడ్స్ వాహనాలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి విధించే త్రైమాసిక పన్ను నుంచి కూడా మినహాయింపు లభించింది. ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రభుత్వం ఇచ్చిన పన్ను రాయితీ అవకాశాన్ని వాహన కొనుగోలుదార్లు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జేటీసీ రమేశ్ సూచించారు. నగరంలో వాహన కాలుష్యం ఆందోళన కలిగిస్తున్న దృష్ట్యా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వైపు మళ్లాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు.

### మొదటి రోజు ఈవీ అమ్మకాలు, మినహాయింపులు ఇలా...

| కేటగిరీ | అమ్మకాలు | లైఫ్ ట్యాక్స్ మినహాయింపు | రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు | మొత్తం (రూ.) |
|---|---|---|---|---|
| ఆటోరిక్షా | 3 | - | 3,000 | 3,000 |
| గూడ్స్‌క్యారేజ్ | 1 | - | 1,000 | 1,000 |
| కార్లు | 6 | 13,74,688 | 6,000 | 13,80,688 |
| బైక్‌లు | 121 | 10,94,892 | 36,300 | 11,31,192 |
| మొత్తం | 131 | 24,69,580 | 46,300 | 25,15,880 |




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం। 19-11-2024

# ఊగిసలాటకు తెరపడేదెప్పుడో!




**రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల పవర్ ప్లాంట్**

సింగరేణి, జెన్‌కోల సంయుక్త భాగస్వామ్యంతో నిర్మించేందుకు ప్రభుత్వ నిర్ణయం

డీపీఆర్ కోసం ప్లాంట్‌ను సందర్శించిన డిజిగ్ సంస్థ

76 శాతం కావాలంటున్న జెన్‌కో, 50 శాతం ఇవ్వాలంటున్న సింగరేణి

భాగస్వామ్యంపై లెక్కలు తేలితేనే శంకుస్థాపనకు అవకాశాలు

సాక్షి, పెద్దపల్లి: రామగుండంలోని జీవితకాలం ముగిసిన బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో 800 మెగావాట్ల కొత్త పవర్ ప్లాంట్ స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఇటీవల రామగుండంలో పర్యటించి ప్లాంట్ సాధ్యాసాధ్యాలపై సమీక్షించారు. సుమారు రూ.10 వేల కోట్ల వ్యయంతో 800 మెగావాట్ల సామర్థ్యం గల సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ నెలకొల్పేందుకు నిర్ణయించారు. అయితే, జెన్‌కో, సింగరేణి సంయుక్త భాగస్వామ్యంలో గణాంకాలు తేలకపోవడంతో ప్లాంట్ పనుల్లో జాప్యమవుతోందని ఉద్యోగులు అంటున్నారు.

**డీపీఆర్ కోసం..**

పెద్దమొత్తంలో పెట్టుబడి భరించే అవకాశం లేదని సింగరేణి, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ(జెన్‌కో) సంయుక్త భాగస్వామ్యంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన విధివిధానాలను సింగరేణితో కలిసి వారంలోగా రూపొందించాలని జెన్‌కోకు రాష్ట్ర ఇంధనశాఖ గత సెప్టెంబర్‌లో ఆదేశాలు జారీచేసింది. సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను నెలలోగా తయారు చేయాలని జెన్‌కోకు సూచించింది. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం డిజిగ్ అనే సంస్థ డీపీఆర్ తయారు చేసేందుకు ప్లాంట్‌ను సందర్శించింది. పాత విద్యుత్ కేంద్రాన్ని తొలగించేందుకు వివిధ విభాగాలకు చెందిన ఇంజనీర్లను జెన్‌కో ప్రత్యేకంగా నియమించినట్టు విశ్వసనీయ సమాచారం.

**1971 నుంచి బీ-థర్మల్‌లో విద్యుత్ ఉత్పత్తి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బొగ్గు, నీరు అందుబాటులో ఉండటంతో రామగుండంలో 1965 జూలై 19న అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ-థర్మల్ పవర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. 1971లో ఇది విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. ప్లాంట్ నిర్మాణానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.14.80 కోట్లు ఖర్చు చేసింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) నిబంధనల ప్రకారం 1996 వరకే ఈ ప్లాంట్‌ను నడిపించాల్సి ఉంది. కానీ, దాని జీవితకాలం పొడిగిస్తూ వచ్చారు. మరోవైపు కొన్నేళ్లుగా ప్లాంట్‌లో బాయిలర్ ట్యూబ్స్ లీక్‌కావడం, మిల్స్, టర్బైన్ విభాగాల్లో తరచూ సమస్యలు తలెత్తడంతో గుదిబండగా మారింది. విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. తరచూ షట్‌డౌన్ కావడం, ఆ తర్వాత పునరుద్ధరించేందుకు ప్రతీసారి బాయిలర్ మండించేందుకు సుమారు రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతుండటంతో నిర్వహణ భారమైంది. అంతేకాదు.. దాని జీవితకాలం ముగియటంతో ప్లాంట్‌ను మూసివేశారు.

**భాగస్వామ్యంపై పీటముడి**

పాత ప్లాంట్ పరిధిలో 560 ఎకరాల స్థలం, అనుభవం కలిగిన ఇంజనీర్లు, శ్రామిక శక్తి ఉన్న జెన్‌కోను కాదని, సింగరేణి భాగస్వామ్యంతో ప్లాంట్ ఏర్పాటు చేయడాన్ని జెన్‌కో ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. గతనెలలో వివిధ రూపాల్లో నిరసన తెలియజేశారు. అయినా, ప్రభుత్వం సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఆసక్తి చూపుతోంది. మరోవైపు.. జెన్‌కో 76 శాతం, సింగరేణి 24 శాతం వాటాతో ప్లాంట్ నిర్మించేందుకు జెన్‌కో ఇంజనీర్లు సముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. అయితే, సింగరేణి సంస్థ తమకు 50 శాతం వాటా ఇవ్వాలని ఉన్నతస్థాయి సమావేశంలో పట్టుబట్టినట్టు సమాచారం. భాగస్వామ్యం లెక్కలు తేలి రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరితేనే కొత్త ప్లాంట్ శంకుస్థాపనకు అవకాశం ఉంటుంది. అప్పుడే జెన్‌కో పాలకమండలి పాత ప్లాంట్‌ను మూసివేసినట్టుగా ఆమోదం తెలిపే అవకాశాలుంటాయని జెన్‌కో ఉద్యోగులు చెబుతున్నారు. జెన్‌కో, సింగరేణి సీఎండీల మధ్య సయోధ్య కుదుర్చేందుకు ఉపముఖ్యమంత్రి సాయంతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రయత్నాలు చేశారు. మధ్యేమార్గంగా నిర్ణయానికి వచ్చి ఫౌండేషన్ స్టోన్ వేసేందుకు సిద్ధమయ్యేలా చూడాలని ఆయన సూచించారు.

## తెలంగాణ హైకోర్టులో స్టాండింగ్ కౌన్సెల్స్ వివరాలు

| కౌన్సెల్ పేరు | విభాగం |
|---|---|
| మిద్దె అరుణ్‌కుమార్ | జీహెచ్‌ఎంసీ |
| రవి మహేందర్ | జీహెచ్‌ఎంసీ |
| పచ్చా శ్రీనివాసరావు | జీహెచ్‌ఎంసీ |
| రాపర్తి వెంకటేశ్ | జీహెచ్‌ఎంసీ |
| గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి | నిజామాబాద్ కార్పొరేషన్ |
| పాశం మోహిత్ | వరంగల్ కార్పొరేషన్ |
| పుట్ట కృష్ణారెడ్డి | రాష్ట్ర మున్సిపాలిటీలు |
| నిజాంపూర్ చంద్రశేఖర్ | టీజీఆర్‌టీసీ |
| జెల్లి నరేందర్ | టీజీఆర్‌టీసీ |
| రమేశ్ చిల్ల | సర్వీస్ మ్యాటర్స్(మున్సిపాలిటీలు) |
| ఆర్. మాధవి లత | సర్వీస్ మ్యాటర్స్(కరీంనగర్, నిజామాబాద్, రామగుండం, ఖమ్మం) |
| సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి | పెద్ద అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, మీర్‌పేట్ మున్సిపాలిటీలు |
| కంచని లక్ష్మయ్య | శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు |
| మర్రెడ్డి భాగ్యశ్రీ | బండ్లగూడ కార్పొరేషన్, ఆదిబట్ల, శంకర్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలు |
| మారగాని కృష్ణ | బడంగ్‌పేట్ కార్పొరేషన్, షాద్‌నగర్ మున్సిపాలిటీ |
| నిమ్మకంటి ఉమాశంకర్ | వ్యవసాయ మార్కెట్ కమిటీ |
| ఎన్.శ్రీధర్‌రెడ్డి | ట్రాన్స్‌కో |
| పి.సత్యమంజులకుమార్ | చేనేత అభివృద్ధి కార్పొరేషన్ |
| బి.చంద్రశేఖర్ | రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ |
| తడకమల్ల శరత్ | కాళోజీ యూనివర్సిటీ |
| ఎంవీడీ బాలు | గిడ్డంగుల కార్పొరేషన్ |
| కోయ ప్రభాకర్‌రెడ్డి | నిమ్స్ |
| ఎం.ప్రవీణ్‌కుమార్ | వైద్య విధాన పరిషత్ |
| రాజ్‌కుమార్ రుద్ర | ఇంటర్మీడియెట్ బోర్డు |
| కొమ్ము కల్పన | ఆగ్రో ఇండస్ట్రీస్ |
| సీ.బుచ్చిరెడ్డి | హౌసింగ్ బోర్డు |
| మల్లారపు కిరణ్‌రెడ్డి | హౌసింగ్ బోర్డు |
| వైవీ భాస్కర్‌రెడ్డి | అటవీ అభివృద్ధి |
| జీషన్ అద్నాన్ | కాలుష్యనియంత్ర మండలి |
| బొమ్మినేని భరత్‌రెడ్డి | డెయిరీ డెవలప్‌మెంట్ |

# 'సొమ్ము'సిల్లుతున్న గల్ఫ్ బాధితులు

- గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- రెండు నెలల క్రితమే ఉత్తర్వులు జారీ
- రెండో విడతలో 129 కుటుంబాలకు రూ.6.45 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటన
- ఇప్పటి వరకు బాధితుల ఖాతాల్లో జమ కాని సొమ్ము

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు పరిహారం అందించడంలో ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ కారణం చేతనైనా గల్ఫ్ దేశాల్లో మరణిస్తే.. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన ప్రభుత్వం.. ఆ సొమ్ము జమ చేయడానికి జాప్యం చేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారానికి వచ్చాక గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వలస కార్మికులను గుర్తించింది. ఇందులో భాగంగా తొలి విడత ఇద్దరు కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించింది. రెండో విడతలో 15 జిల్లాల్లోని 129 మందికి రూ.6.45 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. గత అక్టోబర్ 21న ఉత్తర్వులను జారీ చేయగా.. ఇప్పటి వరకు ఏ ఒక్క బాధిత కుటుంబం ఖాతాలో సాయం సొమ్ము జమ కాలేదు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు పరిహారం మంజూరు చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధిత కుటుంబ సభ్యులలో ఒకరి ఖాతా నంబర్‌ను సేకరించినా.. సొమ్ము మాత్రం జమ చేయలేదు. నిధుల కొరత వల్లే సాయం సొమ్ము జమ కావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తమకు పరిహారం సొమ్ము చేతికి అందితే అప్పులు తీర్చుకోవడం లేదా కుటుంబ భవిష్యత్ అవసరాలకు వినియోగించుకుని సాధారణ జీవితం గడుపుదామని ఆశించిన లబ్ధిదారులకు.. ప్రభుత్వ తీరుతో నిరాశే మిగులుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిహారం సొమ్మును వెంటనే జమ చేయాలని బాధితులు కోరుతున్నారు.



**నిర్లక్ష్యం తగదు**

ఎంతో బాధతో ఉన్న వలస కార్మికుల కుటుంబాలకు పరిహారం సొమ్ము జమ చేయడంలో జాప్యం తగదు. పోయినవారిని ఎలాగూ తీసుకురాలేం. కనీసం ఆర్థిక సాయంతోనైనా ఆ కుటుంబానికి ధీమా ఇవ్వాలి. ఉత్తర్వులు ఇచ్చి రోజులు గడుస్తున్నా సొమ్ము జమ చేయడంలో ఆలస్యం ఎందుకో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులను విడుదల చేయాలి.
– గంగుల మురళీధర్‌రెడ్డి, గల్ఫ్ జేఏసీ ఉపాధ్యక్షుడు

# రాష్ట్రాలకు శిక్షణ.. కేంద్రం భక్షణ

ఆర్థిక క్రమశిక్షణలో రాష్ట్రాలే బెటర్ • గత పదేళ్లలో కేంద్ర ద్రవ్యలోటు 3.5–9.2 శాతం

3.5 శాతంలోపే కట్టడి చేస్తున్న రాష్ట్రాలు • కరోనా సమయంలో మాత్రమే 4.1 శాతం

ప్రణాళిక పద్దు ఖర్చులోనూ రాష్ట్రాలదే పైచేయి • 16వ ఆర్థిక సంఘానికి లెక్కలతోసహా చెప్పిన రాష్ట్ర సర్కారు

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక క్రమశిక్షణలో కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్రాలే మెరుగ్గా ఉన్నాయి. స్థానిక అవసరాలకు అనుగుణంగా పథకాలను రూపొందించుకుని పొదుపుగా, అవసరాల మేరకు ఖర్చు చేయడంలో రాష్ట్రాల పనితీరు మెరుగ్గా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. దేశ జీడీపీ, రాష్ట్రాల జీఎస్‌డీపీలతో పోలిస్తే గత పదేళ్లలో ఏ సంవత్సరంలోనూ ద్రవ్యలోటు కేంద్రం కంటే రాష్ట్రాల్లో ఎక్కువగా నమోదు కాకపోవడం వాటి ఆర్థిక క్రమశిక్షణను తెలియజేస్తోంది. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన 16వ ఆర్థిక సంఘానికి ఘాటుగానే వెల్లడించింది. రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని కేంద్రం చెపుతున్న దానికి భిన్నంగా గణాంకాలున్నాయని తెలిపింది. ఈ ద్రవ్యలోటు గణాంకాలే నిధుల వ్యయంలో రాష్ట్రాల వివేకానికి, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి సాక్ష్యమని పేర్కొంది. ఆర్థిక నిర్వహణ బాధ్యతలను సూచించే చట్టాల పరిధిలో ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్నామని, జీడీపీలో 3 శాతానికి అటూ ఇటుగా ద్రవ్యలోటును కట్టడి చేస్తున్నామని తెలిపింది. 2016–17లో కేంద్రం ప్రవేశపెట్టిన ఉదయ్ స్కీం కారణంగా రాష్ట్రాలపై అప్పుల భారం పెరిగి ద్రవ్యలోటు కేంద్రంతో సమానంగా వచ్చిందని, ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసిన కరోనా వైరస్ ప్రబలిన సమయంలోనూ కేంద్రం కంటే ద్రవ్యలోటు రాష్ట్రాలదే తక్కువ ఉందని స్పష్టం చేసింది.

**జీడీపీతో పోలిస్తే గత పదేళ్ల ద్రవ్యలోటు గణాంకాలు (శాతాల్లో)**

| సంవత్సరం | కేంద్రం | రాష్ట్రం |
|---|---|---|
| 2013-14 | 4.4 | 2.2 |
| 2014-15 | 4.1 | 2.6 |
| 2015-16 | 3.9 | 3.1 |
| 2016-17 | 3.5 | 3.5 |
| 2017-18 | 3.5 | 2.4 |
| 2018-19 | 3.4 | 2.5 |
| 2019-20 | 4.6 | 2.7 |
| 2020-21 | 9.2 | 4.1 |
| 2021-22 | 6.7 | 2.8 |
| 2022-23 | 6.4 | 3.5 |

**0.5 శాతం రాష్ట్రాలే ఎక్కువ**

మూలధన వ్యయంలోనూ కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్రాలే ముందంజలో ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘానికి ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. గత 30 ఏళ్ల సగటులోనూ ఇదే తేలిందని తెలిపింది. 30 ఏళ్ల సగటులో కేంద్ర ప్రణాళిక వ్యయం జీడీపీతో పోలిస్తే 1.4 శాతం అయితే, రాష్ట్రాల వ్యయం 1.9 శాత మని గణాంకాలతోసహా ఆర్థిక సంఘం ముందు ఉంచింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రాల ప్రణాళిక వ్యయం జీడీపీతో పోలిస్తే 2.7 శాతానికి చేరితే, కేంద్రం మాత్రం 2.3 శాతం వద్దే ఆగిపోయిందని ఆ నివేదికలో చురకలంటించింది.

## ఇందిరమ్మ రాజ్య స్థాపనే లక్ష్యం

మంత్రి సురేఖ

సాక్షి, హైదరాబాద్: ఇందిరాగాంధీ ఆశయాల మేరకు మహిళల సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అహరహం శ్రమిస్తోందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్య స్థాపనే లక్ష్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.వేల కోట్ల రుణాలందిస్తూ.. వారి స్వయం సాధికారత దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా.. ప్రధానిగా ఈ దేశ గమనాన్ని మార్చిన ఆమె విప్లవాత్మక నిర్ణయాలు, ఆదర్శవంతమైన విధానాలను సురేఖ గుర్తు చేసుకున్నారు.

## ఇందిరా గాంధీకి సీఎం రేవంత్ నివాళి

సాక్షి, హైదరాబాద్: భారత తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆమెకు నివాళులర్పించారు. నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించుకునే 'జాతీయ సమైక్యతా దినోత్సవం'సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. నెహ్రూ నుంచి అందిపుచ్చుకున్న నాయకత్వ పటిమతో ఉక్కు మహిళ ఇందిరా గాంధీ దేశ ప్రజలకు మేలు చేసే ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని ఒక ప్రకటనలో కొనియాడారు. పేదలు, మహిళల అభ్యున్నతికి ఇందిర విశేష కృషి చేశారని గుర్తుచేశారు.

## భుజంగరావు మధ్యంతర బెయిల్ పొడిగింపు

ఫోన్ ట్యాపింగ్ కేసులో హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు (ఏ–3), మాజీ ఏఎస్పీ భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు మరోసారి పొడిగించింది. వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సల నిమిత్తం ఇచ్చిన మధ్యంతర బెయిల్ గడువు సోమవారం ముగియడంతో దాన్ని పొడిగించాలంటూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ కె.సుజన మరోసారి విచారణ చేపట్టారు. పీపీ వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో మరో నిందితుడు తిరుపతన్న దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27న సుప్రీంకోర్టులో విచారణ ఉందని, అప్పటివరకు వాయిదా వేయాలని కోరారు. దీనికి అనుమతించిన న్యాయమూర్తి తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేశారు. అలాగే మరో నిందితుడు రాధాకిషన్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలు ఈ నెల 21కి వాయిదా పడ్డాయి.

## ఏం ఉద్ధరించారని ఏడాది సంబురాలు

సీఎం సీటులో కూర్చుని రేవంత్ పచ్చి అబద్ధాలు: మధుసూదనాచారి

సాక్షి, హైదరాబాద్: ఏడాది పాలనలో ఏం ఉద్ధరించారని కాంగ్రెస్ పార్టీ సంబురాలు జరుపుతోందని శాసన మండలిలో ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనా చారి ప్రశ్నించారు. కాంగ్రెస్ జరపాల్సింది విశ్వాస ఘాతక, విధ్వంస సభలు అని ఎద్దేవా చేశారు. ఏడాది పాలనలో రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. కాంగ్రెస్ విజయోత్సవ సభ లకు బదులుగా విద్వేష సభలు పెట్టుకోవాలని చెప్పారు. పార్టీ నేతలు సోమ భరత్‌కుమార్, డాక్టర్ ఆంజనేయగౌడ్, పల్లె రవికుమార్, ఆల కుంట హరితో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వరంగల్‌లో పర్యటిస్తున్న నేపథ్యంలో పలు అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సత్య వాది అయిన కాళోజీ మందిరాన్ని అసత్యవాది రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తే కాళోజీ ఆత్మ ఘోషి స్తుందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రైతులను వంచించిన కాంగ్రెస్ పార్టీకి అక్కడ సభ పెట్టే హక్కు లేదన్నారు. నెలకు రూ.30వేల కోట్ల ఆదాయం వస్తే పాలన సక్ర మంగా జరుగుతుందని చెబుతున్న రేవంత్.. కేవలం రూ.18వేల కోట్ల ఆదాయం మాత్రమే వస్తుందని చేసిన ప్రకటనను గుర్తు చేశారు. రాష్ట్ర ఆదాయం తగ్గడంతో ఏ ప్రభుత్వ పథకా లకు కోత వేస్తున్నారో సీఎం రేవంత్ స్పష్టం చేయాలన్నారు. కేసీఆర్‌ను కించపరచడం మినహా రేవంత్ ప్రభుత్వానికి ఏదీ చేతకావడం లేదని చెప్పారు. సీఎం సీటులో కూర్చుని సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, తెలంగాణలో కాంగ్రెస్ చేసిన మోసాలు చూసి మహారాష్ట్రలో ఓటు వేయాలా అని ప్రశ్నించారు.

# పదేళ్లు.. ప్రకృతి నష్టం



**వరుస వైపరీత్యాలతో రాష్ట్రానికి వేల కోట్ల నష్టం**

- 2015 నుంచి ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయిన 371 మంది
- లక్షకుపైగా మూగజీవాల మృత్యువాత.. 80 వేలకు పైగా ఇళ్లు ధ్వంసం
- 18 లక్షల హెక్టార్లలో పంట నష్టం.. రూ.1,500 కోట్ల మేర నష్టం
- ఐదేళ్లలో పిడుగుపాట్లకు 350 మంది బలి

సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లలో ప్రకృతి వైపరీత్యం రాష్ట్రానికి పెద్ద నష్టమే చేసిందని గణాంకాలు చెబుతున్నాయి. వడగళ్లు, కరువు, భారీ వర్షాలు, క్లౌడ్ బరస్ట్, అకాల వర్షాలు, వరదలు, అధిక వేడి, పిడుగుల్లాంటి ఘటనల కారణంగా భారీ స్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగాయని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 16వ ఆర్థిక సంఘానికి నివేదించిన లెక్కల ప్రకారం గత పదేళ్ల కాలంలో (2015–2024) ప్రకృతి వైపరీత్యాల కారణంగా వేల కోట్ల రూపాయల విలువైన నష్టం జరిగింది. ఒక్కో ఏడాది ఒక్కో రకమైన వైపరీత్యం కారణంగా ఇప్పటివరకు 371 మంది చనిపోయినట్టు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక, మూగజీవాలు అయితే లక్షకు పైగా మృత్యువాత పడ్డాయి. మొత్తం 80 వేల ఇళ్లు పాక్షికంగా, పూర్తిగా ధ్వంసమయ్యాయి. దాదాపు 40 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగింది. వీటన్నింటి విలువ రూ.1,500 కోట్ల వరకు ఉందని ప్రభుత్వ నివేదికలో పేర్కొన్న గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**ప్రకృతి వైపరీత్యాల నష్టం ఇలా..**


| సంవత్సరం | ప్రాణనష్టం | మూగజీవాలు | ఇళ్లు | పంట | విలువ |
|---|---|---|---|---|---|
| 2015 | 5 | 2,160 | 868 | 14,47,504 | 117.53 |
| 2016 | 49 | 6,000 | 37,991 | 2,51,461 | 238.41 |
| 2017 | 3 | 178 | 187 | 84,317 | 25.25 |
| 2018 | 23 | 287 | 3,367 | 62,700 | 227.38 |
| 2019 | 61 | 125 | 6,382 | - | 30.34 |
| 2020 | 93 | 647 | 19,818 | - | 45 |
| 2021 | 62 | 5,441 | 4,946 | - | 29.25 |
| 2022 | 19 | - | - | - | 42.45 |
| 2023 | 50 | 82,019 | 7,924 | - | 759.44 |
| 2024 | 6 | - | - | - | 15.81 |

**గత ఐదేళ్లలో వడదెబ్బ, పిడుగుపాటు మరణాల లెక్కలివి**

| సంవత్సరం | వడదెబ్బ | పిడుగుపాట్లు |
|---|---|---|
| 2019 | 236 | 9 |
| 2020 | 139 | 39 |
| 2021 | 68 | 77 |
| 2022 | 35 | 172 |
| 2023 | 14 | 55 |
| 2024 | 10 | 02 |

## మూసీ అభివృద్ధికి కేంద్రమంత్రిగా ఏం చేశావు?

కిషన్‌రెడ్డిని ప్రశ్నించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళ్లకు సాక్స్, ముఖానికి క్రీం రాసుకొని..మూసీనిద్ర పేరుతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మెగా షో చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎంపీగా, కేంద్రమంత్రిగా ఆరేళ్ల నుంచి కొనసాగుతున్న కిషన్‌రెడ్డికి తన పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంత దూరం మూసీనది ప్రవహిస్తుందో కూడా తెలియదన్నారు. మూసీకి రిటర్నింగ్ వాల్ కడితే సరిపోతుందని చెబుతున్న కిషన్‌రెడ్డి తన ఎంపీ నిధుల నుంచిగానీ, కేంద్ర నిధుల నుంచి రూపాయి అయినా విడుదల చేశారా అని ప్రశ్నించారు. మూసీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందించాల్సింది పోయి బీఆర్‌ఎస్‌తో కలిసి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కిషన్‌రెడ్డికి నిజాయతీ ఉంటే మూడు నెలల పాటు తనతో కలిసి మూసీలో నివాసం ఉండాలని సవాల్ విసిరారు.



## కార్తీక శోభ

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో కార్తీక మాసం మూడో సోమవారం నాడు వివిధ కార్యక్రమాలు జరిగాయి. టీటీడీ పరిపాలనా మైదానంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పరమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. – తిరుపతి సిటీ



## టెక్కీల 'శ్రీకృష్ణ పారిజాతం'

అమెరికాలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌లు స్థాపించిన ప్రణవ నాట్యం నృత్య కళాశాల బృందం సోమవారం విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో 'శ్రీకృష్ణ పారిజాతం' ఘట్టాన్ని నృత్యరూపకంగా ప్రదర్శించింది. ఇది ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. – విజయవాడ



## ప్రాణాలంటే లెక్కలేదా.?

విశాఖలో ఆటోడ్రైవర్ల నిర్లక్ష్యం ప్రయాణికులకు ప్రాణ సంకటకంగా మారుతోంది. కొందరు ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటూ ఇలా దూసుకుపోతున్నారు. ప్రయాణికులు సైతం అపాయాన్ని పట్టించుకోకుండా ఆటోల వెనుక కూర్చుంటూ, వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. – విశాఖపట్నం

## వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



పూతలపట్టు: దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు పూతలపట్టు మండలం వావిల్‌తోట పంచాయతీలోని మూర్తిగానూరులో గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహం తల, మిగిలిన భాగం వేర్వేరుచోట్ల పడి ఉండడాన్ని గ్రామస్తులు సోమవారం గమనించి వైఎస్సార్‌సీపీ నాయకులకు చెప్పారు. వీఆర్వో ఫిర్యాదుతో ఎస్‌ఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునిల్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

## మంగళగిరిలో అఘోరి హల్‌చల్

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి జాతీయ రహదారిపై అఘోరి హల్‌చల్ చేసింది. సోమవారం ఉదయం ఓ మహిళ తల పుర్రెలు మెడలో ధరించి ఒంటిపై నూలు పోగు లేకుండా ఆటోనగర్‌లోని కార్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లింది. అక్కడున్న వారు భయపడి కారు సర్వీసు చేస్తుండగా.. ఓ జర్నలిస్టు అక్కడే ఉండి ఫొటో తీశారు. దీనికి ఆగ్రహించిన అఘోరి జర్నలిస్టుపై దాడి చేసి గాయపరచింది. అతడు ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంతలో మరికొంత మంది జర్నలిస్టులు చేరుకుని ఫొటోలు వీడియోలు తీయడంతో పాటు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు చేరుకుని అఘోరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

## టీడీపీ నేతల ఆధ్వర్యంలో బెల్టు షాపుల వేలం



సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వం మద్యం షాపుల ద్వారా బెల్టుషాపుల ఏర్పాట్లకు టీడీపీ నాయకులు శ్రీకారం చుట్టారు. దీనిపై టీడీపీకి చెందిన రెండు వర్గాలు వేర్వేరుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాయి. చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండల టీడీపీ నాయకుడు గ్రామాల్లో బెల్టు షాపుల ఏర్పాటుకు రూ.2 లక్షల వరకు వసూలు చేసి, వేలం వేసినట్లు అదే పార్టీకి చెందిన ఒక వర్గం నాయకులు సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, కలెక్టర్‌కు ఫిర్యాదుచేసి, వాటిని చౌడేపల్లె కోసం అనే ఫేస్‌బుక్ పేజీలో ప్రచారం చేస్తున్నారు. చౌడేపల్లె మండలంలోని యల్లంపల్లి, ఆమినిగుంట, చౌడేపల్లె, గడ్డంవారిపల్లె, బోయకొండ, బత్తలాపురం, సింగిరిగుంట, పరికిదొన, చుక్కావారిపల్లె గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ షాపుల ద్వారా 24 గంటలు మద్యం అందుబాటులో ఉండేలా హుకుం జారీచేసినట్లు సమాచారం. ఈ విషయాల ద్వారా పల్లెల ప్రశాంతత దెబ్బతింటోందని , ఈ విషయాలను ఎక్సైజ్ వారికి తెలిసిన మొద్దు నిద్రలో నటిస్తున్నారని పేర్కొన్నారు.

గిరి రైతు క్షేత్రంలో సిరులు

# ఆదాయం అధరహో

## డ్రాగన్ ఫ్రూట్ సాగులో నిలకడగా ఆదాయం ఆర్జిస్తున్న గిరి రైతు

డ్రాగన్ ఫ్రూట్ సాగులో మంచి ఫలితాలు సాధిస్తున్నారు కొర్రాయి పంచాయతీ శాంతినగర్‌కు చెందిన గిరిజన రైతు గుజ్జెల నాగేశ్వరరావు. ఎకరా విస్తీర్ణంలో సాగు చేపట్టిన ఆయన రూ.2 లక్షల మేర ఆదాయం పొందుతున్నారు. అంతర పంటగా బంతి వేయడం వల్ల ఆదనంగా ఆదాయం వస్తోందని ఆయన తెలిపారు. దళారులు, వ్యాపారులపై ఆధారపడకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న మార్కెటింగ్ వనరులను సద్వినియోగం చేసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.



శాంతి నగర్‌లో ట్రెల్లీస్ విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు

- అంతర పంటగా బంతి
- అనుకూలించిన వాతావరణ పరిస్థితులు
- ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం పొందుతున్న గిరిజన రైతు నాగేశ్వరరావు
- పశువుల ఎరువు వినియోగంతో నాణ్యమైన దిగుబడి
- స్థానికంగానే మార్కెటింగ్ తప్పిన దళారుల సమస్య



గులాబీ రంగులో అమ్మకానికి సిద్ధంగా డ్రాగన్ ఫ్రూట్

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ శాంతినగర్‌కు చెందిన గిరిజన కుటుంబానికి చెందిన గుజ్జెల నాగేశ్వరరావు డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టి మంచి ఆదాయం పొందుతున్నారు. విశాఖ షిప్‌యార్డులో కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తున్న ఆయనకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. అయితే అందరిలా కాకుండా ఆయన వినూత్నంగా ఆలోచించారు. ఈ ప్రాంత వాతావరణం అనుకూలంగా ఉన్నందున డ్రాగన్ ఫ్రూట్ సాగుపై దృష్టి సారించారు. గతేడాది ట్రెల్లీస్ పద్ధతిలో జైన్ రకానికి చెందిన రెండు వేల మొక్కలను ఎకరా విస్తీర్ణంలో నాటారు.

### ఒకొక్క మొక్క రూ.75..

ఒకొక్క మొక్కను గుంటూరులోని ఓ క్షేత్రంలో రూ. 75 చొప్పున కొనుగోలు చేశారు. ట్రెల్లీస్ విధానంలో కీలకమైన సిమెంట్ స్తంభాలు ఒకొక్కటి రూ.350 చొప్పున 500 కొనుగోలు చేశారు. మొత్తమ్మీద మొక్కలు, సిమెంటు స్తంభాలు, కూలి ఖర్చులు కలిపి ఎకరాకు 1.50 లక్షల వరకు పెట్టుబడి అయిందని రైతు తెలిపారు.

➡ నాటిన తొమ్మిది నెలలకు కాపు మొదలైంది. ఈ ఏడాది పూర్తిగా దిగుబడి వచ్చింది. కిలో రూ.200 చొప్పున విక్రయించగా సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు పేర్కొన్నారు.



➡ భూమిని సారవంతం చేసేందుకు రసాయన ఎరువులకు బదులుగా పశువుల ఎరువు వినియోగించారు. ఎకరాకు ఐదు ట్రాక్టర్ల గెత్తం వాడినట్టు రైతు తెలిపారు. దీనివల్ల దిగుబడి పెరగడంతో పాటు పండు నాణ్యతగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఒకసారి నాటితే సుమారు 30 సంవత్సరాల వరకు నిలకడగా దిగుబడి వస్తుందని ఆయన వివరించారు.

➡ ట్రెల్లీస్ విధానంలో సాగు చేపట్టడం వల్ల మొక్కకు గాలి తగిలి ఏపుగా పెరుగుతుంది. మొక్కకు మొక్కకు మధ్య పది అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పు దూరం ఉండాలి. ఒక మొక్క నుంచి సుమారు 20 వరకు పండ్ల దిగుబడి వస్తుందని రైతు తెలిపారు.

➡ పర్యాటక ప్రాంతం కావడం వల్ల మార్కెటింగ్ స్థానికంగా అందుబాటులో ఉంది. అరకు పైనరీ, గిరిజన మ్యూజియంతో పాటు స్థానిక మార్కెట్లో విక్రయించడం వల్ల దళారుల ప్రభావం లేదని రైతు తెలిపారు. దీనివల్ల ఆయన మంచి ఆదాయం పొందగలుగుతున్నారు.

➡ అంతరపంటగా ముద్దబంతి సాగు చేపట్టారు. దీనిపై ఏటా అక్టోబర్, నవంబర్‌లో వచ్చే ఆదాయం తోట నిర్వహణ ఖర్చులకు సరిపోతుందని రైతు తెలిపారు. ఉద్యానవనశాఖ ఎకరాకు రూ.13 వేలు పెట్టుబడి సాయంగా అందజేసిందని రైతు తెలిపారు. ఇంటిల్లపాది కష్టపడి పనిచేయడం వల్ల ఏటా నిర్వహణ ఖర్చులు తగ్గడం వల్ల రెండో ఏడాది మంచి ఆదాయం వచ్చిందని రైతు నాగేశ్వరరావు వివరించారు.

### సాగును ప్రోత్సహిస్తాం



డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టే రైతులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తున్నాం. ఉద్యానవన శాఖ తరపున ఎకరాకు రూ.13 వేల చొప్పున ఆర్థిక సాయం పొందవచ్చు. అయితే ఈ ఏడాది ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా సాగునీటి బోర్లు మంజూరైతే తప్పనిసరిగా డ్రాగన్ ఫ్రూట్ రైతులకు కేటాయిస్తాం.

– కె.శిరీష, ఉద్యానవనశాఖ అధికారి, దుంబ్రిగుడ

## టీడీపీ నాయకుని అక్రమ మైనింగ్‌కు కార్మికుడు బలి

### బండలు మీద పడి అక్కడికక్కడే మృతి

- కేసును నీరుగార్చుతున్న గని యజమాని
- గనిలోనే చనిపోయాడంటున్న మృతుని కుటుంబీకులు
- మృతుని కాళ్లకు సున్నపురాయి మరకలు
- ఎవరూ ఫిర్యాదు చేయలేదంటున్న పోలీసులు



డోన్/ప్యాపిలి: నంద్యాల జిల్లాలో ఓ టీడీపీ నాయకుని అక్రమ మైనింగ్‌కు కార్మికుడు బలయ్యాడు. గనిలో బండలు మీద పడి కార్మికుడు మృతి చెందినా సమీపంలోని తోటలో కాలుజారి కింద పడి చనిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశారు. విషయం తెలిసినా పోలీసులు ఫిర్యాదు అందలేదని అంటున్నారు. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. ప్యాపిలి మండలం చంద్రపల్లికి చెందిన టీడీపీ నాయకుడు, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి, గొర్రెల పెంపకందారుల రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎర్రసాని నాగేశ్వరరావ్ యాదవ్, ఆయన సోదరుడు ఎర్రసాని లక్ష్మీనారాయణ (అలియాస్ లచ్చి యాదవ్) వారి పొలం పక్కనే కొన్నేళ్లుగా లైమ్‌స్టోన్ (సున్నపురాయి)ని యథేచ్ఛగా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. ఈ గనిలో సోమవారం హుసేనాపురం గ్రామానికి చెందిన శివయ్య (55) సున్నపు రాయిని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా కాలుజారి కిందపడటంతో పెద్ద బండరాయి తలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, శివయ్య సమీపంలోని తోటలో కాలు జారి కింద పడి మరణించినట్లుగా గని యజమాని లచ్చి యాదవ్ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. తన తండ్రి గనిలో పనిచేస్తుండగానే మృతి చెందాడని, కాళ్లకు తెలుపు రంగు సున్నపురాయి మరకలు కూడా ఉన్నాయని మృతుడి కుమారుడు రవి చెబుతున్నాడు. ఈ ప్రమాదంపై అధికారులు విచారణ జరిపి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు.

### గతంలోనూ ముగ్గురు మృతి

గత పదేళ్లలో టీడీపీ నాయకుడు లచ్చి యాదవ్ చేసే అక్రమ గనిలో ముగ్గురు కూలీలు ప్రమాదాల బారినపడి మృతి చెందినట్లు తెలిసింది. మృతుల కుటుంబ సభ్యులను భయపెట్టి కేసులు నమోదు కాకుండా చేశారని చెబుతున్నారు. ఇక్కడ అనుమతులు లేకుండానే చట్ట వ్యతిరేకంగా మైనింగ్ చేస్తున్నారని చంద్రపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

## వాల్తేరు డీఆర్‌ఎంపై ఎఫ్‌ఐఆర్ నమోదు

- సౌరభ్ కుమార్‌ని ఏ1గా పెట్టిన సీబీఐ
- ఎఫ్‌ఐఆర్‌లో మరో ఐదుగురి పేర్లు

సాక్షి, విశాఖపట్నం: కాంట్రాక్టర్ల నుంచి రూ.25 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన వాల్తేరు డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌పై సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో పనులు నిర్వహించే కాంట్రాక్టు సంస్థ యజమానుల నుంచి 2 రోజుల క్రితం పూణేలో లంచం తీసుకుంటూ డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ సీబీఐకి చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి సమగ్ర వివరాలతో దర్యాప్తు బృందం నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో డీఆర్‌ఎం పేరుని ఏ1గా చేర్చింది. ముంబైకి చెందిన డీఎస్ మార్కెటింగ్ సంస్థ ప్రొప్రైటర్ సనిల్ రాథోడ్‌ని ఏ2గా, పూణేకి చెందిన హెచ్‌ఆర్‌కే సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఆనంద్‌భగత్‌ని ఏ3గా, హెచ్‌ఆర్‌కే సొల్యూషన్స్, గుజరాత్‌కు చెందిన హిందుస్థాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్ని ఏ4, ఏ5లుగా చేర్చింది. సౌరభ్‌కుమార్‌తో పాటు మిగిలిన వ్యక్తులు, సంస్థలపై సెక్షన్ 61(2) ఆఫ్ బీఎన్ఎస్ 2023, పీసీ యాక్ట్ 1988లోని పలు సెక్షన్‌లు నమోదు చేసినట్లు సీబీఐ ఢిల్లీ ఏసీ–1 కార్యాలయ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. విచారణ బాధ్యతల్ని సీబీఐ ఏసీ–1 సీఐ భన్వేంద్ర చౌధరి కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## దివ్యాంగులు స్వయంసంపత్తి సాధించడమే ధ్యేయం

### కేంద్ర మంత్రి బీఎల్ వర్మ

జమ్మలమడుగు: దివ్యాంగులు స్వయం సంపత్తి సాధించి స్వతంత్రంగా వారి కాళ్లమీద నిలబడేలా చేయడమే తమ ధ్యేయమని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ మంత్రి బీఎల్ వర్మ అన్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని నానుబాల ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చెరకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి శనివారం నిర్వహించారు. వర్చువల్ విధానంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఒకటిగా ఉండేవిధంగా చేయడం కోసం వారిని గుర్తించి, కావలసిన యంత్రాలను ఇస్తున్నామన్నారు. ఒలింపిక్ క్రీడల్లో దివ్యాంగులను ప్రొత్సహిస్తున్నామని తెలిపారు. ఆర్డీఓ సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు. కాగా, విజయవాడ వరద బాధితులకు సాయంగా స్థానిక బాలాజీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సీఎం సహాయనిధికి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. సోమవారం బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ బైరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పిల్లలు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి విరాళం అందించారు.



ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

## సమాన అవకాశాలతోనే మహిళా సాధికారిత

### జాతీయ మానవ హక్కుల కమిషన్ తాత్కాలిక చైర్‌పర్సన్ విజయభారతి సాయని



రేణిగుంట (ఏర్పేడు): అన్ని రంగాల్లో సమాన అవకాశాలను కల్పించి, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ తాత్కాలిక చైర్‌పర్సన్ విజయభారతి సాయని అభిప్రాయపడ్డారు. తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో సోమవారం ×మహిళల హక్కులు–ఆహార భద్రత¥ అంశంపై ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె జాతీయ మానవ హక్కుల కమిషన్ డీజీ అజయ్ భట్నాగర్‌తో కలసి పాల్గొని ప్రసంగించారు. ఐఐటీలో నీతి బోధ్ క్లబ్, నేషనల్ సర్వీస్ స్కీమ్ సహకారం కార్యక్రమం జరిగింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ తాత్కాలిక చైర్‌పర్సన్ ఎస్.విజయభారతి సాయని మాట్లాడుతూ.. మహిళల హక్కులు, ఆహార భద్రత వంటి సవాళ్లను అధిగమించడంతో ప్రభుత్వాలు ఎంతో కృషిని కనబరుస్తున్నాయన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అజయ్ భట్నాగర్ మాట్లాడుతూ మహిళల భద్రతలోని వివిధ కోణాలను, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ల నుంచి సామాజిక వైఖరులను వివరించారు. ఐఐటీ ప్రొఫెసర్లు, నీతిబోధ్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సమాచారం

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 71,431 మంది స్వామివారిని దర్శించుకోగా 23,595 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.87 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### చండీహోమం.. పరిపూర్ణం



తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 10వ తేదీ నుంచి 9 రోజుల పాటు చేపట్టిన కామాక్షి అమ్మవారి చండీహోమం సోమవారంతో పరిపూర్ణమైంది. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా యాగశాలలో ఉదయం 8 నుంచి చేపట్టిన చండీహోమం 11 గంటలకు నిర్వహించిన మహాపూర్ణాహుతితో పరిసమాప్తమైంది. అనంతరం కలశ ఉద్వాసన, మహాభిషేకం, అమ్మవారి మూలవర్లకు కలశాభిషేకం జరిపించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శ్రీకపిలేశ్వరస్వామివారి కలశ స్థాపన, పూజ, జపం, హోమం, నివేదన, హారతి చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం నుంచి రుద్రహోమం ప్రారంభం కానుంది. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

### మృత్యుంజయుడికి విశేష పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన చేపట్టారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితో అభిషేకాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి మొక్కులు చెల్లించారు.

### నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



పెనగలూరు: మండలంలోని తిరుణంపల్లి గ్రామంలో నేడు (మంగళవారం) నుంచి మూడు రోజులపాటు సీతారామ లక్ష్మణ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 19వ తేదీ ఉదయం సుప్రభాతసేవ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, అఖండ ప్రజ్వలన, కలశస్థాపన, అభిషేకం, సాయంత్రం మండల హోమాలు, తీర్థప్రసాదం ఉంటుందని వారు తెలిపారు. 20న ఉదయం పూజల అనంతరం విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అనంతరం సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు.

### కిక్కిరిసిన రత్నగిరి



అన్నవరం: కార్తిక మాసం మూడో సోమవారం పర్వదినం కావడంతో రత్నగిరికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ సత్యదేవుని ఆలయ ప్రాంగణం ఇసుక వేస్తే రాలని విధంగా జనసందోహంతో కిక్కిరిసిపోయింది. దేవస్థానం ఘాట్ రోడ్లు, మల్టీ లెవెల్ పార్కింగ్ స్థలాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. రికార్డు స్థాయిలో 90 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా.

## విద్యా సమాచారం

### ఏయూలో డిప్యూటేషన్లు రద్దు చేయాలని నిరసన

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధ్యాపకులను వారి మాతృ సంస్థలకు పంపించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వర్సిటీ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రాష్ట్ర కన్వీనర్ ఎ.కిరణ్ కుమార్ మాట్లాడుతూ అర్హత లేని, డిగ్రీ కళాశాల అధ్యాపకులతో విద్యను బోధించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం లేదన్నారు. అలాంటి వారిని గుర్తించి, వెంటనే డిప్యూటేషన్లు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ నాయకులు నరసింహ, కోటేశ్వరరావు, రఘుతేజ, శ్రీను, వెంకటేష్, శివకుమార్, అయ్యప్ప, విజయ్, పవన్, వంశీ పాల్గొన్నారు.

### అనవసర రాజకీయాలు వద్దు

#### ఏయూ పరిరక్షణ సమితి విజ్ఞప్తి

విశాఖ విద్య: అనవసర రాజకీయాలు, స్వార్థపరమైన ఆలోచనలతో కొంతమంది ఆంధ్రా యూనివర్సిటీ ప్రశాంతతను భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది ఎంతమాత్రం మంచిది కాదని ఏయూ పరిరక్షణ సమితి కోరింది. ఈ మేరకు సమితి అధ్యక్షుడు మల్లు మహేష్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాల పేరుతో అకారణంగా ధర్నాలు, రాస్తారోకోలు చేయడం పరిపాటైందన్నారు. ఇలాంటి చర్యలతో ప్రశాంతమైన ఏయూ వాతావరణాన్ని భగ్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో డిప్యూటేషన్‌పై వచ్చిన డిగ్రీ కళాశాలల అధ్యాపకులను విశ్వవిద్యాలయం నుంచి సాగనంపాలనే డిమాండ్ న్యాయపరమైనదని, దీనికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం వద్ద పరిష్కారం కోసం పెండింగ్‌లో ఉందని, నిర్ణయం తీసుకోవలసింది కూడా రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు. ఈ డిమాండ్ కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆఫీస్ ముందు ధర్నా చేస్తే బాగుంటుందని, తాము కూడా భాగస్వాములవుతామని చెప్పారు. ఏయూకు సంబంధం లేని విషయాలపై రాద్ధాంతం చేయడం తగదని సూచించారు.



పిల్లల్లో ఏ చిన్న లోపం కనిపించినా తల్లిదండ్రులకు అది చాలా ఆందోళన కలిగిస్తుంది. కొందరు పిల్లల్లో జన్యుపరమైన లేదా ఇతరత్రా కారణాల వల్ల పుట్టుకతోనే వైకల్యాలు రావచ్చు. అలాంటి కొన్ని సాధారణ వైకల్యాలూ, వాటిని గుర్తించడం, నివారించడం ఎలాగో తెలపడం కోసమే ఈ కథనం.

# పండంటి బిడ్డకు ప్లాన్.. స్కాన్

గర్భధారణ సమయంలో డాక్టర్లు 'ఫోలిక్ యాసిడ్'ను ప్రిస్క్రయిబ్ చేస్తుంటారు. ఇది అనేక వైకల్యాలను నివారిస్తుంది. ఇది సాధారణంగా ఆకుకూరల్లో ఎక్కువగా ఉంటుంది. ఇక చిన్నారుల్లో కనిపించే కొన్ని వైకల్యాలివి...

**పుట్టుకతో వచ్చే (కంజెనిటల్) కొన్ని అంగవైకల్యాల నివారణ/చికిత్స...**



● **గ్రహణం మొర్రి (క్లెఫ్ట్ లిప్ / ప్యాలెట్):** పుట్టుకతోనే వచ్చే అంగవైకల్యాలు చాలా ఉంటాయి. అయితే అందులో చాలా సాధారణమైనదీ, కేవలం ఓ చిన్న శస్త్రచికిత్సతో సరిచేయడానికి వీలైనది 'గ్రహణం మొర్రి'. ఇందులో క్లెఫ్ట్ లిప్ అనే సమస్యలో పెదవి భాగం చీలిపోతుంది (క్లెఫ్ట్ లిప్). అలాగే మరికొందరిలో అంగిలి భాగం చీలిపోతుంది (క్లెఫ్ట్ ప్యాలెట్). ఈ రెండు సమస్యలను కలిపి తెలుగులో గ్రహణం మొర్రి అంటారు. చిన్నపాటి శస్త్రచికిత్సతో ఈ సమస్యలను సరిచేయవచ్చు. బిడ్డ పుట్టిన దాదాపు ఏడాది వయసప్పుడే శస్త్రచికిత్స చేయిస్తే... అసలా సమస్య వచ్చిన విషయమే తెలియనంత బాగా దీన్ని సరిదిద్దవచ్చు.

● **డౌన్స్ సిండ్రోమ్:** తల్లిదండ్రుల నుంచి చెరిసగం క్రోమోజోములను కలుపుకుని బిడ్డలో 46 క్రోమోజోములుండాలి. ఏ కారణం వల్లనైనా ఉండాల్సిన క్రోమోజోము కంటే ఒకటి అదనంగా ఉంటే... బిడ్డకు 'డౌన్స్ సిండ్రోమ్' అనే కండిషన్ వస్తుంది. దీనివల్ల బిడ్డలో బుద్ధిమాంద్యత ఏర్పడుతుంది. సాధారణంగా ముప్పై ఐదేళ్ల వయసు పైబడ్డాక గర్భం ధరించే మహిళల్లో బిడ్డకు డౌన్స్ సిండ్రోమ్ ముప్పు ఎక్కువ.

● **న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్ (స్పైనా బైఫిడా)..**

కాబోయే తల్లికి తన గర్భధారణ సమయంలో 'ఫోలిక్ యాసిడ్' అనే పోషకం సరైన మోతాదులో చిన్నారిలో రూపుదిద్దుకోవాల్సిన వెన్నుపాము (న్యూరల్ ట్యూబ్) సరిగా రూపొందకపోవచ్చు. ఇలా న్యూరల్‌ట్యూబ్‌లో లోపాలు వచ్చే ఈ కండిషన్‌ను 'స్పైనా బైఫిడా' అంటారు. ఈ వైకల్యం ఏర్పడితే బిడ్డ కడుపులోనే మృతిచెందే అవకాశాలు ఎక్కువ. ఒకవేళ పుట్టాక బతికితే ఆ బిడ్డ జీవితాంతం శారీరక, మానసిక వైకల్యాలతోనే బతకాల్సిన పరిస్థితి. అందుకే పుట్టబోయే బిడ్డలో ఈ కండిషన్‌ను తెలుసుకోవడం కోసం అవసరమైన పరీక్షలు చేయించాలి.

● **వైకల్యాల ముప్పును ముందే తెలిపే పరీక్షలు:**
గర్భంధరించే మహిళలకు... తమకు పుట్టబోయే చిన్నారులకు పుట్టుకతో వచ్చే వైకల్యాల ముప్పును తెలుసుకునేందుకు కొన్ని ప్రత్యేక పరీక్షలు చేయిస్తుంటారు.

● కాబోయే తల్లి... తన గర్భధారణ తర్వాత 11 నుంచి 14 వారాల మధ్యన 'న్యూకల్ ట్రాన్స్‌లుయెన్సీ (ఎన్‌టీ స్కాన్) అనే పరీక్ష చేయించాలి. దీన్నే ఫస్ట్ సెమిస్టర్ స్క్రీనింగ్ అంటారు. ● ఒకవేళ ఎవరైనా పై పరీక్ష చేయించుకోకపోతే ఆ తర్వాత 15వ వారం నుంచి 20 వ వారం లోపున 'ట్రిపుల్ సీరమ్ స్క్రీనింగ్' లేదా 'క్వాడ్రపుల్ పరీక్ష' చేయించుకోవాలి. ఈ పరీక్షల ద్వారా కడుపులోని పిండం... తల్లి గర్భంలోకి విడుదల చేసే కొన్ని రకాల ప్రోటీన్లను పరిశీలిస్తారు. అవి... ఆల్ఫా ఫీటో ప్రోటీన్, బీటా హెచ్‌సీజీ, ఎస్ట్రాడాయిల్, ఇన్హిబిన్. ఈ పరీక్షలతో ఆ ప్రోటీన్ల మోతాదులను తెలుసుకుంటారు. ఆ మోతాదుల నిష్పత్తిని బట్టి బిడ్డకు వైకల్యం వస్తుందో రాదో చెప్పడానికి కొంతవరకు అవకాశం ఉంటుంది. ఈ పరీక్షతో డౌన్స్ సిండ్రోమ్ తెలుసుకునేందుకు 60 శాతం నుంచి 70 శాతం అవకాశం ఉంటుంది.

అయితే ఒక్కోసారి ఆ ఫలితం తప్పుగా కూడా (అంటే... ఫాల్స్ పాజిటివ్) రావచ్చు. అందుకే దీనితో పాటు 'టిఫా' స్కాన్ అనే పరీక్ష కూడా చేయిస్తారు. ఈ టెస్ట్‌తో తప్పుడు ఫలితాలు వచ్చే అవకాశాలు బాగా తగ్గుతాయి. బిడ్డ పుట్టాక వచ్చే మార్పుల గురించి తెలిశాక డాక్టర్లు, నిపుణులు బిడ్డ విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

● ఒకవేళ పైన పేర్కొన్న పరీక్షల్లో పాజిటివ్ వచ్చినంతమాత్రాన బిడ్డకు తప్పక వైకల్యం వస్తుందని చెప్పడానికి కుదరదు. అలాంటప్పుడు 15వ వారంలో ట్రిపుల్ లేదా క్వాడ్రపుల్ పరీక్ష చేయించి, ఫాల్స్ పాజిటివ్ గనక వస్తే... అప్పుడు గర్భధారణ తర్వాత 16వ వారంలో యామ్నియోసెంటెసిస్ అనే మరో పరీక్షను చేయించుకుని, మొదట వచ్చింది నిజమైన పాజిటివా లేక ఫాల్స్ పాజిటివా అన్నది నిర్ధారణ చేస్తారు.

● **జెనెటిక్ సోనోగ్రామ్ పరీక్షలు..**

బిడ్డ అవయవాలూ, ఇతరత్రా (స్కెలెటల్) నిర్మాణంలో ఏవైనా లోపాలు ఉన్నాయా అని ఈ పరీక్ష ద్వారా తెలుసుకుంటారు. ఇందులో క్రోమోజోమల్ సమస్యలే తెలుస్తాయి. ఈ పరీక్ష ద్వారా బిడ్డలోపలి అవయవాలైన గుండె, మెదడు, మూత్రపిండాలు, కాళ్లూ–చేతులు, ముఖం, కళ్లు, ఊపిరితిత్తులు, వెన్నెముక, ఆబ్డామినల్ అవయవాల (కడుపులోపలి భాగాలు) గురించి తెలుసుకోవచ్చు.



● **నిర్మాణపరమైన అవయవలోపాల కోసం టిఫా పరీక్ష :** కడుపులోని బిడ్డకు అవయవ నిర్మాణాల పరమైన లోపాలు (అంటే స్ట్రక్చరల్ ప్రాబ్లమ్స్) ఉన్నట్లు అనుమానిస్తే వారికి 'టిఫా స్కాన్' అనే ప్రత్యేకమైన స్కానింగ్ పరీక్ష చేయించాల్సి ఉంటుంది.

● **నివారణ :** సాధారణంగా చాలా దగ్గరి కుటుంబసభ్యుల్లో జరిగే మేనరికం వంటి వివాహాల వల్లనే (కన్‌సాంగ్వినస్ మ్యారేజెస్) పుట్టుకతోనే అవయవ లోపలున్న పిల్లలు పుట్టేందుకు అవకాశాలు ఎక్కువ. అందుకే వీలున్నంతవరకు రక్తసంబంధీకుల మధ్య పెళ్లిళ్లు చేసుకోకుండా, బయటివారిని చేసుకోవడం ద్వారా ఇలాంటి వైకల్యాలను చాలావరకు నివారించవచ్చు.



డా. శివనారాయణ రెడ్డి వెన్నపూస,
సీనియర్ నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్

## హెల్దీ బేబీ

# గుమ్మడి పండంటి బిడ్డ... రిస్క్ టాస్క్..



పుట్టబోయే ఆ చిన్నారి ఒకింత బొద్దుగా ఉండాలని అందరూ కోరుకుంటారు. కాస్తంత బొద్దుగా ఉంటే పర్వాలేదు గానీ మరీ ఎక్కువ బరువుండటం తల్లీ, బిడ్డా ఇద్దరికీ చేటు చేసే అంశం. అదెలాగంటే... మహిళలు గర్భం దాల్చినప్పుడు వారిలో కొంతమందికి తాత్కాలికంగా చక్కెరవ్యాధి వస్తుంది. ఇలా కేవలం వారు గర్భవతులుగా ఉన్నప్పుడు వచ్చే చక్కెరవ్యాధిని 'జెస్టెషనల్ డయాబెటిస్' అంటారు. ఈ కండిషన్ ఉన్న మహిళలకు పుట్టే చిన్నారులు కాస్తంత ఎక్కువ బరువుతో పుట్టవచ్చు. అయితే ఇలాంటి సమయాల్లో కాస్తంత ఎక్కువ బరువుగా పిల్లలు పుడితే అది బిడ్డలకు ముప్పుగానూ పరిణమించవచ్చు.

జెస్టెషనల్ డయాబెటిస్ ఉన్న వారికి పుట్టే పిల్లలు కాస్తంత ఎరుపు రంగులో ఉండటంతో వారిని 'టొమాటో బేబీస్' అంటారు. దీనికి కారణం... పిల్లలు తల్లి గర్భంలో ఉన్నప్పుడు వారికి ఆహారం అందించే క్రమంలోనూ, ఇతరత్రా రక్తప్రవాహంతో పాటు తల్లిలోని చక్కెర చిన్నారుల శరీరాల్లోకీ ప్రవేశిస్తుంది. ఈ పరిస్థితిని నియంత్రించడానికి చిన్నారిలోనూ ఇన్సులిన్ ఎక్కువగా స్రవిస్తుంది. దీని మరో పరిణామం ఏమిటంటే... గర్భంలోని బిడ్డ... తన తల్లి నుంచి చాలా ఎక్కువ మోతాదులో పోషకాలను స్వీకరిస్తుంది. అందుకే గర్భసంచిలో ఉన్న బిడ్డ సాధారణం కంటే చాలా ఎక్కువ బరువు పెరుగుతుంది. వీళ్లలో హిమోగ్లోబిన్ మోతాదు సాధారణం కంటే చాలా ఎక్కువగా ఉంటుంది.



ఇలా పిల్లలు మరీ ఎక్కువ బొద్దుగా, బరువు ఎక్కువగా ఉండటాన్ని వైద్యపరిభాషలో 'మాక్రోసోమియా' అంటారు. సరిగ్గా ఈ అంశమే... ఇటు పుట్టబోయే బిడ్డకూ, అటు జన్మనిస్తున్న తల్లికీ... ఇద్దరికీ ప్రమాదం తెచ్చిపెట్టే అవకాశం ఎక్కువ. అందుకే ఇలాంటి సందర్భాల్లో ... ప్రసవం చేసే డాక్టర్ అయిన అబ్‌స్టెట్రీషియన్లు అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా బిడ్డ ఏ మేరకు బొద్దుగా ఉన్నారనే అంశాన్ని అంచనా వేస్తారు. ఒక్కోసారి సాధారణ ప్రసవం అవుతుందని అనుకున్నా, తల మాత్రమే బయటకు వచ్చి (శీర్షోదయమై) భుజాలు ప్రసవమార్గంలో ఇరుక్కుపోవచ్చు. ఇలా జరగడాన్ని 'షోల్డర్ డిస్టోసియా' అంటారు. అదొక మెడికల్ ఎమర్జెన్సీ సమస్య.

ఇలాంటి అన్ని అంశాలూ దృష్టిలో పెట్టుకున్నప్పుడు బిడ్డ మరీ బొద్దుగా ఉంటే అది ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చు. పైగా బొద్దుగా ఉండటం అన్న అంశం ఆరోగ్యానికి ఏమాత్రం సూచిక కాదు. అది చైల్డ్‌హుడ్ ఒబెసిటీకి దారితీయవచ్చు. దీనికి బదులుగా బిడ్డ సన్నగా ఉన్నా... ఆరోగ్యంగా ఉండటమనేది అందరూ కోరుకునే అంశం. అందుకే చిన్నారి బొద్దుగా పుట్టడం / ఉండటం కంటే ఆరోగ్యంగా పుట్టాలని కోరుకోవడం మంచిది.

## తేలిగ్గా బరువు తగ్గించే దానిమ్మ!

దానిమ్మ గుండెజబ్బులను నివారిస్తుందన్నది చాలామందికి తెలిసిందే. అయితే అది బరువు పెరగకుండా చూడటం వల్ల ఒబెసిటీ కారణంగా వచ్చే అనేక ఆరోగ్య అనర్థాలను కూడా నివారిస్తుంది. దానిమ్మతో బరువు తగ్గడానికి కారణమూ ఉంది. అదేమిటంటే... ఇందులో 7 గ్రాముల పీచు ఉండటం వల్ల అది కడుపు (స్టమక్) ఆరోగ్యాన్ని సురక్షితంగా కాపాడుతుంది. అంతేకాదు దానిమ్మపండులో 3 గ్రాముల ప్రోటీన్, విటమిన్ సీ, విటమిన్ కె అనే ప్రధాన విటమిన్లతో పాటు పొటాషియమ్ వంటి హైబీపీని నియంత్రించేందుకు సహాయపడే లవణాలూ ఉన్నాయి. తక్కువ చక్కెర, ఎక్కువ పీచు ఉన్నందున బరువు తగ్గించడానికి దానిమ్మపండు బాగా ఉపయోగపడుతుంది.



● ఐసీయూ

# 'లాస్ట్ హోప్ కాదు... బెస్ట్ కేర్





డా॥ కె. వెంకట రమణ,
కన్సల్టెంట్ క్రిటికల్ కేర్ & ఎక్మో సర్వీసెస్

ఎవరినైనా ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో చేర్చారు అనగానే... ఇక వారు తిరిగి మామూలు వ్యక్తిగా వెనక్కు రావడం అసాధ్యమనేది చాలా మంది సాధారణ ప్రజల్లో ఉండే అపోహ. కాసేపు కోలుకున్నట్లుగా కనిపించినా ఐసీయూలో చేర్చేవారిలో చాలామంది ఆరోగ్యం క్రమంగా విషమిస్తుందని అనుకుంటూ ఉండేవారి సంఖ్య ఎక్కువ. కేవలం కొందరు మాత్రమే కోలుకుంటారనే అభిప్రాయాలు చాలా మందిలో వినిపిస్తుంటాయి. నిజానికి ఐసీయూలో గనక చేర్చకపోతేనే మరణావకాశాలు ఎక్కువ. అసలు ఐసీయూలో ఎలాంటి వసతులుంటాయి, అక్కడ అత్యంత ముప్పు ఉన్న బాధితుల విషయంలో డాక్టర్లు ఏం చేస్తారు, ఎలాంటి చికిత్స అందిస్తారు, ఏయే జాగ్రత్తలు తీసుకుంటారనే విషయాలను తెలుసుకుందాం.

**ఐసీయూలో ఏం చేస్తారంటే...**

బాధితులను ఐసీయూలో ఉంచినప్పుడు దేహంలో వచ్చే మార్పులనూ, అలాగే దేహంలోని అనేక కీలకమైన పనులు జరగడానికి తోడ్పడుతుండే జీవరసాయన చర్యలూ, వాటిలోని మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, జరిగిన ప్రతికూల మార్పులను మళ్లీ యథాస్థితికి (నార్మల్‌కు) తెచ్చేందుకూ, వాటిని క్రమబద్ధంగా జరిగేలా చూసేందుకు డాక్టర్లు ప్రయత్నిస్తుంటారు. బాధితులు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉంటారు కాబట్టీ, వాళ్లను నార్మలైజ్ చేసేందుకు డాక్టర్లు ప్రయత్నిస్తుంటారు కాబట్టి... ఆ డాక్టర్లను 'క్రిటికల్ కేర్' నిపుణులుగా చెబుతారు.

మానవ శరీరం అనేక ఖనిజ లవణాలతో ఎన్నో సంక్లిష్టమైన జీవరసాయన చర్యలు జరుగుతుండటం వల్లనే సజీవంగా ఉంటూ, ఆరోగ్యకరంగా పనిచేస్తుంటుంది. ఎవరైనా ఏదైనా తీవ్రమైన జబ్బుల బారిన పడ్డా లేదా ఏదైనా ప్రమాదంలో గాయపడ్డా ఈ జీవరసాయన క్రియల్లోనూ, శరీరంలోని ఇతర ఖనిజ, లవణాల వంటి రసాయనిక అంశాల్లోనూ ఎన్నో మార్పులు చోటు చేసుకుంటూ ఉంటాయి. ఫలితంగా దేహంలోని ఎన్నెన్నో భాగాలు వేగంగా మార్పులకూ, వివిధ పరిణామాలకు లోనవుతూ ఉంటాయి. దాంతో చాలా దుష్పరిణామాలకు అవకాశాలెక్కువ. శరీరంలో ఉండే సహజమైన సమతుల్యత (హోమియోస్టేసస్) కూడా దెబ్బతింటుంది.



**బాధితులకు వచ్చే ప్రమాదాలూ... అధిగమించే పద్ధతులు...**

ఐసీయూలో చేర్చాల్సి వచ్చిన బాధితుల్లో కనిపించే కొన్ని హటాత్పరిణామాలు ఇలా ఉండవచ్చు... ఉదాహరణకు హటాత్తుగా గుండె రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టుకుపోవడం, గుండె సరిగా పనిచేయకపోవడం, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ తలెత్తడం, మెదడులోగానీ, కడుపులోగాని రక్తస్రావం కావడం వంటి సమస్యలు ఒక్కోసారి శరీరం వెంటనే కోలుకునే అవకాశం లేకుండా చేయవచ్చు. ఇలాంటి సమయాల్లో రోగి పరిస్థితి చాలా వేగంగా క్షీణించడం మొదలువుతుంది. కొందరిలో ఇది ప్రాణాపాయానికీ దారితీయవచ్చు.

ఇలాంటి హటాత్పరిణామాల్లో ఏది వస్తుందో, ఏది రాదో ముందే ఊహించడం సాధ్యం కాదు. అయితే క్రిటికల్ కండిషన్‌లో ఉన్న బాధితులు ఐసీయూలో గనక ఉన్నట్లయితే వారిలో ఆయా సమయాలకు వచ్చే అనర్థాలనూ, ప్రమాదాలనూ వెంటనే గుర్తించి, వెనువెంటనే స్పందించి, వచ్చిన సమస్యకు అనుగుణంగా అవసరమైన చికిత్సను తక్షణం అందించడం సాధ్యమవుతుంది. ఉదాహరణకు ఊపిరి అందనప్పుడు ఐసీయూలోని వెంటిలేటర్లను ఉపయోగించడం, మూత్రపిండాలు పనిచేయకపోతే వెంటనే డయాలసిస్ వంటి ప్రాణరక్షణ యంత్రాన్ని వాడటం వంటివి చేసేందుకు వెసులుబాటు ఉంటాయి. గుండె లయలో తేడా వచ్చినప్పుడు సరిచేయడానికి డిఫిబ్రిలేటర్లు ఉంటాయి.

**ఐసీయూలోని సౌకర్యాలేమిటంటే...**

శరీరం తాలూకు సహజ సమతౌల్య స్థితి (హోమియోస్టేసస్)తిరిగి పొందేందుకు అవసరమైన అన్ని చికిత్సల కోసం కావాల్సిన సౌకర్యాలన్నీ ఐసీయూలో ఉంటాయి. ఏదైనా వ్యాధికి లోనైన శరీర భాగాలు వాస్తవానికి తమను తాము రిపేర్ చేసుకునే స్వాభావికమైన (నేచురల్) గుణం... దాదాపుగా అన్ని అవయవాలకూ ఉంటుంది. కానీ కీలకభాగాలైన మెదడు, గుండె, శ్వాసకోశ వ్యవస్థ, కాలేయం, కిడ్నీలు, రక్తం దెబ్బతింటే అవి నేచురల్‌గానే కోలుకోవాలంటే పట్టే సమయం అతడు బతికి కోలుకోవడం కోసం సరిపోదు. అవి వీలైనంత త్వరగా కోలుకునేలా చేయగలిగితేనే ఆ బాధితుడి మనుగడ (సర్వైవల్) సాధ్యమవుతుంది. ఆ వ్యవస్థలను వీలైనంత త్వరగా మామూలు స్థితికి తెచ్చే సౌకర్యాలన్నీ ఐసీయూలో ఉంటాయి.



**క్రిటికల్ కేర్ నిపుణులతో తక్షణ వైద్యం**

ఎప్పుడూ అప్రమత్తంగా ఉండే క్రిటికల్ కేర్ వైద్యనిపుణులు శరీరంలో ఎప్పుడే మార్పు వచ్చినా దానికి అనుగుణంగా స్పందిస్తారు. ఉదాహరణకు గుండె ఆగిపోయినా తక్షణమే తిరిగి పనిచేయించడానికి సీపీఆర్ చేయడం, షాక్‌లు ఇచ్చి, బాధితులను విజయవంతంగా బతికించడం చేసిన కేసులే ఎక్కువ. కిడ్నీ పనిచేయకపోతే రీనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ, కాలేయం పనిచేయకపోతే ఉపయోగించే మార్స్... ఇలా అందుబాటులో ఉండే ఉపకరణాలూ, పరికరాలతో చికిత్స అందిస్తారు. మందుల్ని అనుకున్న మోతాదుల్లో పంపేందుకు ఇన్‌ఫ్యూజన్ పంపులు ఉంటాయి. ఇక బీపీని, నాడిని లోపలి నుంచి వచ్చే ప్రతి బీట్‌నూ కొలిచే వీలుంటుంది. ఇక బాధితులను చూసుకోడానికి ఏడాదిలో ప్రతిరోజూ 24 గంటలూ జాగ్రత్తగా చూసుకోడానికి నిపుణులైన ఫిజీషియన్లు, నర్సులు, శ్వాస అందేలా చూడటానికి రెస్పిరేటరీ టెక్నీషియన్లు అందుబాటులో ఉంటారు. ఏ కొద్ది తేడా వచ్చినా వెంటనే పై నిపుణులంతా చురుగ్గా స్పందించడంతో తక్షణ వైద్యచికిత్సలు మొదలవుతాయి. ఇవన్నీ చాలా క్రిటికల్‌గా ఉండే బాధితులకు అవసరమైనవి. అప్పటికే పరిస్థితి బాగా విషమించిపోయిన సందర్భాల్లో తప్ప... నిజానికి ఇప్పుడు విజయవంతమైన చికిత్సతో ఐసీయూలోంచి బయటకు వచ్చేవారి సంఖ్యే ఎక్కువ.

# మలబద్ధకం నివారణ కోసం...

మలబద్ధకం ఉన్నవారికి అది చాలా బాధాకరమైన సమస్యే అయినప్పటికీ... నిజానికి వారికి అదొక్కటే కాకుండా, దాని నుంచి వచ్చే ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఎన్నెన్నో. అందుకే ఒక్క మలబద్ధకాన్ని నివారించుకుంటే చాలా రకాల ఆరోగ్య అనర్థాల నుంచి కాపాడుకోవచ్చు. అందుకే దీని నివారణ అంటే చాలా రకాల జబ్బుల నివారణ అని అర్థం చేసుకోవాలి. మలబద్ధకం నివారణకు పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలివి...

పీచుపదార్థాలు (ఫైబర్) మలబద్ధకాన్ని సమర్థంగా నివారిస్తుంది. అన్ని రకాల ధాన్యాల్లోనూ పొట్టులో పీచు పదార్థాలు ఎక్కువ. అందుకే పొట్టు తీయని ధాన్యాలు... మరీ ముఖ్యంగా వరి విషయానికి వస్తే దంపుడు బియ్యం వంటివి మేలు చేస్తాయి. ఇక మామూలు ధాన్యాల్లో కంటే తృణధాన్యాల్లో పీచు ఎక్కువ. వాటితో పాటు కాయగూరలు, ఆకుకూరలు, మొలకెత్తిన ధాన్యాల్లోనూ పీచు పాళ్లు ఎక్కువ. పీచు (ఫైబర్) సమృద్ధిగా ఉండే ఆహారాలతో పాటు తాజా పండ్లతో దీన్ని నివారించుకోవడం తేలికే. మొత్తం జీర్ణవ్యవస్థను ఆరోగ్యకరంగా ఉంచడంతో పాటు తేలిగ్గా విరేచనమయ్యేందుకు ఫైబర్ సహాయపడతుంది. అంతేకాకుండా... ఒంట్లోని చక్కెరను రక్తంలో నెమ్మదిగా కలిసేలా చేయడంతో పాటు కొలెస్ట్రాల్ వంటి కొవ్వులను అదుపులో ఉంచడానికీ ఫైబర్ సహాయం చేస్తుంది.

మామూలు ధాన్యాల్లో కంటే తృణధాన్యాల్లో పీచు ఎక్కువ. వాటితో పాటు కాయగూరలు, ఆకుకూరలు, మొలకెత్తిన ధాన్యాల్లోనూ పీచు పాళ్లు ఎక్కువ. పీచు (ఫైబర్) సమృద్ధిగా ఉండే ఆహారాలతో పాటు తాజా పండ్లతో దీన్ని నివారించుకోవడం తేలికే. మొత్తం జీర్ణవ్యవస్థను ఆరోగ్యకరంగా ఉంచడంతో పాటు తేలిగ్గా విరేచనమయ్యేందుకు ఫైబర్ సహాయపడతుంది. అంతేకాకుండా... ఒంట్లోని చక్కెరను రక్తంలో నెమ్మదిగా కలిసేలా చేయడంతో పాటు కొలెస్ట్రాల్ వంటి కొవ్వులను అదుపులో ఉంచడానికీ ఫైబర్ సహాయం చేస్తుంది.

చిక్కుళ్లలో ప్రోటీన్‌తో పాటు ఫైబర్ కూడా ఎక్కువే. ఇవి కండరాలకు బలాన్నివ్వడంతో పాటు మలబద్ధకం నివారణకూ తోడ్పడుతుంది.

ఇక పండ్ల విషయానికి వస్తే... పీచు ఎక్కువగా ఉండే బొప్పాయి, పుచ్చ, నారింజ వంటి పండ్లు మలబద్ధకాన్ని తేలిగ్గా నివారిస్తాయి. చక్కెర మోతాదులు తక్కువగానూ, పీచు ఎక్కువగానూ ఉండే పండ్లను డాక్టర్లు డయాబెటిస్ బాధితులకు తినమంటూ సూచిస్తారు. ఇవి మలబద్ధకంతో పాటు చాలా రకాల క్యాన్సర్లనూ నివారిస్తాయి. అయితే పళ్లరసాల రూపంలో తీసుకుంటే అందులో పీచుపదార్థాలు దాదాపుగా ఉండవు. అందుకే పండ్లను కొరికి తినడమే మంచిది.



పీచుపదార్థాలతో పాటు తగినన్ని నీళ్లు తాగడం వల్ల కూడా విరేచనం సాఫీగా అవుతుంది. అందుకే రోజుకు కనీసం రెండు లీటర్ల (కనీసం పది గ్లాసుల)కు తగ్గకుండా నీళ్లు తాగడం మంచిది.

## బిజినెస్ రీల్

### హెల్త్‌కార్ట్‌కు రూ.1,285 కోట్ల నిధులు




న్యూఢిల్లీ: పోషకాహారోత్పత్తుల విక్రయంలో ఉన్న హెల్త్‌కార్ట్ తాజాగా రూ.1,285 కోట్ల నిధులను అందుకుంది. క్రిస్‌క్యాపిటల్, మోతిలాల్ ఓస్వాల్ ఆల్టర్నేటివ్స్, నియో గ్రూప్, ఏ91 పార్ట్‌నర్స్ ఈ మొత్తాన్ని సమకూర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల ఆదాయాన్ని అధిగమించడమే కాకుండా పూర్తి సంవత్సరం ఎబిటా లాభదాయకతను కూడా సాధించినట్టు కంపెనీ సోమవారం ప్రకటించింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఉనికిని విస్తరింపజేయడంతోపాటు బ్రాండ్లను బలోపేతం చేస్తూనే ఉన్నట్టు వివరించింది. రూ.55 కోట్ల విలువైన ఈసాప్స్ బైబ్యాక్ చేయాలని హెల్త్‌కార్ట్ నిర్ణయించింది.

### బజాజ్ ఫైనాన్స్ ఎఫ్‌డీల జోరు

చండీగఢ్: ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) 2024 సెప్టెంబర్ 30 నాటికి 21 శాతం వృద్ధితో రూ.66,131 కోట్లకు చేరుకున్నాయని బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెల్లడించింది. బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్‌లో భాగమైన ఈ కంపెనీ మొత్తం కస్టమర్ల సంఖ్య 9.2 కోట్లు నమోదైంది. యాప్ వేదికగా నికర యూజర్లు 6.16 కోట్లుగా ఉన్నట్టు బజాజ్ ఫైనాన్స్ డిపాజిట్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, రివార్డ్స్, ఈఎంఐ కార్డ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సచిన్ సిక్కా తెలిపారు. 42 నెలల కాలవ్యవధిలో డిజిటల్ బుకింగ్ ద్వారా సీనియర్ సిటిజన్లు 8.85 శాతం వరకు, ఇతరులు 8.65 శాతం వరకు ఎఫ్‌డీ రేట్లను పొందవచ్చని చెప్పారు. వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన బజాజ్ గ్రూప్ పట్ల భారతీయుల్లో తరాలుగా విశ్వాసం ఉందని అన్నారు.

### టయోటా స్పెషల్ ఎడిషన్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ గ్లాంజా, అర్బన్ క్రూజర్ టైజర్, అర్బన్ క్రూజర్ హైరైడర్ స్పెషల్ ఎడిషన్స్ ప్రవేశపెట్టింది. ఇటీవల పరిచయం చేసిన స్పెషల్ ఎడిషన్స్‌కు మంచి స్పందన రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ తెలిపింది. స్పెషల్ ఎడిషన్స్‌లో భాగంగా టయోటా జెనిన్ యాక్సెసరీ ప్యాకేజ్‌ను ఆఫర్ చేస్తోంది. ప్యాకేజ్ ధర గ్లాంజా రూ.17,381, అర్బన్ క్రూజర్ టైజర్ రూ.17,931, అర్బన్ క్రూజర్ హైరైడర్ రూ.50,817 ఉంది. కాగా, గ్లాంజా, అర్బన్ క్రూజర్ టైజర్, రూమియన్‌లో రూ.1 లక్ష కంటే ఎక్కువ విలువచేసే ప్రత్యేక ఇయర్ ఎండ్ ఆఫర్లను సైతం టయోటా డిసెంబర్ 31 వరకు అందిస్తోంది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

19-11-2024

| | |
|---|---|
| విశాఖ | 550-00 |
| చిత్తూరు | 593-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 565-00 |
| విజయవాడ | 575-00 |
| రిటైల్ ధర (డజను) | 78.00 |
| హైదరాబాద్ | 550-00 |
| వరంగల్ | 552-00 |
| రిటైల్ ధర | 6.10 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| HINDALCO | 651.1 | 3.79 |
| HEROMOTOCO | 4,728.00 | 2.69 |
| TATASTEEL | 141.2 | 2.33 |
| NESTLEIND | 2,214.80 | 1.47 |
| HINDUNILVR | 2,424.20 | 1.46 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| TCS | 4,017.15 | -3.11 |
| DRREDDY | 1,193.00 | -2.75 |
| INFY | 1,815.05 | -2.65 |
| BPCL | 290.4 | -2.62 |
| CIPLA | 1,464.00 | -2.38 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 5,620 |
| ఎన్ఎస్ఈ | 89,842 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,62,325 |
| ఎఫ్ఐఐ | - 1,403 |
| డీఐఐ | + 2,331 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 69.06 | $ 66.92 |
| బ్రెంట్ | 73.21 | $ 71.04 |

# 100 బిలియన్ డాలర్లకు జీసీసీ రంగం...

- 25 లక్షలకు మించనున్న ప్రొఫెషనల్స్
- 2030 నాటికి అంచనాలు

న్యూఢిల్లీ: దేశీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) పరిశ్రమ 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరనుంది. అందులో పనిచేసే ప్రొఫెషనల్స్ సంఖ్య 25 లక్షలకు పెరగనుంది. భారత్‌లో జీసీసీలపై రూపొందించిన ఓ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ప్రస్తుతం దేశీయంగా 1,700 పైచిలుకు జీసీసీలు ఉన్నాయి. వీటి మొత్తం వార్షిక ఆదాయం 64.6 బిలియన్ డాలర్ల పైగా ఉండగా, 19 లక్షల మంది ప్రొఫెషనల్స్ వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. 'భారతీయ జీసీసీలు సంఖ్యాపరంగానే కాకుండా సంక్లిష్టత, వ్యూహాత్మక ప్రాధాన్యతపరంగా కూడా ఎదుగుతున్నాయి. గడిచిన అయిదేళ్లలో సగానికి పైగా సెంటర్స్, సాంప్రదాయ సర్వీసుల పరిధికి మించి సేవలు అందిస్తున్నాయి' అని నివేదిక పేర్కొంది. 'గ్లోబల్ కార్పొరేషన్ల వ్యూహాత్మక కార్యకలాపాలకు కీలక కేంద్రంగా భారత్ ఎదుగుతోంది. ఈ నేపథ్యంలోనే జీసీసీ మార్కెట్ 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరనుంది. అలాగే సిబ్బంది సంఖ్య 25 లక్షలకు చేరనుంది' అని పేర్కొంది.

నివేదిక ప్రకారం .. 70 శాతం సెంటర్లు 2026 నాటికి అధునాతన కృత్రిమ మేధ సామర్థ్యలను సంతరించుకోనున్నాయి. వీటిలో ఆపరేషనల్ అనలిటిక్స్ కోసం మెషిన్ లెర్నింగ్ అల్గోరిథమ్స్ మొదలుకుని ఏఐ ఆధారిత కస్టమర్ సపోర్ట్, ఆర్అండ్‌డీ కార్యకలాపాల వరకు వివిధ సామర్థ్యాలు ఉండనున్నాయి. తూర్పు యూరప్‌తో పోలిస్తే నిర్వహణ వ్యయాలు సగటున 40 శాతం తక్కువగా ఉండటం వల్ల నాణ్యత విషయంలో రాజీపడకుండా కార్యకలాపాలను పటిష్టం చేసుకోవడానికి అంతర్జాతీయ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారింది. భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న 100 పైగా జీసీసీ దిగ్గజాలపై సర్వే, పరిశ్రమ నిపుణులతో ఇంటర్వ్యూలు, అధ్యయనాలు మొదలైన అంశాల ప్రాతిపదికన ఈ నివేదిక రూపొందింది.



# లక్ష్యం దాటనున్న ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

## సీబీడీటీ చీఫ్ రవి అగర్వాల్ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు .. నిర్దేశిత రూ. 22.07 లక్షల కోట్ల లక్ష్యాన్ని దాటేస్తాయని కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ రవి అగర్వాల్ తెలిపారు. కార్పొరేట్, నాన్-కార్పొరేట్ పన్నుల వసూళ్లు గణనీయంగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటీఎఫ్)లో ట్యాక్స్ పేయర్స్ లాంజ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు వివరించారు. సీబీడీటీ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 10 మధ్య కాలంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు నికరంగా 15.41 శాతం పెరిగి రూ. 12.11 లక్షల కోట్లకు చేరాయి.

మరోవైపు, 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను విదేశీ ఆదాయం, అసెట్స్‌ను తమ ఐటీఆర్‌లలో వెల్లడించని వారు సవరించిన రిటర్న్‌లను దాఖలు చేసేందుకు డిసెంబర్ 31 వరకు గడువుందని అగర్వాల్ పేర్కొన్నారు. ఇతర దేశాలతో ఒప్పందాల ద్వారా విదేశీ అసెట్స్ వివరాలన్నీ ఆటోమేటిక్‌గా ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కి అందుతాయని, ఐటీఆర్‌లలో పొందుపర్చిన వివరాలతో వాటిని సరిపోల్చి చూస్తుందని తెలిపారు. అధిక విలువ అసెట్స్‌ను వెల్లడించని అసెసీలకు ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్స్ పంపే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఆదాయ పన్ను చట్టంలో భాషను సరళంగా, అందరికీ అర్థమయ్యే విధంగా మార్చడంపై 6,000 పైచిలుకు సలహాలు తమకు వచ్చినట్లు అగర్వాల్ పేర్కొన్నారు.




# గోల్డ్ ఈటీఎఫ్‌లు కళకళ

- అక్టోబర్‌లో రూ.1,961 కోట్ల పెట్టుబడులు
- సెప్టెంబర్ కంటే 59 శాతం అధికం
- సానుకూలించిన పసిడి ర్యాలీ అంచనాలు

న్యూఢిల్లీ: బంగారం ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) అక్టోబర్‌లోనూ మెరిశాయి. ఏకంగా రూ.1961 కోట్లను ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టారు. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితులతో గత రెండేళ్లుగా బంగారం ర్యాలీ చేస్తుండడం చూస్తున్నాం. దీంతో బంగారం మరింత మంది ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.1,233 కోట్లు వచ్చాయి. దీంతో పోల్చితే అక్టోబర్‌లో 59 శాతం మేర పెట్టుబడులు పెరిగినట్టు తెలుస్తోంది. ఇక 2023 అక్టోబర్ నెలలో వచ్చిన రూ.841 కోట్ల కంటే రెట్టింపునకు పైగా అధికమయ్యాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం ఆస్తులు సెప్టెంబర్ చివరికి ఉన్న రూ.39,823 కోట్ల నుంచి అక్టోబర్ చివరికి రూ.44,545 కోట్లకు దూసుకుపోయాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) అక్టోబర్‌లో నికరంగా 2 లక్షలు పెరిగాయి. దీంతో మొత్తం ఫోలియోలు 59.13 లక్షలకు చేరాయి. ఈ ఏడాది ఆగస్ట్‌లో రూ.1,611 కోట్లు, జూలైలో రూ.1,337 కోట్లు, జూన్‌లో రూ.726 కోట్లు, మే నెలలో రూ.396 కోట్ల చొప్పున పెట్టుబడులు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి వచ్చినట్టు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**రూ.24,153 కోట్లు:** కరోనా విపత్తు, అనంతరం ఉక్రెయిన్-రష్యా యుద్ధం, మధ్యప్రాచ్యంలో హమాస్‌తో ఇజ్రాయెల్ పోరు ఇవన్నీ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ఆర్థిక అనిశ్చితులకు దారితీయడం గమనార్హం. ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్ సాధనంగా పేరున్న బంగారానికి డిమాండ్ ఏర్పడి ర్యాలీకి దారితీసింది. దీంతో 2020 జనవరి నుంచి చూస్తే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.24,153 కోట్లు నికరంగా వచ్చాయి. "యూఎస్ ఫెడ్ ఈ ఏడాది 0.75 శాతం మేర వడ్డీ రేట్లను తగ్గించింది. దీంతో డాలర్ విలువ పెరిగింది. ఇది అంతర్జాతీయంగా బంగారం ధరలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందన్నది చూడాల్సి ఉంది. పండుగలు, పెళ్లిళ్ల సమయంలో బంగారం ధరలు పెరుగుతాయన్న అంచనాలు నెలకొన్నాయి. దీన్నుంచి ప్రయోజనం పొందాలన్న ఇన్వెస్టర్ల ఆకాంక్ష ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు పెరగడానికి దారితీసి ఉండొచ్చు" అని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ హిమాన్షు శ్రీవాస్తవ తెలిపారు.

# జింకా లాజిస్టిక్స్ ఐపీవో ఓకే

## చివరిరోజుకల్లా 2 రెట్లు స్పందన




న్యూఢిల్లీ: ట్రక్ ఆపరేటర్లకు డిజిటల్ ప్లాట్‌ఫామ్ సేవలందించే జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూకి అంతంత మాత్ర స్పందన లభించింది. చివరి రోజు సోమవారానికల్లా 1.9 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. కంపెనీ 2.25 కోట్ల షేర్లు ఆఫర్ చేయగా.. 4.19 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. క్విబ్ విభాగంలో 2.76 రెట్లు బిడ్స్ నమోదుకాగా.. రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 1.65 రెట్లు దరఖాస్తులు లభించాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల విభాగంలో 24 శాతానికే దరఖాస్తులు అందాయి. ఇష్యూలో భాగంగా యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 501 కోట్లు సమకూర్చుకున్న సంగతి తెలిసిందే. వెరసి షేరుకి రూ. 259–273 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 1,115 కోట్లు సమీకరించింది. ఐపీవో ద్వారా ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు రూ. 565 కోట్ల విలువైన 2.06 కోట్ల షేర్లను విక్రయించగా.. రూ. 550 కోట్ల విలువైన ఈక్విటీని కంపెనీ కొత్తగా జారీ చేసింది. ఈ నిధుల్లో రూ. 200 కోట్లు మార్కెటింగ్‌కు, రూ. 140 కోట్లు బ్లాక్‌బక్ ఫిన్‌సర్వ్ మూలధన పెట్టుబడులకు వినియోగించనుంది.

### ఏరిస్‌ఇన్‌ఫ్రా ఐపీవోకు రెడీ

నిర్మాణ రంగ మెటీరియల్స్ ప్రొక్యూర్‌మెంట్‌లో టెక్నాలజీ ఆధారిత బీ2బీ సేవలందించే ఏరిస్‌ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూకి క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వెరసి ఐపీవో ద్వారా రూ. 600 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఐపీవో చేపట్టేందుకు వీలుగా ఈ ఏడాది ఆగస్ట్‌లో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన కంపెనీ తాజాగా అనుమతులు పొందింది. కాగా.. ఇష్యూ నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, అనుబంధ సంస్థ బిల్డ్‌మెక్స్ ఇన్‌ఫ్రాలో పెట్టుబడులకు, రుణ చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

# బాండ్ల జారీతో ఎస్‌బీఐకు నిధులు

రూ. 10,000 కోట్ల సమీకరణ




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) తాజాగా రూ. 10,000 కోట్లు సమీకరించింది. ఏడోసారి ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ బాండ్ల జారీ ద్వారా పెట్టుబడులు సమకూర్చుకుంది. 15 ఏళ్ల కాలపరిమితి గల వీటికి కూపన్ రేటు 7.23 శాతంకాగా.. రూ. 11,500 కోట్లకుపైగా విలువైన బిడ్స్ దాఖలయ్యాయి. నిజానికి బ్యాంక్ రూ. 5,000 కోట్ల విలువైన బాండ్ల జారీకి తెరతీసింది. అధిక బిడ్డింగ్ నమోదైతే.. మరో రూ. 5,000 కోట్ల విలువైన బాండ్లను విక్రయించేందుకు గ్రీన్‌షూ ఆప్షన్‌ను ఎంచుకుంది. వెరసి బాండ్ ఇష్యూకి 2 రెట్లు అధికంగా స్పందన లభించింది. బిడ్ చేసిన సంస్థలలో ప్రావిడెంట్ ఫండ్స్, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్స్ తదితరాలున్నట్లు ఎస్‌బీఐ పేర్కొంది. మౌలిక సదుపాయాలు, అందుబాటు ధరల హౌసింగ్ విభాగాలలో దీర్ఘకాలిక పెట్టుబడులుగా తాజా నిధులను వినియోగించనున్నట్లు వివరించింది. బాండ్లకు స్థిరత్వ ఔట్‌లుక్‌సహా.. ఏఏఏ రేటింగ్‌ను పొందింది. వీటి జారీతో దీర్ఘకాలిక బాండ్లపై ఇతర బ్యాంకులు సైతం దృష్టి సారించేందుకు వీలు చిక్కినట్లు ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు.

# విమానయానం కొత్త రికార్డు



న్యూఢిల్లీ: ప్రయాణికుల సంఖ్య పరంగా దేశీయ విమానయాన రంగం సరికొత్త రికార్డులు నమోదు చేసింది. తొలిసారిగా ఒకేరోజు 5 లక్షల ప్రయాణికుల మార్కును చేరుకుంది. నవంబర్ 17న ఏకంగా 5,05,412 మంది వివిధ నగరాలకు రాకపోకలు సాగించారు. 3,173 విమాన సర్వీసుల ద్వారా ఈ రికార్డు నమోదైంది. పండుగలు, వివాహాల సీజన్ ఇందుకు కారణమని పౌర విమానయాన శాఖ తెలిపింది. అక్టోబర్ 27 నుండి ప్రారంభమయ్యే శీతాకాలపు షెడ్యూల్‌లో భారతీయ విమానయాన సంస్థలు ప్రతి వారం 124 విమానాశ్రయాలకు 25,007 సర్వీసులను నడుపుతాయని డీజీసీఏ గత నెలలో ప్రకటించింది. వేసవి షెడ్యూల్‌లో 125 విమానాశ్రయాల నుండి వారానికి నడిచే 24,275 సర్వీసుల కంటే ఇది మూడు శాతం ఎక్కువ. 2023 శీతాకాలపు షెడ్యూల్‌తో పోలిస్తే విమానాల సంఖ్య 5.37 శాతం పెరిగింది. శీతాకాలపు షెడ్యూల్ 2024 అక్టోబర్ 27 నుండి 2025 మార్చి 29 వరకు ఉంటుంది.

## వారీ ఎనర్జీస్ లాభం అప్

క్యూ2లో రూ. 376 కోట్లు




న్యూఢిల్లీ: పీవీ మాడ్యూల్స్ తయారీ కంపెనీ వారీ ఎనర్జీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. స్టాక్ ఎక్స్చేంజీలలో ఇటీవలే లిస్టయిన కంపెనీ తొలిసారి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది.జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 17 శాతం ఎగసి రూ. 376 కోట్లకు చేరింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 320 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 3,559 కోట్ల నుంచి రూ. 3,663 కోట్లకు పుంజుకుంది. మొత్తం వ్యయాలు సైతం రూ. 3,124 కోట్ల నుంచి రూ. 3,165 కోట్లకు పెరిగాయి. సొంత అనుబంధ సంస్థలలో రూ. 600 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు బోర్డు అనుమతించినట్లు వారీ ఎనర్జీస్ వెల్లడించింది.

**ఫలితాల నేపథ్యంలో వారీ ఎనర్జీస్ షేరు బీఎస్ఈలో 7 శాతం జంప్‌చేసి రూ. 3,116 వద్ద ముగిసింది.**

# అదానీ గ్రూప్ భారీ పెట్టుబడులు

- ఐదేళ్లలో రూ.2.94 లక్షల కోట్లు
- సోలార్, పవన, హైబ్రిడ్ ప్లాంట్ల ఏర్పాటు




ముంబై: అదానీ గ్రూప్ పునరుత్పాదక ఇంధన వనరులపై భారీ పెట్టుబడులతో ఉంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో భారీ సామర్థ్యంతో సోలార్, పవన, హైబ్రిడ్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై వచ్చే ఐదేళ్లలో 35 బిలియన్ డాలర్లు (రూ.2.94 లక్షల కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్టు అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ ప్రకటించారు. '2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువ నాయకుల పాత్ర' అనే అంశంపై జరిగిన సీఈవో ప్యానెల్ చర్చలో భాగంగా సాగర్ అదానీ ఈ వివరాలు వెల్లడించారు. గుజరాత్‌లోని ఖావ్డాలో 30,000 మెగావాట్ సామర్థ్యంతో పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాలను ఈ కంపెనీ ఏర్పాటు చేస్తుండడం గమనార్హం. ఇంధన స్థిరత్వం, ఇంధన పరివర్తనం విషయంలో అదిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ పెట్టుబడుల్లో ఇది ఒకటి అవుతుందని సాగర్ అదానీ పేర్కొన్నారు. "మన దగ్గర 500 గిగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. తలసరి వినియోగంలో ప్రపంచ వ్యాప్తంగా చూస్తే మనం మూడింత ఒక వంతు పరిమాణంలోనే ఉన్నాం. వచ్చే 7–8 ఏళ్లలో ప్రపంచ సగటు తలసరి విద్యుత్ వినియోగానికి చేరుకోవాలంటే మరో 1,000 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం అవసరం. చైనా స్థాయికి చేరుకోవాలంటే మరో 1,500 మెగావాట్ల సామర్థ్యం అవసరం. అభివృద్ధి చెందిన దేశాలకు సమాన స్థాయికి చేరుకోవాలంటే మరో 2,500–3,000 మెగావాట్ల సామర్థ్యం అవసరం అవుతుంది"అని వివరించారు.

# మెడ్‌ప్లస్ హెల్త్‌లో 6.6% వాటాల విక్రయం





న్యూఢిల్లీ: రిటైల్ ఫార్మసీ, డయాగ్నోస్టిక్స్ చెయిన్ అయిన మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్‌లో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, ఎస్‌బీఐ మ్యుచువల్ ఫండ్ ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 6.6 శాతం వాటాలను విక్రయించాయి. వీటి విలువ సుమారు రూ. 552 కోట్లు. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం అనుబంధ పీఐ ఆపర్చూనిటీస్ ఫండ్ వన్ ద్వారా ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ 68.93 లక్షల షేర్లను (5.77 శాతం వాటా) విక్రయించి, సంస్థ నుంచి వైదొలిగింది. అటు ఎస్‌బీఐ మ్యుచువల్ ఫండ్ కూడా 10 లక్షల షేర్లను (సుమారు 0.84 శాతం) విక్రయించింది. దీంతో సంస్థలో ఎస్‌బీఐ మ్యుచువల్ ఫండ్ వాటా 4.88 శాతం నుంచి 4.04 శాతానికి తగ్గింది. ఒక్కో షేరుకు సగటున రూ. 700 ధరతో ఈ లావాదేవీలు జరిగాయి. ఆగస్టులో ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ మొత్తం 11.35 శాతం వాటాను రూ. 836 కోట్లకు విక్రయించి వైదొలిగింది.

**సోమవారం ఎన్ఎస్ఈలో మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ షేరు రెండు శాతం పెరిగి రూ. 719 వద్ద క్లోజయ్యింది.**

# బైబ్యాక్, డివిడెండ్ పాలసీలో మార్పులు

### ప్రభుత్వ సంస్థలకు తాజా మార్గదర్శకాలు

- నిబంధనలు సవరించిన ఆర్థిక శాఖ
- బ్యాంకులు, బీమా సంస్థలకు వర్తించవు
- వివరాలు వెల్లడించిన దీపమ్



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ సంస్థ(సీపీఎస్ఈ)లకు మూలధన పునర్వ్యవస్థీకరణపై సవరించిన మార్గదర్శకాలను ఆర్థిక శాఖ జారీ చేసింది. దీపమ్ ద్వారా వెలువడిన వీటి ప్రకారం ఇకపై సీపీఎస్ఈలు తమ నికర లాభాల్లో కనీసం 30 శాతం లేదా నెట్‌వర్త్‌లో 4 శాతాన్ని(ఏది అధికమైతే దాన్ని) వార్షిక డివిడెండుగా చెల్లించవలసి ఉంటుంది. ఎన్‌బీఎఫ్‌సీ తదితర ఫైనాన్షియల్ రంగ సీపీఎస్ఈలు తప్పనిసరిగా నికర లాభాల్లో కనీసం 30 శాతాన్ని డివిడెండుగా చెల్లించాలి. ఇంతక్రితం 2016లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమైతే నికర లాభాల్లో 30 శాతం లేదా నెట్‌వర్త్‌లో 5 శాతాన్ని(ఏది ఎక్కువైతే అది) డివిడెండుగా చెల్లించవలసి ఉంటుంది. అయితే అప్పట్లో ఫైనాన్షియల్ రంగ సీపీఎస్ఈలగురించి ప్రత్యేకంగా ప్రస్తావించలేదు.

### బ్యాంకులకు వర్తించవు

దీపమ్ విడుదల చేసిన తాజా మార్గదర్శకాలు ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా రంగ కంపెనీలకు వర్తించబోవు. అంతేకాకుండా కంపెనీల చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం లాభాలను పంచిపెట్టడాన్ని నిషేధించిన సంస్థలకు సైతం మార్గదర్శకాలు అమలుకావని దీపమ్ స్పష్టం చేసింది. సవరించిన తాజా మార్గదర్శకాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) నుంచి అమలవుతాయని తెలియజేసింది. సీపీఎస్ఈలు మధ్యంతర డివిడెండ్ల చెల్లింపులను ప్రతీ త్రైమాసికానికీ లేదా ఏడాదిలో రెండుసార్లు చేపట్టేందుకు వీలుంటుంది. అన్ని లిస్టెడ్ సీపీఎస్ఈలు.. వార్షిక అంచనా డివిడెండ్‌లో కనీసం 90 శాతం ఒకే దశలో లేదా దశలవారీగా చెల్లించవచ్చు. అయితే గడిచిన ఏడాదికి తుది డివిడెండ్‌ను ప్రతీ ఏటా సెప్టెంబర్‌లో నిర్వహించే వార్షిక సాధారణ సమావేశం(ఏజీఎం) ముగిసిన వెంటనే చెల్లించవలసి ఉంటుంది. అన్‌లిస్టెడ్ సంస్థలు గతేడాది ఆడిటెడ్ ఆర్థిక ఫలితాల ఆధారంగా ఏడాదిలో ఒకసారి తుది డివిడెండుగా చెల్లించవలసి ఉంటుంది.

### బైబ్యాక్ ఇలా..

గత ఆరు నెలల్లో పుస్తక విలువ(బీవీ) కంటే షేరు మార్కెట్ విలువ తక్కువగా ఉన్న సీపీఎస్ఈ.. ఈక్విటీ షేర్లను బైబ్యాక్ చేయవలసి ఉంటుంది. అయితే ఇందుకు కనీసం రూ. 3,000 కోట్ల నెట్‌వర్త్, రూ. 1,500 కోట్లకంటే అధికంగా నగదు, బ్యాంక్ నిల్వలు కలిగి ఉండాలి. కంపెనీ రిజర్వులు, మిగులు నిధులు చెల్లించిన ఈక్విటీ మూలధనానికి సమానంగా లేదా 20 రెట్లు అధికంగా ఉన్న కంపెనీలు బోనస్ షేర్లను జారీ చేయవలసి ఉంటుంది. గత ఆరు నెలల్లో షేరు ముఖ విలువకంటే మార్కెట్ ధర 150 రెట్లు అధికంగా పలుకుతున్న లిస్టెడ్ సీపీఎస్ఈ.. షేర్ల విభజనను చేపట్టవలసి ఉంటుంది. ఈ బాటలో షేర్ల విభజన మధ్య కనీసం మూడేళ్ల వ్యవధిని పాటించవలసి ఉంటుంది. తాజా మార్గదర్శకాలు సీపీఎస్ఈల అనుబంధ(51 శాతానికిపైగా వాటా కలిగిన) సంస్థలకు సైతం వర్తించనున్నాయి.

# మెటాకు రూ. 213 కోట్ల జరిమానా




న్యూఢిల్లీ: వాట్సాప్ గోప్యత పాలసీ 2021 అప్‌డేట్‌కి సంబంధించి అనుచిత వ్యాపార విధానాలను అమలు చేసినందుకు గాను సోషల్ మీడియా దిగ్గజం మెటాకు కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) రూ. 213 కోట్ల జరిమానా విధించింది. వీటిని సరిదిద్దుకునేందుకు నిర్దిష్ట వ్యవధి లోగా తగు చర్యలు తీసుకోవాలని మెటా, వాట్సాప్‌లను ఆదేశించింది. ఇకపై ఇలాంటి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వాట్సాప్ తన ప్లాట్‌ఫాం మీద సేకరించే డేటాను సర్వీస్‌లు అందించడానికైతే తప్ప అయిదేళ్ల వరకు ప్రకటనలపరమైన అవసరాల కోసం ఇతర మెటా కంపెనీలకు షేర్ చేయరాదని సీసీఐ పేర్కొంది. ఇతరత్రా అవసరాల కోసం షేర్ చేసుకునేటప్పుడు కచ్చితమైన వివరణ ఇవ్వాలని తెలిపింది. 2021 ఫిబ్రవరి నాటి పాలసీ అప్‌డేట్ ప్రకారం వాట్సాప్‌ను ఉపయోగించుకోవడాన్ని కొనసాగించాలంటే యూజర్లు తమ డేటాను మెటా కంపెనీలతో షేర్ చేసుకోవడానికి తప్పనిసరిగా అంగీకరించాలనే షరతును చేర్చారు. అంతకు ముందు ఇది ఐచ్ఛికంగానే ఉండేది. గుత్తాధిపత్యం ఉన్న మెటాతో డేటాను షేర్ చేయడాన్ని తప్పనిసరి చేయడం వల్ల ప్రకటనల మార్కెట్లో పోటీ సంస్థలకు అవరోధాలు ఏర్పడే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమైంది.

# విన్నర్ సినెర్

## ఏటీపీ ఫైనల్స్ టోర్నీ టైటిల్ నెగ్గిన వరల్డ్ నంబర్‌వన్

| | | |
|---|---|---|
| ఫైనల్లో అమెరికా ప్లేయర్ టేలర్ ఫ్రిట్జ్‌పై విజయం | ఒక్క మ్యాచ్, ఒక్క సెట్ కూడా ఓడిపోకుండా విజేతగా నిలిచిన ఇటలీ స్టార్ | రూ. 41 కోట్ల 20 లక్షల ప్రైజ్‌మనీ సొంతం |


విన్నర్స్ ట్రోఫీతో సినెర్

రోజర్ ఫెడరర్, రాఫెల్ నాదల్ ఇప్పటికే టెన్నిస్ నుంచి వీడ్కోలు తీసుకోగా... సెర్బియా స్టార్ జొకోవిచ్ కూడా త్వరలోనే వీరి బాటలో నడిచే అవకాశముంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ పురుషుల టెన్నిస్ 'ముఖచిత్రం' ఎవరనే ప్రశ్నకు సమాధానంగా ఇటలీ ప్లేయర్ యానిక్ సినెర్ దూసుకొచ్చాడు. సీజన్ ముగింపు టోర్నమెంట్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ఫైనల్స్‌లో సినెర్ తొలిసారి చాంపియన్‌గా అవతరించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన సింగిల్స్ ఫైనల్లో సినెర్ అమెరికా ప్లేయర్ టేలర్ ఫ్రిట్జ్‌పై వరుస సెట్‌లలో విజయం సాధించాడు. ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని సినెర్... 1986లో ఇవాన్ లెండిల్ తర్వాత ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకుండా విజేతగా నిలిచిన తొలి ప్లేయర్‌గా ఘనత సాధించాడు. ఇటీవల డోపింగ్ వివాదంతో విమర్శలపాలైనా... ఉద్దేశపూర్వకంగా తాను ఎలాంటి తప్పిదం చేయలేదని వివరణ ఇచ్చిన సినెర్... తాజా విజయంతో సీజన్‌ను చిరస్మరణీయంగా ముగించాడు.


రన్నరప్ ట్రోఫీతో టేలర్ ఫ్రిట్జ్

**ట్యూరిన్:** సొంతగడ్డపై ఇటలీ టెన్నిస్ స్టార్ యానిక్ సినెర్ అదరగొట్టాడు. ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో తొలిసారి విజేతగా అవతరించాడు. అమెరికా ప్లేయర్, యూఎస్ ఓపెన్ రన్నరప్ టేలర్ ఫ్రిట్జ్‌తో జరిగిన సింగిల్స్ ఫైనల్లో సినెర్ 6-4, 6-4తో గెలుపొందాడు. 84 నిమిషాలపాటు జరిగిన ఈ తుది సమరంలో సినెర్ 14 ఏస్‌లు సంధించాడు. ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. తొలి సర్వీస్‌లో 40కుగాను 33 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 16కు 13 పాయింట్లు సాధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసిన సినెర్ తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోలేదు. నెట్ వద్దకు 5 సార్లు దూసుకొచ్చిన ఇటలీ స్టార్ మూడుసార్లు పాయింట్లు నెగ్గాడు. 28 విన్నర్స్ కొట్టిన సినెర్ కేవలం 9 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు ఫ్రిట్జ్ 8 ఏస్‌లు సంధించి, 2 డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నెట్ వద్దకు 8 సార్లు దూసుకొచ్చి 7 సార్లు పాయింట్లు నెగ్గిన ఫ్రిట్జ్ 15 అనవసర తప్పిదాలు చేశాడు. టోర్నీ మొత్తంలో ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా విజేతగా నిలిచినందుకు సినెర్ 48,81,100 డాలర్ల (రూ. 41 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీ, 1500 ర్యాంకింగ్ పాయింట్లు గెల్చుకున్నాడు. టేలర్ ఫ్రిట్జ్‌కు 22,47,400 డాలర్ల (రూ. 18 కోట్ల 96 లక్షలు) ప్రైజ్‌మనీ, 800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2006లో జేమ్స్ బ్లేక్ తర్వాత ఏటీపీ ఫైనల్స్ టోర్నీ తుది పోరులో ఆడిన అమెరికన్ ప్లేయర్‌గా గుర్తింపు పొందిన ఫ్రిట్జ్ కీలక సమరంలో తడబడ్డాడు. ఒకవేళ ఫ్రిట్జ్ గెలిచి ఉంటే 1999లో సంప్రాస్ తర్వాత ఏటీపీ ఫైనల్స్ టైటిల్ సాధించిన అమెరికా ప్లేయర్‌గా గుర్తింపు పొందేవాడు. మరోవైపు ఇవాన్ లెండిల్ (1986లో; చెక్ రిపబ్లిక్/అమెరికా) తర్వాత ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో ఒక్క సెట్ కూడా కోల్పోకుండా విజేతగా నిలిచిన తొలి ప్లేయర్‌గా ఘనత వహించాడు. 2024 ఏడాదిని సినెర్ 70 విజయాలు, 6 పరాజయాలతో ముగించాడు. ఆండీ ముర్రే (బ్రిటన్; 2016లో) తర్వాత ఒకే సీజన్‌లో 70 విజయాలు సాధించిన ప్లేయర్‌గా సినెర్ నిలిచాడు.

**8** ఈ ఏడాదిలో సినెర్ సాధించిన టైటిల్స్ సంఖ్య. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ, రోటర్‌డామ్ ఓపెన్, మయామి మాస్టర్స్, హాలె ఓపెన్, సిన్సినాటి మాస్టర్స్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ, షాంఘై మాస్టర్స్, ఏటీపీ ఫైనల్స్ టోర్నీలలో సినెర్ విజేతగా నిలిచాడు. ఓవరాల్‌గా సినెర్ కెరీర్‌లో 18 టైటిల్స్ నెగ్గాడు.


ఏటీపీ ఫైనల్స్ టోర్నీ డబుల్స్ విన్నర్స్ ట్రోఫీతో క్రావిట్జ్-ప్యూట్జ్ (జర్మనీ) జోడీ

# రన్నరప్ శిబి శ్రీనివాస్



**సాక్షి, హైదరాబాద్:** చదరంగోత్సవ ఆలిండియా ఓపెన్ ఫిడే రేటెడ్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ ప్లేయర్ శిబి శ్రీనివాస్ ఐన్‌స్టీన్ రన్నరప్‌గా నిలిచాడు. బెంగళూరులోని బీఎంఎస్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ముగిసిన ఈ టోర్నీలో 21 ఏళ్ల శిబి శ్రీనివాస్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో శిబి శ్రీనివాస్‌తోపాటు మరో ఇద్దరు కరణం నాగ సాయి సార్థక్ (కర్ణాటక), అవిరత్ చౌహాన్ (మహారాష్ట్ర) 7.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... శిబి శ్రీనివాస్‌కు రెండో స్థానం, సాయి సార్థక్‌కు మూడో స్థానం, అవిరత్‌కు నాలుగో స్థానం ఖరారయ్యాయి. 8 పాయింట్లతో ప్రశాంత్ నాయక్ (కర్ణాటక) విజేతగా నిలిచాడు. శిబి శ్రీనివాస్ ఈ టోర్నీలో ఏడు గేముల్లో గెలిచి, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. ప్రణవ్ వసంత్ కుమార్ రావు, తోట విధు, అద్వైత్, హరి అన్నామలై, ఆనంది, వినాయక్ కులకర్ణి, రవి గోపాల్ హెగ్డేలపై శిబి శ్రీనివాస్ గెలిచాడు. సంపత్ కుమార్ తిరునారాయణన్ చేతిలో ఓడిన శిబి... సాయి సార్థక్‌తో గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. రన్నరప్‌గా నిలిచిన శిబి శ్రీనివాస్‌కు రూ. 40 వేల ప్రైజ్‌మనీతో పాటు ట్రోఫీ లభించింది.

# ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

## మూడో టి20లోనూ ఓడిపోయిన పాకిస్తాన్ ● చెలరేగిన స్టొయినిస్



**హోబర్ట్:** వన్డే సిరీస్‌ను కోల్పోయిన ఆస్ట్రేలియా జట్టు టి20 సిరీస్‌లో మెరిసింది. పాకిస్తాన్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. సోమవారం జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో... మొదట బౌలర్లు, తర్వాత మార్కస్ స్టొయినిస్ (27 బంతుల్లో 61 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగడంతో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై జయకేతనం ఎగురవేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు 18.1 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (28 బంతుల్లో 41; 4 ఫోర్లు) ఒక్కడే రాణించగా, హసీబుల్లా ఖాన్ (19 బంతుల్లో 24; 3 ఫోర్లు) కాస్త మెరుగ్గా ఆడాడు. మిగతా బ్యాటర్లను ఆస్ట్రేలియన్ బౌలర్లు ఆరోన్ హార్డి (3/21), ఆడమ్ జంపా (2/11), స్పెన్సర్ జాన్సన్ (2/24) క్రీజులో నిలువనీయలేదు. దీంతో 91/5 వద్ద మెరుగైన స్థితిలో కనిపించిన పాక్ అనూహ్యంగా మరో 26 పరుగులే చేసి మిగతా సగం వికెట్లను కోల్పోయి ఆలటైంది. షాహీన్ అఫ్రిది (12 బంతుల్లో 16; 2 ఫోర్లు, 1 సిక్స్) చకచకా చేసిన పరుగులతో పాక్ 100 పరుగుల మార్క్‌ను దాటింది. తర్వాత సులువైన లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 11.2 ఓవర్లలోనే మూడే వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు షార్ట్ (2), జేక్ ఫ్రేజర్ (18) పవర్‌ప్లేలోనే వెనుదిరిగినా... కెప్టెన్ ఇంగ్లిస్ (27; 4 ఫోర్లు)తో కలిసి స్టొయినిస్ దంచేశాడు. 23 బంతుల్లోనే అతను అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. పాక్ బౌలర్లలో అఫ్రిది, జహందాద్, అబ్బాస్ తలా ఒక వికెట్ తీశారు. పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడేందుకు ఇక్కడికి వచ్చిన పాక్ తొలుత జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. కానీ టి20ల్లో మాత్రం చిత్తుగా ఓడింది. అయితే బాబర్ (4192 పరుగులతో) అంతర్జాతీయ టి20ల్లో భారత కింగ్ కోహ్లి (4188)ని అధిగమించి రెండో స్థానానికి చేరాడు. రోహిత్ శర్మ (4231) అగ్రస్థానంలో ఉన్నాడు. అయితే టీమిండియా క్రికెటర్లిద్దరూ టి20లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో బాబర్ అగ్రస్థానానికి చేరే అవకాశముంది.


హరియాణా రెయిడర్‌ను పట్టేసిన టైటాన్స్ ఆటగాళ్లు

# తెలుగు టైటాన్స్ తడాఖా

## 'టాపర్' హరియాణా స్టీలర్స్‌పై 22 పాయింట్ల తేడాతో ఘనవిజయం ● అదరగొట్టిన ఆశిష్, విజయ్

**నోయిడా:** తెలుగు టైటాన్స్ ఈ సీజన్‌లో చెప్పుకోదగిన విజయాన్ని సాధించింది. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో అగ్రస్థానంలో దూసుకెళ్తున్న హరియాణా స్టీలర్స్‌కు ఊహించని షాక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌కు ముందు పది మ్యాచ్‌లాడిన హరియాణా స్టీలర్స్ కేవలం 2 మ్యాచ్‌ల్లోనే ఓడి, ఎనిమిదింట విజయం సాధించిది. అలాంటి మేటి ప్రదర్శన కనబరుస్తున్న హరియాణాపై తెలుగు టైటాన్స్ సాధికార విజయం సాధించింది. సోమవారం జరిగిన ఈ పోరులో కీలకమైన ఆటగాడు, కెప్టెన్ పవన్ సెహ్రావత్ గాయంతో బరిలోకి దిగలేదు. అయినా సరే టైటాన్స్ 49-27తో స్టీలర్స్‌కు ఊహించని పరాజయాన్ని రుచి చూపించింది. ఆట ఆరంభమైన పది నిమిషాల్లోనే తెలుగు టైటాన్స్ రెయిడర్లు, డిఫెండర్లు సత్తా చాటుకోవడంతో హరియాణా ఆలౌటైంది. సరిగ్గా ప్రథమార్ధం ముగిసే సమయానికి (20 నిమిషాలు) మళ్లీ ఆలౌట్ చేసిన టైటాన్స్ ఆధిక్యాన్ని 23-11కు పెంచకుంది. ద్వితీయార్ధంలో స్టీలర్స్ పాయింట్లు చేసినప్పటికీ క్రమం తప్పకుండా తెలుగు టైటాన్స్ చేస్తున్న స్కోరును ఏ దశలోనూ చేరుకోలేకపోయింది. రెయిడర్లు ఆశిష్ నర్వాల్ (11 పాయింట్లు), కెప్టెన్ విజయ్ మలిక్ (8) అదరగొట్టారు. డిఫెండర్ సాగర్, ఆల్‌రౌండర్ శంకర్ చెరో 5 పాయింట్లు చేశారు. హరియాణా తరఫున కెప్టెన్ రాహుల్ (6), ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా (5), రెయిడర్ జయసూర్య (5) రాణించారు. ప్రస్తుతం 10 మ్యాచ్‌లాడిన తెలుగు జట్టు ఆరో విజయంతో పట్టికలో ఏడో స్థానంలో ఉంది. అనంతరం హోరాహోరిగా జరిగిన రెండో మ్యాచ్‌లో యు ముంబా 38-37 ఒకే ఒక్క పాయింట్ తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. ముంబా తరఫున రెయిడర్ అజిత్ చౌహాన్ (10) ఆకట్టుకున్నాడు. అమిర్ మొహమ్మద్, కెప్టెన్ సునీల్ కుమార్ చెరో 4 పాయింట్లు చేశారు. బెంగళూరు జట్టులో ప్రదీప్ నర్వాల్ (10), సుశీల్ (6), నితిన్ రావల్ (6) రాణించారు. నేడు జరిగే పోటీల్లో పుణేరి పల్టన్‌తో యూపీ యోధాస్ (రాత్రి 8 గంటల నుంచి)... బెంగళూరు బుల్స్‌తో పట్నా పైరేట్స్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.

# న్యూజిలాండ్ బౌలర్ బ్రేస్‌వెల్‌పై నిషేధం

## కొకైన్ తీసుకున్నట్లు తేలడంతో వేటు

**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ పేస్ బౌలర్ డగ్లస్ బ్రేస్‌వెల్‌పై ఒక నెల నిషేధం విధించారు. అతను మాదకద్రవ్యాలు తీసుకోవడంతో న్యూజిలాండ్ స్పోర్ట్ ఇంటిగ్రిటీ కమిషన్ (ఎన్‌ఎస్ఐసీ) వేటు వేసింది. ఈ ఏడాది అతను కొకైన్ తీసుకున్నట్లు పరీక్షల్లో తేలింది. 2011లో టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేసిన బ్రేస్‌వెల్ జింబాబ్వేతో తన తొలి మ్యాచ్‌లో 6/40 బౌలింగ్ గణాంకాలతో ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది జనవరి 13న కివీస్ దేశవాళీ టి20 టోర్నీలో భాగంగా వెల్లింగ్టన్ జట్టుతో జరిగిన పోరులో సెంట్రల్ డిస్ట్రిక్స్ జట్టుకు ఆడిన బ్రేస్‌వెల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కూడా దక్కించుకున్నాడు. మ్యాచ్ అనంతరం అతని నుంచి సేకరించిన రక్త,



మూత్ర నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించగా పాజిటివ్ అని తేలడంతో ఎన్‌ఎస్ఐసీ అతన్ని ముందుగా మూడు నెలల పాటు సస్పెండ్ చేసింది. తర్వాత ఒక నెలకు పరిమితం చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 11 నుంచి నెలరోజులపాటు అతనిపై నిషేధం పడింది. 34 ఏళ్ల బ్రేస్‌వెల్ న్యూజిలాండ్ తరఫున 28 టెస్టులు ఆడి 74 వికెట్లు, 21 వన్డేలు ఆడి 26 వికెట్లు, 20 టి20 మ్యాచ్‌లు ఆడి 20 వికెట్లు పడగొట్టాడు. 'తర్వాతి తరం క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాల్సిన క్రికెటర్లు ఆన్ ద ఫీల్డ్, ఆఫ్ ద ఫీల్డ్‌లో బాధ్యతతో ప్రవర్తించాలి. ఇలాంటి నిషేధిత ఉత్ప్రేరకాలతో న్యూజిలాండ్ బోర్డు (ఎన్‌జడ్‌సీ) ప్రతిష్టను మసకబార్చవద్దు' అని ఎన్‌జడ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ స్కాట్ వీనింక్ తెలిపారు.

# ఐపీఎల్ వేలం కోసం వెటోరి

## భారత్‌తో తొలి టెస్టు మధ్యలో ఆస్ట్రేలియా జట్టును వీడనున్న అసిస్టెంట్ కోచ్



**పెర్త్:** ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు అసిస్టెంట్ కోచ్ డానియెల్ వెటోరి పెర్త్‌లో భారత్‌తో జరిగే తొలి టెస్టు మధ్యలోనే జట్టును వీడి ఐపీఎల్ మెగా వేలానికి బయలుదేరుతాడు. ఈ న్యూజిలాండ్ బౌలింగ్ దిగ్గజం ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)కు హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. దీంతో 45 ఏళ్ల వెటోరి సౌదీ అరేబియాలోని రెండో పెద్ద నగరం జిద్దాలో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే వేలంలో పాల్గొంటాడు. ఐదు టెస్టుల 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో తొలి టెస్టు 22 నుంచి పెర్త్‌లో జరుగుతుంది. 'ఐపీఎల్ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్ అయిన వెటోరికి మద్దతిస్తాం. అతను మొదటి టెస్టు సన్నాహానికి చేయాల్సిందంతా (ట్రెయినింగ్) చేసే వేలానికి హాజరవుతాడు. ఇందులో మాకు ఏ ఇబ్బంది లేదు. మెగా వేలం ముగిసిన వెంటనే మళ్లీ మా జట్టుతో కలుస్తాడు' అని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రతినిధి ఒకరు వెల్లడించారు. సీఏ నేషనల్ డెవలప్‌మెంట్ కోచ్ లాచ్లన్ స్టీవెన్స్... తొలి టెస్టు కోసం వెటోరి పాత్రను భర్తీ చేస్తారని సీఏ తెలిపింది. కివీస్‌కు చెందిన వెటోరి మాత్రమే కాదు... ఆస్ట్రేలియన్ దిగ్గజాలు రికీ పాంటింగ్, జస్టిన్ లాంగర్‌లు సైతం జిద్దాకు పయనమవుతారు. పాంటింగ్ పంజాబ్ కింగ్స్‌కు, లాంగర్ లక్నో సూపర్ జెయింట్స్‌కు హెడ్ కోచ్‌లుగా ఉన్నారు. దీంతో 'చానెల్ సెవెన్'లో వ్యాఖ్యాతలు వ్యవహరించనున్న వీళ్లిద్దరు కూడా పెర్త్ టెస్టు మధ్యలోనే మెగా వేలంలో పాల్గొననున్నారు.

# ఇంగ్లండ్, విండీస్‌ల ఆఖరి టి20 రద్దు

## 3-1తో సిరీస్ నెగ్గిన ఇంగ్లండ్

**గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా):** కరీబియన్ పర్యటనలో ఆఖరిదైన ఐదో టి20 రద్దవడంతో ఇంగ్లండ్ 3-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి జరగాల్సిన మ్యాచ్ సరిగ్గా ఐదు ఓవర్లు ముగిశాక వర్షంతో ఆగిపోయింది. అప్పటికే మ్యాచ్ నిలిచే సమయానికి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 44 పరుగులు చేసింది. ఓపెనర్లు లూయిస్ (20 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షై హోప్ (10 బంతుల్లో 14 నాటౌట్, 3 ఫోర్లు) అజేయంగా ఉన్నారు. అయితే భారీ వర్షంతో అవుట్ ఫీల్డ్ అంతా చిత్తడిగా మారింది. తిరిగి ఆట నిర్వహించలేని పరిస్థితి తలెత్తడంతో ఫీల్డు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ద్వైపాక్షిక సిరీస్‌లో మొదటి మూడు టి20ల్లో వరుసగా ఇంగ్లండే గెలిచి మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను నెగ్గింది. ఈ సిరీస్‌లో 9 వికెట్లు తీసిన ఇంగ్లండ్ సీమర్ సాకిబ్ మహమూద్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు అందుకున్నాడు. ఈ పర్యటనలో ముందు మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య వెస్టిండీస్ 2-1తో కైవసం చేసుకుంది. అయితే ఈ ద్వైపాక్షిక సిరీస్‌లో ఫలితాలు వచ్చిన ఈ ఏడు మ్యాచ్‌ల్లోనూ టాస్ నెగ్గి... ఫీల్డింగ్ ఎంచుకొని, లక్ష్యాన్ని ఛేదించిన జట్లే గెలుపొందడం విశేషం!





# రాజకోట రహస్యం

## విండ్సర్ ప్యాలెస్‌లో దొంగలు పడ్డారు

**దర్జాగా ట్రక్కు, స్కూటర్ ఎత్తుకెళ్లారు ● నెల రోజుల తర్వాత వెలుగులోకి**

బ్రిటన్‌లో రాజు గారింట్లో దొంగలు పడ్డారు! రాజు చార్లెస్-3 దంపతులకు చెందిన విండ్సర్ రాజప్రాసాదంలో ఒక పికప్ ట్రక్కును, బైకును ఎత్తుకెళ్లారు. గత అక్టోబర్ 13న అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ ఉదంతాన్ని బ్రిటిష్ టాబ్లాయిడ్ సన్ తాజాగా బయటపెట్టింది. ''ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఆరడుగుల ఫెన్స్‌ను దూకి మరీ ప్యాలెస్ లోనికి ప్రవేశించారు. దొంగిలించిన ట్రక్కుతోనే సెక్యూరిటీ గేట్‌ను బద్దలు కొట్టి మరీ దర్జాగా ఉడాయించారు'' అని తెలిపింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ప్రాసాదంలోకి దొంగలు సులువుగా ప్రవేశించడమే గాక సెక్యూరిటీ సిబ్బంది కన్నుగప్పి ఏకంగా వాహనాలనే ఎత్తుకుపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రాసాదం పరిధిలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తే వెంటనే అలారం మోగుతుంది. చోరీ జరిగిన రోజు అలారం, ఇతర రక్షణ వ్యవస్థలన్నీ ఏమయ్యాయన్నది అంతుచిక్కడం లేదు. దీనిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. లండన్‌కు పాతిక మైళ్ల దూరంలో బెర్క్‌షైర్‌లో ఉండే విండ్సర్ క్యాజిల్‌లో రాజ దంపతులు వారానికి రెండు రోజులు బస చేస్తారు. యువరాజు విలియం, కేట్ దంపతులు కూడా తమ పిల్లలతో కలిసి దాని ఆవరణలోని అడెలైడ్ కాటేజీలోనే నివాసముంటారు. చోరీ జరిగినప్పుడు రాజ దంపతులు భవనంలో లేకున్నా విలియం దంపతులు తమ కాటేజీలోనే ఉన్నట్టు సమాచారం. దొంగలు బద్దలు కొట్టుకుని ఉడాయించిన గేటు గుండానే రాజ దంపతులు రాకపోకలు సాగుతాయని చెబుతున్నారు. ఈ ఉదంతంపై స్పందించేందుకు బకింగ్‌హాం ప్యాలెస్ నిరాకరించింది. బ్రిటన్ రాజ దంపతులతో పాటు రాజ కుటుంబీకులకు సొంత పోలీసు భద్రతా వ్యవస్థ ఉంటుంది. వారి భద్రతపై ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తారు.

### గతంలో ఎలిజబెత్‌పై హత్యాయత్నం

విండ్సర్ క్యాజిల్‌లో భద్రతా లోపాలు తలెత్తడం ఇది తొలిసారేమీ కాదు. 2021లో ఈ ప్రాసాదంలోనే రాణి ఎలిజబెత్-2పై హత్యా యత్నం జరిగింది. ఒక సాయుధుడు క్రిస్మస్ రోజు ఏకంగా ఫెన్సింగ్ దూకి లోనికి చొరబడ్డాడు. సునాయాసంగా రాణిని సమీపించాడు. అతన్ని చూసి భయంతో ఆమె చాలాసేపు కేకలు వేసినట్టు చెబుతారు. చివరికి భద్రతా సిబ్బంది దుండగున్ని బంధించడంతో ముప్పు తప్పింది. అప్పట్లో రాణి విండ్సర్‌లోనే నివాసముండేవారు. సాయుధుడు అంత సులువుగా రాణి సమీపం దాకా వెళ్లగలగడం, పైగా ఆ సమయంలో దగ్గర్లో భద్రతా సిబ్బంది లేకపోవడం అప్పట్లో చాలా అనుమానాలకు తావిచ్చింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

# అమెరికాలో భారతీయ విద్యార్థుల హవా

**2023-24 విద్యా సంవత్సరంలో 3,31,602 మంది విద్యాభ్యాసం**
- 2022-23 కంటే 23 శాతం అధికం
- చైనాను వెనక్కి నెట్టి తొలి స్థానంలోకి..
- ఓపెన్ డోర్స్-2024 నివేదిక వెల్లడి



ఉన్నత చదువులకు ఆకర్షణీయమైన గమ్యస్థానం అమెరికా. అగ్రరాజ్యంలో చదువుకోవడం, అక్కడే ఉద్యోగం సంపాదించుకోవడం ప్రపంచవ్యాప్తంగా యువత కల. అమెరికాకు విద్యార్థులను పంపించడంలో చైనా ముందంజలో ఉండేది. ఇప్పుడు ఆ స్థానాన్ని భారత్ దక్కించుకుంది. అమెరికాలో ప్రస్తుతం 3.3 లక్షల మందికిపైగా భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. అమెరికాకు విద్యార్థులను పంపిస్తున్న దేశాల జాబితాలో భారత్ తొలిస్థానంలో నిలవడం గత 15 ఏళ్లలో ఇదే మొదటిసారి. ఈ విషయాన్ని 'ఓపెన్ డోర్స్'సోమవారం తమ నివేదికలో వెల్లడించింది. 2022-23 విద్యా సంవత్సరంలో అమెరికాలో చైనా విద్యార్థులే అధికంగా ఉండేవారు. ఆ తర్వాతి స్థానం భారతీయ విద్యార్థులది. సంవత్సరం తిరిగేకల్లా పరిస్థితి మారిపోయింది. 2023-24 విద్యా సంవత్సరంలో మొదటి స్థానంలో భారతీయ విద్యార్థులు, రెండో స్థానంలో చైనా విద్యార్థులు ఉన్నారు.

- 2023-24లో అమెరికాలో 3,31,602 మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. 2022-23లో 2,68,923 మంది ఉన్నారు. విద్యార్థుల సంఖ్య ఈసారి ఏకంగా 23 శాతం పెరిగింది.
- అమెరికాలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో భారతీయుల వాటా 29 శాతం కావడం గమనార్హం.
- ఇండియా తర్వాత చైనా, దక్షిణ కొరియా, కెనడా, తైవాన్ దేశాలున్నాయి.
- చైనా విద్యార్థులు 2.77 లక్షలు, దక్షిణ కొరియా విద్యార్థులు 43,149, కెనడా విద్యార్థులు 28,998, తైవాన్ విద్యార్థులు 23,157 మంది ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు.
- 2008/2009లో అమెరికాలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అత్యధికంగా ఉండేవారు. 15 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ పరిస్థితి పునరావృతమైంది.
- ఒక విద్యా సంవత్సరంలో 3,31,602 మంది అమెరికాలో చదువుకుంటుండడం ఇదే మొదటిసారి.
- అంతర్జాతీయ గ్రాడ్యుయేట్(మాస్టర్స్, పీహెచ్‌డీ) విద్యార్థులను అమెరికాకు పంపుతున్న దేశాల జాబితాలో ఇండియా వరుసగా రెండో ఏడాది తొలిస్థానంలో నిలుస్తోంది. ఇండియన్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 19 శాతం పెరిగి 1,96,567కు చేరుకుంది.
- ఇండియన్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య 13 శాతం పెరిగి 36,053కు చేరింది. ఇండియన్ నాన్-డిగ్రీ విద్యార్థుల సంఖ్య 28 శాతం తగ్గిపోయి 1,426కు పరిమితమైంది.
- ఓపెన్ డోర్స్ రిపోర్టును ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్(ఐఐఈ) ప్రచురించింది. ఈ సంస్థను 1919లో స్థాపించారు. అమెరికాలోని విదేశీ విద్యార్థులపై ప్రతిఏటా సర్వే నిర్వహిస్తోంది. వారి వాస్త వ సంఖ్యను బహిర్గతం చేస్తోంది. 1972 నుంచి యూఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ స్టేట్స్ బ్యూరో ఆఫ్ ఎడ్యుకేషన్, కల్చరల్ అఫైర్స్ కూడా సహకారం అందిస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

## డిసెంబరు 6న కిసాన్ మోర్చా చలో ఢిల్లీ

**చండీగఢ్:** పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, ఇతర డిమాండ్ల సాధనం కోసం వచ్చేనెల 6న తేదీన చలో ఢిల్లీ యాత్రను చేపడతామని సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం)లు సోమవారం ప్రకటించాయి. సోమవారం నాడిక్కడ జరిగిన రైతు నేతల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. చలో ఢిల్లీకి పిలుపిచ్చిన రైతు సంఘాలు ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి పంజాబ్- హరియాణా సరిహద్దుల్లోని శంభు, ఖనౌరి బోర్డర్ పాయింట్ల వద్ద బైఠాయించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ స్పందన కోసం దీర్ఘకాలం వేచిచూశాక ఢిల్లీ వైపు కదలాలని నిర్ణయించుకున్నట్లు కేఎంఎం నాయకుడు శర్వాణ్‌సింగ్ పాంధర్ సోమవారం వెల్లడించారు. డిమాండ్లపై చర్చించేందుకు రైతులతో ఎలాంటి చర్చలను కేంద్ర ప్రభుత్వం జరపడం లేదని దుయ్యబట్టారు. డిసెంబరు 6న ఢిల్లీ దిశగా కదులుతామని ప్రకటించారు. 'మాకు మరో మార్గం లేదు. తొమ్మిది నెలలుగా శాంతియుతంగా కేంద్రం ప్రతిస్పందన కోసం ఎదురుచూశాం'అని పాంధర్ అన్నారు. శంభు సరిహద్దు పాయింట్ నుంచి బ్యాచ్‌ల వారీగా ఢిల్లీ వైపు వెళతామని తెలిపారు.

## కూటమి మారిన వారిని ఓడించండి: ఖర్గే

**ముంబై:** డబ్బులు తీసుకొని కూటమి మారిన వారిని (శివసేన, ఎన్సీపీలను చీల్చి బీజేపీ పంచన చేరిన వారిని) తిరస్కరించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మహారాష్ట్ర ప్రజలకు పిలుపిచ్చారు. ఒక్కొక్కరు రూ. 50 కోట్లు తీసుకొని ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన ఎమ్మెల్యేల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారికి స్పష్టమైన సందేశం పంపాలని ఓటర్లను కోరారు. ముంబై సమీపంలోని వసాయ్‌లో ఖర్గే సోమవారం ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీలోని 288 స్థానాలకు ఈనెల 20 పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. 23న ఫలితాలు వెల్లడవుతాయి. బటేంగేతో కటేంగే, ఏక్ హై తో సేఫ్ హై.. లాంటి నినాదాలతో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విభజన రాజకీయాలకు పాల్పడిందని ఖర్గే ధ్వజమెత్తారు. మహారాష్ట్రకు చెందిన ఛత్రపతి శివాజీ, సాహు మహారాజ్, జ్యోతిరావు పూలే, బి.ఆర్.అంబేడ్కర్‌లు సమున్నత లక్ష్యాల కోసం పాటుపడ్డారని పేర్కొన్నారు. కొందరు సమాజాన్ని కుల, మతపరంగా విభజించాలని చూస్తున్నారని పరోక్షంగా మహాయుతి కూటమిపై ధ్వజమెత్తారు. అంబేడ్కర్ రాజ్యాంగం ప్రవచించిన సిద్ధాంతాలు, ఐక్యతకు కాంగ్రెస్, మహా వికాస్ అఘాడి నిలబడితే.. బీజేపీ సమాజంలో విభజన రేఖలు తెస్తోందని ఆరోపించారు.

## చొరబాటుదార్లను వెళ్లగొట్టడం ఖాయం

**ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ హెచ్చరిక**

**సాహిబ్‌గంజ్/దేవగఢ్:** జార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాలు రోహింగ్యాలు, బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదార్లకు అడ్డాలుగా మారిపోయాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. వారు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నప్పటికీ జేఎంఎం కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో చొరబాటుదార్లను ప్రభుత్వం ప్రోత్సహించిందని మండిపడ్డారు. సోమవారం జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచార సభల్లో యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు. రాజ్‌మహల్, సాహిబ్‌గంజ్ తదితర ప్రాంతాల్లో అరాచకం రాజ్యమేలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 23వ తేదీ తర్వాత చొరబాటుదార్లను బయటకు వెళ్లగొట్టడం ఖాయమని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. పొరుగుదేశం నుంచి జార్ఖండ్‌లోకి అక్రమంగా ప్రవేశించడానికి సహకరించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రజల సొమ్మును దోచుకున్న కూటమి నాయకులను శిక్షిస్తామని అన్నారు.

## ఆతిశి కేబినెట్‌లోకి రఘువీందర్

**న్యూఢిల్లీ:** నంగ్లోయ్ ఎమ్మెల్యే రఘువీందర్ షోకీన్‌ను ముఖ్యమంత్రి ఆతిశి ఢిల్లీ మంత్రివర్గంలోకి తీసుకున్నారు. రవాణా మంత్రి పదవికి, ఆప్‌కు ప్రముఖ జాట్ నేత కైలాశ్ గహ్లోత్ ఆదివారం రాజీనామా చేయడం తెలిసిందే. ఖాళీ అయిన ఈ స్థానాన్ని ఆతిశి సోమవారం రఘువీందర్‌తో భర్తీ చేశారు. రఘువీందర్ కూడా జాట్ సామాజికవర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. నష్టనివారణ చర్యల్లో భాగంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. రఘువీందర్‌ను కేబినెట్‌లోకి తీసుకోవాలని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నిర్ణయించారని మనీశ్ సిసోడియా సోమవారం ప్రకటించారు. నంగ్లోయ్ నుంచి షోకీన్ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకుముందు రెండుసార్లు కౌన్సిలర్‌గా పని చేశారని సిసోడియా తెలిపారు

# ఖమేనికి తీవ్ర అనారోగ్యం..

**సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేని!**

**టెహ్రాన్:** ఇరాన్ సుప్రీంలీడర్ అలీ ఖమేని తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. వారసుడిని ఎన్నుకోవడానికి జరిగిన రహస్య సమావేశంలో ఆయన రెండో కుమారుడు మొజ్తబా ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికైనట్లు సమాచారం. ఒకవైపు ఇజ్రాయెల్‌తో యుద్ధమేఘాలు కమ్ముకున్న వేళ.. ఇరాన్ కొత్త సుప్రీంలీడర్‌ను ఎన్నుకోవడం గమనార్హం. 85 ఏళ్ల అలీ ఖమేని తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఆయన ఆదేశాల మేరకే కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకోవడానికి సమావేశం జరిగిందని ఇరాన్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. ఇరాన్‌లో ప్రజలు ఎన్నుకున్న అధ్యక్షుడు ఉన్నప్పటికీ.. అన్ని అంశాల్లో సుప్రీం లీడర్ మాటే అంతిమం. అలీ ఖమేని జీవించి ఉండగానే.. మొజ్తబా ఖమేనీ సుప్రీంలీడర్‌గా బాధ్యతలు చేపడతారని వార్తలు వెలువడుతున్నాయి. సుప్రీం లీడర్ పదవి కోసం ఇరాన్‌లో అంతర్గత పోరు సాగుతోందని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెల్లడించిన కొద్దివారాలకే వారసుడిగా ముజ్తబా ఖమేని ఎన్నికయ్యారని ఇరాన్ ఇంటర్నేషనల్ తెలిపింది. వయసురీత్యా అనారోగ్య కారణాలతో బాధపడుతున్న అలీ ఖమేనీ చివరిసారిగా అక్టోబరు 4న హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా అంత్యక్రియల్లో బాహటంగా దర్శనమిచ్చారు. నస్రల్లా టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో మరణించిన విషయం తెలిసిందే. కొంతకాలంగా ఖమేని ఆరోగ్య పరిస్థితి విషమిస్తోందని.. ఆయన ఆదేశాల మేరకు సెప్టెంబరు 26న 60 మంది సభ్యులుగల ఇరాన్ నిపుణుల అసెంబ్లీ సమావేశమై ముజ్తబాను తదుపరి సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నందని ఇరాన్ ఇంటర్నేషనల్ తెలిపింది. తక్షణమే వారసుడి ఎంపిక చేయాలని ఇరాన్ నిపుణుల అసెంబ్లీని అలీ ఖమేని కోరారని.. ఎంపిక ప్రక్రియ, నిర్ణయంపై తొలుత అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ.. తీవ్ర ఒత్తిళ్లు రావడంతో ముజ్తబా ఎంపిక జరిగిందని సమాచారం.

## కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా సంజయ్

**న్యూఢిల్లీ:** భారత నూతన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా కె.సంజయ్ మూర్తి సోమవారం నియమితులయ్యారు. ప్రస్తుత ఆడిటర్ జనరల్.. గిరీష్ చంద్ర ముర్ము ఈనెల 20 తన పదవీకాలాన్ని పూర్తిచేసుకోనున్నారు. ఆయన స్థానంలో హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు చెందిన 1989 ఐఏఎస్ అధికారి సంజయ్ మూర్తి బాధ్యతలు చేపడతారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన నియామకం అమలులోకి వస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. సంజయ్ మూర్తి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారని వెల్లడించింది. ప్రస్తుత ఆడిటర్ జనరల్ గిరీష్‌చంద్ర ముర్ము 2020 ఆగస్టు 8న బాధ్యతలు చేపట్టారు.





## విధ్వంసం విరుచుకుపడ్డ క్షణాలు...

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల తీవ్రతను కళ్లకు కట్టే ఫొటోలివి. లెబనాన్ రాజధాని బీరూట్‌లోని తయౌనే ప్రాంతంలోని ఒక భారీ అపార్ట్‌మెంట్ భవనంపైకి దూసుకెళ్తున్న భారీ బాంబును తొలి ఫొటోలో చూడవచ్చు. దాని పేలుడుతో భవనంలో చెలరేగిన మంటలు, తదనంతర విధ్వంసాన్ని తర్వాతి ఫొటో పట్టి చూపుతోంది. దాడి సమయంలో అక్కడికి సమీపంలోనే ఉన్న అసోసియేటెడ్ ప్రెస్ ఫొటోగ్రాఫర్ మొత్తం ఉదంతాన్ని ఇలా తన కెమెరాలో బంధించాడు. ఈ అపార్ట్‌మెంట్ హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థకు ఆవాసమని ఇజ్రాయెల్ చెబుతోంది. స్థానిక ప్రజలను ఖాళీ చేయాల్సిందిగా ముందుగానే హెచ్చరించి శుక్రవారం దానిపై ఇలా లక్షిత దాడికి దిగింది. దాంతో అపార్ట్‌మెంట్ చాలావరకు కూలిపోయి శిథిలాల దిబ్బగా మారింది. ఈ దాడిలో వాడింది 2,000 పౌండ్ల ఎంకే-84 సిరీస్ బాంబని చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం మరో ఏపీ ఫొటోగ్రాఫర్ కూడా బీరూట్‌లో అచ్చం ఇలాంటి దాడి క్రమాన్నే ఫొటోలు తీశాడు. గత 13 నెలల్లో ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌లో కనీసం 3,200 మందికి పైగా మరణించినట్టు సమాచారం. వీటిలో అత్యధిక మరణాలు గత సెప్టెంబర్ నుంచే సంభవించాయి. మొత్తం మృతుల్లో మూడో వంతు దాకా మహిళలు, పిల్లలేనని లెబనాన్ ఆరోగ్య శాఖ పేర్కొంది. - సాక్షి, నేషనల్ డెస్క్

## గుడ్డే ముందట!

కోడి ముందా, గుడ్డు ముందా? చిరకాలంగా మనిషి మెదడును తొలుస్తున్న అంతుచిక్కని ప్రశ్న. దీనికి సమాధానం కనిపెట్టేందుకు సైంటిస్టులు ఎంతో కాలంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కోడి కంటే బహుశా గుడ్డే ముందు వచ్చి ఉండొచ్చని అలాంటి తాజా పరిశోధన ఒకటి పేర్కొంది. జంతువుల ఆవిర్భావానికి చాలాకాలం ముందునుంచే జీవుల్లో గుడ్డు వంటి నిర్మాణాలు ఏర్పడేవని తేల్చింది. క్రోమోస్పెరియా పెర్కిన్సి అనే ఏకకణ జీవిపై చేసిన పరిశోధనల ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చినట్టు జెనీవా యూనివర్సిటీ బయోకెమిస్ట్ మరైన్ ఒలివెట్టా తెలిపారు. పరిశోధన బృందానికి ఆమే సారథ్యం వహించారు. పునరుత్పత్తి ప్రక్రియ సందర్భంగా సి.పెర్కిన్సిలో జరిగే పాలింటమీ ప్రక్రియ అచ్చం జంతువుల్లో పిండం ఎదుగుదలను పోలి ఉంటుందని ఒలివెట్టా వివరించారు. ''ఆ ప్రక్రియ ఫలితంగా గుడ్డును పోలే బోలు కణ పదార్థం రూపొందినట్టు కనిపెట్టాం. సంక్లిష్టమైన బహుళకణ జీవుల ఆవిర్భావానికి చాలాముందే తొలినాటి జీవుల్లో పిండం వంటి నిర్మాణాల జెనెటిక్ ప్రోగ్రామింగ్ వ్యవస్థ ఉండొచ్చని దీన్నిబట్టి అంచనా వేయవచ్చు. తొలి నాళ్లలోనే జీవుల్లో బహుళకణ సమన్వయం వంటి ప్రక్రియలు సాగేవనేందుకు మా పరిశోధన ఫలితాలు ఊతమిస్తున్నాయి''అని చెప్పారు. అయితే దీనిపై స్పష్టత రావాలంటే మరింత లోతుగా పరిశోధనలు జరగాల్సి ఉందని అంగీకరించారు. - సాక్షి, నేషనల్ డెస్క్

# వైద్య సిబ్బందిపై దాడుల నిరోధానికి ప్రత్యేకంగా కేంద్ర చట్టం అవసరం లేదు

**జాతీయ టాస్క్‌ఫోర్స్ సిఫారసు**

**న్యూఢిల్లీ:** వైద్యుల, వైద్య సిబ్బందిపై దాడులను నిరోధించడానికి ప్రత్యేకంగా కేంద్ర చట్టాలు అవసరం లేదని సుప్రీంకోర్టు నియమించిన జాతీయ టాస్క్‌ఫోర్స్ (ఎన్‌టీఎఫ్) పేర్కొంది. వైద్య సిబ్బందిపై చిన్నాచితక దాడులను అడ్డుకోవడానికి ప్రస్తుతం అమలులో ఉన్న రాష్ట్ర చట్టాలు సరిపోతాయని, తీవ్రమైన దాడులను భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) 2023 కింద పరిష్కారమార్గాలు ఉన్నాయని సిఫారసు చేసింది. కోల్‌కతాలోని ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో పీజీ ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం నేపథ్యంలో వైద్యుల భద్రత నిమిత్తం సుప్రీంకోర్టు జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను నియమించిన విషయం తెలిసిందే. వైద్య సిబ్బందిపై దాడులు, హింస నిరోధానికి 24 రాష్ట్రాలు ఇప్పటికే చట్టాలు చేశాయని ఎన్‌టీఎఫ్ పేర్కొంది. అందులో ఆసుపత్రులు, వైద్యశాలలు, వైద్య సిబ్బందికి తగు నిర్వచనం ఇచ్చారని తెలిపింది. మరో రెండు రాష్ట్రాలు ఈ మేరకు బిల్లులను అసెంబ్లీల్లో ప్రవేశపెట్టాయని వివరించింది. చిన్నాచితక దాడులను నిరోధించడానికి రాష్ట్రాల చట్టాల్లో తగు నిబంధనలు ఉన్నాయని తెలిపింది. వైద్యులు, వైద్య సిబ్బందిపై తీవ్రమైన దాడులు జరిగితే భారతీయ న్యాయ సంహిత కింద విచారించవచ్చని, అందుకని వీరికోసం ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాల్సిన అవసరం లేదని ఎన్‌టీఎఫ్ తెలిపింది. చట్టాలు లేని రాష్ట్రాల్లో వైద్య సిబ్బందిపై దాడులు జరిగితే బీఎన్ఎస్ కింద వెంటనే తగు చర్యలు చేపట్టాలని సిఫారసు చేసింది. జాతీయ టాస్క్‌ఫోర్స్ నివేదికను కేంద్రం అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టు ముందుంచింది. స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక నివారణ చర్యల కింద తమ సిఫారసులను అమలు చేయాలని టాస్క్‌ఫోర్స్ గడువు విధించింది. ఆసుపత్రులకు తగిన భద్రత ఉండాలని పేర్కొంది. ఆసుపత్రుల్లో భద్రతా కమిటీని ఏర్పాటు చేయాలని, తగిన శిక్షణ పొందిన సిబ్బందిని ఆసుపత్రుల్లో నియమించాలని సిఫారసు చేసింది. స్థానిక పోలీసులతో సమన్వయం అవసరమని చెప్పింది.

**తగు సంఖ్యలో సీసీటీవీ కెమెరాలు ఉండాలి**

ఆసుపత్రి పరిమాణాన్ని బట్టి తగు సంఖ్యలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని జాతీయ టాస్క్‌ఫోర్స్ సిఫారసు చేసింది. దాడులు జరగడానికి ఆస్కారమున్న కీలకమైన ప్రదేశాల్లో అత్యవసరన బటన్‌లను ఏర్పాటు చేయాలని, ఇవి వైద్య సిబ్బందికి అందుబాటులో ఉండాలని తెలిపింది. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని, ఆసుపత్రి చుట్టూ ఉన్న గోడకు ఫెన్సింగ్స్ ఉండాలని సూచించింది. కిటికీలకు కూడా తగిన రక్షణ కవచం ఉండాలని పేర్కొంది. రెసిడెంట్ డాక్టర్లకు జాతీయ మెడికల్ కమిషన్ సూచించిన పనివేళలు అమలయ్యేటట్లు ఆసుపత్రులు పర్యవేక్షించాలని సిఫారసు చేసింది. దాడులు జరిగిన వెంటనే చట్టపరమైన చర్యలు ప్రారంభించి (ఫిర్యాదు చేయడం, ఎఫ్ఐఆర్ లేదా జీరో ఎఫ్ఐఆర్ నమోదు) వైద్యుల్లో విశ్వాసం పాదుగొల్పాలని సూచించింది. రోగి బంధువులు, వైద్య సిబ్బంది మధ్య ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి జరగాలని పేర్కొంది. రోగి ఆరోగ్య పరిస్థితిపై అతని తరఫు వారికి తగిన సమాచారం లేకపోవడమే.. చాలా సందర్భాల్లో ఉద్రిక్తతలకు, దాడులకు దారితీస్తోందని అభిప్రాయపడింది.




## భారత విమానాల్లో ఇంటర్నెట్!

**ఫాల్కన్ ద్వారా జీశాట్-20 ఉపగ్రహ ప్రయోగం**

**ఫ్లోరిడా:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన సమాచార శాటిలైట్‌ను ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్-ఎక్స్ సోమవారం ప్రయోగించింది. ఫ్లోరిడాలోని తమ బేస్ నుంచి జీశాట్-ఎన్2 శాటిలైట్‌ను తమ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో- స్పేస్-ఎక్స్‌లు వాణిజ్యపరంగా ఏకతాటిపైకి రావడం ఇదే తొలిసారి. జీశాట్-ఎన్2 ఉపగ్రహాన్ని జీశాట్-20గా కూడా పిలుస్తారు. ఈ ఉపగ్రహం దేశవ్యాప్తంగా బ్రాండ్‌బ్యాండ్ సర్వీసుల సామర్థ్యాన్ని మెరుగుపర్చడమే కాకుండా భారత్‌లో విమానాల్లో ఇంటర్నెట్ సేవలను అందిస్తుంది. జీశాట్-20 ఉపగ్రహం బరువు 4,700 కిలోలు. భారత్ ప్రయోగించిన అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌లలో ఇది ఒకటి.

అన్ని పోటీపరీక్షలకు ఉపయోగపడే ముఖ్యమైన కరెంట్ అఫైర్స్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి... మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి

సాక్షి ప్లస్
మంగళవారం । 19-11-2024

# 74వ రాజ్యాంగ సవరణ

## పట్టణ, నగర పాలక సంస్థలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

మన దేశంలో పట్టణ, నగరాల్లో పౌర సదుపాయాల కల్పనకు పట్టణ స్థానిక ప్రభుత్వాలున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 8 రకాలైన పట్టణ స్థానిక ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి.

### పట్టణ స్థానిక ప్రభుత్వాలు

1. మునిసిపల్ కార్పొరేషన్
2. నోటిఫైడ్ ఏరియా కమిటీ
3. కంటోన్మెంట్ బోర్డ్
4. పోర్ట్ ట్రస్ట్, 5. మునిసిపాలిటీ
6. టౌన్ ఏరియా కమిటీ
7. టౌన్‌షిప్,
8. ప్రత్యేక ప్రయోజన సంస్థలు

దేశంలో తొలిసారిగా 1687లో మద్రాస్‌లో మునిసిపల్ కార్పొరేషన్‌ను బ్రిటిష్‌వారు ఏర్పాటు చేశారు. 1726లో బాంబే, కలకత్తా కార్పొరేషన్లు ఏర్పడ్డాయి. 1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. 1993, జూన్ 1 నుంచి దేశవ్యాప్తంగా 74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చింది.

### 74వ రాజ్యాంగ సవరణ

పట్టణ స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన అంశాలను రాజ్యాంగంలో 'IXA' భాగంలో ప్రకరణ 243P నుంచి 243ZG వరకు పొందుపరిచారు.

- మునిసిపాలిటీ: 243Q ప్రకరణ కింద ఏర్పాటైన స్థానిక స్వపరిపాలన సంస్థ.
- పంచాయతీ: 243B ప్రకరణ కింద పంచాయతీగా ఏర్పడిన ప్రాంతం.
- జనాభా: చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ జరిగి, నోటిఫై అయిన సందర్భంలో నిర్ధారించిన జనాభా.

**243Q మునిసిపాలిటీల నిర్మాణం గురించి తెలుపుతోంది.**

- గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా పరివర్తన చెందుతున్న ప్రాంతాన్ని నగర పంచాయతీగా గుర్తిస్తారు.
- చిన్న పట్టణాల్లో మునిసిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తారు.
- పెద్ద పట్టణాల్లో మునిసిపల్ కార్పొరేషన్లు ఉంటాయి.
- పట్టణంగా పరివర్తన చెందుతున్న ప్రాంతం, చిన్న పట్టణం, పెద్ద పట్టణం వంటి అంశాలకు సంబంధించి రాష్ట్ర గవర్నర్ సరైన అర్థ వివరణ ఇస్తారు.

### మునిసిపాలిటీ ఎన్నికలు

ప్రకరణ **243R** మునిసిపాలిటీల నిర్మాణం, ఎన్నికల గురించి తెలియజేస్తోంది.

- మునిసిపాలిటీ సభ్యులను (అన్ని స్థాయిల్లో) ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.
- మునిసిపాలిటీ సభ్యుల కూర్పు, అధ్యక్ష ఎన్నిక ప్రక్రియకు సంబంధించిన చట్టాలను రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ రూపొందిస్తుంది.
- నగర పంచాయతీ, మునిసిపాలిటీ, కార్పొరేషన్ అధ్యక్షుల ఎన్నిక రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ నిర్ణయించిన మేరకు ప్రత్యక్ష లేదా పరోక్ష పద్ధతిలో జరుగుతుంది.
- సంబంధిత మునిసిపాలిటీ, కార్పొరేషన్ ప్రాంతంలో ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు హోదా రీత్యా సభ్యులుగా కొనసాగుతారు.

### వార్డు కమిటీలు

- ప్రకరణ **243S** ప్రకారం 3 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన మునిసిపాలిటీల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వార్డులను కలిపి వార్డు కమిటీలను ఏర్పాటు చేయొచ్చు.
- వార్డ్ కమిటీ ఏర్పడినప్పుడు సంబంధిత వార్డ్ ప్రతినిధిని ఆ కమిటీకి అధ్యక్షుడిగా నియమించాలి. రెండు లేదా అంతకంటే ఎక్కువ వార్డులతో వార్డు కమిటీ ఏర్పాటు చేస్తే ఆయా వార్డుల ప్రతినిధులు తమలో ఒకర్ని అధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- కార్పొరేషన్‌లో వార్డ్ కమిటీల సంఖ్య 50కి తగ్గకుండా, 100కి మించకుండా ఉండాలి.

### రిజర్వేషన్స్

**ప్రకరణ 243T రిజర్వేషన్ల గురించి పేర్కొంటుంది.**

- ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలి.
- ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన స్థానాల్లో ఆయా వర్గాలకు చెందిన మహిళలకు 1/3 వంతు స్థానాలను రిజర్వ్ చేయాలి.
- మొత్తం స్థానాల్లో కనీసం 1/3 వంతు స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాలి.
- రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో కేటాయించాలి.
- రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అధికారాన్ని కలిగి ఉంది.

### పదవీ కాలం, అనర్హతలు

**ప్రకరణ 243U పదవీ కాలం గురించి తెలుపుతోంది. అన్ని స్థాయిల్లోని సభ్యులు, అధ్యక్షుల పదవీ కాల పరిమితి ఐదేళ్లు. ప్రకరణ 243V అనర్హతల గురించి పేర్కొంటోంది.**

- పంచాయతీరాజ్ వ్యవస్థలో అన్ని స్థాయిల్లో అధ్యక్ష, సభ్యుల అర్హతలను నిర్ణయించే అధికారం రాష్ట్ర శాసన నిర్మాణశాఖకు ఉంటుంది.
- పార్లమెంటుకు, అసెంబ్లీలకు పోటీచేసే అభ్యర్థులకు వర్తించే అర్హత, అనర్హత నిబంధనలే స్థానిక సంస్థలకు పోటీ చేసే అభ్యర్థులకు కూడా వర్తిస్తాయి.
- స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు కనీసం 21 ఏళ్లు ఉండాలి.
- 1995 సంవత్సరం తర్వాత ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కలిగుంటే పోటీకి అనర్హులు.

### అధికార విధులు

- ప్రకరణ **243W** అధికార విధుల గురించి వివరిస్తోంది.

12వ షెడ్యూల్‌లో 18 విధులను పట్టణ స్థానిక సంస్థలకు నిర్దేశించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వాలు బదిలీ చేస్తాయి. పన్నెండో షెడ్యూల్‌లో పేర్కొన్న 18 విధుల వివరాలు..

1. నగర ప్రణాళిక
2. సమర్థవంత భూ వినియోగం, భవన నిర్మాణాలపై నియంత్రణ
3. ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళికలు
4. మురికివాడల నిర్మూలన, అభివృద్ధి
5. పట్టణ అడవులు, పర్యావరణ పరిరక్షణ
6. రహదారులు, వంతెనలు
7. ప్రజారోగ్యం, మురుగు నీటిపారుదల, చెత్త నియంత్రణ
8. అగ్నిమాపక వ్యవస్థ
9. పరిశ్రమలకు, గృహాలకు నీటి వసతి
10. బలహీన వర్గాల సంరక్షణ, వికలాంగులకు వసతి.
11. వీధి దీపాలు, బస్టాండుల నిర్వహణ
12. కబేళాలపై నియంత్రణ
13. నగర దారిద్ర్య నిర్మూలన పథకాలు
14. విద్య, సాంస్కృతిక అభివృద్ధికి చర్యలు
15. జంతువుల సంరక్షణ
16. ఆట స్థలాలు, ఉద్యానవనాల నిర్వహణ
17. శ్మశాన వాటికల నిర్వహణ
18. జనన, మరణాల నమోదు

### ఆదాయ వనరులు, హక్కులు

**ప్రకరణ 243X** ప్రకారం స్థానిక సంస్థలు తమ ఆదాయం కోసం శాసనసభ నిర్ణయించిన మేరకు పన్నులు విధించడం, వసూలు చేయడం చేయవచ్చు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహాయ నిధులు అందిస్తాయి.

**ప్రకరణ 243Y ప్రకారం ఫైనాన్స్ కమిషన్**

- 73వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న ప్రకరణ 243Iలోని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ పట్టణ స్థానిక సంస్థలకు కూడా వర్తిస్తుంది.

**ప్రకరణ 243Z ప్రకారం అకౌంటింగ్ అండ్ ఆడిటింగ్**

పట్టణ, నగర కార్పొరేషన్ సంస్థల అకౌంట్లను పరిశీలించేందుకు రాష్ట్ర శాసనసభ ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవచ్చు.

**ప్రకరణ 243ZA ప్రకారం మునిసిపాలిటీల ఎన్నికల నిర్వహణ**

ప్రకరణ 243Kలో ప్రస్తావించిన విధంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తుంది.

**ప్రకరణ 243ZB ప్రకారం కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తింపు**

74వ రాజ్యాంగ సవరణలోని అంశాలు కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా వర్తిస్తాయి. పార్లమెంటు చట్టం ద్వారా వీటిని వర్తింప చేస్తుంది.

**ప్రకరణ 243ZC ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలకు వర్తింపులో మినహాయింపులు**

- 244(1) ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలు, 244(2) ప్రకారం షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల్లో ఈ విభాగం వర్తించదు.
- పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలోని కొండ ప్రాంతాలకు ఏర్పాటు చేసిన గూర్ఖాహిల్ కౌన్సిల్‌కు ఈ విభాగం వర్తించదు.
- ప్రకరణ 244(1), 244(2) ప్రకారం షెడ్యూల్డ్, ఆదివాసీ ప్రాంతాలకు ఈ విభాగాన్ని వర్తింపచేస్తూ పార్లమెంట్ శాసనాలను రూపొందించవచ్చు. అయితే వాటిని రాజ్యాంగ సవరణలుగా పరిగణించరు.

**ప్రకరణ 243ZD ప్రకారం జిల్లా ప్రణాళికా కమిటీ**

- ప్రతి రాష్ట్రంలో జిల్లా స్థాయిలో జిల్లా ప్రణాళికా కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ పంచాయతీ, మునిసిపాలిటీలు రూపొందించిన ప్రణాళికలను సమీకరించి తుది ప్రణాళికలను రూపొందిస్తుంది. జిల్లా ప్రణాళిక కమిటీ నిర్మాణాన్ని రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తుంది.

గమనిక: జిల్లా ప్రణాళిక కమిటీ కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీకి వర్తించదు.

**ప్రకరణ 243ZE ప్రకారం మెట్రోపాలిటన్ ప్రణాళికా కమిటీ**

10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వీటి నిర్మాణం, విధులు వంటి అంశాలను రాష్ట్ర శాసన సభ చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. నగర మేయర్ ఈ కమిటీకి చైర్మన్‌గా, మునిసిపల్ కమిషనర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. దీంతోపాటు కమిటీలో మునిసిపల్ పాలనలో అనుభవమున్న నలుగురు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. మొత్తం సభ్యుల్లో 2/3 వంతు సభ్యులను గ్రామ పంచాయతీ అధ్యక్షులు, మునిసిపాలిటీ, కార్పొరేషన్ ప్రతినిధులు ఎన్నుకుంటారు.

**ప్రకరణ 243ZF ప్రకారం పాత శాసనాల కొనసాగింపు**

74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చిన ఒక సంవత్సరం వరకు రాష్ట్రంలో అమల్లో ఉన్న పాత చట్టాలే కొనసాగుతాయి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలను అనువర్తింప చేసుకోవాలి.

### పట్టణ స్థానిక సంస్థలు - నిర్మాణం

1992లో 74వ రాజ్యాంగ సవరణ తర్వాత పట్టణాల్లో కూడా మూడంచెల స్థానిక ప్రభుత్వ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మొదటి అంచె - నగర పంచాయతీ
రెండో అంచె - పురపాలక సంస్థలు
మూడో అంచె - నగరపాలక సంస్థలు

### నగర పంచాయితీ

గ్రామీణ వ్యవస్థ నుంచి పట్టణీకరణ దిశగా మారుతున్న సుమారు 20,000 నుంచి 40,000 వరకు జనాభా గల చిన్న పట్టణ ప్రాంతాలకు నగర పంచాయతీ హోదా కల్పిస్తారు. నగర పంచాయతీని జనాభా మేరకు వార్డులుగా విభజిస్తారు. ప్రతి వార్డు నుంచి ఓటర్లతో ఒక సభ్యుడు నేరుగా ఎన్నికవుతారు. ప్రతి నగర పంచాయతీలో గరిష్ఠంగా 10 మంది ఎన్నికైన వార్డు సభ్యులు, ముగ్గురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు.

- నగర పంచాయతీలో నివాసముంటున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హోదా రీత్యా సభ్యులుగా ఉంటారు.
- నగర పంచాయతీ సభ్యులు తమలో ఒకర్ని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- సర్పంచ్, ఉప సర్పంచ్‌లను తొలగించినట్లే వీరిని కూడా అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

### పురపాలక సంస్థలు

1965లో సమగ్ర పురపాలక సంస్థల చట్టం ప్రకారం మునిసిపాలిటీలు ఏర్పడ్డాయి. 74వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో కొత్త చట్టాన్ని రూపొందించింది. 40,000 నుంచి 3,00,000 జనాభా ఉన్న పట్టణాల్లో పురపాలక సంస్థలను ఏర్పాటు చేస్తారు. వార్షికాదాయ, పరిమాణాల ఆధారంగా పురపాలక సంస్థలను ఐదు రకాలుగా వర్గీకరించారు. అవి..

1. సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘం: వార్షిక ఆదాయం రూ.8 కోట్ల కంటే ఎక్కువ ఉన్నవి.
2. స్పెషల్ గ్రేడ్ పురపాలక సంఘం:వార్షికాదాయం రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల మధ్య ఉన్నవి.
3. గ్రేడ్-1 పురపాలక సంఘం: వార్షికాదాయం రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల మధ్య ఉన్నవి.
4. గ్రేడ్-2 పురపాలక సంఘం: వార్షికాదాయం రూ.2 కోట్లు నుంచి రూ.4 కోట్ల మధ్య ఉన్నవి.
5. గ్రేడ్-3 పురపాలక సంఘం: వార్షికాదాయం కోటి రూపాయల నుంచి రూ. రెండు కోట్ల లోపు ఉన్నవి.

సూచన: ఈ వర్గీకరణను ప్రభుత్వం కాలానుగుణంగా మార్చవచ్చు.

ప్రతి పురపాలక సంస్థలో నాలుగు అంగాలు ఉంటాయి. అవి..

పురపాలక మండలి: పురపాలక సంస్థ చర్చా వేదికే పురపాలక మండలి. ఇందులో ఎన్నికైన సభ్యులు, కోఆప్టెడ్ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఉంటారు.

మున్సిపల్ కౌన్సిలర్లు: వీరిని ఓటర్లు వార్డు ప్రాతిపదికన ఎన్నుకుంటారు. జనాభాను బట్టి వీరి సంఖ్యను నిర్ణయిస్తారు.

- 40 వేల వరకు జనాభా ఉంటే 21 మంది కౌన్సిలర్లు ఉంటారు.
- జనాభా 40 వేల నుంచి లక్ష వరకు ఉంటే 21 మంది సభ్యులు, ప్రతి 10 వేల జనాభాకు ఒక సభ్యుడు అదనంగా ఉంటారు.
- జనాభా లక్ష నుంచి రెండు లక్షల వరకు ఉంటే 27 మంది సభ్యులు, ప్రతి 15 వేల జనాభాకు ఒక సభ్యుడు అదనంగా ఉంటారు.
- జనాభా రెండు లక్షల మించి ఉంటే 33 మంది సభ్యులు, ప్రతి 20 వేల అదనపు జనాభాకు ఒక అదనపు సభ్యుడు ఉండవచ్చు. గరిష్ఠంగా 45 సభ్యులకు మించరాదు.

# మూడో వ్యక్తి చెల్లించాల్సిన అద్దె?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

గణితం-ఎస్ఏ/ఎస్‌జీటీ కంటెంట్

### భాగస్వామ్యం

- భాగస్వామ్యం: ఒక వ్యాపారాన్ని ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉమ్మడిగా చేస్తే వారిని 'భాగస్వాములు' అని, ఆ వ్యాపారాన్ని 'భాగస్వామ్యం' అంటారు.
- భాగస్వాములందరి పెట్టుబడులు ఒకే కాలం వరకు ఉంటే, పెట్టుబడుల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.
- వేర్వేరు పెట్టుబడులు వేర్వేరు కాలాల్లో ఉంటే పెట్టుబడి, వాటి కాలాల పరిమితి లబ్ధాల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.

1. A, B అనే ఇద్దరు భాగస్వాములు వరుస గా రూ. 4,000, రూ. 6,000 పెట్టుబడులతో వ్యాపారం చేశారు. వారు సంవత్సరం వ్యాపారం చేయగా రూ.1500 లాభం వస్తే A, Bలకు వచ్చే లాభాల తేడా?
1) రూ.100 2) రూ.200
3) రూ.300 4) రూ.600

జ. వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన కాలాలు సమానం అయితే లాభాల నిష్పత్తి = పెట్టుబడుల నిష్పత్తి
= 4,000 : 6,000 = 2:3
మొత్తం లాభం = 2+3 →1500
⇒ 5 → 1500
$1 \rightarrow \frac{1500}{5} = 300$
A, B లకు వచ్చే లాభాల తేడా
= 3-2 = 1 → రూ.300

2. P, Q లు సమాన పెట్టుబడులతో వ్యాపారాన్ని ప్రారంభించారు. 9 నెలల తర్వాత Q వ్యాపారం నుంచి విరమించుకున్నాడు. ఏడాది చివర వచ్చిన లాభం రూ. 8540. అందులో Q వాటా?
1) రూ.1220 2) రూ.2440
3) రూ.4880 4) రూ.3660

జ. వ్యాపారంలో సమాన పెట్టుబడులు ఉంటే లాభాల నిష్పత్తి = కాలాల నిష్పత్తి
= 12 నెలలు : 9 నెలలు
= 4 : 3
వచ్చిన మొత్తం లాభం = 4+3 → రూ.8540
(సమస్య నుంచి)
7→ రూ.8540
$1 \rightarrow \frac{8540}{7}$ Rs.1220
Q వాటా = 3→ 3 × 1220 = రూ.3660

3. రూ.9000 పెట్టుబడితో A వ్యాపారం ప్రారంభించాడు. 5 నెలల తర్వాత రూ. 8000 పెట్టుబడితో B చేరాడు. ఏడాది చివర వారి లాభం రూ. 4100 అయితే A వాటా?
1) రూ. 2700 2) రూ. 1400
3) రూ. 4100 4) రూ. 1300

జ. వేర్వేరు పెట్టుబడులు, వేర్వేరు కాలాల్లో ఉండే లాభాల నిష్పత్తి =
పెట్టుబడి × కాలాల నిష్పత్తి
A, B ల లాభాల నిష్పత్తి =
9000 × 12 నెలలు : 8000 × 7 నెలలు
= 108:56 = 27:14
మొత్తం లాభం = 27+ 14 → 4100
41 → 4100
$1 \rightarrow \frac{4100}{41} = 100$
Aకు వచ్చే లాభం
27 → 27 × 100 = రూ. 2700

4. రూ. 8,000, రూ.4,000, రూ. 8,000 వరుస పెట్టుబడులతో రాజు, రమణ, రవిలు వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రాజు వ్యాపారం వదిలేశాడు. 8 నెలల తర్వాత రూ. 4005లాభం వచ్చింది. దానిలో రమణ వాటా?
1) రూ. 890 2) రూ.1335
3) రూ. 1602 4) రూ. 1780

జ. లాభాల నిష్పత్తి
= పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
=(8000×6):(4000×8):(8000×8)
= 48:32:64 = 3:2:4
∴ రాజు, రమణ, రవిల లాభాల నిష్పత్తి
మొత్తం లాభం = 3+2+4 → రూ. 4005
9 → రూ. 4005
$1 \rightarrow \frac{4005}{9}$
రమణ వాటా $2 \rightarrow 2 \times \frac{4005}{9} = 890$

5. రాముడు వ్యాపారం ప్రారంభించిన కొద్ది మాసాలకు రహీమ్‌ను వ్యాపారంలో చేర్చు కున్నాడు. అప్పుడు వారి పెట్టుబడుల నిష్పత్తి 4:5. ఏడాది చివరన లాభంలో రాముడు, రహీంల వాటాలు వరుసగా రూ.3300, రూ.2750 అయితే రహీం వ్యాపారంలో ఎప్పుడు చేరాడు?
1) 8 నెలల తర్వాత 2) 6 నెలల తర్వాత
3) 4 నెలల తర్వాత 4) 3 నెలల తర్వాత

జ. రాముడు పెట్టుబడి పెట్టిన కాలం 12 నెలలు రహీం పెట్టుబడి పెట్టిన కాలం x నెలలు అనుకోండి.
పెట్టుబడుల నిష్పత్తి = 4: 5
లాభాల నిష్పత్తి = పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
3300 : 2750 = 4 × 12 : 5× x
$5x = \frac{2750 \times 4 \times 12}{3300} = 40$
x = 40/5 = 8
∴ రహీం పెట్టుబడి పెట్టిన కాలం = 8 నెలలు అంటే 4 నెలల తర్వాత (12-8=4) రహీం వ్యాపారంలో చేరాడు.

6. A, B, Cలు కలిసి వ్యాపారంలో రూ. 50,000 మూలధనం సమకూర్చుకున్నారు. B కంటే A రూ. 4,000 ఎక్కువ, C కంటే B రూ. 5,000 ఎక్కువ పెట్టుబడి పెట్టారు. మొత్తం లాభం రూ. 35,000 అయితే A వాటా ఎంత?
1) రూ. 8,400 2) రూ. 11,900
3) రూ. 13,600 4) రూ. 14,700

జ. C పెట్టుబడి = x అనుకోండి
B పెట్టుబడి = x + 5000,
A పెట్టుబడి = (x + 5000) + 4000
A, B, C ల మొత్తం పెట్టుబడి
= x + (x + 5000) +
[(x + 5000) + 4000] = రూ. 50,000
(సమస్య నుంచి)
⇒ 3x+ 14,000= రూ. 50,000
⇒ x = రూ.12,000
A, B, Cల పెట్టుబడులు
= (12,000 + 5000) + 4000,
12,000 + 5000, 12,000
A, B, Cల పెట్టుబడుల నిష్పత్తి
= 21,000 : 17,000 : 12,000
= 21 : 17 : 12
మొత్తం లాభం = 21 + 17 + 12
→ 35,000
50→35,000
$1 \rightarrow \frac{35000}{50} = 700$
A వాటా 21 → 21 × 700
= రూ. 14,700

7. భాగస్వామ్య వ్యాపారంలో A, Cల పెట్టుబడి 2:1గా, A,Bల పెట్టుబడి 3:2 గా ఉంది. సంవత్సరాంతాన మొత్తం లాభం రూ.3,900 అయితే A, C వాటాల తేడా ఎంత?
1) రూ.600 2) రూ.900
3) రూ.1200 4) రూ.1500

జ. A : C = 2:1, A : B = 3 : 2
$\frac{A}{C} = \frac{2}{1} = \frac{2 \times 3}{1 \times 3} = \frac{6}{3}$
$\frac{A}{B} = \frac{3}{2} = \frac{3 \times 2}{2 \times 2} = \frac{6}{4}$
A : B : C = 6 : 4 : 3(లేదా)
C : A = 1:2
A : B = 3:2
C : A : B = 1×3 : 2 ×3 : 2×2
= 3 : 6 : 4
మొత్తం లాభం
= 6 + 4 + 3 → 3,900
(సమస్య నుంచి)
13 → 3,900
$1 \rightarrow \frac{3900}{13} = 300$
A, C ల వాటాల తేడా = 6 – 3 = 3
→ 3 × 300 = రూ.900

8. డేవిడ్, గోపి పెట్టుబడుల మొత్తం రూ.40,400. ఏడాది చివర వచ్చిన మొత్తం లాభం రూ.10,000. పెట్టుబడుల నిష్పత్తిలో కాకుండా సమానంగా పంచుకుంటే డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. గోపి పెట్టుబడి?
1) రూ. 20,402 2) రూ. 19,998
3) రూ. 31,428 4) రూ. 26,868

జ. మొత్తం లాభం = రూ.10,000
సమానంగా పంచుకుంటే డేవిడ్, గోపిల లాభాలు రూ. 5,000 : రూ. 5,000
డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. కాబట్టి లాభాలను పంచాల్సిన విధానం
రూ.5050:రూ. 4950
లాభాల నిష్పత్తి = 5050 : 4950
= 101: 99
పెట్టుబడుల నిష్పత్తి = లాభాల నిష్పత్తి
= 101 : 99
పెట్టుబడుల మొత్తం
= 101+99 → రూ. 40,400
(సమస్య నుంచి)
200 → 40,400
$1 \rightarrow \frac{40,400}{200} = 202$
గోపి పెట్టుబడి
99 → 99 × 202 = రూ.19,998

9. అరుణ్, వరుణ్‌ల పెట్టుబడుల మొత్తం రూ. 65,000. సంవత్సర ఆదాయం రూ. 20,000. అందులో రూ.7,000 ఖర్చులకు పోనూ మిగిలింది పెట్టుబడుల నిష్పత్తిలో పంచుకోగా అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1,000 అధికంగా వచ్చింది. అయితే వరుణ్ పెట్టుబడి?
1) రూ. 30,000 2) రూ. 35,000
3) రూ. 25,000 4) రూ. 40,000

జ. సంవత్సర ఆదాయం = రూ. 20,000
ఖర్చులకు రూ. 7,000 పోను మిగిలిన ఆదాయం = 20,000– 7000 = 13,000
రూ.13,000ను అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1000 అధికంగా వచ్చేట్లు పంచుకొనే విధానం = రూ. 6,000, రూ. 7,000
= 6:7
పెట్టుబడుల మొత్తం = 6+7 → 65,000
(సమస్య నుంచి)
13→65,000
$1 \rightarrow \frac{65,000}{13} = 5000$
వరుణ్ పెట్టుబడి 7 → 7× 5,000
= రూ. 35,000

10. A, B, Cలు వరుసగా రూ. 2,500, రూ. 1,800, రూ. 2,000 పెట్టుబడి పెట్టి ఒక వ్యాపారం ప్రారంభించారు. 4 నెలల తర్వాత A తన పెట్టుబడి నుంచి రూ. 700 తీసుకొన్నాడు. తమ పెట్టుబడికి B రూ. 400, C రూ.300 కలిపారు. సంవ త్సరం చివర రూ. 945 లాభం వస్తే B, C లాభాల తేడా?
1) రూ. 10 2) రూ. 20
3) రూ. 30 4) రూ. 40

జ. A, B, Cల లాభాల నిష్పత్తి = పెట్టుబడి, కాలం లబ్ధాల నిష్పత్తి
= 2500×4 + (2500–700)×8 :1800×4 +(1800+400)×8:2000×4+ (2000+300)×8
= 10000+14400:7200+17600:8000+ 18400 = 24400 : 24800 : 26400
= 61: 62: 66
మొత్తం లాభం= 61+62+66 →రూ.945
(సమస్య నుంచి)
$189 \rightarrow 945;\ 1 \rightarrow \frac{945}{189}$
B, Cల లాభాల తేడా = 66 – 62 = 4
$\frac{945}{189} \times 4$ = రూ.20

### మాదిరి ప్రశ్నలు

1. గోపాల్, భూపాల్ వరుసగా రూ. 3,000, రూ. 5,000 పెట్టుబడితో వ్యాపారం చేశారు. సంవత్సరాంతమున వచ్చిన లాభం రూ. 1880 అయితే గోపాల్ వాటా?
1) 705 2) 1175
3) 1435 4) 1715

2. రాణి రూ. 2525 మూలధనంతో కూరల వ్యాపారం ప్రారంభించిన కొంతకాలానికి వాణి రూ. 1,200 పెట్టుబడితో వ్యాపారంలో చేరింది. సంవత్సరాంతాన వచ్చిన మొత్తం రూ. 1664 లాభంలో రాణి వాటా రూ. 1212 అయితే వాణి ఎన్ని నెలల తర్వాత వ్యాపారంలో చేరింది?
1) 3 2) 4
3) 5 4) 6

3. లాల్ వర్తకం ప్రారంభించి కొంత కాలానికి పాల్‌ను భాగస్తునిగా చేర్చుకున్నాడు. వారి పెట్టుబడుల నిష్పత్తి 3:4. సంవత్సరాంతమున వారి లాభాల వాటాలు సమానంగా ఉన్న పాల్ వ్యాపారంలో ఉన్న కాలం ఎన్ని నెలలు?
1) 3 2) 6 3) 9 4) 12

4. ఒక వ్యాపారంలో A రూ.6,000ను 5 నెలలు, B రూ.10,000ను 4 నెలలు, C రూ.15,000ను 6 నెలలు పెట్టుబడిగా పెట్టారు. వారికి వచ్చిన లాభం రూ.8000 అయితే A వాటా?
1) రూ.4,500 2) రూ. 2,000
3) రూ. 1,500 4) రూ. 3,000

5. రూ.15,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత రూ.10,000లతో B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంతమున లాభం రూ.6,000 అయితే B వాటా?
1) రూ.2,000 2) రూ.3,000
3) రూ.4,000 4) రూ.5,000

6. రూ.30,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంత మున లాభాలను సమానంగా పంచుకున్నారు. అయితే B పెట్టుబడి?
1) రూ.15,000 2) రూ.25,000
3) రూ.35,000 4) రూ.40,000

7. A, B వరుసగా రూ. 8000, రూ.12,000లతో వ్యాపారం ప్రారంభించారు. వారు 10% లాభాన్ని దానధర్మాలు చేశారు. సంవత్సరాంతమున కు A వాటా రూ. 5400 అయితే మొత్తం లాభం?
1) రూ.13,500 2) రూ.15,000
3) రూ.14,800 4) రూ.12,000

8. A, B వరుసగా రూ.20,000, రూ.30,000లతో వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రూ. 10,000లను A అదనంగా పెట్టుబడి పెట్టాడు. కానీ రూ. 5000లను B వెనక్కు తీసుకొన్నాడు. సంవత్సరాంతానికి వారికి వచ్చిన లాభం రూ. 8400 అయితే A వాటా?
1) రూ. 2,500 2) రూ. 4,000
3) రూ. 4,400 4) రూ. 5,200

9. A, Bలు 9:6 నిష్పత్తిలో వ్యాపారం ప్రారం భించారు. సంవత్సరం చివరలో వచ్చిన లాభం రూ. 6,800ను పొరపాటున 6:9 నిష్పత్తిలో పంచుకున్నారు. అయితే Bకు వచ్చిన అదనపు లాభం?
1) రూ.2,720 2) రూ.4,080
3) రూ.1,360 4) రూ.2,180

10. A, B, C లు 2:3:5 నిష్పత్తిలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం తమ పెట్టుబడుల నుంచి ఒక్కొక్కరు వరుసగా 20%, 25%, 30% వెనక్కు తీసుకున్నారు. రెండో సంవత్సరం వారు పంచుకునే లాభాల నిష్పత్తి?
1) 32: 45: 70 2) 4: 5:6
3) 12:17:21 4) ఏదీకాదు

11. ముగ్గురు రైతులు ఒక తోటను అద్దెకు తీసుకొన్నారు. మొదటి వ్యక్తి 30 ఆవులను మూడు నెలలు, రెండో వ్యక్తి 20 ఆవులను 4 నెలలు, మూడో వ్యక్తి 15 ఆవుల్ని 8 నెలలు ఉంచారు. తోట మొత్తం అద్దె రూ.580 అయితే 3వ వ్యక్తి చెల్లించాల్సిన అద్దె?
1) రూ. 200 2) రూ. 240
3) రూ. 320 4) రూ. 360

12. ఉమ్మడి వ్యాపారంలో A, Bలు 3:5 నిష్పత్తి పెట్టుబడితో వ్యాపారం ప్రారంభిం చారు. B పెట్టుబడికి సమానంగా 6 నెలల తర్వాత C వాళ్లతో చేరాడు. ఒక సంవత్సరం చివర వచ్చిన లాభాన్ని వారు పంచుకొనే నిష్పత్తి?
1) 3: 5: 2 2) 1: 2 : 3
3) 3: 5: 5 4) 6: 10 : 5

### సమాధానాలు

1) 1; 2) 1; 3) 3; 4) 3;
5) 1; 6) 4; 7) 2; 8) 2;
9) 3; 10) 1; 11) 2; 12) 4.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com



# దేశంలో అతి పెద్ద ఇనుము-ఉక్కు కర్మాగారం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

**జనరల్ స్టడీస్**

**జాగ్రఫీ**

## భారతదేశం ఖనిజాధార పరిశ్రమలు

ఖనిజాలు, లోహాలను ముడి సరుకులుగా ఉపయోగించే పరిశ్రమలను ఖనిజాధార పరిశ్రమలు అంటారు.

ఇనుము-ఉక్కు పరిశ్రమ, అల్యూమినియం, సిమెంట్, ఎరువులు, భారీ ఇంజనీరింగ్ పరిశ్రమలు, రాగి పరిశ్రమ మొదలైనవి కొన్ని ముఖ్యమైన ఖనిజాధార పరిశ్రమలు.

### ఇనుము - ఉక్కు పరిశ్రమ

ఏ దేశ ఆర్థికాభివృద్ధికైనా ఇనుము-ఉక్కు పరిశ్రమల అభివృద్ధి అతి ముఖ్యమైంది. అందువల్లే ఈ పరిశ్రమను 'మూల పరిశ్రమ' అంటారు. ఖనిజాధార పరిశ్రమల్లో ఇనుము-ఉక్కు పరిశ్రమ అత్యంత ప్రధాన, అతి పెద్ద పరిశ్రమ.

- భారతదేశంలో మొదటి ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని1830లో తమిళనాడులోని పోర్టోనోవో వద్ద స్థాపించారు. 1866లో దీన్ని మూసేశారు.
- 1870లో పశ్చిమ బెంగాల్‌లోని కుల్టీ వద్ద 'బెంగాల్ ఐరన్ వర్క్స్'ఇనుము-ఉక్కు పరిశ్రమను నెలకొల్పారు. ఇది దేశంలో మొట్టమొదటి ఇనుము-ఉక్కు పరిశ్రమ. దీన్ని బర్న్పూర్‌లోని ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (ఐఐఎస్‌సీవో)లో విలీనం చేశారు.

**టాటా ఇనుము - ఉక్కు కర్మాగారం(టిస్కో):** ఇది దేశంలోని మొదటి భారీ ఆధునిక ఇనుము-ఉక్కు కర్మాగారం. దీన్ని జార్ఖండ్‌లోని సక్చీ వద్ద 1907లో జంషెడ్‌జీ టాటా స్థాపించారు. ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన మొదటి కర్మాగారం ఇది. ప్రస్తుతం పనిచేస్తున్న అతి పురాతన ఇనుము-ఉక్కు కర్మాగారం. జంషెడ్‌జీ టాటా గౌరవార్థం సక్చీని 'జంషెడ్‌పూర్'గా వ్యవహరిస్తున్నారు.

- 1919లో పశ్చిమ బెంగాల్‌లోని 'బర్న్పూర్' వద్ద 'ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ' (ఐఐఎస్‌సీవో)ని స్థాపించారు. దీన్ని 1972లో కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
- 1923లో కర్ణాటకలో షిమోగా జిల్లాలోని భద్రావతి వద్ద 'మైసూర్ స్టీల్ వర్క్స్' (మిస్కో) అనే ఇనుము-ఉక్కు కర్మాగారాన్నినిర్మించారు. అనంతరం విశ్వేశ్వరయ్య గౌరవార్థం ఈ పరిశ్రమకు 'విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్'(వీఐఎస్ఎల్) గా పేరు మార్చారు.

**భిలాయ్ ఇనుము - ఉక్కు కర్మాగారం:** దీన్ని రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలోని 'భిలాయ్' వద్ద రష్యా సహకారంతో నిర్మించారు. కోర్బా ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను ఇది వినియోగించుకుంటోంది. దీని ఉత్పత్తి 1959లో ప్రారంభమైంది.

**రూర్కెలా ఇనుము - ఉక్కు కర్మాగారం:** దీన్ని ఒడిశాలో సుందర్‌గఢ్ జిల్లాలోని 'రూర్కెలా' వద్ద బ్రాహ్మణీ నది ఒడ్డున నిర్మించారు. దీనికి 'పశ్చిమ జర్మనీ' సహకారం చేసింది. ఇది 1959 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

**దుర్గాపూర్ ఇనుము - ఉక్కు కర్మాగారం:** దీన్ని పశ్చిమ బెంగాల్‌లోని బురద్వాన్ జిల్లాలో దామోదర్ నదీ ప్రాంతంలో దుర్గాపూర్ వద్ద నిర్మించారు. దీనికి బ్రిటన్ సహకారం చేసింది. ఇది 1962 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

భిలాయ్,రూర్కెలా,దుర్గాపూర్ ఇనుము-ఉక్కు కర్మాగారాలు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేశారు.

**బొకారో ఇనుము - ఉక్కు కర్మాగారం:** ఇది మూడో పంచవర్ష ప్రణాళిక కాలం (1964)లో ఏర్పాటైంది. దీన్ని జార్ఖండ్‌లో హజారీబాగ్ జిల్లాలోని బొకారో, దామోదర్ నదుల సంగమ ప్రాంత సమీపంలో నిర్మించారు. అత్యధికంగా స్వదేశీ పరిజ్ఞానంతో, కొంత రష్యా సహకారంతో స్థాపించిన నాలుగో ప్రభుత్వరంగ ఇనుము-ఉక్కు కర్మాగారం.

- ప్రస్తుతం ఇది భారతదేశంలో అతిపెద్ద ఇనుము-ఉక్కు కర్మాగారం. 1972 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

**విశాఖ స్టీల్ ప్లాంట్:** ఇది ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉంది. దీన్ని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్.. రష్యా సహాయంతో నిర్మించింది. 1992ఆగస్టు 1న నాటి ప్రధాని పీవీ నరసింహారావు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేశారు. ఈ కర్మాగారం భారతదేశంలో అత్యాధునిక, తీరప్రాంతంలో ఉన్న ఏకైక ఇనుము-ఉక్కు కర్మాగారం.

- 1982లో తమిళనాడులోని 'సేలం' వద్ద ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. ఈ కర్మాగారం నాణేల తయారీకి, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తికి ప్రసిద్ధి. మరో కర్మాగారాన్ని కర్ణాటకలోని హొస్పేట్ సమీపంలోని విజయనగర్ వద్ద నిర్మించారు.

### ప్రభుత్వరంగంలోని ప్రధాన ఎరువుల ఫ్యాక్టరీలు

| ఎరువుల ఫ్యాక్టరీ పేరు | యూనిట్లు ఉన్న ప్రాంతం |
|---|---|
| ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (1961) | సింద్రీ (జార్ఖండ్), తాల్చేర్ (ఒడిశా), గోరఖ్‌పూర్ (ఉత్తరప్రదేశ్), రామగుండం (తెలంగాణ) |
| నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (1974) | వంగాల్ (పంజాబ్)లో రెండు కేంద్రాలు, విజయపూర్ (మధ్యప్రదేశ్) రెండు కేంద్రాలు, భటిండా (పంజాబ్), పానిపట్ (హర్యానా) |
| గోదావరి ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ | కాకినాడ (ఆంధ్రప్రదేశ్) |
| పారాదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్ | పారాదీప్ (ఒడిశా) |
| మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ | చెన్నై సమీపంలో ఉంది |

**స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్):** దీన్ని 1973లో న్యూఢిల్లీలో స్థాపించారు. ఇది పూర్తిగా ప్రభుత్వాధీన సంస్థ. దీనికి మహారత్న హోదా ఉంది. భిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా, బొకారో, బర్న్పూర్, సమీకృత ఉక్కు కర్మాగారాలు మొదలైన వాటి నిర్వహణ బాధ్యత దీనిదే.

- భారతదేశంలో ఏర్పాటైన తొలి స్పాంజ్ ఐరన్ కర్మాగారం తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని పాల్వంచ (కొత్తగూడెం)లో ఉంది.

### అల్యూమినియం పరిశ్రమ

భారతదేశంలో ఇనుము తర్వాత ఇది రెండో పెద్ద ఖనిజరంగ పరిశ్రమ. దీన్ని మన దేశంలో వార్‌బోర్న్ పరిశ్రమ అంటారు. 'అల్యూమినియం'ను విశ్వలోహం అంటారు. భారతదేశంలో 1937లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అసన్‌సోల్ సమీపంలో 'జాయక్‌నగర్' ప్రాంతంలో 'అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'ను స్థాపించారు.

- భారతదేశంలో 8 అల్యూమినియం శుద్ధి కర్మాగారాలు ఉన్నాయి. **అవి..**

1. **ఇందాల్కో (ఇండియన్ అల్యూమినియం కంపెనీ):** దీనికి అలువాపురం(కేరళ), హీరాకుడ్ (ఒడిశా), బెల్గాం (కర్ణాటక)లో యూనిట్లు ఉన్నాయి.
2. **హిందాల్కో(హిందుస్తాన్ అల్యూమినియం కంపెనీ):** ఇది రేణుకూట్ (ఉత్తరప్రదేశ్)లో ఉంది.
3. **బాల్కో(భారత్ అల్యూమినియం కంపెనీ):** దీనికి కోర్బా(ఛత్తీస్‌గఢ్), రత్నగిరి(మహారాష్ట్ర)లో యూనిట్లు ఉన్నాయి. బాల్కో మొదటిసారి లక్ష టన్నుల కెపాసిటీ సాధించింది.
4. **నాల్కో(నేషనల్ అల్యూమినియం కంపెనీ):** ఇది దామన్‌జోడి(ఒడిశా)లో ఉంది.
5. **మాల్కో(మద్రాస్ అల్యూమినియం కంపెనీ):** ఇది మెట్టూరు (తమిళనాడు)లో ఉంది.

### సిమెంటు పరిశ్రమ

భారతదేశంలో మొదటి సిమెంటు పరిశ్రమ 1904లో చెన్నైలో ప్రారంభమైంది. ప్రస్తుతం దీన్ని మూసివేశారు. పూర్తి స్థాయిలో 1912లో గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేశారు.

- సిమెంటు ఉత్పత్తిలో భారత్‌ది రెండో స్థానం కాగా మొదటి స్థానంలో చైనా ఉంది.
- భారతదేశంలో తమిళనాడు, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సిమెంటు ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. సిమెంటు పరిశ్రమకు ప్రధాన ముడి సరుకు సున్నపురాయి.
- ప్రస్తుతం మనదేశంలో 128 భారీ, 322 చిన్న సిమెంటు కర్మాగారాలున్నాయి.
- ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ సిమెంటు కర్మాగారాలు ఉన్నాయి. ప్రైవేట్ కంపెనీలు దాదాపు 65 శాతం సిమెంటును ఉత్పత్తి చేస్తున్నాయి. అసోసియేట్ సిమెంటు కంపెనీ(ఏసీసీ) లిమిటెడ్ అతి పెద్ద సిమెంట్ తయారీ సంస్థ కాగా దాల్మియా గ్రూపు రెండోది.



### ఎరువుల పరిశ్రమ

దేశంలో మొదటి ఎరువుల పరిశ్రమను 1906లో తమిళనాడులోని రాణిపేటలో ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ రంగంలో మొదట 1951లో బిహార్‌లోని సింద్రీ (ప్రస్తుతం ఈ ప్రాంతం జార్ఖండ్‌లో ఉంది) వద్ద ఆధునిక ఎరువుల కర్మాగారాన్ని నిర్మించారు. చైనా, అమెరికా తర్వాత ప్రపంచంలో ఎరువుల ఉత్పత్తిలో భారతదేశం మూడో స్థానంలో ఉంది.

- 1961లో ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, 1974లో నేషనల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్‌ను స్థాపించడం ద్వారా ఎరువుల పరిశ్రమ అభివృద్ధి చెందింది.

### గాజు పరిశ్రమ

భారతదేశంలో మొదటి గాజు పరిశ్రమను 1941లో ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో స్థాపించారు. ఈ పరిశ్రమకు కావాల్సిన ముడి పదార్థాలు.. ఇసుక, సున్నపురాయి, సిలికా, సోడా యాష్. ఫిరోజాబాద్ పరిశ్రమ గాజులు, పూసలకు ప్రసిద్ధి.

### ఇంజనీరింగ్ పరిశ్రమలు

మనదేశంలో 1958లో హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌ను రాంచీ(జార్ఖండ్)లో స్థాపించారు. దీని స్థాపనతో ఇంజనీరింగ్ పరిశ్రమ అభివృద్ధి ప్రారంభమైంది. ప్రస్తుతం దేశ అవసరాలకు కావాల్సిన అన్ని రకాల సామగ్రిని మన దేశం తయారు చేస్తోంది.

## దేశంలోని ప్రధాన ఇంజనీరింగ్ పరిశ్రమలు

**హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్:** జార్ఖండ్‌లోని రాంచీలో ఉంది. ఇది ఉక్కు పరిశ్రమ. యంత్ర సామగ్రి, హెవీ క్రషింగ్, గ్రైండింగ్ యంత్రాలు, క్రేన్లు, రోలింగ్ యంత్రాలు, నూనె బావుల డ్రిల్లింగ్ రిగ్స్‌ను ఉత్పత్తి చేస్తోంది.

**మైనింగ్ అండ్ అలైడ్ మిషనరీ కార్పొరేషన్ లిమిటెడ్:** ఇది దుర్గాపూర్(పశ్చిమ బెంగాల్) ఉంది. రకరకాల ఖనిజ యంత్రాలను తయారు చేస్తోంది.

**భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్:** ఇది విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)లో ఉంది. పెట్రో రసాయనాలు, ఎరువుల యంత్రాలను తయారు చేస్తోంది. దీన్ని 2009లో బీహెచ్ఈఎల్‌లో విలీనం చేశారు.

**తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్:** ఇది కర్ణాటకలో ఉంది. గేట్స్, ట్రాన్స్‌మిషన్ టవర్స్, పెన్‌స్టాక్ పైప్స్ తయారు చేస్తుంది.

### ఇతర పరిశ్రమలు

1. **హిందుస్తాన్ మెషీన్ టూల్స్(హెచ్ఎంటీ):** దీన్ని 1953లో కర్ణాటకలోని బెంగళూరులో స్థాపించారు. దీనికి అయిదు యూనిట్లు ఉన్నాయి. శ్రీనగర్(జమ్మూకశ్మీర్),బెంగళూరు(కర్ణాటక), హైదరాబాద్, కాలమస్సేరి(కేరళ) యూనిట్లలో హెచ్ఎంటీవాచ్‌లు, పింజోర్ (హర్యానా) యూనిట్‌లో ట్రాక్టర్లను తయారు చేస్తారు.
2. **భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్):** దీన్ని 1956లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో స్థాపించారు. దీనికి జగదీశ్‌పూర్, హరిద్వారా (ఉత్తరప్రదేశ్) తిరుచిరాపల్లి (తమిళనాడు), హైదరాబాద్‌లో యూనిట్లు ఉన్నాయి.
3. **ప్రాగా టూల్స్:** ఇది సికింద్రాబాద్ లో ఉంది. ఇక్కడ రక్షణ సామగ్రిని తయారు చేస్తారు.
4. **హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్):** దీనికి హైదరాబాద్, రూప్ నారాయణపూర్ (పశ్చిమబెంగాల్)లో యూనిట్లు ఉన్నాయి.
5. **హిందుస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీ:** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
6. **హెవీ వెహికల్ ఫ్యాక్టరీ:** ఇది ఆవడి(చెన్నై)లో ఉంది.
7. **హిందుస్తాన్ హౌజింగ్ ఫ్యాక్టరీ లిమిటెడ్:** ఇది న్యూఢిల్లీ ఉంది.
8. **భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్):** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
9. **హిందుస్తాన్ యాంటీబయాటిక్స్ లిమిటెడ్:** ఇది పింప్రీ(మహారాష్ట్ర)లో ఉంది.
10. **హిందుస్తాన్ ఫొటో ఫిల్మ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్:** దీన్ని 1960లో భారత ప్రభుత్వం తమిళనాడులోని ఊటీ వద్ద ఏర్పాటు చేసింది.
11. **ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (ఐడీపీఎల్):** దీని కేంద్ర కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది.

### గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మనదేశంలో మొదటి స్పాంజ్ ఐరన్ ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు? (కానిస్టేబుల్ -2012)
   1) కొత్తగూడెం 2) విశాఖపట్నం
   3) భోపాల్ 4) కోల్‌కతా
2. దేశంలోని అతిపెద్ద ఉక్కు కర్మాగారం ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) భిలాయ్ 2) బొకారో
   3) రూర్కెలా 4) దుర్గాపూర్
3. భారత్ హెవీ ఎలక్ట్రికల్ కర్మాగారం ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) విశాఖపట్నం 2) భువనేశ్వర్
   3) హైదరాబాద్ 4) ముంబై
4. దేశంలోని మొదటి ఉక్కు కర్మాగారమైన టాటా ఇనుము-ఉక్కు కంపెనీ ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) దుర్గాపూర్ 2) నాగపూర్
   3) బీజాపూర్ 4) జంషెడ్‌పూర్
5. బొకారో ఉక్కు కర్మాగారాన్ని ఏ దేశ సహాయంతో నిర్మించారు? (జైల్ వార్డెన్ - 2012)
   1) అమెరికా సంయుక్త రాష్ట్రాలు
   2) ఇంగ్లండ్ 3) జర్మనీ
   4) సోవియెట్ యూనియన్
6. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి. (జైల్ వార్డెన్ - 2012)
   1) విశాఖపట్నం - నౌకా నిర్మాణం
   2) టిట్లాఘర్ - రైల్వే సామగ్రి
   3) భద్రావతి - ఇనుము, ఉక్కు
   4) పింజోర్ - యంత్ర పరికరాలు

**సమాధానాలు**

1) 1; 2) 2; 3) 3; 4) 4;
5) 4; 6) 2.

---

## Hacker (Computer security)

# Is Hacker A Hero or Villain?

Hacker is considered as hero of computer programs. In computer security, a hacker is someone who focuses on security mechanisms of computer and network systems. He is someone who lives and breathes computers, who know all about computers, who can get a computer to do anything. Equally important, though, is the hacker's attitude. Computer programming must be a hobby, something done for fun, not out of a sense of duty. Hackers are generally computer geniuses because it is due to the extraordinary computer knowledge and skills that they can conveniently break into other computer systems.

### CRACKER

Cracker is considered as villain of computer programs. A cracker is someone who breaks into someone else's computer system, often on a network; bypasses passwords or licenses in computer programs; or in other ways intentionally breaches computer security. A cracker does this for profit, maliciously, for some altruistic purpose.

***CLASSIFICATION OF HACKERS BASED ON THEIR ATTITUDE:***

### WHITE HAT

A "White hat" hacker breaks security for non-malicious reasons, perhaps to test their own security system or while working for a security company which makes security software. The term "white hat" in Internet slang refers to an ethical hacker.

### BLACK HAT

A "Black hat" hacker is a hacker who "violates computer security for little reason beyond maliciousness or for personal gain". Black hat hackers break into secure networks to destroy, modify, or steal data; or to make the network unusable for those who are authorized to use the network. Black hat hackers are also referred to as the "crackers" within the security industry and by modern programmers.



### GREY HAT

A grey hat hacker lies between a black hat and a white hat hacker. Grey hat hackers sometimes find the defect of a system and publish the facts to the world instead of a group of people. Even though grey hat hackers may not necessarily perform hacking for their personal gain, unauthorized access to a system can be considered illegal and unethical.

### ELITE HACKER

A social status among hackers, elite is used to describe the most skilled. Newly discovered exploits circulate among these hackers.

**BANK EXAMS**
**COMPUTER AWARENESS**

### SCRIPT KIDDIE

A script kiddie (also known as a skid or skiddie) is an unskilled hacker who breaks into computer systems by using automated tools written by others.

### NEOPHYTE

A neophyte ("newbie", or "noob") is someone who is new to hacking or phreaking and has almost no knowledge or experience of the workings of technology and hacking.

### BLUE HAT

A blue hat hacker is someone outside computer security consulting firms who is used to bug-test a system prior to its launch, looking for exploits so they can be closed.

### PHREAKS

A phreak is a hacker who specializes in phone systems. These days, however, phreaking is more of a cracker activity. At one time, phreaks were enthusiastic about telephone networks and simply wanted to understand how they worked and explore them. Ethical phreaks didn't steal services or cause damage; they just used their technical skill to play with the system. Phone systems have changed and are less susceptible to technological hacks. As a result, modern phreaks intent on cracking the telecommunications systems often rely on criminal acts such as stealing phone cards and cloning cell phones.

### HACKTIVISTS

The hacktivist is a gray hat or cracker who defaces Web pages to bring attention to a political agenda or social cause. Companies, organizations, and governments that engage in controversial practices or that have unpopular policies are likely targets of hacktivists. How ethical this behaviour is depends on whether or not you support the hactivist's agenda or believe in his cause.

### MODEL QESTIONS

1. Retail employees typically use ________ terminals to process sales transactions.
   1) Point of sale 2)Transaction point
   3) Automatic teller
   4) Sales processing
   5) None of these
2. The simultaneous processing of two or more programs by multiple processors is _____
   1) Multiprogramming
   2) Multiprocessing
   3) Time-sharing 4) Multitasking
   5) None of these
3. The ___ folder retains copies of messages that you have started but are not yet ready to send.
   1) Drafts 2) Sent Items
   3)Address Book 4) Outbox
   5) None of these
4. Inheritance is the ability of an object to pass on its characteristics to its ________.
   1) Subclasses 2)off-spring
   3) Super classes 4) Parents
   5) None of these
5. Which of the following is used for close a tab on a browser?
   1) Ctrl + T 2) Ctrl + Y
   3) Ctrl + A 4) Ctrl + W
   5) None of these
6. A program that converts high level language to machine Language is ______
   1) Linker 2) Assembler
   3) Compiler 4) All of the above
   5) None of these
7. At a time how many operating system can be at work on a computer?
   1) Only one 2) Two 3) Three
   4) Four 5) None of these
8. A computer that combines the characteristic of analog and digital computers________
   1) Hybrid Computer
   2) Analog Computer
   3) Digital Computer
   4) Super Computer
   5) None of these
9. The technique that extends storage capacities of main memory beyond the actual size of the main memory is called _______
   1) Multitasking 2) Switching
   3) Multiprocessing
   4) Multiprogramming
   5) Virtual storage
10. The maximum Zoom percentage in MS WORD is________
    1) 100% 2) 200%
    3) 400% 4) 500%
    5) None of these
11. The smallest memory size is?
    1) Byte 2) GigaByte
    3) KiloByte 4) MegaByte
    5) None of these
12. Android Operating system is an example of which kind of Source Model?
    1) Open Source
    2) Vertical Market Software
    3) Horizontal Market Software
    4) Shareware 5) None of these
13. Which process checks to ensure the components of the computer and operating are connected properly?
    1) Booting 2) Processing
    3) Editing 4) Saving
    5) None of these
14. Codes consisting of lines of varying widths or lengths that are computer-readable are known as?
    1) An ASCII code
    2) An OCR scanner
    3) A magnetic tape
    4) A bar code 5)None of these
15. What is the ultimate purpose of Defragmentation?
    1) Make the PC faster
    2) Create More Free Space
    3) Delete temporary files
    4) Reduce Power consumption
    5) None of these
16. Which input device cannot be used to work in MS Office?
    1) Scanner 2) Mouse
    3) Keyboard 4) Joy stick
    5) Light pen
17. Storage that retains its data after the power is turned off is referred to as?
    1) Volatile storage
    2) Sequential storage
    3) Non-volatile storage
    4) Direct storage
    5) None of these
18. Accessing data on tapes is much ___ than that accessing data on disks?
    1) Same 2) Faster
    3) Slower 4) All of the above
    5) None of these
19. IP-Address 192.5.48.3 belongs to-
    1) Class A 2) Class B
    (3) Class C 4) Class D
    5) None of these
20. Which type of web document is run at the client site?
    1) Static 2) Dynamic
    3) Active 4) All of the above
    5) None of these
21. UDP (User Diagram Protocol) is-
    1) Connectionless
    2) Network Oriented
    3) Connection oriented
    4) a & b 5) None of these
22. Which of the following is NOT a Microsoft Internet tool or technology?
    1) Dreamweaver 2) Silver light
    3) Internet Explorer
    4) Expression Web
    5) None of these
23. Which Software protects the resources of a private network from users from other networks?
    1) Cache server 2) proxy server
    3) Firewall 4) Router
    5) None of these

**KEY**

1) 1; 2) 2; 3) 1; 4) 1; 5) 4;
6) 3; 7) 1; 8) 1; 9) 5; 10) 4;
11) 3; 12) 1; 13) 1; 15) 2; 14) 4;
16) 4; 17.3; 18) 3; 19) 3; 20) 1;
21) 1; 22) 1; 23) 3.